

ఈనాడు



విజయవాడ 29-11-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 109

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



దక్షిణ గోవాలో ప్రధాని మోదీ ఆవిష్కరించిన 77 అడుగుల శ్రీరాముడి విగ్రహం

సమైక్యతే వికసిత భారతానికి మార్గం

శ్రీ సంస్థాన్ గోకర్ణ్ జీవోత్తమ్ మఠ్ 550వ వార్షికోత్సవంలో మోదీ

13లో

దేశ ప్రగతికి గీతాసారం మూలం



ఉడుపి సభలో ప్రధాని మోదీ

గూగుల్‌కు ‘సింహాచలం’ భూములు!

15లో

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు బలమైన మద్దతు

ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు

- రాష్ట్ర ఆర్థిక బలాన్ని బ్యాంకులు అర్థం చేసుకోవాలి
- అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలవాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దిశానిర్దేశం
- సీఎం రాయలసీమ ఉద్యాన హబ్ ప్రణాళిక బాగుందని ప్రశంస
- బ్యాంకులు, బీమా కంపెనీల ప్రాంతీయ ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన



అమరావతిలో బ్యాంకులు, బీమా సంస్థల కార్యాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాల ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, లోకేశ్, నారాయణ తదితరులు

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్ ముందుకు వెళ్లేందుకు బడ్జెట్‌లో ఏం చేయాలా అని ప్రయత్నం చేస్తున్నానని, ఇక్కడ ఎంతో అభివృద్ధి జరగబోతోందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇందుకు సంబంధించి ప్రధాని మోదీ నుంచి తనకు స్పష్టమైన మార్గనిర్దేశనం ఉందని వెల్లడించారు. ఈ రాష్ట్రం గురించి ప్రధాని మోదీతో ఎప్పుడు మాట్లాడినా సానుకూలంగా స్పందిస్తారని, విభజన తర్వాత ఎంతో ఎదగాల్సిన రాష్ట్రమని, వారికి ఎంతో చేయాలో అంత చేయండని చెప్పారని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకులు, బీమా సంస్థలు కేవలం కార్యాలయాలు ఏర్పాటు చేస్తే తమ బాధ్యత అయిపోయిందని అనుకోవద్దని ఆంధ్రప్రదేశ్‌కు,



అమరావతిలో నిర్మించనున్న ఎస్‌బీఐ ప్రాంతీయ ప్రధాన కార్యాలయ భవనం నమూనా

అమరావతికి ఎంత ఇవ్వగలరో అంతా ఇచ్చి ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించిన రాయలసీమ ఉద్యాన హబ్ ప్రణాళికను నిర్మల ప్రశంసించారు. దేశానికి ఇలాంటి ప్రణాళికలు (మిగతా 12లో)

అమరావతి అభివృద్ధి అన్‌స్టాపబుల్

2028 నాటికి ఒక స్థాయికి తీసుకువస్తాం

కేంద్ర సహకారంతో ఏపీ దేశానికే వెన్నెముక అవుతుంది

అమరావతి రైతులకు మూలధన రాబడి పన్నుపై రాయితీ కొనసాగించాలి

పోలవరం- నల్లమలసాగర్ ప్రాజెక్టుతో ఇతర రాష్ట్రాలకు సంబంధం లేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు 12లో

అమరావతికి ఇదో ఆర్థికశక్తి

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



రాజధానికి మరో 16,666 ఎకరాల సమీకరణ

ఏడు గ్రామాల భూములు తీసుకోవాలని మంత్రివర్గ నిర్ణయం

అంతర్జాతీయ క్రీడానగరం, ఇన్నర్‌రింగ్ రోడ్డు, రైల్వే స్టేషన్ నిర్మాణం కోసం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి రైతుల నుంచి రెండో విడతలో 16,666.57 ఎకరాల భూములను సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తుళ్లూరు, అమరావతి మండలాల పరిధిలోని ఏడు గ్రామాలకు చెందిన రైతుల నుంచి భూసమీకరణ విధానంలో భూములు తీసుకోవాలన్న ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదముద్ర వేసింది. 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ క్రీడా నగరంతోపాటు అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు, రైల్వే స్టేషన్, రైల్వే ట్రాక్ నిర్మాణానికి ఈ భూమిని ప్రభుత్వం సమీకరిస్తుంది. ఆ ఏడు గ్రామాల పరిధిలో 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉంది. అందులో ఎక్కువ కొండలు, గుట్టలు, జలవనరులు వంటివి ఉన్నాయి. రాజధాని నిర్మాణానికి తొలి విడతలో భూసమీకరణలో అమలు చేసిన ప్యాకేజీనే ఇప్పుడు భూముల తీసుకోనున్న ఏడు గ్రామాల రైతులకూ ప్రభుత్వం వర్తింపజేస్తుంది. (మిగతా 5లో)

రెండో విడతలో సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన భూముల వివరాలు (ఎకరాల్లో)

ఊరు	పట్టా భూమి	ఎసైన్డ్ భూమి	ప్రభుత్వ భూమి	మొత్తం విస్తీర్ణం
వైకుంఠపురం	1,965	0	1,395.48	3,361
పెదమద్దూరు	1,018	0	127	1,145
ఎండ్రాయి	1,879	46	241	2,166
కర్లపూడి	2,603	51	290.75	2,944
వడ్డమాను	1,763.29	4.72	168.86	1,937
హరిశ్చంద్రపురం	1,448.09	2.29	977.87	2,428
పెదపరిమి	5,886.18	0	627.34	6,513
మొత్తం	16,562.56	104.01	3,828.30	20,494

◆ వీటిలో వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గుంటూరు జిల్లాలోని తుళ్లూరు మండలంలోను, వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాలు పల్నాడు జిల్లాలోని అమరావతి మండలంలోను ఉన్నాయి.

ఎన్‌ఎంసీ ప్రమాణాల ప్రకారమే వైద్య కళాశాలలకు భూమి

- అదనపు భూమి వైద్య అనుబంధ విభాగాల అభివృద్ధికి వినియోగం
- పీపీపీ విధానంలో నిర్మాణంపై కీలక సవరణలు
- రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రి పార్థసారథి

6లో

నేరుగా విమానంలోకి అయ్యప్ప ఇరుముడి తీసుకెళ్లొచ్చు

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు 3లో



ఆ దేశాల నుంచి వలసలకు స్వస్తి

భద్రతపరంగా మాకు ముప్పున్నవారు పోవాల్సిందే


తృతీయ ప్రపంచ దేశాలపై ట్రంప్ కఠిన నిర్ణయం

15లో

జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులకు

ఎదురుదెబ్బ

ముందస్తు బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు



- గతంలో ఇచ్చిన మధ్యంతర ఉపశమనం రద్దు
- రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం
- పోలీసు వ్యవస్థ నిందితులకు అండగా ఉంటోందని వ్యాఖ్య
- శక్తిమంతులైన మిమ్మల్ని అరెస్ట్ చేయరని మీకూ తెలుసు
- అలాంటప్పుడు లొంగుబాటుకు గడువెందుకంటూ తీవ్ర ఆక్షేపణ



రామకృష్ణారెడ్డి



వెంకటరామిరెడ్డి

ఈనాడు - దిల్లీ

పల్నాడు జిల్లాలో ఈ ఏడాది మే 24న జరిగిన తెదేపా నాయకులు జె. వెంకటేశ్వర్లు, జె.కోటేశ్వరరావుల హత్య కేసులో నిందితులుగా ఉన్న వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో తమ ముందస్తు బెయిల్‌ను కొట్టేస్తూ ఏపీ హైకోర్టు ఆగస్టు 29న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వారిద్దరూ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసింది. రెండు వారాల్లోపు లొంగిపోవాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఛార్జిషీట్లు దాఖలు కాకముందే నిందితులకు 161 స్టేట్‌మెంట్లు, కేసు డైరీలోని విషయాలు తెలియడం పట్ల ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. నిందితుల పరపతి తమను ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నట్లు పేర్కొంది. వారికి పోలీసు వ్యవస్థ అండగా ఉంటోందని, అందుకే కావాల్సిన అన్ని డాక్యుమెంట్లనూ ముందుగానే అందజేశారని ఆక్షేపించింది. రాష్ట్రంలో శక్తిమంతులుగా ఉన్న మిమ్మల్ని పోలీసులు అరెస్ట్ చేయబోరని మీకూ తెలుసని, అలాంటప్పుడు లొంగిపోవడానికి మళ్లీ గడువు అడగడం దేనికని వ్యాఖ్యానించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పదేపదే విజ్ఞప్తి చేయడంతో లొంగుబాటుకు రెండు వారాల గడువిచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిన్నెల్లి సోదరులు సెప్టెంబర్ 1న దాఖలు చేసిన పిటిషన్లపై అదే నెల 4న విచారించిన ధర్మాసనం వారికి అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించింది. కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. (మిగతా 5లో)



విజయవాడలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరయ్యేందుకు వెళ్తున్న వైవీ సుబ్బారెడ్డి

పరకామణి కేసులో వైవీ సుబ్బారెడ్డి విచారణ


- గంటన్నరపాటు ప్రశ్నించిన సీఐడీ
- నా హయాంలో జరిగినందునే విచారణకు పిలిచామన్నారు
- విలేకర్లతో సుబ్బారెడ్డి

ఈనాడు, అమరావతి: తితిదే పరకామణిలో చోరీ, ఆ కేసు రాజీలో అప్పటి పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని సీఐడీ విచారించింది. విజయవాడ తులసీనగర్‌లోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరైన ఆయన 12.30 గంటలకు బయటకు వచ్చారు. పరకామణిలో చోరీ, ఆ కేసు రాజీ రెండూ (మిగతా 5లో)

భారత్ వైపు దూసుకొస్తున్న దిత్వా తుపాను


13లో

ఇదీ సంగతి!



50 వేల మందికి ‘క్వాంటమ్’ శిక్షణ

రూ.500కే ఫౌండేషన్ కోర్సు



100 మందికి యంగ్ రీసెర్చర్స్ స్కాలర్‌షిప్

- ప్రతిభ కనబరిచిన 3 వేల మందికి ఫేజ్-2 కోర్సు ఉచితం
- వైజర్, క్యూబిటెక్ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం
- డిసెంబరు 8 నుంచి కోర్సు ప్రారంభం ● ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రాన్ని క్వాంటమ్ టాలెంట్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. అమరావతి క్వాంటమ్ మిషన్ (ఏక్యూవీ)లో భాగంగా 50 వేల మందికి క్వాంటమ్ టెక్నాలజీపై శిక్షణ ఇవ్వనుంది. అమెరికాలోని వైజర్ (ద వాషింగ్టన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్టెమ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ రీసెర్చ్), హైదరాబాద్‌లోని క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ శిక్షణ ఇవ్వనున్నాయి. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఆ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. డిసెంబరు 8 నుంచి కోర్సు ప్రారంభమవుతుంది. ఫేజ్-1, ఫేజ్-2గా రెండు దశల్లో శిక్షణ ఉంటుంది. కేవలం రూ.500 ఫీజుతో ఫేజ్-1 కోర్సులో బేసిక్ శిక్షణ ఇస్తారు. అందులో ప్రతిభ కనబరిచిన 3,000 మందిని ఎంపిక చేసి ఫేజ్-2లో అడ్వాన్స్డ్ కోర్సులో పూర్తిగా ఉచితంగా శిక్షణ ఇస్తారు. ఫేజ్-1 కోర్సుకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వైజర్, క్యూబిటెక్ సంస్థలు (మిగతా 5లో)




Khushi ke
har pal ke liye KISNA
KFNC40436NAM

నేరుగా విమానంలోకి అయ్యప్ప ఇరుముడి తీసుకెళ్లొచ్చు

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడి



ఈనాడు, దిల్లీ: శబరిమల పవిత్రయాత్రలో పాల్గొనే అయ్యప్ప భక్తుల సౌలభ్యం కోసం ఇరుముడిని (కొబ్బరికాయతో పాటు) వారితో పాటు నేరుగా విమానంలోకి వారి చేతి సామానుగా తీసుకెళ్లడానికి అనుమతిస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ‘‘ఇరుముడికి ఉన్న పవిత్రత, భావోద్వేగాల్ని దృష్టిలో ఉంచుకొని భక్తులు దాన్ని తమతోపాటు విమానంలోకి తీసుకెళ్లేందుకు మా శాఖ అనుమతి ఇచ్చిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూనే భక్తుల సంప్రదాయాలు, ఆచారాలకు భంగం కలుగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. దేశం గర్వించే సాంస్కృతిక విలువలు, సంప్రదాయాలు, భక్తి స్ఫూర్తిని నిలబెట్టే విషయంలో మాకున్న నిబద్ధతను ఈ నిర్ణయం ప్రతిబింబిస్తుంది. ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ, ప్రతి భక్తుడికీ సౌలభ్యం, మర్యాద, ఆత్మగౌరవం కల్పించడం ప్రభుత్వ ధ్యేయం, ఈ ప్రత్యేక సడలింపు శుక్రవారం నుంచి జనవరి 20 వరకు దేశవ్యాప్తంగా వర్తిస్తుంది. ఈ కాలంలో శబరిమల యాత్రకు వెళ్లే భక్తులు, విమానాశ్రయ భద్రతా తనిఖీలను పూర్తి చేశాక ఇరుముడిని విమాన క్యాబిన్‌లో తమతో పాటు తీసుకెళ్లవచ్చు. అయితే.. ఇరుముడి స్క్రీనింగ్, తనిఖీల విషయంలో అధికారుల సూచనలను కచ్చితంగా అనుసరించాలి’’ అని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబు హర్షం

అయ్యప్ప భక్తులు ఇరుముడితో నేరుగా విమానంలో ప్రయాణించేందుకు అనుమతించే నిర్ణయాన్ని సీఎం చంద్రబాబు స్వాగతించారు. అయ్యప్ప భక్తులకు ఇది మరింత సౌకర్యవంతంగా ఉంటుందని ఎక్స్ వేదికగా శుక్రవారం పేర్కొన్నారు. మన సంప్రదాయాల్ని గౌరవిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం ప్రశంసనీయమన్నారు.

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	16.2	28.8
విజయనగరం	17.0	28.0
కడప	18.0	28.0
నరసాపురం	18.2	28.6
రాజమహేంద్రవరం	19.0	34.0
అనంతపురం	19.2	30.4
విశాఖపట్నం	19.8	30.4
కర్నూలు	19.8	30.5
శ్రీకాకుళం	20.0	29.0
విజయవాడ	20.4	29.8
గుంటూరు	21.0	28.0
ఒంగోలు	21.4	30.5
సూర్యాపేట	22.0	30.0
తాడేపల్లిగూడెం	23.0	30.0
నెల్లూరు	23.0	30.5

గ్రహం అనుగ్రహం

29–11–2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం

నవమి: సా. 5-31 తదుపరి దశమి; పూర్వాభాద్ర: రా. 9-51 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: లేదు; అమృత ఘడియలు: మ. 2-00 నుంచి 3-54 వరకు; దుర్ముహూర్తం: ఉ. 6-15 నుంచి 7-44 వరకు; రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు; సూర్యోదయం: ఉ. 6.16; సూర్యాస్తమయం: సా. 5.20

ఈనాడు

దృష్టి పెట్టాల్సింది బోధనపైనే...

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఉద్ఘాటించినట్లు- అత్యుత్తమ ప్రతిభావంతులకు, మేటి వ్యక్తిత్వ సంపన్నులకు దేశం నెలవు కావాలంటే తల్లి, తండ్రి, గురువులతోనే సాధ్యం. మంచీ చెడూ తెలియజెప్పి పిల్లలను సరైన మార్గంలో నడిపించడంలో అమ్మానాన్నలు తొలివరసలో నిలుస్తారు. ఉపాధ్యాయులేమో ఆ చిన్నారులకు ప్రాపంచిక జ్ఞానాన్ని బోధిస్తూ, యుక్తాయుక్త విచక్షణను, తార్కిక ఆలోచనను, ఆత్మవిశ్వాసాన్ని సైతం అలవరచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారు. ఒక ఇంజినీరు సరిగ్గా పనిచేయకపోతే ఓ భవనమో వంతెనో కూలిపోతుంది. ఒక వైద్యుడు విధినిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే ఓ ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది. కానీ, తమ బాధ్యతలో అధ్యాపకులు అశ్రద్ధ వహిస్తే ఓ తరం భవిష్యత్తే అంధకారంలో కూరుకుపోతుంది. అందుకే గురువుల దృష్టి అంతా తరగతి గదులపైనే ఉండాలి. విద్యార్థులను మేలిమి వజ్రాలుగా సానబట్టడమే వారి లక్ష్యం కావాలి. కానీ, తాము బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తున్నట్లు తెలంగాణలో పాతికశాతం ఉపాధ్యాయులు తాజా సర్వేలో వెల్లడించారు. చదువు చెప్పలేకపోతున్నామన్న బాధ టీచర్లలో తలెత్తకుండా, బోధనలో వారు రాణించగలిగే విధంగా ప్రభుత్వాలు తక్షణం శ్రద్ధ వహించాలి. సమర్థ శిక్షణతో ఉపాధ్యాయుల నైపుణ్యాలను మరింత మెరుగుపరచాలి!

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో ప్రధాన భూమిక ఉపాధ్యాయులదే. అందుకే గురు బ్రహ్మ గురుర్విష్ణు అంటూ మన సంస్కృతి వారిని కీర్తిస్తోంది. అలా జాతి తలరాతను మార్చి రాసే టీచర్ల శిక్షణ ఎలా సాగుతోందో చూస్తే- ఆవేదనే మిగులుతుంది. కాసులే పరమావధిగా చాలా బీఈడీ కాలేజీలు క్లాసులు సైతం చెప్పకుండా పట్టాలు చేతిలో పెట్టేస్తున్నాయి. దాంతో ఎంతో మందిలో బోధనా సామర్థ్యాలు కొరవడుతున్నాయి. మరోవైపు ఎన్నో ప్రభుత్వ బడుల్లో అవసరానికి మించి టీచర్లు ఉంటుంటే- కొన్నిచోట్ల తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు లేక పిల్లల ఉజ్జ్వల భవిష్యత్తుపై కారుచీకట్లు కమ్ముకొంటున్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వ బడుల్లో చేరికలు తగ్గిపోతున్నాయి. కానీ, వేలకు వేలు ధారపోసి చదువును కొనలేని పేద, బడుగు బలహీనవర్గాల పిల్లలకు అవే ఆశాదీపాలవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సర్కారీ బడుల్లో బోధన నాణ్యత పెంపుపై ప్రభుత్వాలు దృష్టిసారించకపోతే- అసహాయ కుటుంబాల చిన్నారులకు ఇంకా అన్యాయం చేసినట్లు అవుతుంది. ఆర్థిక సామాజిక అసమానతలను అది మరింతగా ఎగదోస్తుంది!


ఏ దేశమైనా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చదువే ఆలంబన అవుతుంది. దీన్ని గుర్తించి దక్షిణ కొరియా, సింగపూర్, జపాన్, ఫిన్లాండ్ లాంటివి మెరికల్లాంటి వారిని ఉపాధ్యాయ వృత్తిలోకి రప్పిస్తున్నాయి. మారుతున్న అవసరాలకు అనుగుణంగా టీచర్లకు ఎప్పటికప్పుడు సమర్థ శిక్షణ అందిస్తూ, భావి పౌరులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుకొంటున్నాయి. తద్వారా జ్ఞానాధారిత ప్రపంచంలో అవి గెలుపు జెండా ఎగరేస్తున్నాయి. మన దేశంలోనేమో అందుకు భిన్నమైన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. నిరుటి అసర్ నివేదిక ప్రకారం- దేశీయంగా అయిదో తరగతి విద్యార్థుల్లో సగం మందే రెండో క్లాసు పాఠాలు చదవగలరు! చిన్నచిన్న భాగహారాలు చేయమంటే తెల్లముఖాలు వేసే వారికీ కొదవలేదు. ఇలా అరకొర జ్ఞానంతో ఏదో ఒకటి ముక్కునపట్టి పరీక్షల్లో పాసైపోతున్నవారు అంతిమంగా ఉపాధి వేటలో కళ్లు తేలేస్తున్నారు. ఈ దుస్థితిని పరిమార్చాలంటే- ఉపాధ్యాయ శిక్షణను లోపరహితం చేసి నవీన బోధనా పద్ధతులకు ఎర్రతివాచీ పరవాలి. సర్కారీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తూనే బట్టీ చదువులను సాకల్యంగా సంస్కరించాలి!



నౌకా నిర్మాణంలో ఎన్నాళ్లీ వెనకబాటు?

ప్రపంచంలో డబ్బనేది పుట్టకముందు నుంచే ప్రజల మధ్య, దేశాల మధ్య వస్తుమార్పిడి జరుగుతుండేది. ఈనాడేతే ఎగుమతి దిగుమతుల్లేని దేశమన్నదే లేదు. అయితే, సరకు రవాణాకు అత్యంత కీలకమైన వాణిజ్య నౌకలను సొంతంగా తయారు చేసుకునే దేశాలు ఆర్థికంగానే కాకుండా, వ్యూహాపరంగానూ లాభపడుతున్నాయి. ఈ విషయంలో ఇండియా బాగా వెనకబడి పోయింది. కేంద్రం తీసుకొచ్చిన తాజా సంస్కరణలు మన నౌకా నిర్మాణ రంగం దశను మార్చగలవన్న ఆశలను రేకెత్తిస్తున్నాయి.

భారతదేశ నౌకా పరిశ్రమకు ఎంతో ఘనమైన వారసత్వముంది. ప్రపంచ గతిని మార్చిన ప్రత్యేక ఘట్టాలెన్నో దీనితో ముడిపడి ఉన్నాయి. క్రీ.పూ.3000 సంవత్సరాల క్రితమే సింధు లోయలోని వర్తకులు మెసొపొటేమియాతో నౌకా వాణిజ్యం నెరిపేవారు. మొహెంజొదారో, హరప్పాల్లో జరిపిన తవ్వకాల్లో ఇందుకు లభించిన ఆధారాలెన్నో! 11,098 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం కలిగిన ఉపఖండంలో నందులు, మౌర్యులు, శాతవాహనులు, గుప్తులు, పల్లవులు, చోళులు వంటి వారి పాలనలోనూ... మొఘల్, పోర్చుగీస్, డచ్, ఫ్రెంచ్, బ్రిటిష్ జమానాల్లోనూ అనేక చోట్ల నౌకా పరిశ్రమ పరిఢవిల్లింది. పురాతత్వ పరిశోధకులు 1954లో అహ్మదాబాద్‌కు సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని లోథాల్ దగ్గర డ్రై-డాక్‌ను కనుగొన్నారు. నౌకా నిర్మాణంతో పాటు ఎక్కడెక్కడికో ఓడలు మరమ్మతుల కోసం లోథాల్‌కు వచ్చేవి. క్రీ.పూ.2400 నాటి ఆ రేవులో సముద్రపు అలలు, గాలుల సమాచారాన్ని తెలుసుకునేందుకు ఏర్పాట్లు ఉండేవి. అంతటి సాంకేతిక పరిజ్ఞానం అప్పట్లో ప్రపంచంలో మరెక్కడా లేదంటే భారతీయ నౌకా పరిశ్రమ ఎంతటి ఉన్నతిని చూసిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, స్వాతంత్ర్యానంతరం పరిస్థితులు మారిపోయాయి. నేడు ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో భారత్ వాటా ఒక్క శాతమైనా లేదు! ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ఇటీవల ఇండియా మారిటైమ్ వీక్ సందర్భంగా 600కు పైగా ఒప్పందాలు చేసుకుంది.



ప్రపంచ నౌకా నిర్మాణంలో వివిధ దేశాల వాటా (శాతాల్లో)...

(ఆధారం: యూఎన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్-2024 నివేదిక)

విదేశీ నౌకలే దిక్కు...

ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన ఇండియా- నిరుడు సుమారు 82,000 కోట్ల డాలర్ల వస్తుసేవలను విదేశాలకు ఎగుమతి చేసింది. దిగుమతులేమో 91,500 కోట్ల డాలర్లు. మన విదేశీ వర్తకంలో పరిమాణం పరంగా 95శాతం, విలువను బట్టి చూస్తే 70శాతం సరకులు సముద్రాల మీదుగానే రవాణా అవుతున్నాయి. అయితే, ఇందుకోసం భారత్‌కు విదేశీ నౌకలే దిక్కవుతున్నాయి. ఈ విషయంలో స్వదేశీ షిప్‌ల వాటా కేవలం అయిదు శాతమే. 1980 దశకంలో మన విదేశీ వర్తకంలో 40శాతం స్వదేశీ నౌకల ద్వారానే జరిగేదంటే నేడు పరిస్థితి ఎంతగా దిగజారిపోయిందో కదా! మన షిప్‌యార్డుల పనితీరు పేలవంగా ఉండటం, చాలా తక్కువ సంఖ్యలో అవి నౌకలను ఉత్పత్తి చేస్తుండటమే దీనికి ప్రధాన కారణం. ఇలాంటి పరిస్థితుల్లో సరకు రవాణా కోసం భారత్ ఏటా ఆరు లక్షల కోట్ల రూపాయలను విదేశీ నౌకలకు ధారపోస్తోంది. ఇది రక్షణ రంగానికి ఈ ఏడాది కేంద్రం కేటాయించిన బడ్జెట్‌కు దాదాపు సమానం!

ప్రపంచ నౌకా నిర్మాణ సామర్థ్యం 65 మిలియన్ గ్రాస్ టన్నులు(ఎంజీటీ) కాగా, మనది కేవలం 0.072 ఎంజీటీయే. ఏటా 15వేల కోట్ల డాలర్లతో అంతర్జాతీయ నౌకా నిర్మాణ మార్కెట్ తులతూగుతుంటే, భారతీయ పరిశ్రమ సుమారు 110 కోట్ల డాలర్లతో కొట్టుమిట్టాడుతోంది. దేశ రక్షణకు అత్యంత కీలకమైన నౌకాదళ షిప్‌ల తయారీ, మరమ్మతుల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమలు నిమగ్నమయ్యాయి. ఎల్అండ్‌టీ వంటి ప్రైవేటు కంపెనీలేమో ప్రత్యేక నౌకలను తయారు చేస్తున్నాయి. కానీ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను మాత్రం అవి అందుకోలేకపోతున్నాయి. ఏళ్ల తరబడి వేళ్లూనుకున్న నిర్లక్ష్యం మూలాన్నే భారీ వాణిజ్య నౌకల తయారీలో భారత్ బాగా వెనకబడిపోయింది. చైనా వంటి దేశాలతో పోలిస్తే, నౌకల తయారీకి మన దగ్గర చాలా ఎక్కువ ఖర్చవుతోంది. చాలా ఆలస్యమూ జరుగుతోంది.

గతిని మారుస్తాయా?

సరకు రవాణాకు తగినన్ని స్వదేశీ నౌకలు లేకపోవడం, విదేశీ నౌకలపైనే ఎక్కువగా ఆధారపడటం ఏ విధంగానూ భారత్‌కు శ్రేయస్కరం కాదు. నౌకా నిర్మాణం కోసం విదేశీ షిప్‌యార్డులను ఆశ్రయించడం భారతదేశ వాణిజ్యాన్నీ, సరఫరా గొలుసుల సామర్థ్యాన్నీ దెబ్బతీస్తుంది. ఆర్థికంగా బలపడుతున్నకొద్దీ భారత్ నౌకలపై ఆధారపడటం పెరుగుతుంది. అదే జరిగితే, భారత్ వ్యూహపరంగా రాజీపడాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. అలా కాకూడదంటే, సగర్వంగా భారతీయ జెండా రెపరెపలాడుతూ సాగర జలాలపై దూసుకెళ్లే స్వదేశీ నౌకల తయారీకి కేంద్రం పెద్దపీట వేస్తోంది. ఈ దిశగా మొన్న సెప్టెంబరులో నౌకా నిర్మాణ రంగం దశను మార్చేందుకు రూ.69,725 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. తాజాగా మారిటైమ్ వీక్ సందర్భంగానూ రూ.12 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకుంది. సుదీర్ఘకాలంగా ఈ రంగాన్ని పట్టిపీడిస్తున్న నిధుల కటకటా, పనుల లేమికి, అరకొర వాణిజ్య నౌకలతో నెట్టుకురావడం వంటి పరిస్థితులకూ ఈ సంస్కరణలు ముగింపు పలకవచ్చు. తద్వారా దేశంలో నౌకా నిర్మాణం, మరమ్మతులు, బ్రేకింగ్ కార్యకలాపాలు ఊపందుకోవడంతో పాటు భారీ వాణిజ్య నౌకల నిర్మాణానికి మేలిమి బాటలు పరుచుకోగలవు. ప్రపంచ నౌకా ఉత్పత్తిలో 90శాతం చైనా, దక్షిణ కొరియా, జపాన్‌లలోనే జరుగుతోంది. ఈ జాబితాలో 16వ స్థానంలో దిగబడిపోయిన ఇండియాను మరో పదేళ్లలో తొలి పది దేశాల్లో ఒకటిగా, వికసిత్ భారత్ ఆవిష్కృతమయ్యే 2047 నాటికి మొదటి నాలుగింటిలో ఒకటిగా నిలపాలని కేంద్రం నిశ్చయించింది. ఇది అక్షరాలా నెరవేరాలని ఆశిద్దాం!

- తమ్మిశెట్టి రఘుబాబు

మన లోపలి సంతోషానికి బాహ్య సంకేతమే... నవ్వు. నిద్రలో నవ్వే పసిపాపాయిని చూడగానే చిరునవ్వు నవ్వని పెద్దలెవరూ ఉండరు. తప్పటడుగుల చిట్టితండ్రి తప్పుచేసి దొరికిపోయి రువ్వే లేత నవ్వు, దండించాలనుకున్న అమ్మ కోపాన్ని పడీ పడీ నవ్వేలా మార్చేస్తుంది. ఆ పసివాళ్లని అమాంతం ఎత్తుకుని ముద్దాడేట్టు చేస్తుంది.

మనసారా నవ్వే నవ్వును విరిసిన పువ్వుతో పోలుస్తారు కవులు. ప్రేయసి నవ్వు ప్రియుడికి దేన్నయినా ఎదిరించే వెయ్యి ఏనుగుల బలాన్నిస్తుంది. నవ్వు కోపానికి విరుగుడు, అనేక రోగాలను దూరం చేసే దివ్య ఔషధం. దీన్ని మించిన వ్యాయామం లేదు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యాన్నిచ్చి, ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేలా చేస్తుంది నవ్వు. ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరికైనా అది అందించే ఫలితం అనూహ్యం.



నవ్వు... విరిసిన పువ్వు!

పిరికితనాన్ని పోగొడుతుంది. మనస్ఫూర్తిగా నవ్వే వ్యక్తులు ఎక్కువ కాలం జీవిస్తారు. చిన్నప్పుడు కల్మషం లేకుండా నవ్వినట్టే, పెద్దయ్యాక కూడా నవ్వగలిగినవాళ్లు అదృష్టవంతులు. ఎక్కడ నవ్వాలి, ఎంత మోతాదులో నవ్వాలి- అన్నది వ్యక్తిత్వ వికాసంలో ముఖ్యమైన అంశం. కావాల్సిన కార్యాన్ని సానుకూలం చేసే శక్తి నవ్వుకు ఉంది. నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారితో ఏర్పడే పరిచయం పదికాలాలు నిలిచి ఉంటుంది.

నవ్వుల్లో ప్రధానంగా ఆరు రకాలున్నాయి. స్మితం అంటే- పెదాలపై దరహాస చంద్రికలు పూయించడం. పలువరుస కనిపించేట్లు నవ్వితే అది హసితం. అదే విహసితం అంటే చిన్నగా శబ్దం చేస్తూ నవ్వే నవ్వు. చెవులకు ఇంపుగా నవ్వుతూ తలా భుజాలూ కూడా కదిలిస్తే అది ప్రహసితం. అపహసితం అంటే- అపహాస్యం లేదా ఎగతాళి చేస్తూ నవ్వే నవ్వు. చివరగా... శరీరమంతా ఊగిపోతూ నవ్వే నవ్వును అతిహసితం అంటారు. మహాభారతంలో తిక్కన ముప్పై రెండు రకాల నవ్వుల్ని పేర్కొన్నాడు. ఇవికాక పలువురు రచయితలు తమ రచనల్లో పరి పరి విధాల నవ్వులని పరిచయం చేశారు. ఎదుటివారిని హేళనచేస్తూ నవ్వడం, నిస్సహాయతను చూసి వెక్కిరిస్తూ నవ్వడం, కాలుజారి కిందపడిన వాళ్లని చూసి పగలబడి నవ్వడం, గెలుపు చిహ్నంగా వికటాట్టహాసం చేయడం, ఎదుటివారి అపజయానికి ఎద్దేవాగా నవ్వడం... అభిలషణీయం కావు. నవ్వు నాలుగు విధాల చేటు అన్నది ఇలాంటి వాటి విషయంలోనే. నవ్వు వెనకాల ఉండే అర్థాన్ని గ్రహించిన వాళ్లు, ఆ నవ్వును బట్టే వారికి విలువిస్తారు.

మనిషి ఏడుస్తూ పుట్టినా నవ్వుతూ వెళ్లిపోవాలనుకుంటాడు. నవ్వుకు అంత విలువుంది మరి. పైసా ఖర్చు లేకుండా కాస్త పెదాలను కదిలిస్తే చాలు... అది రెండు మనసుల మధ్య స్నేహానికి వంతెన అవుతుంది. దీర్ఘకాలపు అనుబంధానికి పునాది వేస్తుంది. ఏ కారణంగానైనా చిన్నబోయిన మనసుకు సాంత్వననిస్తుంది. ఏ నగలతోనూ తేలేని అందం ముఖానికి చిరునవ్వు తెస్తుంది. ప్రతి మనిషి దగ్గరా ఉండే ఈ ఆస్తి ఎవరూ దోచుకోలేనిది. అందుకే ఉదారంగా ప్రదర్శించాలే కానీ దాచుకోకూడదు!

- పీవీ రాయుడు



నాయకత్వం వహించడానికి చేతిలో బెత్తం కాదు, మనసులో ప్రేమ ఉండాలి. ఎవరైనా గొప్ప నాయకులుగా పేరు తెచ్చుకున్నారంటే వాళ్లు తమ ఇష్టాయిష్టాల కన్నా మెజారిటీ అభిప్రాయానికి విలువ ఇస్తున్నారని అర్థం.

- జెఆర్‌డీ టాటా

ఆరింటిని జయించాలి

ఒక వస్త్రాన్ని శుభ్రం చేయడం అంటే దానిలో దాగి ఉన్న మురికిని తొలగించడమే. అంతేగాని ఆ వస్త్రానికి కొత్తగా మెరుగులు దిద్దడం కాదు. అలాగే మనిషిలో కూడా అనేక మాలిన్యాలు పోగుపడి ఉంటాయి. రాగద్వేషాలు, భయాందోళనలు, అహంకారం, అసహనం, ఈర్ష్య వంటి భావాలు మనసును కలుషితం చేస్తుంటాయి. అనుకున్న పనులన్నీ జరగకపోవడం, ఆశించిన కోరికలు నెరవేరకపోవడం కూడా మనిషిని నిరాశా నిస్పృహలకు గురిచేస్తుంటాయి. ప్రజలు వీటిని గుర్తించరు. గుర్తించినా వారికి అవి దోషాలుగా కనిపించవు. ఒకవేళ దోషాలుగా కనిపించినా కూడా వాటిని వదిలిపెట్టడానికి అహం అడ్డు తగులుతుంది. ఈ తరహా జీవనవిధానంలో ఆనందం ఎప్పటికీ దొరకదు.

కష్టాలకు మూలకారణాలేంటో వెతకాలి. సాధారణంగా ఎవరి కష్టాలకు వారే కారణం అవుతారు. ఇది సత్యం. కానీ ఎదుటి వారి వల్లే తమకు కష్టాలు వస్తాయనే తప్పుడు ఆలోచనతో ఉంటారు చాలామంది. ఇలా కాకుండా, ఎవరికి వారు ముందు తమలోని లోపాలను తెలుసుకోవాలి. తమ కర్మలను మనస్సాక్షిగా పరిశీలించుకోవాలి. అప్పుడు కష్టాలకు కారణాలు తెలుస్తాయి. వాటిని సరిదిద్దుకునే క్రమంలో ఆనందం చేరువవుతుంది.

ప్రతి మనిషిలోనూ ఆరు శత్రుగుణాలు ఉంటాయి. మొదటిది కామం. అలవికాని కోరికలతో ఉండటం దీని స్వభావం. కామాతురాణాం న భయం న లజ్జ... అన్నారు. పరువూ మర్యాదా అన్నీ వదిలేసి ప్రవర్తిస్తారు. రెండోది క్రోధం. నిత్యం కోపంతో రుసరుసలాడుతూ ప్రతి దానికీ ఎదుటివారిని దూషించడం దీని లక్షణం. ఇది ఉంటే ప్రేమ, దయ వంటివి ఏ కోశానా కనబడవు. మూడోది లోభం. పిల్లికి కూడా భిక్షం పెట్టని తత్త్వం ఇది. ఎంత ఉన్నా పక్కవారికి చెయ్యి విదల్చలేని పిసినారి గుణమిది. నాలుగోది మోహం. వస్తువాహనాలు, బంధాల మీద వల్లమాలిన ప్రేమ కలిగిఉండటం మోహం. ఈ వ్యామోహం సంకుచిత స్వభావానికి దారితీస్తుంది. అయిదోది మదం. .. అంటే గర్వం. డబ్బు ఉందనో, పదవి ఉందనో విపరీతమైన పొగరుతో ప్రవర్తిస్తారు. ఆరోది మాత్సర్యం, అంటే ఈర్ష్య. ఇతరుల భాగ్యాన్ని చూసి ఏడవడం. తనకు లేనిది ఇతరులకు ఉందనే కడుపు మంట. ఈ ఆరు దుర్గుణాలు మనుషులు అందరిలోనూ ఉంటాయి. సంస్కారంతోనూ, జ్ఞానంతోనూ వాటిని తొలగించుకోవాలి. దుర్గుణాలు తొలగిపోతేనే సుగుణాలు వచ్చి చేరతాయి. ఈ సాధనంతా ఒక ఎత్తైతే, తనకున్నదాంతోనే తృప్తిగా జీవించడం మరో ఎత్తు.

జీవితం అన్నాక కష్టాలు తప్పవు. వాటిని నివారించుకునే మార్గాన్ని భగవాన్ బుద్ధుడు సూచించాడు. దోషపూరితమైన ఆలోచనలను తొలగించుకోవడమే దానికి నివారణ మార్గం అన్నాడు. అరిషడ్వర్గాలతో పాటు అటువంటి ఆలోచనలే మనిషికి నిజమైన శత్రువులు. వీటిని నిర్మూలించుకుంటే చాలావరకు కష్టాల కడలి నుంచి గట్టెక్కినట్లే. అప్పుడు లోలోన దాగి ఉన్న ఆనందం వెల్లడవుతుంది. అదే జీవిత పరమార్థమవుతుంది.

అంతర్యామి

- డాక్టర్ బండి సత్యనారాయణ



పరిశోధనలే ప్రాణంగా...

శాస్త్ర సాంకేతిక రంగాలు నేడు ఆర్థిక వ్యవస్థల పురోగతిని శాసిస్తున్నాయి. అందుకే అన్ని దేశాలు వాటిపై ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆయా దేశాల్లో జరుగుతున్న కృషిని సంబంధిత పత్రికల్లో వచ్చే వ్యాసాలు వెల్లడిస్తాయి. ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ, గణితం, క్లినికల్ మెడిసిన్, బయోమెడికల్ రీసెర్చ్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, భూ, అంతరిక్ష విజ్ఞానాలకు సంబంధించి సైన్స్, సాంకేతిక జర్నళ్లలో 2022లో విశ్వవ్యాప్తంగా 33.40 లక్షల వ్యాసాలు ప్రచురితమయ్యాయి. అందులో పలు దేశాల వాటా(లక్షల్లో)...

చైనా	8.98
అమెరికా	4.57
ఇండియా	2.07
జర్మనీ	1.13
యూకే	1.05
జపాన్	1.03
రష్యా	0.84
దక్షిణ కొరియా	0.76
కెనడా	0.69
ఫ్రాన్స్	0.65

(ఆధారం: ప్రపంచ బ్యాంక్ నివేదిక-2025)


కాంగ్రెస్ కరనాటకం!

కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచి తాను సీఎం అయినప్పటి నుంచి సిద్ధరామయ్య కాస్తా యుద్ధరామయ్య అయిపోయారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఉపముఖ్యమంత్రి శివకుమార్ 'ఒక్కసారి సీఎం చెయ్యి గణనాథా' అంటూ కర్ణాటక గల్లీల నుంచి దిల్లీ పార్టీ పెద్దల దాకా ఒత్తిడి తెస్తున్నారు. అలా ఒక చెయ్యి ఇంకో చెయ్యిని తెగ కొడుతోంది. విరగ్గొడుతోంది. గెలవక గెలవక గెలిచిన కొద్ది రాష్ట్రాల్లో ఇలా అవుతుంటే పార్టీ 'విధి'నేతలు 'పాలు'పోక 'నీరు'గారిపోతున్నారు. ఏదో కర్ణాటకలో జరుగుతోందని కాదు కానీ యావత్ భారతంలో కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఉండే 'కర'నాటకమే ఇది!

'కాంగ్రెస్‌ను గెలిపించడం వరకే మీ చేతుల్లో ఉంది. గెలిచాక ఎవరు ముఖ్యమంత్రి అవుతారు? అయిన వాళ్లు ఎంతవరకు గద్దె మీద ఉంటారు? మూడినప్పుడు గద్దె మీద ఉన్న వాళ్లు మిద్దె మీద నుంచి పడినట్టు పడి ఏమవుతారు? అనేవి మా చేతుల్లో ఉన్నాయి. అనవసరంగా మీరు ప్రయాసపడి, ఆయాసపడి ప్రయోజనం లేదు' అని అధిష్ఠానం ఎప్పుడూ కాంగ్రెస్ ఓటర్ల కలలోకి వచ్చి చెబుతూనే ఉంటోంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మీడియాలో నేటి ముఖ్యమంత్రి అని వస్తే 'నేటి వరకే గ్యారంటీ. రేపటి సంగతి, సంగీతం చెప్పలేం' అని అర్థం చేసుకోవాలి.

బరిలో దిగాక 'పార్టీ కల్యాణం, లోక కల్యాణం' సరిసమానంగా చూసుకునే పార్టీ ఆల్ ఇండియాలోనే కాదు, హోల్ వరల్డ్‌లో కాంగ్రెస్ ఒక్కటే. వచ్చే ఎన్నికల్లో మట్టికరిచినా సరే, ఇప్పుడు మాత్రం రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక పదవుల్లో కీలక నాయకులకు సమానావకాశాలు కల్పించాలన్న సిద్ధాంతం మీద కాంగ్రెస్ గట్టిగా నిలబడుతుంది. ఎవరో ఒక నాయకుణ్ని ముఖ్యమంత్రి చేసి అయిదేళ్ల పాటు పదవిలో ఉంచితే- రెండు చేతులతో ఆయన ఏవో, ఏవేవో కుంభకోణాలు చేసి నాలుగు రాళ్లు వెనకేసుకుని కోటి రాళ్లు తన మీద వడేయించుకోవడం ఏం న్యాయం? నాయకులందరూ, వాళ్ల అనుచరులందరూ సమానంగా అభివృద్ధి చెందాలా లేదా?

అందుకే పది మంది సీఎంలను తాము తీసేసినా ఫర్వాలేదు, తరవాత జరిగే ఎన్నికల్లో జనం కర్రు కాల్చి తమ పార్టీకి వాత పెట్టినా డోంట్ కేర్. కాంగ్రెస్ పాటించే ఈ పాలసీ మారదు గాక మారదు. ఆ పార్టీలో ఈ విధానానికి ఒకనాటి ఆంధ్రప్రదేశ్ 'మడుగు జాడ' అయింది. వెనకటి కాలంలో కాంగ్రెస్ అధిష్ఠానం రోజులు లెక్క పెట్టి



ఏడాదికి ఒకరి చొప్పున నలుగురు ముఖ్యమంత్రులను ఎడాపెడా గద్దె దించి చివరికి తన పార్టీనే శంకరగిరి మాన్యాల్ని పట్టించేసింది. అసలు సిసలైన త్యాగమంటే అదీ.

పూర్వకాలంలో కాంగ్రెస్ సీఎంలు తమ మీద ఏ చిన్న ఆరోపణ వచ్చినా వెనకా ముందు ఆలోచించకుండా రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయేవారు. తర్వాతి కాలంలో ఏ ఆరోపణలు లేకున్నా అధిష్ఠానమే వాళ్లను ఇంటికి పంపించడం మొదలుపెట్టింది. అలా తనకు పుట్టగతులు లేకుండా చేసుకుంటూ, కొత్త పార్టీలు పుట్టుకొచ్చేలా తెగ కష్టపడింది. ఇంత త్యాగబుద్ధి ఇంకే పార్టీకైనా ఉందా?

కాంగ్రెస్ పార్టీ పెద్దలు తమ సీఎంలను గద్దె దించడానికి ఆగమేఘాల మీద సరిగ్గా ఎన్నికలకు ముందు ఒక 'సుముహూర్తం' నిర్ణయిస్తారు. దానికి కట్టుబడి వాళ్లని దించేసి అసమ్మతివాదులుగా తయారు చేస్తారు. వారి ఉసురు తగిలి కొత్త ముఖ్యమంత్రి నాయకత్వంలో పార్టీ ఘోరంగా ఓడిపోయేట్టు 'సకల జాగ్రత్తలు' తీసుకుంటారు. ఒక రకంగా పాత సీఎంకి కొండంత సాయం చేస్తారు. తమ నాయకత్వంలో ఎన్నికలు జరిగి ఉంటే పార్టీ ఓడిపోయేదే కాదని ఆత్మ విశ్వాసమో, పరమాత్మ విశ్వాసమో కల్పిస్తారు. అయితే కాంగ్రెస్‌కు ఆదర్శప్రాయమైన ఓ సుగుణం ఉంది. ఇతర పార్టీల ముఖ్యమంత్రులను పదవీచ్యుతులను చేయాలన్న పాడు కోరికలు ఇప్పుడు ఆ పార్టీకి లేవు.

కాంగ్రెస్‌లో కాకలుతీరిన నాయకులే కాదు, బాకాలు ఊదించుకునే ఉత్త నేతలూ ఉంటారు. అలాంటి వారిలో ఒకాయన ఉమ్మడి ఏపీలో సీఎం పదవి తనకు వారసత్వంగా దక్కలేదని కోపంతో బయటికి వచ్చి సొంత పార్టీ పేరుకు కాంగ్రెస్‌ను తోకగా పెట్టుకున్నాడు. తండ్రి జమానాలోని కొన్ని కుంభకోణాల్లో ఎన్నో కోణాల్లో చిక్కుకుని జైలు పాలైనా ఆయనలో పశ్చాత్తాపం రాలేదు. కాంగ్రెస్ జమానాలో కొంతమంది ముఖ్యమంత్రుల పదవీకాలాన్ని మించి జైల్లో ఉన్న ఆయన మహానుభావుడు, బయటికి వచ్చాక తగుదునమ్మా అని ఒక్క ఛాన్స్ ఇమ్మని జనాన్ని నమ్మించి సీఎం అయ్యారు. అయ్యి వెనకటి పనులనే కంటి'న్యూగా' చేయడంతో చివరికి పదవి పోగొట్టుకున్నారు. అయినా ఆయనది అదే వరస... అదే వాయి. బెయిలుపై బయట ఉన్నా 'రాజా' భజంత్రీలు... ముద్దాయిగా కోర్టుకు వెళ్లేటప్పుడు కూడా 'ఏ వన్ మందీ' మార్బలంతో విజయోత్సవాలు... రాజకీయాల్లో ఎన్నెన్ని జైలు వేషాలు! ఎన్ని వింతలు! ఎన్ని విన్యాసాలు! కాంగ్రెస్ సంస్కృతి అని పూర్వం గిట్టని పార్టీలు నిందించేవి. అది కూడా ఈ తోకపార్టీ సంస్కృతిలా ఉండేది కాదంటే ఎంత అభివృద్ధి సాధించినట్టో.. నట్టో.. టట్టడాయ్!!

- శంకర నారాయణ

అలలు అలా..!

హాయ్ ఫ్రెండ్స్..! మీరెప్పుడైనా బీచ్‌కి వెళ్లినప్పుడు అలలను గమనించారా? అలాగే వాటిని చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది. ఆ శబ్దం కూడా చాలా బాగుంటుంది. ఇంతకీ సముద్రంలో అలలు రావడానికి, శబ్దానికి కారణమేంటో తెలుసా? తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుందాం రండి!

సెలవుల్లో బీచ్‌కి లేదంటే ఊర్లో ఉన్న చెరువు దగ్గరికి వెళ్లినప్పుడు ఆ నీళ్లలో ఎంచక్కా ఆడుకుంటాం. అక్కడ ఎంతసేపు ఆడుకున్నా అస్సలు బోర్ కొట్టదు కదా! బీచ్‌లో ఆడుకునేటప్పుడైతే అలలతో పాటు మనమూ ముందుకు వచ్చేస్తాం. ఇంతకీ ఈ అలలు ఎలా ఏర్పడతాయంటే.. గాలి నీటిలో ఒక ఎనర్జీని విడుదల చేస్తుంది. అప్పుడు నీళ్లు ముందుకు కదులుతాయి. ఆ సమయంలోనే చిన్నచిన్న అలలు ఏర్పడతాయి. అంటే గాలి ఎంత వేగంగా వీస్తే.. అలలు అంత వేగంగా ముందుకు కదులుతాయన్నమాట. ఇంకాస్త పెద్ద అలలు, ఉప్పెనలు ఏర్పడటానికి కారణం.. చందమామ. 'అదేంటి.. గాలి అంటే నీళ్లు ఉన్న చోట ఉంటుంది కాబట్టి అలలకు కారణం అనుకోవచ్చు.


హాయ్! బుజ్జీ!!

చందమామ అక్కడెక్కడో ఉంటుంది కదా! అసలు ఈ రెండింటికీ ఏంటి సంబంధం' అనుకుంటున్నారా నేస్తాలూ! సూర్యుడు, చంద్రుడు, భూమి ఒకదాని మీద మరొకటి గురుత్వాకర్షణ శక్తి కలిగి ఉంటాయి. సూర్యుడి కంటే చందమామ భూమికి చాలా దగ్గరగా ఉంటుంది. అలా చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి వల్ల భూమిపైనున్న నీటిపై ప్రభావం పడుతుందన్నమాట. సముద్రంలోని నీటిమట్టం పెరగడానికీ తగ్గడానికి కూడా ఇదే కారణం తెలుసా! మరో విషయం ఏంటంటే.. నీటి అలల శబ్దం మనసును చాలా ప్రశాంతంగా ఉంచుతుందట. ఒత్తిడి కూడా తగ్గేలా చేస్తుందట. అందుకే చాలామంది పెద్దవాళ్లు సముద్రాలు ఉన్న చోటుకు వెళ్లడానికి ఇష్టపడతారట. మనం చిన్నపిల్లలం కదా నీళ్లు ఎక్కువగా ఉన్న దగ్గరికి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలి సరేనా! ★

పదవలయం

కింద ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలు రాయండి. అన్నీ 'త' అక్షరంతోనే ముగుస్తాయి. ఓసారి ప్రయత్నించండి.

1. నానుడి లాంటిది..
2. ఒక రుతువు
3. లోటు
4. ఒక జీవి
5. భవిష్యత్తు ఇంకోలా
6. చేతితో దుస్తులు నేస్తే..
7. --- కాజా
8. ఆనందంతో అరవడం



[illegible]



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర స్టార్ హోటళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి, సలహాదారు ముత్తవరపు మురళీకృష్ణ

'ఆతిథ్య రంగానికి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పునరుద్ధరించాలి'

ఈనాడు, అమరావతి: పర్యాటక, ఆతిథ్య రంగానికి జీఎస్టీ కింద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ప్రయోజనాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర స్టార్ హోటళ్ల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వీ స్వామి, సలహాదారు ముత్తవరపు మురళీకృష్ణ శుక్రవారం విజయవాడలో కలిసి.. ఆతిథ్య రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు.


రాజధానికి మరో 16,666 ఎకరాల సమీకరణ

(మొదటి పేజీ తరువాయి)

జరీబు భూములకు ఎకరానికి 1,000 గజాల నివాస, 450 గజాల వాణిజ్య స్థలం, మెట్ట భూములకైతే ఎకరానికి 1,000 గజాల నివాస, 250 గజాల వాణిజ్య స్థలం కేటాయిస్తుంది. వార్షిక కౌలు చెల్లిస్తుంది. ప్రస్తుతం రాజధాని గ్రామాల్లోని రైతులకు ఇస్తున్న అన్ని సదుపాయాలను ఈ ఏడు గ్రామాల రైతులకూ కల్పిస్తుంది.

భవిష్యత్తులో మరింత భూసమీకరణ

అమరావతిలో 5 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు, కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు స్మార్ట్ ఇండస్ట్రీస్ జోన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజధాని పనులు వేగం పుంజుకోవడంతో పెట్టుబడులు పెట్టేందుకు పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ముందుకు వస్తున్నాయి. క్వాంటమ్ వ్యాలీ ప్రారంభమైతే దానికి అనుబంధంగా అనేక విద్య, పరిశోధన సంస్థలూ వచ్చే అవకాశముంది. వాటి కోసం భవిష్యత్తులో మరిన్ని గ్రామాలకు చెందిన రైతుల నుంచి భూమిని సమీకరించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఎయిర్‌పోర్టు, కాలుష్య రహిత పరిశ్రమల జోన్‌కు అవసరమైన భూసమీకరణపై అధికారులు కసరత్తు చేస్తున్నారని, త్వరలో దానిపై స్పష్టత ఇస్తామని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ క్యాబినెట్ సమావేశం అనంతరం విలేకరులకు తెలిపారు. భవిష్యత్తులో ఒలింపిక్స్ నిర్వహించేందుకు పోటీపడే స్థాయిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీని నిర్మించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. '217 చ.కి.మీ. పరిధిలో రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, యూనివర్సిటీలు, స్కూళ్లు, హోటళ్లు, ఇతర సంస్థలకు రాజధానిలో ఇప్పటికే స్థలాలు కేటాయించాం. అందరూ ఒకరి తర్వాత ఒకరుగా పనులు ప్రారంభిస్తున్నారు. ఇక్కడి ప్రజలకు కావలసిన ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు స్మార్ట్ ఇండస్ట్రీస్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ వంటివి కావాలి. వాటి కోసం మరికొంత భూమి తీసుకుంటాం. ఇప్పటికే గుంటూరు జిల్లా కలెక్టర్, అధికారులు గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు తీసుకున్నారు' అని నారాయణ పేర్కొన్నారు.



పరకామణి కేసులో వైవీ సుబ్బారెడ్డి విచారణ

(మొదటి పేజీ తరువాయి)

సుబ్బారెడ్డి హయాంలోనే జరిగాయి. చోరీ చేసిన సొత్తుతో కూడబెట్టిన ఆస్తుల్లో 7 ఆస్తుల్ని తితిదేకు గిఫ్ట్‌డీడ్‌గా ఇవ్వటానికి నిందితుడు రవికుమార్ ప్రతిపాదించగా సుబ్బారెడ్డి నేతృత్వంలోని పాలకమండలి ఆమోదించడం చర్చనీయాంశమవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సీఐడీ ఆయన్ను విచారణకు పిలిచి, ప్రశ్నించింది. విచారణ అనంతరం సుబ్బారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. మీ హయాంలో ఈ కేసు జరిగినందునే మిమ్మల్ని విచారణకు పిలవాల్సి వచ్చిందని సీఐడీ అధికారులు తనతో చెప్పారన్నారు. నిందితుడు రవికుమార్ ఆస్తుల్ని బినామీల పేరిట రాయించుకున్నారా అనే ప్రశ్నలేవీ తనను అడగలేదని చెప్పారు. అయితే కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన అత్యంత కీలకమైన కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని కేవలం గంటన్నరే విచారించటం ద్వారా సీఐడీ ఏం సాధించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సుబ్బారెడ్డిని సీఐడీ అధికారులు విచారిస్తున్నంతసేపూ సీఐడీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న భవనంలోనే వైకాపా నేతలంతా మకాం వేశారు. పేర్ని నాని, దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, దేవభక్తుని చక్రవర్తి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఆ భవనంలోనే ఉన్నారు.

బయటికి రాకుండా ఎవరు తొక్కిపట్టారో తేల్చాలి: సుబ్బారెడ్డి

తితిదే పరకామణిలో చోరీ, రాజీ వ్యవహారాన్ని బయటకు రాకుండా ఎవరు తొక్కిపెట్టారు? అధికారులా? విజిలెన్స్ సిబ్బందా? ఇంకెవరైనానా అనేది మీరే నిర్ధారించాలంటూ సీఐడీ అధికారులను కోరానని తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విచారణ అనంతరం విలేకర్లకు చెప్పారు. 'తితిదే పరకామణిలో చోరీ, రాజీ మీ హయాంలో జరిగినందునే మిమ్మల్ని విచారణకు పిలిచామని సీఐడీ అధికారులు నాతో చెప్పారు. వారి ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పా. నా పదవీకాలం ముగిసిన తర్వాతే ఈ విషయాలన్నీ నా దృష్టికి వచ్చాయని వివరించా. పరకామణిలో చోరీ జరగటం ఘోరం. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యుల్ని, దోషుల్ని పట్టుకోవాలని, కోర్టు ద్వారా వారిని శిక్షించాలని కోరా. ఈ కేసుల్లో నిజంగా దోషుల్ని తేలిస్తే మంచిదే. తేల్చాలనే నేను కూడా సీఐడీకి సూచించా. నెయ్యి సరఫరా కేసులో సిట్‌కు, పరకామణిలో చోరీ, రాజీ కేసుల్లో సీఐడీకి సహకరిస్తా. నాతో పాటు అప్పట్లో పాలకమండలి సభ్యులుగా ఉన్న వారంతా విచారణకు సహకరిస్తారు. మేం తప్పు చేసుంటే విచారణకు సహకరిస్తామని ఇంత ధైర్యంగా ఎందుకు చెబుతాం?' అని సుబ్బారెడ్డి పేర్కొన్నారు.



సీఐడీ విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి



విచారణ జరుగుతున్న సీఐడీ కార్యాలయం పక్కనున్న భవనం నుంచి బయటకు వస్తున్న వైకాపా నాయకులు మల్లాది విష్ణు, దేవినేని అవినాష్

50 వేల మందికి 'క్వాంటమ్' శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ కోర్సులు వచ్చే నాలుగేళ్లపాటు నిర్వహిస్తాయి.

ఫేజ్-1 కోర్సు నాలుగు వారాలు

- ఇంజినీరింగ్ విద్యార్థులు, డిగ్రీలో గణితం, భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులు, ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారు, అధ్యాపకులు కూడా ఈ కోర్సులో చేరవచ్చు.
- ఇది ఫౌండేషన్ కోర్సు. క్వాంటమ్ కంప్యూటింగ్ అంటే ఏమిటి? ఏ టెక్నాలజీలు, అప్లికేషన్లు అందుబాటులో ఉన్నాయి? ఈ రంగానికి ఉన్న విస్తృతి, పరిమితులు, ఆర్థిక, ఔషధ, రవాణా వంటి వివిధ రంగాల్లో క్వాంటమ్ టెక్నాలజీ తీసుకురానున్న విప్లవాత్మక మార్పులు వంటి అంశాలపై ఈ కోర్సులో అవగాహన కల్పిస్తారు.
- ఏపీలోని విద్యార్థులకు రూ.500, ఇతర రాష్ట్రాలకు చెందినవారికి రూ.1,000, ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారికి, అధ్యాపక వృత్తిలో ఉన్నవారికి రూ.2,000 చొప్పున కోర్సు ఫీజుగా నిర్ణయించారు.
- కోర్సులో చేరాలనుకున్నవారు Learn.qubitech.io వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సందేహాలుంటే support@qubitech.io ఈమెయిల్ ఐడీలో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు.
- కోర్సు మొత్తం ఆన్‌లైన్‌లోనే ఉంటుంది.

మూడు భాగాలుగా కోర్సు!

- ఫేజ్-1 కోర్సు మూడు భాగాలుగా ఉంటుంది. ఎంఐటీ, ప్రిన్స్‌టన్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రఖ్యాత విద్యా సంస్థలకు చెందిన ప్రొఫెసర్లతో పాటు క్వాంటమ్ టెక్నాలజీలో విశేష కృషి చేసిన నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ విలియం ఫిలిప్స్ లెక్చర్లు మొదటి భాగంలో ఉంటాయి.
- రెండో భాగంలో అమెరికాలో గూగుల్, ఐయాన్‌క్యూ, ప్రిన్స్‌టన్, డ్యూక్ వంటి సంస్థలకు చెందిన క్వాంటమ్ ల్యాబ్‌లను చూపిస్తారు.
- మూడో భాగంలో పరిశ్రమ, స్టార్టప్‌లకు చెందిన ప్రతినిధులతో ప్యానల్ డిస్కషన్లు, గెస్ట్ లెక్చర్లు ఉంటాయి. రీసెర్చ్ ఇంజినీర్లు తమ అనుభవాలను వివరిస్తారు.
- ఐఐఎస్సీ బెంగళూరులో తొలి ఫ్రొటానిక్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అభివృద్ధి చేసిన ప్రొఫెసర్ చంద్రశేఖర్‌తో రెండు గెస్ట్ లెక్చర్లు ఉంటాయి.

ఆన్‌లైన్‌లో కోర్సు

- కోర్సు మొత్తం ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. వారానికి ఒక మాడ్యూల్ చొప్పున కోర్సు అప్‌లోడ్ చేస్తారు.
- ఆన్ డిమాండ్ లెక్చర్లు కావడంతో విద్యార్థులు వారికి వీలైన సమయంలో లాగిన్ కావచ్చు.
- వారానికి 8 గంటలు చొప్పున కోర్సు నిడివి సుమారు 32 గంటలు ఉంటుంది.
- ప్రతివారం పరీక్షలు, ఎసైన్‌మెంట్లు ఉంటాయి. కోర్సు చివరిలో తుది పరీక్ష నిర్వహిస్తారు.

ఫేజ్-2 కోర్సు పూర్తిగా ఉచితం!

- ఫేజ్-1 కోర్సులో మంచి మార్కులు తెచ్చుకున్న 3 వేల మందిని ఫేజ్-2 కోర్సుకు ఎంపిక చేస్తారు. అడ్వాన్స్‌డ్ అల్గారిథమ్స్ రూపొందించడంపై వారికి శిక్షణ ఇస్తారు.
- ఫేజ్-2 కోర్సు మార్చి, ఏప్రిల్‌లో ఉంటుంది. ఇది ఆరు వారాల కోర్సు. ఇది కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారుగానీ, ఎక్కువ శాతం లైవ్ లెక్చర్లు ఉంటాయి.
- ఈ కోర్సులో 100 మంది టాపర్స్‌ను ఎంపిక చేసి యంగ్ రీసెర్చర్స్ స్కాలర్‌షిప్ ఇస్తారు. ఏటా వేసవిలో వైజర్ సంస్థ నిర్వహించే క్వాంటమ్ సమ్మర్ స్కూల్‌లో వారికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. సాధారణంగా ఈ కోర్సు ఫీజు 250 డాలర్లుగా ఉంటుంది. కానీ ఈ 100 మంది టాపర్స్‌కు ఉచితంగా అందజేస్తారు.
- ఫేజ్-2 కోర్సులో మంచి ప్రతిభ కనబరిచిన 300-400 మందికి వివిధ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్స్‌కు వైజర్ సంస్థ వీలు కల్పిస్తుంది.

ఉద్యోగాలున్నాయి.. అభ్యర్థులే లేరు: కంప్యూటింగ్ రంగంలో క్వాంటమ్ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. మెకిన్సే క్వాంటమ్ టెక్నాలజీ మానిటర్ (2025) అంచనా ప్రకారం.. 2035 నాటికి క్వాంటమ్ టెక్నాలజీలు 106 బిలియన్ డాలర్ల మార్కెట్‌ను సృష్టిస్తాయి. మెడిసిన్, క్లైమేట్ సైన్స్, మెటీరియల్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో అనేక మార్పులు తీసుకొస్తాయి. దేశాలన్నీ ఈ మార్పుని, వేగాన్ని అందిపుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నాయి. కానీ దానికి తగ్గట్టుగా క్వాంటమ్ నిపుణులు అందుబాటులో లేరు.

- క్వాంటమ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ కన్సార్షియం అంచనా ప్రకారం 2030 నాటికి ఒక్క అమెరికాలోనే 2 లక్షల ఉద్యోగాలు ఈ రంగంలో అందుబాటులోకి వస్తాయి.
- ఏటా కొన్ని వందల క్వాంటమ్ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తుంటే... నామమాత్రంగానే భర్తీ అవుతున్నాయని మెకిన్సే క్వాంటమ్ టెక్నాలజీ మానిటర్ చెబుతోంది.
- ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడ చూసినా ఐటీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు కీలక స్థానాల్లో ఉన్నారు. రాష్ట్ర విద్యార్థులు క్వాంటమ్ టెక్నాలజీల్లోను నైపుణ్యం సాధించడంతో పాటు ఇండస్ట్రీ లీడర్లుగా ఎదిగేలా చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ యోచన.

కేసుల విచారణ ముందుకు సాగకపోవడానికి మీరే కారణం

- వైవీ సుబ్బారెడ్డి పిటిషన్‌లో సుప్రీంకోర్టు వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: సీబీఐ తనపై దాఖలు చేసిన క్రిమినల్ కేసును కొట్టేయాలని కోరుతూ వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు జనవరి మూడో వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఈ కేసులో వాదనలు వినిపించడానికి సమయం కావాల్సి ఉన్నందున నాన్ మిస్‌లేనియస్ డేకి వాయిదా వేయాలని సీబీఐ తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకొంది. తర్వాత వైవీ సుబ్బారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ ఈ కేసులో పిటిషనర్‌ను ఇద్దరు పబ్లిక్ సర్వెంట్లతో కలిపి విచారిస్తున్నారని, వారిలో ఒకరు చనిపోగా మరొకరిపై నమోదు చేసిన కేసును కోర్టు కొట్టేసిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసు ఎలా ముందుకెళ్తుందో తమకు అర్థం కావట్లేదన్నారు. పిటిషనర్ లంచం అడిగినట్లు ఎలాంటి ఆరోపణలూ లేవని.. అలాంటప్పుడు అవినీతి నిరోధక చట్టాన్ని వర్తింపచేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. ఈ కేసు విచారణ 2010 నుంచి జరుగుతూ వస్తున్నా ఇంతవరకూ ఏమీ కాలేదని, ఇంకెంత కాలం కొనసాగుతుందని ప్రశ్నించారు. అందుకు జస్టిస్ ఎంఎం సుందరేష్ స్పందిస్తూ 'మీ కారణంగానే ఏమీ కాలేదు' అన్నారు. 'బికాజ్ ఆఫ్ యు... బికాజ్ ఆఫ్ ద వే' అని జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ ఇరుపక్షాల న్యాయవాదులను ప్రస్తావిస్తూ వ్యాఖ్యానించారు. తర్వాత జస్టిస్ సుందరేష్ జోక్యం చేసుకుంటూ 'సీబీఐ, ఈడీ కేసులేవీ సరిగా నడవట్లేదు' అని పేర్కొన్నారు. తదుపరి విచారణను జనవరి మూడో వారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులకు ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఈ పిటిషన్లపై వాదనలు ప్రారంభమైన వెంటనే.. హత్యల గురించి పోలీసులకు ఫిర్యాదు చేసిన తోట ఆంజనేయులు తరఫు న్యాయవాది శుభ్రాంశు పాఢి జోక్యం చేసుకుంటూ పిటిషనర్లు సాక్షులను ప్రభావితం చేశారన్నారు. 'సెప్టెంబర్ 4న ధర్మాసనం పిటిషనర్లకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల ప్రకారం దర్యాప్తునకు సహకరిస్తున్నామని వారు కోర్టులో అప్లికేషన్ వేశారు. దాంతో పాటు వారిని దర్యాప్తు అధికారి విచారించిన సీఆర్‌పీసీ 161 స్టేట్‌మెంట్‌ను కూడా దాఖలు చేశారు. అది వారికి ఎలా వచ్చిందో పిటిషనర్ల తరఫు న్యాయవాదులను వివరణ ఇవ్వమనండి' అని ధర్మాసనానికి విన్నవించారు.

కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిందే

మీకు ఆ డాక్యుమెంట్లు ఎలా వచ్చాయని పిన్నెల్లి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవేను జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. కోర్టు తమకిచ్చిందని ఆయన బదులివ్వగా న్యాయమూర్తి విభేదించారు. 'కోర్టు ఎట్టి పరిస్థితుల్లోనూ అవి ఇవ్వదు. ఇవ్వకూడదు. ఆ విషయం మీకు బాగా తెలుసు' అని వ్యాఖ్యానించారు. కోర్టు ద్వారా ఆ పత్రాలు పొంది అప్లికేషన్‌తో పొందుపరిచామని దవే చెప్పగా న్యాయమూర్తులు వ్యతిరేకించారు. ఛార్జిషీట్ దాఖలు చేయకముందే కోర్టు అవి మీకెలా ఇస్తుందని జస్టిస్ మెహతా ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుంటూ ఇలా నిందితులకు 161 స్టేట్‌మెంట్స్ వెళ్లడం తమను ఆందోళనకు గురిచేసిందన్నారు. దీనిపై సిద్ధార్థ దవే వాదనలు వినిపించబోగా జస్టిస్ మెహతా విముఖత వ్యక్తం చేశారు. మీరు ఏ మార్గంలో ఆ పత్రాలు సంపాదించినా అది ఆమోదయోగ్యం కాదు, ఏ కేసులో అయినా సరే దాన్ని ఆమోదించబోమని పేర్కొన్నారు. మీరు దాఖలు చేసిన 161 స్టేట్‌మెంట్ సర్టిఫైడ్ కాపీనా అని ప్రశ్నించారు. 'పిటిషనర్లు విచారణకు వెళ్లిన తర్వాత అక్కడ అధికారులు ప్రశ్నించారు' అని దవే చెప్పబోగా జస్టిస్ మెహతా జోక్యం చేసుకున్నారు. మీరు చెప్పబోయే మిగతా వ్యాక్యాన్ని నేనే పూర్తి చేస్తానంటూ 'పోలీసులే ఆ పత్రాలను మీ చేతికి అందించారు' అని పేర్కొన్నారు. దవే దాన్ని అంగీకరించడంతో న్యాయమూర్తి మెహతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు ఆ పత్రాలను చేజిక్కించుకున్న విధానం పిటిషనర్ల కుట్రను చెబుతోంది. తమను ఈ కేసులో ఫోన్ సంభాషణల ఆధారంగా ఇరికించినట్లు పిటిషనర్లు రిజాయిండర్‌లో పేర్కొన్నారు. కేసు డైరీలో ఉన్న సంక్లిష్ట విషయాల గురించి మీకెలా తెలిసింది?' అని నిలదీశారు. అందువల్ల ఇది ముందస్తు బెయిల్ ఇచ్చే కేసు కాదని, పిటిషనర్లను కస్టడీలోకి తీసుకొని విచారించాల్సి ఉందని స్పష్టం చేశారు. తమ పొరపాటుకు చింతిస్తున్నామని దవే చెప్పగా.. 'ఇది పొరపాటు కాదు. నిందితులకున్న పరపతిని చూసి మేమే ఆశ్చర్యపోతున్నాం' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. దవే బదులిస్తూ పిటిషనర్లకు, హత్యకు పాల్పడిన వారికి మధ్య హత్యకు రెండు రోజుల ముందు 57 సెకన్లు, 7 సెకన్ల ఫోన్ సంభాషణ జరిగిందని పోలీసులు పేర్కొంటున్నారని, అంత స్వల్ప సమయంలో కుట్ర పన్నడం సాధ్యమేనా అని అన్నారు. ఇది తెదేపా నాయకుల మధ్య జరిగిన గొడవ అని, ఇక్కడ పిటిషనర్లు ప్రతిపక్ష పార్టీ వారని చెప్పారు. హత్య తర్వాత ఫిర్యాదుదారు మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ పిటిషనర్ల పేర్లు చెప్పలేదని వాదించారు. రాజకీయ కక్ష సాధింపుతో పెట్టిన ఈ కేసు నుంచి పిటిషనర్లకు ఉపశమనం కల్పించాలని కోరారు.

లోపలికిపోయి వస్తే మీ హోదా పెరుగుతుంది

దవే వాదనలతో న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ విభేదించారు. 'మీరు ఎన్నిసార్లు లోపలికి పోయి బయటికొస్తే మీ హోదా అంత పెరుగుతుంది' అని పిటిషనర్లను ఉద్దేశించి పేర్కొన్నారు. ఫిర్యాదుదారు తొలుత ఇచ్చిన స్టేట్‌మెంట్ చూడాలని దవే చేసిన విజ్ఞప్తిని జస్టిస్ మెహతా తోసిపుచ్చారు. 'ఇక్కడ కేవలం ముందస్తు బెయిల్‌పైనే విచారణ జరుగుతోంది తప్పితే ట్రయల్‌పై కాదు. ఇక్కడ బెయిల్ సాధ్యం కాదు' అని పేర్కొన్నారు. పిన్నెల్లి వెంకటరామిరెడ్డి తరఫున మరో సీనియర్ న్యాయవాది షోయబ్ ఆలం వాదనలు వినిపిస్తూ తాము కోర్టులో దాఖలు చేసిన కౌంటర్‌లోని ఆధారాలతో రాష్ట్ర ప్రభుత్వం కూడా విభేదించలేదని చెప్పారు. జస్టిస్ మెహతా జోక్యం చేసుకుంటూ 'మీరు ట్యాంపరింగ్ చేశారన్నది సుస్పష్టం. ఛార్జిషీట్లు దాఖలు చేయకముందే పిటిషనర్లు సాక్షులను మేనేజ్ చేశారు' అని పేర్కొన్నారు. ఫిర్యాదుదారు ఆంజనేయులు మీడియా ముందు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను షోయబ్ ఆలం చదివి వినిపించడానికి ప్రయత్నించగా.. వాటిని పరిగణనలోకి తీసుకోబోమంటూ న్యాయమూర్తి నిరాకరించారు. ముందస్తు బెయిల్ రద్దు చేస్తున్నామని, వెళ్లి పిటిషనర్లను అరెస్టు చేయండి అని జస్టిస్ విక్రమ్‌నాథ్ ఆదేశించారు. లొంగిపోవడానికి కొంత సమయం ఇవ్వాలని పిన్నెల్లి సోదరుల తరఫు న్యాయవాదులు పదేపదే విజ్ఞప్తి చేయడంతో రెండు వారాల సమయం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఎన్ఆర్ఐ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

- **కంపెనీ ఎండీకి గాయాలు**

నందిగామ, న్యూస్‌టుడే: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎన్టీఆర్ జిల్లా నందిగామ శివారు అనాసాగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్ఆర్ఐ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చెరుకూరి చంద్రశేఖర్(50) మరణించారు. కంపెనీ ఎండీ యలమంచలి జగదీష్‌బాబుకు గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు రూ.2.50 కోట్ల విలువ చేసే కారులో వస్తుండగా ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని గోవిందపేటకు చెందిన చెరుకూరి చంద్రశేఖర్.. అమెరికాలో ఐటీ కంపెనీ హెడ్‌గా ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, 10, 12 ఏళ్ల ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రశేఖర్ అమెరికాలోని తమ సంస్థ ఈపే టీమ్ సొల్యూషన్స్ పనిమీద ఈ నెల 18న హైదరాబాద్ వచ్చారు. ఇటీవల విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ సదస్సులో కంపెనీ తరఫున రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూ చేసుకున్నట్లు సమాచారం. విజయవాడలో ఓ కార్యక్రమం కోసం హైదరాబాద్ నుంచి గురువారం సాయంత్రం 6.30 గంటలకు కారులో కంపెనీ ఎండీ యలమంచలి జగదీష్‌బాబుతో కలిసి బయలుదేరారు.

పేలిన సిమెంట్ లారీ టైరు

రాత్రి 12 గంటల సమయంలో కారులో అనాసాగరం వద్ద ఫ్లైఓవర్ పైకి వచ్చారు. ఈ సమయంలో ఎదురుగా విజయవాడ వైపు సిమెంట్ లారీ వేగంగా వెళ్తుండగా టైరు పేలింది. దీంతో లారీ ఒక్కసారిగా ఎడమవైపు రావడంతో వెనక వస్తున్న కారు లారీని ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ పక్కన కూర్చున్న చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలై కారులోనే మృతిచెందారు. వెనుక సీటులో కూర్చున్న జగదీష్‌బాబుకు గాయాలు కాగా.. డ్రైవర్ రాంచర్ల రెడ్డిని విజయవాడకు తీసుకెళ్లి ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని నందిగామ మార్చురీకి తరలించారు. శుక్రవారం విజయవాడ డీసీపీ లక్ష్మీనారాయణ, పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోలీసులు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జయిన కారు





కారులోనే మృతి చెందిన చంద్రశేఖర్

ఒకేచోట చేనేత, హస్తకళలు, జీసీసీ ఉత్పత్తుల అమ్మకాలు

తొలి విడతగా ఐదు నగరాల్లో వాణిజ్య సముదాయాలు: మంత్రి సవిత



మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చేనేత, హస్తకళల అభివృద్ధి గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్ల, కమిషనర్ రేఖారాణి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా

ఈనాడు, అమరావతి: ఒకేచోట ఆప్కో, లేపాక్షి, గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఉత్పత్తులు విక్రయించేలా వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. ఆయాచోట్ల చేనేత, హస్తకళా రూపాలు, అరకు కాఫీతో కూడిన జీసీసీ ఉత్పత్తులు లభ్యమవుతాయని పేర్కొన్నారు. విజయవాడలో చేనేత, హస్తకళల అభివృద్ధి గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్ల, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా, కమిషనర్ రేఖారాణి తదితరులతో మంత్రి సమావేశమై పలు అంశాలపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ.. తొలి విడతగా దిల్లీ, హైదరాబాద్, విజయవాడ, విశాఖ, తిరుపతిల్లో ఈ వాణిజ్య సముదాయాలు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. తిరుపతిలో వచ్చే నెల 20 నుంచి చేనేత, హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వచ్చేనెల 8 నుంచి 14 వరకు లేపాక్షి వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఖాళీస్థలం పన్నుపై 50% మినహాయింపు

- పుర, నగరపాలక సంస్థల్లో నిర్మాణాలు చేపట్టే కాలానికి వర్తింపు
- ప్రభుత్వ నియంత్రణలోకి ప్రైవేట్ ఆయుష్ ఆసుపత్రులు
- మంత్రివర్గ నిర్ణయాలు



మంత్రివర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పుర, నగరపాలక సంస్థల పరిధిలో నిర్మాణాలు చేపట్టే కాలంలో ఆ స్థలానికి సంబంధించిన ఖాళీ స్థలం పన్నుపై 50 శాతం మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఉద్దేశించిన సవరణ ముసాయిదా బిల్లును మంత్రివర్గం శుక్రవారం ఆమోదించింది. పట్టణ స్థానిక సంస్థల్లో డిస్‌ప్లే బోర్డులు (హోర్డింగ్‌లు), సైన్‌బోర్డులు, బస్సులు, ఆటోల మీద ప్రకటనలు ప్రదర్శించే సంస్థలు ఇక నుంచి విధిగా లైసెన్స్‌లు తీసుకోవాలి. దీనికి సంబంధించి పురపాలక నియమావళిలో చేసిన సవరణలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశం వివరాలను సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పార్థసారథి విలేకర్లకు వెల్లడించారు.

డేటా సెంటర్ పనుల్లో ఆరు సంస్థలు

రాష్ట్ర ప్రజలంతా గర్వపడేలా ప్రభుత్వం ప్రపంచ ఐటీ దిగ్గజం గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తెచ్చింది. దీని నిర్మాణంలో వివిధ పనుల కోసం అదానీ ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అదానీ కోనెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అదానీ పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, భారతి ఎయిర్‌టెల్ లిమిటెడ్, నెక్స్ట్రా డేటా, నెక్స్ట్రా వైజాగ్ లిమిటెడ్ వంటి అనుభవమున్న సంస్థలను గుర్తించాం. గతంలో గూగుల్‌లో చేసుకున్న ఒప్పందంలో ఎలాంటి మార్పూ ఉండదు. రైడెన్ అభ్యర్థన మేరకు మాత్రమే దీన్ని ఆమోదించాం.

◆ ఆయుష్‌ను అలోపతికి సమానంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ అలోపతిక్ ప్రైవేట్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ -2002లో కొన్ని సవరణలు చేసే ప్రతిపాదనకు ఆమోదం. ఈ సవరణ ద్వారా ప్రైవేట్ ఆయుష్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తారు. దీనివల్ల ప్రైవేటు వైద్య సంస్థల నియంత్రణతోపాటు రోగుల భద్రతకు దోహదపడుతుంది.

◆ 18 ఏళ్లు వయసు నిండినవారు ఓటరుగా నమోదవ్వాలంటే ఇప్పటిదాకా ఏడాదికి ఒక్కసారి (జనవరి 1) మాత్రమే అవకాశం ఉండేది. ఇకపై ఏడాదికి నాలుగుసార్లు (జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1వ తేదీ) అవకాశం కల్పిస్తూ పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేసే ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఆమోదం

◆ ఎయిమ్స్, అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, భవనాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలతోపాటు ఏపీజెన్కో/ ఏపీపీడీసీఎల్ థర్మల్ పవర్ స్టేషన్లకు ఫైర్ ఎన్వోసీకి రుసుము చెల్లింపు మినహాయింపు.

◆ ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి 16 పోస్టుల్ని డిప్యుటేషన్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామకం.

◆ 2025-26 ఖరీఫ్ ధాన్యం సేకరణకు వర్కింగ్ క్యాపిటల్ నిబంధనలకు అనుగుణంగా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రూ.5 వేల కోట్ల రుణం తీసుకునేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం. ఇప్పటికే జారీ చేసిన జీవో ర్యాటిఫికేషన్.

ఎన్ఎంసీ ప్రమాణాల ప్రకారమే వైద్య కళాశాలలకు భూమి



- పీపీపీ విధానంలో నిర్మాణంపై కీలక సవరణలు
- మంత్రివర్గ నిర్ణయాల్ని వెల్లడించిన మంత్రి పార్థసారథి

ఈనాడు, అమరావతి: పీపీపీ విధానంలో వైద్యకళాశాలల నిర్మాణంలో కీలక సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కళాశాలల అభివృద్ధికి భూ కేటాయింపులు, సిబ్బంది బదిలీ, భవిష్యత్తు అభివృద్ధి, పదకల రిలేషన్స్, బ్రాండింగ్, కన్సల్టెన్సీ పరిమితులపై ఆరు కీలక సవరణలు చేసింది. రాజధాని అమరావతి విస్తరణలో రెండో విడత భూసమీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పైలట్ రీజియన్ పరిధిలో 16,666.57 ఎకరాల్లో భూసమీకరణ కింద తీసుకునే ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

అవసరమైనంత భూమినే..

పీపీపీ విధానంలో తొలిదశలో ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం అవసరమైన భూమినే ఇవ్వనున్నాం. అదనపు భూమి వైద్య అనుబంధ విభాగాల అభివృద్ధి కోసం ప్రభుత్వ ఆధీనంలో ఉంచేలా నిర్ణయం తీసుకున్నాం.

◆ ఆదోని వైద్య కళాశాలకు గతంలో 59.10 ఎకరాలు కేటాయిస్తే పీపీపీలో 49.64 ఎకరాలే కేటాయిస్తాం. మదనపల్లెకు కేటాయించిన 97 ఎకరాల్లో 52.47 ఎకరాలు ఇస్తాం. మార్కాపురం వైద్యశాలకు 49.99 ఎకరాల్లో 47.10 ఎకరాలు, పులివెందులలో 51.51 ఎకరాల్లో 48.50 ఎకరాలు పీపీపీ సంస్థకు అప్పగిస్తాం. ఆయా భూమి ఎకరాకు ఏడాదికి రూ.100 లీజుకు ఇవ్వనున్నాం.

◆ ఎన్ఎంసీ ప్రమాణాల ప్రకారం కొత్త వైద్యకళాశాలల క్యాంపస్, 625 పడకల బోధనాసుపత్రి, బోధన ప్రయోగశాలలు, విద్యార్థుల వసతిగృహాలు, సిబ్బంది నివాసాలు నిర్మించాలి.

◆ లీజుకాలం ముగిశాక అన్ని మౌలిక సదుపాయాలు, ఆస్తులు ప్రభుత్వానికి స్వాధీనం చేయాలి.

◆ ప్రభుత్వకోటా కింద నీట్ ఎలిజిబుల్ రిజిస్ట్రేషన్ కేటగిరీలో 50% సీట్లు ఉంటాయి. మిగిలినవి మేనేజ్‌మెంట్, ఎన్నారై సీట్లు.

◆ ఆంధ్రప్రదేశ్ ఉన్నతవిద్య పర్యవేక్షణ కమిషన్ ఫీజులను నిర్ణయిస్తుంది.

◆ 70% పడకలు పేదలకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఓపీ సేవలు పూర్తి ఉచితం.

◆ వైద్య కళాశాలకు అనుసంధానంగా ఆసుపత్రి నిర్మించే వరకు.. రెండేళ్లపాటు ప్రస్తుత ప్రభుత్వాస్పత్రిని వినియోగించుకోవచ్చు.

◆ సిబ్బంది జీతాలకు ప్రభుత్వం మద్దతిస్తుంది, పరికరాలకు నిర్దేశిత మొత్తం చెల్లించాలి.

◆ వైద్య కళాశాలలకు ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రి అని పేర్కొనాలి తప్ప.. ప్రైవేటుసంస్థ పేరుతో ఉండకూడదు.

◆ భవిష్యత్తులో దంత కళాశాల, నర్సింగ్, పారామెడికల్, ఆయుష్, స్పోర్ట్స్, శిక్షణ, పరిశోధన కేంద్రాల అభివృద్ధికి అనుమతి ఉంటుంది. వచ్చే ఆదాయంలో 3% ప్రభుత్వానికి చెల్లించాలి.

వారసత్వ ఆస్తుల బదిలీకి ఆమోదం

వారసత్వ వ్యవసాయ ఆస్తులను బదిలీ చేసే ప్రతిపాదనకు ఆమోదం. ఇతర రాష్ట్రాల్లో మరణించినవారికి వారసత్వ ఆధారిత మ్యుటేషన్ కేసుల్లో వారసులందరి పేర్లను జాయింట్‌గా నమోదుచేయాలి. వ్యక్తిగత చట్టాల ప్రకారం చట్టపరమైన వారసులు ఆస్తిలో విభజించని వాటాలను వారసత్వంగా పొందుతారు. రిజిస్టర్ చేయడం లేకుండా మ్యుటేషన్ వ్యక్తిగత కేటాయింపులు, ఉమ్మడి యాజమాన్యాన్ని ప్రతిబింబించాలి. ఈ కొత్త నిబంధనను చేర్చకపోతే వ్యక్తిగత ప్రత్యేక యాజమాన్యం తప్పుగా నమోదు, ప్రభుత్వం స్టాంపుడ్యూటీ ఆదాయాన్ని కోల్పోవడం, భవిష్యత్తు వివాదాల్లో వారసులకు చట్టపరమైన రక్షణ లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి.

పోలవరం అనుసంధాన రహదారులకు నిధులు

పోలవరం ప్రాజెక్టు కింద కొత్తగా రూ.542 కోట్లతో చేపట్టే పనులకు మంత్రివర్గం ఆమోదించింది. రూ.117.80 కోట్లతో పోలవరం గ్రామం నుంచి స్పిల్ వే అనుసంధాన టన్నెల్, శాడిల్ డ్యామ్‌ల వరకు కుడివైపు అనుసంధాన రహదారుల ఏర్పాటుచేస్తున్నారు. రూ.217.55 కోట్లతో గ్యాప్-1 నుంచి మెయిన్ కెనాల్ ప్రారంభస్థానం ద్వారా హెడ్ రెగ్యులేటర్, కేవల్ బండ్ వరకు 21 కి.మీ పొడవున ఎడమవైపు అనుసంధాన రహదారుల పనులు చేస్తారు. రూ.207.50 కోట్లతో 0 కి.మీ నుంచి 6.20 కి.మీ వరకు ఎడమవైపు రక్షణ పనులు. తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నం, గండిపోచమ్మ ఆలయ సమీపంలో వరద నిర్వహణలో రక్షణ పనులు చేపట్టనున్నారు.

శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల డిప్‌నకు భారీగా రిజిస్ట్రేషన్లు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో డిసెంబరు 30 నుంచి జరగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి మొదటి మూడు రోజుల ఆన్‌లైన్ ఈ-డిప్‌కు రికార్డు స్థాయిలో భక్తులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు తితిదే వెబ్‌సైట్‌లో 6,71,651 మంది, తితిదే మొబైల్ యాప్‌లో 9,61,607 మంది, ఏపీ గవర్నమెంట్ వాట్సాప్ బాట్‌లో 1,07,428 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తం 17,40,686 మంది భక్తులు పేర్లు నమోదు చేసుకున్నారని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. అలాగే వైకుంఠ ద్వార దర్శనం మొదటి మూడు రోజులైన డిసెంబరు 30న తేదీ 57 వేలు, 31న 64 వేలు, జనవరి 1న తేదీ 55 వేల టోకెన్లు అందుబాటులో ఉన్నాయని సమాచారం. డిసెంబరు 30, 31, జనవరి 1వ తేదీలకు సంబంధించి ఈ-డిప్ నమోదుకు డిసెంబరు 1వ తేదీ వరకు అవకాశం ఉంది. ఈ-డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులకు డిసెంబరు 2న ఎస్ఎంఎస్ ద్వారా సందేశం పంపుతారు. మొదటి మూడు రోజులు ఈ-డిప్‌లో టోకెన్లు పొందిన వృద్ధులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతి. మిగిలిన ఏడురోజులు టోకెన్లు లేని భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు.

తితిదే అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీ అందిస్తున్న రామకృష్ణ, కుటుంబ సభ్యులు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన భక్తుడు రామకృష్ణ కిలారి శుక్రవారం తితిదే శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం అందించారు. తిరుపతిలోని పద్మావతీ అతిథిగృహంలో తితిదే అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి విరాళం డీడీని కుటుంబ సభ్యులతో కలిసి దాత అందజేశారు.

వెండి ప్లేటుకు, సెల్ ఫోన్‌కు లొంగిపోయారు!

- కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారని తేలినా నివేదిక తొక్కిపెట్టేశారు..
- సంబంధిత డెయిరీల ప్రతినిధులతో కలిసి నేరపూరిత కుట్ర
- ప్రతిఫలంగా రూ.3.50 లక్షల నగదు, వెండిప్లేటు, ఫోన్ లంచం
- తితిదే అధికారి సుబ్రహ్మణ్యం రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించిన సిట్

ఈనాడు, తిరుపతి, అమరావతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): 'తితిదేకు వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్, భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ మిల్క్, ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థలు సరఫరా చేస్తున్న నెయ్యి కల్తీది. అందులో వెజిటబుల్ ఆయిల్స్ కలిశాయి. అందుకే బీటా సిటోస్టెరోల్ పాజిటివ్ వచ్చింది' అంటూ మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ఇచ్చిన నివేదికను తితిదే ప్రొక్యూర్‌మెంట్ విభాగం నాటి జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం (ఏ-29) తొక్కిపెట్టారని సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన సిట్ తేల్చింది. ఆయా సంస్థలు కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నట్లు 2022 ఆగస్టులో నివేదిక అందగా.. చర్యలు తీసుకోవాల్సింది పోయి.. 2022 అక్టోబరు వరకూ నెయ్యి సరఫరా చేసేలా భోలేబాబా డెయిరీకి మరిన్ని ఆర్డర్లు ఇచ్చారని వెల్లడించింది. ఆయన ప్రొక్యూర్‌మెంట్ జీఎంగా ఉన్నంతకాలం ప్రీమియర్, వైష్ణవి డెయిరీలు నెయ్యి సరఫరా కొనసాగేలా చేశారని వివరించింది. తితిదేకు కల్తీ నెయ్యి సరఫరా కేసులో సుబ్రహ్మణ్యంను గురువారం అరెస్టు చేసిన సిట్ అధికారులు కోర్టులో సమర్పించిన రిమాండ్ రిపోర్టు శుక్రవారం వెలుగుచూసింది. అందులోని ప్రధానాంశాలివి..

ఆ డెయిరీలతో కలిసి నేరపూరిత కుట్ర

తితిదేకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన వైష్ణవి, భోలేబాబా, మాల్‌గంగ డెయిరీలు, ఇతర సంస్థల ప్రతినిధులతో కలిసి సుబ్రమణ్యం ఈ కుట్రకు పాల్పడ్డారు. ఆయా డెయిరీల ప్లాంట్లలో తితిదే తరఫున తనిఖీలు చేపట్టి, వాటికి టెండర్లలో పాల్గొనే అర్హత ఉందో లేదో తేల్చాల్సిన సాంకేతిక బృందంలో సభ్యుడిగా ఉన్న ఆయన.. సమగ్ర తనిఖీలు చేయకుండా ఆయా సంస్థలకు అనుకూలంగా తప్పుడు నివేదికలు సమర్పించారు. తద్వారా అర్హత లేని సంస్థలు తితిదే నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొని వాటిని దక్కించుకునేలా చేశారు.

◆ అనుచిత లబ్ధి కలిగించినందుకు ప్రతిఫలంగా ఆయా డెయిరీల ప్రతినిధుల నుంచి వివిధ సందర్భాల్లో రూ.3.50 లక్షల నగదు, రూ.50 వేల విలువ చేసే మొబైల్ ఫోన్, రూ.16,700 విలువ చేసే వెండి ప్లేటు, రూ.5 వేల విలువ చేసే 50 గ్రాముల వెండినాణెం వంటివి లంచంగా తీసుకున్నారు.

సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న నుంచి ఆదేశాలు

తితిదేకు నెయ్యి సరఫరా టెండర్లలో భోలేబాబా డెయిరీ పాల్గొనగా.. 2022 జూన్ 6న ఆ డెయిరీ ప్లాంటును తనిఖీ చేయడానికి సుబ్రహ్మణ్యం సభ్యుడిగా ఉన్న సాంకేతిక కమిటీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫతేపూర్ వెళ్లింది. ఆ సమయంలో వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న.. సుబ్రహ్మణ్యానికి పదే పదే ఫోన్ చేసి ఆదేశాలిచ్చారు. భోలేబాబా డెయిరీకి టెండర్లలో పాల్గొనే సాంకేతిక అర్హత లేదని, నెయ్యి తయారీకి నిర్దేశించిన సరైన ప్రమాణాలు పాటించడంలేదని ఈ కమిటీ నివేదిక ఇచ్చింది. అయినా సరే ఆ సంస్థకు సుబ్రహ్మణ్యం నెయ్యి సరఫరా ఆర్డర్లు ఇచ్చారు. తితిదేకు నెయ్యి సరఫరా చేసే డెయిరీల ప్రతినిధుల నంబర్లను వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నకు సుబ్రహ్మణ్యం అందజేసి అక్రమాలకు ఆస్కారం కల్పించారు.

◆ వైష్ణవి, మాల్‌గంగ డెయిరీలతో భోలేబాబా డైరెక్టర్లే 2021, 2022ల్లో నెయ్యి సరఫరా టెండర్లు వేయించారు. సుబ్రహ్మణ్యం సభ్యుడిగా ఉన్న సాంకేతిక కమిటీ ఆ డెయిరీల ప్లాంట్లను పరిశీలించకుండానే వాటికి అన్ని రకాల అర్హతలు ఉన్నాయని నివేదిక ఇచ్చింది. దాంతో ఫైనాన్షియల్ బిడ్‌కు అనుమతి లభించింది. ఎల్1, ఎల్2గా నిలిచిన డెయిరీలకు కాంట్రాక్టు దక్కింది. టెండరు దాఖలు సమయంలో మూడు డెయిరీలు తప్పుడు పత్రాలు సమర్పించాయి. వాటిని పక్కన పెట్టకుండా సుబ్రహ్మణ్యం ధ్రువీకరించారు. ఫలితంగా తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అయి కోట్ల మంది హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. తితిదేకు భారీగా నష్టం వాటిల్లింది. ఆయా డెయిరీలకు కోట్ల రూపాయల్లో అనుచిత లబ్ధి కలిగింది..

డెయిరీ నిపుణుడి సిఫార్సులూ ఉల్లంఘన

నెయ్యి టెండరు సరఫరా నిబంధనల్లో బీటా సిటోస్టెరాల్, ఎఫ్ఎస్ఎస్ఆర్ (ఆహార భద్రత, ప్రమాణాల నియంత్రణ) ప్రమాణాలు ఎంత ఉండాలో చేర్చాలని డెయిరీ నిపుణుడైన బి.సురేంద్రనాథ్ తితిదే ఈవోకు మెయిల్ పంపారు. భవిష్యత్తులో పిలిచే టెండర్లతో పాటు 2022 మే 10, 11న జరిగిన నెయ్యి సరఫరాకు సాంకేతికంగా అర్హత పొందిన సంస్థలకూ వీటిని వర్తింపజేయాలని సిఫార్సు చేయగా నాటి ఈవో అందుకు అనుమతించారు. ఈ టెండర్లలో ఎల్1, ఎల్2గా నిలిచిన ఆల్ఫా డెయిరీ, ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థలు ఎఫ్ఎస్ఎస్ఆర్ ప్రమాణాల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరగా సుబ్రహ్మణ్యం అందుకు సిఫార్సు చేస్తూ ఈవోకు ఓ నోట్ పంపారు.


విదేశీ నియామకాలపై యువతకు ప్రత్యేక శిక్షణ

ఏపీఎస్ఎస్‌డీసీ ఛైర్మన్ శేషారావు

ఈనాడు, అమరావతి: యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు తెలిపారు. ఓంక్యాప్ ద్వారా విదేశీ నియామకాలకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం జాతీయ నియామక ఏజెంట్లతో నైపుణ్యాభివృద్ధి సంస్థ శుక్రవారం విజయవాడలో సమావేశం నిర్వహించి, వారితో పలు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇతర దేశాలు పాటిస్తున్న నియామక విధానాలు, నియంత్రణ చట్టాలు, వలస విధానంలో సవాళ్లు, ఏపీ ప్రభుత్వం నుంచి అవసరమైన మద్దతుపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పలు నియామక ఏజెన్సీలు తమ కార్యాలయాలను రాష్ట్రంలో ప్రారంభించేందుకు ఆసక్తి చూపాయి. ప్రధానంగా సీగల్ ఇంటర్నేషనల్, ట్రాన్సెండ్ హెచ్ఆర్ కన్సల్టింగ్ సంస్థలు త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభిస్తామని ప్రకటించాయి. ఈ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ కార్యదర్శి కోన శశిధర్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేశ్‌కుమార్, ఏపీఎన్ఆర్టీ అధ్యక్షుడు వేమూరి రవికుమార్, సీడాప్ సీఈఓ నారాయణస్వామి పాల్గొన్నారు.

తుంగభద్రపై బ్యారేజి-వంతెన నిర్మాణానికి సహకరించండి

- కర్ణాటక ప్రభుత్వ అభ్యర్థన
- మంత్రి నిమ్మలతో కర్ణాటక మంత్రి బోసురాజు భేటీ



మంత్రి రామానాయుడితో కర్ణాటక మంత్రి బోసురాజు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలను కలిపేలా తుంగభద్రపై వంతెన, మరియు బ్యారేజి నిర్మించేందుకు సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కర్ణాటక కోరింది. ఆ రాష్ట్ర చిన్ననీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు శుక్రవారం విజయవాడలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడితో భేటీ అయి దీనిపై విజ్ఞప్తి చేశారు. తుంగభద్రపై వంతెన, బ్యారేజి నిర్మాణం విషయమై బోసురాజు గతంలోనే రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. శుక్రవారం ఈ అంశంపైనే అమరావతికి వచ్చారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా మాన్వి తాలూకా చిక్కల పర్వి గ్రామం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం కుంబళనూరు వద్ద కలిసేలా ఈ కొత్త బ్యారేజి, వంతెన నిర్మిస్తామని, అనుమతించాలని ఆయన కోరారు. ఇక్కడ నీటి నిల్వ కూడా 0.35 టీఎంసీలు మాత్రమేనని, దాని వల్ల ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులకు ఎలాంటి అంతరాయం కలగదని, రెండు రాష్ట్రాల మధ్య రవాణా మెరుగుపడుతుందని బోసురాజు వివరించారు. దీని నిర్మాణ వ్యయాన్ని తామే భరిస్తామని, అవసరమైతే ఆ బ్యారేజి నిర్వహణ కూడా ఆంధ్రప్రదేశ్‌కు అప్పగిస్తామని చెప్పారు.

అధ్యయనం చేయాలి: మంత్రి నిమ్మల

ఈ విషయంపై తాము ఇంకా అధ్యయనం చేయాల్సి ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. కర్ణాటక ప్రతిపాదనను పరిశీలించి, వివరాలివ్వాలని అక్కడే జలవనరుల శాఖ అధికారులకు సూచించారు. అధికారుల అధ్యయనం తర్వాత స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడి తదుపరి అభిప్రాయం తెలియజేస్తామని మంత్రి రామానాయుడు బోసురాజుకు చెప్పారు.

భళారే యువ..



శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలతో యువతీ యువకులు అలరించారు. సినీ పాటలకు అదిరే స్టెప్పులు వేసి ఉర్రూతలూగించారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఫ్యాషన్ షోతో ఆకట్టుకున్నారు. సిద్ధార్థ ఆడిటోరియం వేదికగా కురుక్షేత్ర పేరుతో శుక్రవారం రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, విజయవాడ సిటీ

నేడు, రేపు 'ఈనాడు' ప్రాపర్టీ షో-2025

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సొంతింటి కల సాకారం చేసుకునే వారి కోసం శని, ఆదివారం విజయవాడ బందరు రోడ్డులోని ఏ కన్వెన్షన్ సెంటర్లో 'ఈనాడు' ప్రాపర్టీ షో-2025 నిర్వహించనున్నారు. ఇందులో ప్రముఖ బిల్డర్లు, రియల్టర్లు, ఇంటీరియర్ డెకరేటర్లు, ఫర్నిచర్, సోలార్, బిల్డింగ్ మెటీరియల్ సంస్థలు, రుణ సౌకర్యం కల్పించే బ్యాంకర్లు పాల్గొంటారు. ఒకే వేదికపైకి అన్నింటినీ తీసుకురావడంతో గృహాలు, ప్లాట్లు కొనుగోలు చేసే వారికి సౌలభ్యంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే మీరు కోరుకునే వాటిని ఎంపిక చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఆదివారం రాత్రి 8 గంటల వరకు మాత్రమే ప్రాపర్టీషో ఉంటుంది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రాపర్టీషో సందర్శించిన వారి కూపన్ల లక్కీ డ్రా నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు.

ముఖ్యనగరాల.. ముచ్చటేలేదు!

- డిమాండ్ ఉన్నా దేశీయ సర్వీసులు ఏవీ?
- విమానయాన సంస్థలను ఒప్పించడంలో విఫలం

ఈనాడు, అమరావతి

'గోవా, వారణాసి, షిర్డీ, కొచ్చి, కోల్‌కతా, అహ్మదాబాద్‌లకు విజయవాడ విమానాశ్రయం నుంచి సర్వీసులు నడపాలని చాలాకాలంగా ప్రయాణికుల నుంచి డిమాండ్ వస్తోంది. కొన్నేళ్లుగా విమానాశ్రయ అభివృద్ధి కమిటీ సమావేశాల్లోనూ ఈ రూట్లలో సర్వీసులు ఆరంభించేలా.. విమానయాన సంస్థలతో మాట్లాడతామని ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ.. ఆ తర్వాత ఆ ముచ్చటేలేదు. ఏటా భారీగా ప్రయాణికులు.. ఇక్కడి నుంచి ఇతర నగరాలకు వెళ్లి దేశీయ సర్వీసులు అందుకుంటున్నారు.'

> "విమాన సర్వీసుల పెంపుతోనే.. 2014 నుంచి ఇప్పటి వరకూ ప్రయాణికుల వృద్ధి సాధ్యమైంది. 2014 నాటికి ఏటా 2 లక్షల ప్రయాణికులు కూడా లేని స్థాయి నుంచి.. 2019 నాటికి 12 లక్షలకు రద్దీ పెరిగింది. ప్రస్తుతం రోజుకు 4 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ఏడాది 15 లక్షల మార్క్ దాటబోతోంది."



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం

గ'ఘన'మైనా...

దేశంలోనే ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక, వాణిజ్య కార్యకలాపాలు జరిగే నగరాలన్నింటికీ.. ఇక్కడి నుంచి ప్రయాణికుల రద్దీ పుష్కలంగా ఉంది. చుట్టుపక్కల నాలుగైదు జిల్లాలకు అత్యంత దగ్గరగా ఉండే విమానాశ్రయం ఇదే. అందుకే.. ఏ నగరానికి ఇక్కడి నుంచి సర్వీసులు ఆరంభించినా.. ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) అమాంతం పెరుగుతుంది. కానీ.. ప్రస్తుతం హైదరాబాద్, దిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, తిరుపతి, విశాఖలకు మాత్రమే సర్వీసులు నడుస్తున్నాయి. దేశంలో ప్రముఖ నగరాలకు సర్వీసులను ఆరంభిస్తే.. వృద్ధి భారీగా ఉంటుంది.

25 లక్షలు పైనే..

ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరులకు ఏటా 25 లక్షల మంది ప్రయాణికులు రోడ్డు మార్గంలో వెళ్లి.. అక్కడి నుంచి దేశీయ, అంతర్జాతీయ సర్వీసులను అందుకుంటున్నారని.. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ అంచనా వేసింది. పౌర విమానయానశాఖకు లేఖలు రాసింది. విజయవాడ నుంచే సర్వీసులు ఆరంభిస్తే.. వీళ్లంతా ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తారు.

పర్యాటక ప్రదేశాలకు రద్దీ..

ఏటా రోడ్డు, రైలు మార్గంలో లక్షల మంది వారణాసి, షిర్డీలతోపాటు గోవా, కేరళకు ఇక్కడి నుంచి పర్యాటకంగా వెళ్లి వస్తున్నారు. వాణిజ్య, వ్యాపార ప్రతినిధులు కోల్‌కతా, అహ్మదాబాద్‌లకు తరలివెళ్తున్నారు. ★ గతంలో విజయవాడ నుంచి నేరుగా షిర్డీ, వారణాసికి కొద్ది నెలలు సర్వీసులు నడపగా 80 శాతం పైగా ఓఆర్ ఉండేది.

1 నుంచి ఇగ్నో పరీక్షలు ప్రారంభం

విజయవాడ వన్‌టౌన్: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో).. డిసెంబరు-2025 టర్మ్ ఎండ్ పరీక్షలు వచ్చే నెల 1 నుంచి జనవరి 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ కె.సుమలత తెలిపారు. విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల హాల్ టికెట్లు ఇగ్నో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రాక్టికల్ పరీక్షలకు అభ్యర్థులు తమ అధ్యయన కేంద్రాల్లో థియరీ పరీక్షల తర్వాత సంప్రదించాలన్నారు.

3 నుంచి యువతకు ఉచిత శిక్షణ

సీతారాంపురం: డిసెంబరు 3 నుంచి వ్యవసాయ అనుబంధ వ్యాపార రంగాల్లో రాణించాలనుకునే యువతకు ఉచిత శిక్షణనిస్తామని ఎలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి తెలిపారు. ఎలీప్ (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్), సీఈడీ (సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్) అనుబంధ సంస్థ ద్వారా తీర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. కొండపావులూరులోని సుధా అకాడమీలో 45 రోజులు శిక్షణ జరుగుతుందన్నారు. బీఎస్సీ (బీజడ్‌సీ), అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ సైన్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 94412 66769లో సంప్రదించాలని ఆమె కోరారు.

మహమ్మారిపై.. అధ్యయనం

- కిడ్నీ వ్యాధిని పూర్తిగా రూపుమాపే కార్యాచరణ
- ఎ.కొండూరును జల్లెడపట్టిన వైద్యుల బృందం

ఈనాడు, అమరావతి

'ఎ.కొండూరు గిరిజన తండాల్లో కిడ్నీ వ్యాధిని పూర్తిగా రూపుమాపడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలోని వైద్య బృందం ఎ.కొండూరులో పర్యటించి అధ్యయనం చేసింది. చైతన్యనగర్, దీప్లానగర్, చీమలపాడు పెద్దతండాలు సహా వ్యాధి తీవ్రత ప్రాంతాల్లో బాధితుల ఇళ్లకు వెళ్లి.. వారితో మాట్లాడింది. పారిశుద్ధ్యం, మౌలిక వసతులు.. అన్నింటినీ పూర్తిగా పరిశీలించి.. నీటి నమూనాలు సేకరించింది.'



బాధితులు ఎక్కువున్న చీమలపాడు పెద్ద తండా

కేసులు ఇలా...

- 2025లో కిడ్నీ బాధిత మరణాలు : 17
- డయాలసిస్ చేయించుకుంటున్నవాళ్లు : 26
- 2022 నుంచి ఇప్పటిదాకా గుర్తించిన కేసులు: 175
- ఈ ఏడాది గుర్తించిన తీవ్ర కేసులు : 11

పరిస్థితి మారుతోంది..

వైకాపా పాలనతో పోలిస్తే తండాల్లో పరిస్థితి మారుతోంది. ఎ.కొండూరు పీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రాన్ని పటిష్ఠం చేసి.. ఉచితంగా మందులు ఇస్తున్నారు. ■ గతంలో డయాలసిస్‌కు అద్దె వాహనాల్లో వెళ్లేవాళ్లు. ప్రస్తుతం రోగులకు ప్రత్యేక వాహనం పెట్టారు. రోజుకు మూడు షిఫ్టుల్లో 12 మందికి ఇక్కడే సేవలందిస్తున్నారు. ■ 25 ఏళ్లు నిండిన వారికి ఏడాదికోసారి కిడ్నీ వ్యాధిని గుర్తించే స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. ■ వారానికోసారి పీహెచ్‌సీకి నెఫ్రాలజిస్ట్ వచ్చి రోగులను పరీక్షిస్తున్నారు.

డ్రెయినేజీలు లేవు

తండాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. దారుల పక్కన పొదలు, చెత్త.. అక్కడే మురుగు కుంటలున్నాయి. భూగర్భ జలాలను వాడే బోర్లు, నల్లాల చుట్టూ లీకైన నీళ్లతో కుంటలు ఏర్పడ్డాయి. చాలా ప్రాంతాల్లో సెప్టిక్ ట్యాంకల నుంచి మురుగు పొంగుతోంది.

గతంలో బోరు నీరే ఆధారం

ఏళ్లుగా తండాల్లో బోరు నీరే తాగుతున్నారు. ఆర్వో ప్లాంట్ల జలాలు ఉన్నా.. వాటిని కొనడానికి ఆసక్తి చూపడంలేదు. ఏడాదిగా తండాలకు కృష్ణా జలాలను రెండు రోజులకోసారి ట్యాంకర్లతో ఇస్తున్నారు. ప్రస్తుతం కొన్ని తండాలకు కృష్ణా జలాల ప్రాజెక్టు ట్రయల్‌రన్‌లో భాగంగా నీరిస్తున్నారు.

సుజలాలతో సగం పరిష్కారం..

తండాలకు నిత్యం స్వచ్ఛజలాలను ఇస్తే సగం సమస్య తీరినట్లేనని నిపుణుల బృందం సూచించింది. ★ వ్యాధి తీవ్రత పక్కాగా గుర్తించేందుకు ఎపిడెమియాలజీ అధ్యయనం చేయాలి. ★ డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు మూడు నెలలకోసారి గుండె పరీక్షలకు కార్డియాలజిస్టును ఎ.కొండూరు పీహెచ్‌సీకి పంపాలి. ★ భూగర్భ జలాల పరీక్షలు నిరంతరం కొనసాగాలి.

ప్రజారాజధాని ప్రగతికి మరో కీలక అడుగు



రాజధాని అమరావతిలో బ్యాంకులు, బీమా సంస్థల కార్యాలయాలకు శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం పండగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు, వేదికపై మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ - న్యూస్‌టుడే, తుళ్లూరు

రూ.600 కోట్ల కుంభకోణంలో ఇరుక్కున్నారు

ట్రాన్స్‌కో డీఈఈకి బెదిరింపు ★ రూ.34.65 లక్షలు దోచిన సైబర్ నేరగాళ్లు

విజయవాడ నేరవార్తలు: 'మీరు రూ.600 కోట్ల కుంభకోణం కేసులో ఇరుక్కున్నారు. ఇందులో నాయకులు, బ్యాంకు మేనేజర్ల పాత్ర ఉంది. మీ సిమ్ నుంచి యువతుల నగ్న చిత్రాలు పంపారు. సీబీఐ అరెస్టు వారెంట్ జారీ చేసిందని' సైబర్ నేరగాడు భయపెట్టి.. ట్రాన్స్‌కో డీఈఈ నుంచి ఏకంగా రూ.34.65 లక్షలు దోచేశాడు. ★ ఎనికేపాడుకు చెందిన ఓ యువకుడు (38) గుణదలలో విద్యుత్తు సౌధలో డీఈఈ. ఈ నెల 20న గుర్తు తెలియని వ్యక్తి 'ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్' నుంచి అంటూ ఫోన్ చేశాడు. మీ పేరుతో ఉన్న సిమ్ ద్వారా యువతులు, మహిళల నగ్న చిత్రాలు పంపారని.. బెంగళూరులో 18 మంది ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైందని భయపెట్టాడు. రెండు గంటల్లో బెంగళూరు రావాలని హెచ్చరించాడు. ఆధార్ నంబరు పరిశీలించి ముంబయిలో మానవ అక్రమ రవాణా, మనీలాండరింగ్ కేసులు నమోదయ్యాయని భయపెట్టాడు. కెనరా బ్యాంకులో మీ ఖాతా ద్వారా రూ.3 కోట్ల లావాదేవీలు జరిగాయనీ, ఫిలిప్పైన్స్, కంబోడియా, మయన్మార్‌లకు విమాన టిక్కెట్లు బుక్ చేశారని చెప్పాడు. ఇదే కేసులో అరెస్టైన సదాఖాన్‌తో మీకు సంబంధాలున్నాయని హడలెత్తించాడు.

10 శాతం డిపాజిట్

మీపై నమోదైన కేసు గురించి ప్రతి 2 గంటలకు అప్‌డేట్ ఇవ్వాలని హెచ్చరించాడు. ఇలా ఈ నెల 20 నుంచి 23 వరకు రోజూ డీఈఈతో మాట్లాడాడు. 24న కేసు సీబీఐకి బదిలీ అయిపోయిందని, వారు అరెస్టు వారెంటు ఇచ్చారన్నారు. జాతీయ భద్రత అంశమనీ, ఎవరికీ చెప్పకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని హెచ్చరించాడు. ఎవరికైనా చెబితే 3 ఏళ్ల జైలు, రూ.5 లక్షల జరిమానా విధిస్తారని కంగారుపెట్టాడు. రూ.3 కోట్ల లావాదేవీల్లో పది శాతం.. రూ.30 లక్షలు డిపాజిట్ చేయమన్నాడు. అంత సొమ్ము లేదంటే.. లోన్ తీసుకోమని సలహా ఇచ్చాడు. దీంతో డీఈఈ.. ఎస్‌బీఐలో రూ.35 లక్షలు రుణం తీసుకున్నారు. సదరు నగదు ఈ నెల 26న హైదరాబాద్‌లో ప్రైవేట్ బ్యాంకుకు పంపమనగా.. ఆర్‌టీజీఎస్ ద్వారా రూ.34.65 లక్షలు బదిలీ చేశారు. పంపిన డబ్బులను కేసు పూర్తయిన తర్వాత తిరిగి ఇస్తామనడంతో వారి మాటలు నమ్మారు. రసీదు అడిగితే.. ఆదాయపు పన్ను శాఖ పేరుతో రసీదు కూడా పంపేశారు. తర్వాత మోసపోయినట్లు గుర్తించిన డీఈఈ.. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు శుక్రవారం కేసు నమోదు చేశారు.

దుర్గగుడి అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: రానున్న కృష్ణా పుష్కరాలకు దుర్గగుడి అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేయడమే లక్ష్యంగా పని చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అధికారులకు సూచించారు. శుక్రవారం దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నతో కలిసి ఎంపీ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. భవానీ దీక్షల విరమణకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని చెప్పారు. వాహనాల పార్కింగ్, ఘాట్ల వద్ద క్లోక్ రూమ్స్, మరుగుదొడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. దసరా ఉత్సవాల్లో సమన్వయంతో విజయవంతం చేసిన తరహాలో పాలక మండలి, ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసులు పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు వెలగపూడి శంకరబాబు, బడేటి ధర్మారావు, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకే సీసీఐ మద్దతు!

- పత్తి రైతు చిత్తు
- పట్టించుకోని అధికారులు

నందిగామ, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, కంచికచర్ల(న్యూస్‌టుడే)


పెనుగంచిప్రోలులో లోడింగ్ చేస్తున్న కూలీలు

పత్తి రైతులను ఆదుకోవాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ).. వ్యాపారులకు దన్నుగా నిలుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలమైన రైతుల పేరుతో స్లాట్ బుక్ చేసి వ్యాపారులు నేరుగా సీసీఐకి పత్తి విక్రయించి లబ్ధి పొందుతున్నారు. మార్కెట్ యార్డుల్లో మాత్రం కొనుగోలు చేయట్లేదు. మార్కెటింగ్ శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవట్లేదు.

జిల్లాలో నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, మైలవరం, గంపలగూడెం మార్కెట్ యార్డుల్లో ప్రారంభించిన సీసీఐ కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. కేవలం సీసీఐ బయ్యర్లు జిన్నింగ్ మిల్లులు వద్దనే తమ లాభం చూసుకుని కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర క్వింటాకు రూ.8110 ఉన్నా రూ.ఐదారు వేలు కూడా చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు.

స్లాట్‌ల సమాచారం కొందరికే..

సీసీఐకి విక్రయించాలనుకునే రైతులు సీఎం యాప్‌లో రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ డేటా మొత్తం కపాస్ కిసాన్ యాప్‌లోకి వచ్చింది. అనంతరం రైతులు తమ ఫోన్ నుంచి విక్రయానికి స్లాట్‌లు బుక్ చేసుకుని కేటాయించిన తేదీన తీసుకెళ్లాలి. ఈ స్లాట్‌లను సీసీఐ బయ్యర్లు విడుదల చేస్తున్నారు. ఈ మేరకు రైతులు స్లాట్‌లో బుక్ చేసుకుని మిల్లు కెళ్లాలి. స్లాట్ విడుదల చేసే సమాచారం బయ్యర్లు తమకు అనుకూలమైన వ్యాపారులకే అందిస్తున్నారు. దీనివల్ల రైతులకు సమాచారం తెలియక బుక్ చేసుకోలేకపోతున్నారు. నందిగామ, కంచికచర్ల, గంపలగూడెం కేంద్రాలకు ఒకే బయ్యరు ఉన్నారు. జగ్గయ్యపేటకు మరొక బయ్యర్ ఉన్నారు.

మార్కెట్ యార్డుల్లో జాడలేని కొనుగోళ్లు

ఇప్పటి వరకు నందిగామ యార్డులో 400 క్వింటాళ్లు, మిల్లులో మాత్రం 8 వేలు క్వింటాళ్లు, కంచికచర్ల యార్డు పరిధిలో మిల్లు వద్ద 2450 క్వింటాళ్లు బయ్యర్ కొనుగోలు చేశారు. యార్డుల్లో అసలు కొనడం లేదు.

నాణ్యత లేదని సాకులు

నాణ్యత లేదని సాకులు చెబుతూ యార్డుల్లో కొనుగోలు చేయని బయ్యర్లు జిన్నింగ్ మిల్లుల్లో మాత్రం కొంటున్నారు. స్లాట్ బుక్ చేసుకుని వెళ్లినా మిల్లుల వద్ద బయ్యర్లు కొనుగోలు చేయకుండా నిబంధనల సాకుతో తిరస్కరిస్తున్నారు. నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల నుంచి గుంటూరు వరకు తీసుకెళ్లి పత్తిని వెనక్కి తెచ్చుకోలేక అక్కడ ఎంతో కొంత ధరకు వ్యాపారులకు అమ్మి ఇంటికి వస్తున్నారు. జగ్గయ్యపేట యార్డు పరిధిలో తిరుమలగిరి జిన్నింగ్ మిల్లు వద్ద బయ్యర్ కొనుగోళ్లు నామమాత్రంగానే చేస్తుండడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు.

రూ.28 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ


శోభాయమానం.. అయ్యప్ప పీఠం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ వెంకన్న గురుస్వామి ఆధ్వర్యంలోని అయ్యప్ప పీఠానికి శుక్రవారం రూ.28 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. మాలధారులు.. గణపతి, కుమారస్వామి, అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి, లక్ష్మీదేవి చిత్రపటాలను రూ.100, రూ.200, రూ.500 కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆ ప్రాంగణం అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది. రామాలయ ఛైర్మన్ మహంకాళీ వెంకన్నగురుస్వామి, భగవాన్ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ యు.వాసుదేవరావు దంపతులు, గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఉరకలేసిన ఉత్సాహం

ఆకట్టుకున్న ప్రదర్శనలు


భళారే.. డైలాగ్స్


విద్యార్థినుల జోష్..


యువతుల నృత్యాభినయం..


శాస్త్రీయ నృత్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు వేదికపై ప్రదర్శనలిస్తూ ప్రేక్షకులను అలరించారు. పీబీ సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, సిద్ధార్థ మేనేజ్‌మెంట్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కురుక్షేత్ర పేరుతో శుక్రవారం రాత్రి సిద్ధార్థ ఆడిటోరియంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలు చేస్తూ అలరించారు. సినీ పాటలకు స్టెప్‌లు వేసి అదరగొట్టారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఫ్యాషన్ షో నిర్వహించారు. ర్యాంప్ వాక్ చేసి సందడి చేశారు. విడిగా, జంటగా, బృందంగా ప్రదర్శనలిస్తూ ఔరా అనిపించారు.

ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ


అధ్యాపకులతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే: విద్యార్థులు విద్యతో పాటు కెరీర్‌లో అవసరమైన అనేక నైపుణ్యాలను నేర్పించడం ద్వారా తమ కళాశాలలో ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అమృత సాయి ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామమోహనరావు అన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో భాగంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులతో కళాశాలలో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ నిర్వహించారు. కళాశాలలో అందించిన నైపుణ్యాలతో ఇప్పటి వరకు 296 మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని అన్నారు. బెంగళూరు టాటా ఎలక్ట్రానిక్స్‌లో ఉద్యోగాలు సాధించిన 44 మంది విద్యార్థులు ఉద్యోగంలో చేరేందుకు అధ్యాపకుల సమక్షంలో కళాశాల నుంచి బస్సులో బయల్దేరారు. వారికి అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ డా.ఎం.శశిధర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డా.పి.చిరంజీవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికీ చేరువయ్యేందుకు ప్రజాదర్బార్

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజలకు చేరువయ్యేందుకు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం చక్కని అవకాశం అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. శుక్రవారం పాతబస్తీ గణపతిరావు రోడ్డులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నాయకులు ఎవ్వరూ అందుబాటులో లేరని తెలిపారు. ఇక నుంచి ప్రతి వారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించాలని మంత్రి లోకేశ్ సూచించారని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలన్నిటిని పీజీఆర్ఎస్ ద్వారా ఆన్‌లైన్ చేసి 15 రోజుల్లో వాటిని పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, కార్పొరేటర్ మాధూరి లావణ్య, శాప్ డైరెక్టర్ సంతోష్‌కుమార్, దుర్గగుడి పాలకవర్గం సభ్యురాలు సరిత, తెదేపా నాయకులు ఫతావుల్లా, నాగేశ్వరరావు, జాహీద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మహిళ సమస్య తెలుసుకుంటున్న ఎంపీ కేశినేని, రాకేష్, నాగుల్‌మీరా

బ్రాయిలర్ ధరలు
(కిలో/ రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -108 రిటైల్ ధర 135 చికెన్ విత్ స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 127, 136, 147 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 640 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థులపై వివక్ష వద్దు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: తీవ్ర నిరాశతో ఉండే హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థుల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆత్మస్థైర్యం నింపారు.


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, వేదికపై రాజేంద్రప్రసాద్, నీలకంఠరెడ్డి, రామ్మోహన్‌రావు, మంజుల, రేణుక

వారితో కలిసి అల్పాహారం స్వీకరించారు. వారికి మంత్రే స్వయంగా వడ్డించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమానికి విజయవాడ నగరంలోని ఓ హోటల్ వేదికగా నిలిచింది. మంత్రి.. చిన్నారులు, పెద్దలతో నేరుగా సంభాషించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా ఈ తరహా కార్యక్రమం నిర్వహించడం ఇదే తొలిసారి.

☛ మాదక ద్రవ్యాలను సూదుల ద్వారా తీసుకోవడం వల్ల యువత హెచ్‌ఐవీ బారినపడుతున్నారని వీటికి దూరంగా ఉండాలని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. హెచ్‌ఐవీ సోకిన వారిపై ఎవరూ వివక్ష ప్రదర్శించకూడదని సూచించారు. ఈ రోగులు ఆందోళనకు గురికాకుండా వైద్యుల సిఫార్సులు అనుసరించి ప్రభుత్వం ఉచితంగా అందజేసే మందులను వాడాలని కోరారు. ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ పీడీ కె.నీలకంఠరెడ్డి, తెలుగు నెట్‌వర్క్ పాజిటివ్ పీపుల్ అధ్యక్షుడు రామ్మోహనరావు, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త సంచాలకురాలు డాక్టర్ మంజుల, సీనియర్ అధికారి రాజేంద్రప్రసాద్, చేయూత సంస్థ జిల్లా అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు


అధికారులతో సమావేశమైన కలెక్టర్ జి.లక్ష్మీశ

పాయకాపురం, న్యూస్‌టుడే : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ)లో ఉద్యోగాల భర్తీకి నిర్వహిస్తున్న పరీక్షల్లో యూపీఎస్సీ తొలిసారిగా ముఖ ఆధారిత గుర్తింపు (ఫేస్ అథెంటికేషన్) విధానాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సహాయక ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, అకౌంట్ ఆఫీసర్ల పరీక్ష నిర్వహణపై జేసీ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, యూపీఎస్సీ అధికారులతో శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నెల 30వ తేదీ ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు నగరంలోని 15 కేంద్రాల్లో ఈపీఎఫ్ఓ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5860 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ముఖ ఆధారిత గుర్తింపు విధానాన్ని మొదటిసారిగా అమలు చేయనున్నడంతో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. రవాణా సౌకర్యం కల్పించాలని, పరీక్ష కేంద్రాలకు విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం చక్రాల కుర్చీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్య బృందాలు, పోలీసు భద్రత ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో పరీక్షల పర్యవేక్షక అధికారి అరుణ్‌ఖురానా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య, పరీక్షా కేంద్రాల సూపర్‌వైజర్లు, పోలీసు, విద్యుత్తు, తపాలా, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టులపై అప్రమత్తంగా ఉండాలి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : డిజిటల్ అరెస్టు మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టు అసలు లేనేలేదని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు స్పష్టం చేశారు. వీడియో కాల్ చేసి ఎవరైనా మిమ్ములను లేదా మీ కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తున్నట్లు బెదిరిస్తే భయపడవద్దని సూచించారు. సైబర్ సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు రోజుకో తరహాలో జరుగుతున్నాయని చెప్పారు. పోలీసులు ఎంత అప్రమత్తంగా వ్యవహరించినా.. నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నారని తెలిపారు. వీటిపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు. న్యాయవాదులు తోడ్పాటు అందించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సీబీఐ, పోలీస్, కస్టమ్స్, ఈడీ వంటి సంస్థలు.. వీడియో కాల్ చేయవని, అరెస్టు చేస్తామని చెప్పవని.. గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు జరిగితే తక్షణం 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటికే బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, ప్రజల్లో అవగాహన తీసుకువచ్చామని వివరించారు. బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా మాట్లాడుతూ.. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న, బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, బీబీఏ ప్రధాన కార్యదర్శి కె.వి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు. వేదికపై కృష్ణప్రసన్న, అజయ్‌కుమార్, రంగారావు, బాషా

విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విజయవాడ(రైల్వేస్టేషన్): పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా డిసెంబరు 1వ తేదీ నుంచి విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

08583/08584 విశాఖపట్నం-తిరుపతి(డిసెంబరు 2 నుంచి 31వరకు).
08547/08548 విశాఖపట్నం-తిరుపతి(డిసెంబరు 3 నుంచి జనవరి 1వరకు).
08579/08580 చర్లపల్లి-విశాఖపట్నం(డిసెంబరు 6 నుంచి 28వరకు).
08581/08582 విశాఖపట్నం-బెంగళూరు(డిసెంబరు 7 నుంచి 29వరకు).
02811/02812 భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ (డిసెంబరు 6 నుంచి 29 వరకు).
01477/01478 అనకాపల్లి-సోలాపూర్ (డిసెంబరు 5 నుంచి 26వరకు).
02841/02842 చెన్నై-షాలిమార్(డిసెంబరు 1 నుంచి 31వరకు).

హత్య కేసులో నిందితుడి అరెస్టు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలంలోని రావికంపాడులో లభించిన గుర్తుతెలియని మృతదేహం ముచ్చింతాలకు చెందిన చందనగా గుర్తించిన పోలీసులు ఆమెను హత్య చేసింది భర్త మేనల్లుడేనని నిర్ధారించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం మధిరకు చెందిన చందనకు ముచ్చింతాలకు చెందిన జక్కులూరి వీరయ్యతో వివాహమైంది. ఆ తరువాత వీరయ్య మేనల్లుడు పూర్ణకంటి హరీష్‌తో చందనకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇది తెలిసి వీరయ్య భార్యను వదిలేయడంతో హరీష్, చందనలు కలిసి సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో వేరే యువతిని వివాహం చేసుకున్న హరీష్‌ను ఇటీవల చందన తనపై ప్రేమ తగ్గిందని నిలదీయడంతో వీరిద్దరి మధ్యలో మనస్పర్ధలు ఏర్పడ్డాయి. గత శనివారం రాత్రి వీరద్దరి మధ్య వివాదం పెరగడంతో..చందనను హరీష్ గొంతు నులిమి హత్యచేశాడు. ఆ తర్వాత ఆమె మృతదేహాన్ని దుప్పట్లో మూట కట్టి తన బైక్‌పై ముందు పెట్టుకొని తాము తరచూ రహస్యంగా కలుసుకునే రావికంపాడు పొలాల వద్దకు తీసుకెళ్లి కాల్వలో పడేసి బైక్‌పైనే ఖమ్మం పరారై వెళ్లాడు. సీసీ కెమెరాల ద్వారా ఈ ప్రాథమిక విషయాలు తెలుసుకున్న పోలీసులు తమ విచారణలో నిందితుడు హరీషేనని నిర్ధారించుకొని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించింది.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజీ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

తిరువూరు

• తిరువూరు • మైలవరం

అష్టోత్తర శత దీపాలంకరణ సేవ


ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి గుడిలో శుక్రవారం రాత్రి అష్టోత్తర శత దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. అర్చకులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో భక్తులు దీపాలు వెలిగించారు. రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఉత్సవమూర్తులకు అద్దాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

అధికారులు జవాబుదారీగా వ్యవహరించాలి


జి.కొండూరు: అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

జి.కొండూరు, న్యూస్‌టుడే : అధికారులు సమస్యలపై వచ్చిన ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక సామాజిక భవనం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి 86 దరఖాస్తులు స్వీకరించి వారితో మాట్లాడారు. తొలుత మహాత్మా జ్యోతిరావు పులె వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలో 53 మంది లబ్ధిదారులకు రూ.42 లక్షల విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కులు, ఎల్‌ఓసీలను అందజేశారు. మైలవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహన్‌రావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు, ఉంటా నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో నియోజకవర్గం నుంచి ఎంపికై పాల్గొన్న స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని ఎన్. గుల్నీ ఆరాను స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం అభినందించారు. జి.కొండూరులో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, అక్కడే విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేసి, అభినందించారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు వితరణ

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని వెల్వడానికి చెందిన గుర్రాల వెంకట కోటేశ్వర రెడ్డి స్థానిక ఎంబీయం బాలికోన్నత పాఠశాల ప్లస్‌కు రూ.10 వేల విలువైన నాలుగు సీలింగ్ ఫ్యాన్లను శుక్రవారం అందజేశారు. ఈ మేరకు దాతను అభినందించి సన్మానించారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఉపాధ్యాయురాలు తులసి, ఎస్ఎంసీ బాబూరావు, పి.గోపాల్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



రెడ్డిగూడెం పంచాయతీ బీసీ కాలనీలోని డ్రైనులో పూడిక పేరుకుందని స్థానికులు 'ఈనాడు-మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు స్పందించి శుక్రవారం పంచాయతీ సిబ్బందిని పంపి డ్రైనులో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



★ తిరువూరు 2వ వార్డులోని డ్రైనులో దోమలు అధికంగా ఉన్నాయని స్థానికుడు పెద్దిరాజు, నిరంజన్ 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తెలిపారు. స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ తమ సిబ్బందిని పంపి దోమల మందు చల్లించారు.

స్పందనకు వందనం

★ తిరువూరు 19వ వార్డులోని కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు రామకృష్ణ అధికారులకు తెలిపారు. స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

ఇన్‌ఛార్జి ఎంపీపీగా రెడ్డి వెంకట శ్రీనివాసరావు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి వ్యక్తిగత కారణాలతో జెడ్పీ వద్ద తన పదవికి రాజీనామా చేయడంతో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉత్తర్వుల మేరకు ఇన్‌ఛార్జి ఎంపీపీగా రెడ్డి వెంకట శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం 72వ కి.మీ నియంత్రిక నుంచి శుక్రవారం ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు 876 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదల చేసినట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు.

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

మైలవరం నియోజకవర్గంలో వరి తర్వాత మొక్కజొన్న సాగుకే రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుండటంతో ఈ పంట వైపు మొగ్గు చూపుతున్నారు. గతేడాది రబీలో పలు ఎకరాల్లో ఈ సాగు చేయగా ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం పెరిగింది. ఒకప్పుడు అపరాలు ఎక్కువగా పండించే వారు. ప్రస్తుతం మొక్కజొన్నకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో సాగు చేస్తోంది. పంట సమయం 110 నుంచి 120 రోజులు కావడంతో కౌలుదారులు కూడా దీన్ని సాగు చేయడానికి సుముఖత చూపుతున్నారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని చిలుకూరు, దాములూరులతో పాటు రెడ్డిగూడెం తదితర మండలాల్లో దుక్కులు పూర్తి చేసి విత్తనాలు నాటుతున్నారు.


దాములూరులో విత్తనాలు నాటుతున్న కూలీలు

ప్రోత్సహిస్తే మేలు

గతేడాది మంచి దిగుబడులు రావడం, మండల పరిధిలో మెట్ట ప్రాంతాలు సాగుకు అనుకూలంగా ఉండటం, క్వింటా మొక్కజొన్న గింజల మద్దతు ధర రూ.2 వేల వరకు ఉండటం, ఎకరా పొలానికి రూ.65 వేల వరకు మిగులుతుండటం, ఎకరా పొలానికి 9 నుంచి 10 కిలోల విత్తనాలు సరిపోతాయి. పంటకు 10 నుంచి 12 సార్లు తడులు అందిస్తే చాలు. కూలీల కొరతతో ప్రస్తుతం మొక్కజొన్న రైతులు పంట సకాలంలో సాగు చేసుకోలేక పోతున్నారు. ప్రభుత్వం పురుగు మందులు

రబీలో మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు

సరఫరా చేసే ఉపకరణాలు ఉంటుందని అన్నదాతలు కోరుతున్నారు. తెదేపా హయాంలో కత్తెర పురుగు నివారణ మందులు, వేపనూనె, విత్తనాలు, పరదాలు రాయితీపై అందించారు. గత వైకాపా ప్రభుత్వం వీటిని నిలిపేసింది. మళ్లీ వాటిని పునరుద్ధరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సూచనలు పాటించండి

రబీలో మొక్కజొన్న సాగు లాభదాయకమే. పంట వేసినప్పటి నుంచి అధికారుల సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. విత్తనాలను సబ్సిడీపై అందించాం. పురుగు మందులు, వేప నూనె తదితరాలు కూడా రాయితీపై అందించాలని వినతులు వస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం. - రజని, ఏవో, ఇబ్రహీంపట్నం

పోషకాహారం తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం

ఈనాడు మీతోడు

ఇబ్రహీంపట్నం గ్రామీణం: పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులను దూరం చేయవచ్చని ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ పర్వీన్ విద్యార్థులకు సూచించారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గుంటుపల్లి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి ఆమె హాజరై మాట్లాడారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పూర్తి స్థాయిలో తీసుకోవాలని సూచించారు. గుంటుపల్లికి చెందిన వైద్యారోగ్య సిబ్బంది 60 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో కె.నారాయణ, ఎంఈవో పుష్పలత, ప్రధానోపాధ్యాయిని సుగుణ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గుంటుపల్లి వైద్యారోగ్య సిబ్బంది పి.పవన్, జె. రమాదేవి, కాంతమ్మ, ఇందిర విద్యార్థులకు రక్త పరీక్షలు, ఎత్తు తదితరాలు నిర్వహించి దస్త్రాల్లో నమోదు చేశారు.


మాట్లాడుతున్న వైద్యురాలు పార్వీన్, పక్కన ఎంఈవో పుష్పలత, సీహెచ్‌వో నారాయణ, హెచ్ఎం సుగుణ కుమారి


విద్యార్థి ఎత్తు కొలుస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

అదే ఉత్సాహం.. ప్రతిభకు ప్రోత్సాహం

మైలవరం, న్యూస్‌టుడే : అనర్గళంగా ఉపన్యసించిన విద్యార్థులు బహుమతులు పొందారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటుతామని నిరూపించుకున్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా శుక్రవారం స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందులో పి.వర్షిని(9వ తరగతి), టి.నవ్యశ్రీ(8వ తరగతి), ఎస్కే నషీమ్(9వ తరగతి) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఉపాధ్యాయులు జె.శాంతి, కేవీస్ జ్యోత్స్న బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.


మైలవరం: బహుమతులు సాధించిన వారితో హెచ్ఎం.రాజశేఖర్, ఉపాధ్యాయులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లోని సృజన శక్తులను వెలికి తీసేందుకు 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని స్థానిక వికాస్ టెక్నో స్కూల్ డైరెక్టర్ నరెడ్ల వేమన కుమారి అన్నారు. ఆ పాఠశాలలో శుక్రవారం జరిగిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్.కుశ్వంత్(9వ తరగతి), జి.లాస్య(10వ తరగతి), కె.రచన (8వ తరగతి) విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు వేమన కుమారి, ప్రిన్సిపల్ ఆర్.గోపి బహుమతులు అందజేసి అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు శివ కృష్ణ, మస్తాన్, రాకేష్ పాల్గొన్నారు.


విస్సన్నపేట : విజేతలతో ప్రిన్సిపల్ గోపి తదితరులు

పేదల సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రాధాన్యం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : పేదల సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. సీఎం చంద్రబాబు తన సహాయ నిధి నుంచి పేదల వైద్యానికి ఆర్థిక సాయం అందిస్తున్నారని చెప్పారు. తిరువూరులోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 50 మందికి వైద్యం కోసం మంజూరైన రూ. 24,64,939 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వి. మునియ్య, కూటమి నాయకులు చెన్నా శ్రీనివాసరావు, బి.ఉమామహేష్, డాక్టర్ జయసింహా, జి. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విస్సన్నపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎస్సీ కార్పొరేషన్ నిధులు ద్వారా మంజూరైన బ్యాటరీతో నడిచే మూడు చక్రాల వాహనాలను తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. విస్సన్నపేట శివాలయం దగ్గర నివాసం ఉండే దివ్యాంగురాలు సంగెపు వెంకాయమ్మ, వేమిరెడ్డిపల్లి పంచాయతీ నర్మదా నగర్‌కి చెందిన దివ్యాంగుడు తోట నాగార్జునకు వీటిని అందించారు. తెదేపా సీనియర్ నాయకుడు మోరంపూడి రవిబాబు, ఎంపీడీవో చిన రాట్నాలు, కూటమి నాయకులు లోకేశ్వరరావు, ప్రసాద్, వేమన, ప్రభాకర్ పాల్గొన్నారు.


తిరువూరులో చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ప్రజాదర్బార్ నేడు

తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేటలో శనివారం తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఇందులో పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు.

సంకల్పం నీరుగారింది!



పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు చేపట్టిన స్వచ్ఛ సంకల్పం మది. అందులో భాగంగా అయిదేళ్ల కిందట ప్రతి పంచాయతీకి ఎలక్ట్రికల్ ఆటోలు, చెత్త సేకరణకు రిక్షాలను అందజేశారు. ఆటోలతో స్వయం ఉపాధితో పాటు పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమని భావించారు. కొన్నాళ్ల పాటు తూతూమంత్రంగా నడిచిన వాహనాల నిర్వహణ అటకెక్కింది. ఆశించిన స్వచ్ఛ సంకల్పం చతికిలపడింది. అందుకు నిదర్శనమే మైలవరం మండలం వెల్వడంలో రహదారి పక్కన శిథిలావస్థలో ఉన్న ఆయా వాహనాలివీ. - న్యూస్‌టుడే, మైలవరం

మరమ్మతులకు గుర్రై.. మూలకు చేరి..



తిరువూరు మున్సిపాలిటీకి చెందిన రూ.లక్షలు విలువైన వాహనాలు మరమ్మతులకు నోచుకోకుండా యార్డులోనే పడి ఉన్నాయి. దీంతో ఆయా వార్డుల్లో చెత్త సేకరణను విఘాతం ఏర్పడుతోంది. వ్యర్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. తాగునీటి ట్యాంకర్లు దెబ్బతినడంతో మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యను అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వాహనాలకు మరమ్మతులు చేయించాలని పుర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

దాడి చేస్తున్నాయ్..గాయపరుస్తున్నాయ్



ధాన్యం పండించిన రైతులకు కోతుల బెడద తీవ్రంగా ఉంది. నూర్పిడి చేసిన వడ్ల వద్దకు పదుల సంఖ్యలో చేరుకుని చెల్లాచెదురు చేస్తున్నాయి. ట్రాక్టర్లలో లోడు చేసిన ధాన్యం బస్తాలను చింపేస్తున్నాయి. ఒకరిద్దరు కాపలా ఉంటే వారిపై కూడా దాడికి ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే ప్రతి ఊరిలో వందల సంఖ్యలో కోతులు మకాం చేసి ఇళ్లలో ఆహార వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. ప్రస్తుతం వానరాల ప్రతాపం వడ్ల రాశులపై చూపిస్తున్నాయి. - న్యూస్‌టుడే, గంపలగూడెం

మురుగు ఇలా.. రాకపోకలు ఎలా?



జి.కొండూరు శివారు ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిపైకి మురుగు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆ నీరు ముందుకు పారే అవకాశం లేకపోవడంతో నిత్యం రోడ్డుపైకి చేరుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు అటువైపు రావాలంటే దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. మరో పక్క వేగంగా వచ్చే వాహనాలు ఆ నీటిలో ప్రయాణించినప్పుడు పాదచారులపై పడుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. గ్రామ శివారు వరకు కాలువ పొడిగించి రహదారిపైకి మురుగు చేరకుండా చూడాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్న ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు


ఎన్టీటీపీఎస్‌లో ఫులె చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇంజినీర్లు


గంపలగూడెంలో..


తిరువూరు తెదేపా పట్టణ, మండల కార్యాలయంలో..

సమాజంలో అసమానతలు తొలగించేందుకు కృషి

శతాబ్దిన్నర క్రితమే సమాజంలో అసమానతలను తొలగించేందుకు సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు ఫులె కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. జ్యోతిరావు ఫులే వర్ధంతి సందర్భంగా శుక్రవారం మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. - న్యూస్‌టుడే, బృందం


మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో..


గొల్లపూడిలో దేవినేని ఆధ్వర్యంలో..

రైతు సంక్షేమానికి పెద్దపీట

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాయని తెదేపా నాయకులు పేర్కొన్నారు. 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గణపవరంలో ముఖ్యమంత్రి సందేశ కరపత్రాలను అన్నదాతలతో కలిసి వారు ప్రదర్శించారు. రైతుల కోసం చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. లీలాప్రసాద్, గోపాల స్వామి, బుజ్జిరెడ్డి, శ్యాం, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడు, చినకొమిర పీఏసీఎస్‌లో తెదేపా మండల అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఆర్. వీరారెడ్డి తదితరులు పంచసూత్రాల కరపత్రాలను రైతులకు అందజేశారు.


గణపవరంలో కరపత్రాలు చూపుతున్న తెదేపా నాయకులు, అన్నదాతలు

గంపలగూడెం మండలం గోసవీడులో..

ఆభరణాలు, నగదు చోరీ

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు గ్రామంలో గురువారం రాత్రి రెండు చోట్ల దొంగతనం జరగ్గా ఆభరణాలు, నగదు పోయాయి. సేకరించిన సమాచారం మేరకు.. చెవుటూరుకు చెందిన బండారు చినఅంకబాబు బస్సు కండెక్టర్‌గా విధులు నిర్వహిస్తుంటారు. ఆయన గురువారం విధుల్లో ఉండగా భార్య నాగమణి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో నిద్రించేందుకు వెళ్లారు. ఆ సమయంలో దుండగులు తాళాలు పగలగొట్టి బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు, రూ.50 వేలు నగదు దోచుకున్నారు. అదే గ్రామం శివారులో జాతీయ రహదారి- 30 పక్కనే ఉన్న గుడూరు వెంకటరెడ్డికి చెందిన బడ్డీ కొట్టులో రూ. 5 వేలు విలువ చేసే సిగరెట్టు పెట్టెలు, రూ.2 వేలు నగదు దొంగిలించారు. ఈ విషయం తెలుసుకున్న జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించినట్లు, పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాభివృద్ధికి చేయూత

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని వెల్వడానికి చెందిన ప్రవాస భారతీయ వైద్యుడు లకిరెడ్డి హనిమిరెడ్డి రూ.కోటి వ్యయంతో గ్రామంలో మరో అభివృద్ధి పనికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ అవస్థలు తప్పించేందుకు సీసీ రోడ్డు నిర్మించడానికి నడుం బిగించారు. దాత ఔదార్యాన్ని స్థానికులు కొనియాడారు. తెదేపా రాష్ట్ర నాయకుడు కోమటి సుధాకరరావు, ఎల్బీఆర్‌సీఈ అధ్యక్షుడు జి.శ్రీనివాస రెడ్డి, సర్పంచి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.


కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న దాత హనిమిరెడ్డి

ధాన్యం అమ్మి లబ్ధి పొందండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ జె.సుశీలాదేవి పేర్కొన్నారు. శుక్రవారం కూనపరాజుపర్వ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కేంద్రాల్లో అమ్మడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు వివరించారు. ఏవో డి.శ్రీనివాసరావు, కూనపరాజుపర్వ పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ సుశీలాదేవి

నూరు శాతం ఉత్తీర్ణతకు ఉపయుక్తం

గంపలగూడెం, తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : యూటీఎఫ్ ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన పదో తరగతి అధ్యయన సామగ్రిని(స్టడీ మెటీరియల్) తిరువూరు మండల విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఇది నూరు శాతం ఉత్తీర్ణతకు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఎంఈవో ఎ.శ్యామ్‌సుందరరావు, యూటీఎఫ్ నాయకులు వెంకట స్వామి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, భరత కుమారి తదితరులు పాల్గొని ఆవిష్కరించారు.


తిరువూరులో స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న శ్యామ్ సుందరరావు, యూటీఎఫ్ నాయకులు

తెదేపా కార్యాలయంలో రసాభాస

కొండపల్లి: పురపాలిక అధ్యక్ష పేర్ల ఎంపికలో కొందరి వ్యక్తుల మధ్య ఏర్పడిన వివాదం ముష్టి యుద్ధానికి దారి తీసింది. శుక్రవారం రాత్రి కొండపల్లి తెదేపా కార్యాలయంలో ఛైర్మన్ చిట్టిబాబు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పురపాలిక అధ్యక్ష ఎన్నిక ప్రస్తావన వచ్చింది. ఆ సమయంలో పార్టీ కోసం కష్టపడే వారికే పదవి ఇవ్వాలని, కొందరు అభిప్రాయ పడితే, ఇతరులకు ఆ పదవి కావాలని మరికొందరు మాట్లాడారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం జరిగింది. పరిస్థితి చేయి దాటుతుందని గ్రహించిన ఛైర్మన్ చిట్టిబాబు ఇరువర్గాలను సముదాయించి పార్టీ అధ్యక్ష పదవికి అర్హుడైన వ్యక్తిని అధిష్ఠానం చూసుకుంటుందని తేల్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మైలవరం: సైబర్ మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విజయవాడ డీసీపీ బి.లక్ష్మినారాయణ సూచించారు. విలేజ్ విజిట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మొర్సుమిల్లి, వెల్వడంలో ఏసీపీ ప్రసాదరావుతో కలిసి సైబర్ సురక్షా సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటీపీల ద్వారా మోసం, డిజిటల్ అరెస్ట్ పేరిట నేరాలకు పాల్పడుతున్నారని పలు ఉదాహరణలు వివరించారు. డివిజన్‌లో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వాటి నివారణకు శిరస్త్రాణం ధరించాలని కోరారు. సీఐ చంద్రశేఖర్, ఎస్సై తదితరులు పాల్గొన్నారు.



వెల్వడంలో మాట్లాడుతున్న డీసీపీ లక్ష్మినారాయణ, పక్కన ఏసీపీ ప్రసాదరావు

సామాజిక బాధ్యతతో వైద్య శిబిరాలు


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : సామాజిక బాధ్యతతో ఎన్టీటీపీఎస్ పరిసర గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీరు పి.శివరామాంజనేయులు తెలిపారు. గుంటుపల్లి ఆర్‌సీఎం చర్చిలో ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీవో శకుంతల, తెదేపా మండల అధ్యక్షుడు పేదర్ల రవి, గుంటుపల్లి సర్పంచి కవిత, ఎన్టీటీపీఎస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూత్రపిండాల వ్యాధితో మహిళ మృతి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని చైతన్య నగర్ గ్రామానికి చెందిన బాణావతు పీరి(85) మూత్రపిండాల వ్యాధితో మృతి చెందారు. గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆమెకు కుటుంబ సభ్యులు పెద్ద మొత్తంలో నగదు ఖర్చు చేసి వైద్యం చేయించారు. ఈ మేరకు వ్యాధి తీవ్రతతో గురువారం రాత్రి చనిపోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. సీపీఎం, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.ఆనందరావు, జె.వెంకటేశ్వరరావు, కుమార్ నాయక్ శుక్రవారం ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. ప్రభుత్వం పీరి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ఈతరం

■ youthpage@eenadu.in

సబ్జెక్టుతో చెప్పనా..

తెలుగు- నేను నిన్ను ప్రేమిస్తున్నాను
ఇంగ్లిష్- ఐ లవ్ యూ
కెమిస్ట్రీ- యూ ఆర్ మై ఆక్సిజన్
ఫిజిక్స్- యూ ఆర్ మై గ్రావిటీ
హిస్టరీ- యూ ఆర్ మై క్వీన్
జాగ్రఫీ- యూ ఆర్ మై యూనివర్స్
మ్యాథ్స్- యూ ఆర్ మై సొల్యూషన్
బోటనీ- నా ప్రేమ వృక్షం నీవే
సైకాలజీ- నా ఆలోచన అంతా నీవే
పొలిటికల్ సైన్స్- నా హృదయపాలన నీదే
ఎకనామిక్స్- నా జీవితానికి లవ్ ఎఫిషి నువ్వే
సివిక్స్- నీ చెయ్యి అందుకోవడం నా ప్రాథమిక హక్కు
కంప్యూటర్ సైన్స్- నా లవ్ బగ్‌ని ఫిక్స్ చేయవా!
– వినయ్, కొత్తపల్లి

పంచుకుందాం

సఫరింగ్

నేను పార్వతీపురంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న రోజులవి. కాలేజీలో చేరిన నెల తర్వాత మాకు బాగా అర్థమైన విషయం ఏమిటంటే.. మాకు ఫిజిక్స్ పాఠాలు అస్సలు ఏమీ అర్థం కావడం లేదని! అందు వల్ల ఈ విషయాన్ని మా ప్రిన్సిపాల్‌గారికి లేఖ రాసి తెలియజేయాలి అనుకున్నాం. ఆ టైమ్‌లో మేమంతా ఇంగ్లిష్‌లో చాలా వీక్. అందుకే మా తోపు ఫ్రెండ్ జగదీష్ 'నేను రాస్తా. పక్కకి జరగండిరా..' అంటూ ముందుకొచ్చాడు. ఇలా మొదలు పెట్టాడు.
గుడ్‌మార్నింగ్ సర్,
వియ్ ఆర్ సఫరింగ్ ఫ్రమ్ ఫిజిక్స్..
అని వాడు రాసిన తీరు చూసి నవ్వలేక చచ్చాం అనుకోండి!
– రామకృష్ణ ఎర్రిరెడ్డి

రంగుల కల



బీకాం మూడో ఏడాదిలో ఉన్నాం అప్పుడు. నా బెస్ట్‌ఫ్రెండ్, నేను సినిమాకి వెళ్లాం అనుకుని బయల్దేరాం. ఈలోగా నా ఫ్రెండ్‌గాడు 'ఒక్క నిమిషం' అంటూ క్లాస్‌లోకి వెళ్లాడు. ఎంతకీ రాడే! ఓ పక్క సినిమాకి టైమ్ అయిపోతోంది. 'ఏంటి వీడు ఇంకా రాడు' అనుకుంటూ నేనూ క్లాస్‌లోకి వెళ్లా. మనోడు తన రఫ్ బుక్ వెతుకుతూ క్లాస్ మొత్తం తిరిగేస్తున్నాడు. 'రఫ్ బుక్‌కి ఇంత హడావుడి ఏంట్రా' అనుకుంటూ నేను అసహనంగా నిలబడ్డా. కాసేపటికి వాడి బుక్ దొరికింది. ఇంతకీ అంత అపురూపంగా ఆ పుస్తకంలో ఏం రాశాడు అంటే.. తనకు నచ్చిన అమ్మాయి కాలేజీ మొదలైన రోజు నుంచి ప్రతిరోజూ ఏ తేదీన ఏ రంగు డ్రెస్ వేసుకొచ్చిందో మూడేళ్ల నుంచి లిస్ట్ రాసి దాచాడు వెధవ. పాపం అంత ప్రేమించిన వాళ్లు పెళ్లిచేసుకోలేదు లెండి అది వేరే విషయం. కానీ ఆ అమాయకపు ప్రేమ గుర్తొస్తే పెదాలపై ఓ చిన్న చిరునవ్వు నిలుస్తుంది.
– శ్రీను



మిక్సింగ్ మాస్టర్

మ్యూజిక్ మిక్సింగ్‌లో విశాఖకు చెందిన కళాకారుడు దుమ్మురేపుతున్నాడు. సూపర్‌హిట్ సినిమాలకు మిక్సింగ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు. ఒక పాటలో వోకల్స్, ఇన్‌స్ట్రుమెంట్ల ధ్వనులను మిళితం చేయడంలో మిక్సర్‌లదే కీలక పాత్ర. అప్పుడే అది చక్కని సంగీతంగా వినిపిస్తుంది. ఈ పనిలో రాటుదేలాడు ఇతడు. సంగీతంలో ఆస్కార్‌గా భావించే గ్రామీ అవార్డులను రెండుసార్లు సొంతం చేసుకోవడమే కాదు, తాజా గ్రామీ రేసులోనూ నిలిచాడు. అతడే పల్లికొండ అదృష్ట దీపక్. ఈ అవార్డుల సాధన వెనుక కృషి తన మాటల్లోనే..



చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. కానీ అప్పటికి మ్యూజిక్ ఇంజినీరింగ్ అంటే మా ప్రాంతంలో అంతగా అవగాహన లేదు. నాన్న ఆపదరావు ఏయూలో తెలుగు ఆచార్యులు. నా అభిరుచిని మెచ్చి ప్రోత్సహించారు. ఏడేళ్లకే గిటార్ నేర్చుకున్నా. చదువుకుంటూనే విశాఖలోని కొన్ని ఆర్కెస్ట్రా బృందాలకు గిటార్ ప్లే చేసేవాడ్ని. ఇంటర్ తర్వాత ముంబయిలో ఆడియో ఇంజినీరింగ్ కోర్సు చేశా. కానీ అది ముగిశాక అవకాశాలేమీ రాలేదు. పనికోసం వెతుక్కోవాల్సి వచ్చింది. విశాఖలోనే మొదటిసారి ఓ స్టూడియోకి రికార్డింగ్ ఇంజినీర్‌గా పనిచేశా. కొన్ని ధారావాహికలకు రికార్డింగ్, సౌండ్ మిక్సింగ్ చేశా. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటున్నా.. ఏదో లోటు వెంటాడేది. సరైన గుర్తింపు రావడం లేదనే బాధ అది. తిరిగి ముంబయిలో రెండు స్టూడియోలను సంప్రదించగా అప్పటికే అక్కడ సౌండ్ మిక్సింగ్ ఇంజినీర్లు ఉండటంతో అవకాశం లేదన్నారు. ఆ తర్వాత అనుకోని రీతిలో మెల్లగా ఛాన్సులు పెరిగాయి. ఆపైన వెనుదిరిగి చూడలేదు.

రెండు గ్రామీలతో..

'తక్కువ బడ్జెట్లో సినిమా ఉంది. పెద్ద ఇంజినీర్లను ఇబ్బంది పెట్టాలనుకోవడం లేదు, చేస్తావా' అని స్లమ్‌డాగ్ మిలియనీర్‌కు ఏఆర్ రెహమాన్ అడిగినప్పుడు ఇంకేమీ ఆలోచించలేదు. ఊహించని విధంగా అది ప్రపంచ వేదికల్లో గొప్ప పేరు తీసుకొచ్చింది. బెస్ట్ సౌండ్ ట్రాక్ ఇంజినీర్‌గా మొదటి గ్రామీను తెచ్చిపెట్టింది. ఆ తర్వాత డివైన్ టైడ్స్ ఆల్బమ్‌లో విండ్స్ ఆఫ్ సంసారా అనే పాటకు 'బెస్ట్ న్యూఏజ్ ఆల్బమ్' కేటగిరీలో మరోసారి గ్రామీ వరించింది.

● ఇప్పుడు యువత తమ మ్యూజిక్ హాబీను ప్రొఫెషన్‌గా మార్చుకునేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. ఆన్‌లైన్‌లోనైనా కోర్సులు చేసే వీలుంది. ఇప్పటికే చాలా మంది యువతకు ఇన్‌స్టాలో మెంటార్‌షిప్ ఇస్తూ వస్తున్నా. ఆసక్తికి శ్రమ తోడైతే చాలు.. మిమ్మల్ని ఎవ్వరూ ఆపలేరు!

– సురేశ్ రావివలస, విశాఖపట్నం

కుంభమేళా స్ఫూర్తిగా..

మహా కుంభమేళాను ప్రేరణగా తీసుకొని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 'సౌండ్స్ ఆఫ్ కుంభ' పేరిట ఓ ఆల్బమ్‌ను సిద్ధాంత్ భాటియా రూపొందించారు. అంతర్జాతీయంగా పేరున్న సంగీత కళాకారులు ఇందులో భాగస్వాములయ్యారు. దీనికి నేను సౌండ్ మిక్సింగ్ ఇంజినీర్‌గా పనిచేశా. ప్రస్తుతం ఇది గ్రామీ అవార్డు రేసులో ఉంది. గ్లోబల్ మ్యూజిక్ అవార్డు కేటగిరీలో ప్రపంచ వ్యాప్తంగా 400 ఆల్బమ్‌లు పోటీపడగా తుది పోటీలో 5 నిలిచాయి. అందులో మాదొకటి. డిసెంబరులో జరిగే ఓటింగ్ అనంతరం తుది ఫలితాలు వెలువడనున్నాయి. లైవ్ సౌండ్ ఎఫెక్ట్ ఆధారంగా దీన్ని రూపొందించి సౌండ్ మిక్స్ చేయడంతో ఎంతో పేరొచ్చింది.

● కుంభమేళాలో పాల్గొని లైవ్ సౌండ్‌ను తీసుకొని ట్రాక్‌లతో మ్యూజిక్ రూపొందించాం. ఇప్పటివరకూ హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోని 120కి పైగా సినిమాలకు పనిచేశాను. తాజాగా తేరే ఇష్క్ మే విడుదలైంది.

కొంటె కొటేషన్



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

1. లిప్‌స్టిక్ మిరప అందం.. వేస్తే మండును అధరం
– కొండలరావు, దూసి
2. ఆకారం చూస్తే మిరప పండు.. అద్దుకుంటే పెదవి మండు
– సాయిరామ్, నెల్లూరు
3. ఇదేమి అందం.. బుగ్గగిల్లి జోలపాడే చందం
– వేణు, ఖమ్మం
4. లవర్ కొనిమ్మని చేసింది మారాం వేసుకున్నాక నోరంతా కారం తగ్గలేదు మంట వారం!
– మమత, హన్మకొండ



హగ్ ఇస్తావా అబ్బాయ్



అక్కడ అమ్మాయిలు హగ్గుల కోసం అబ్బాయిలకు డబ్బులిస్తున్నారట. సాంత్వన చేకూర్చే ఐదునిమిషాల చక్కని కౌగిలింతకు ఆరొందల రూపాయల వరకూ చెల్లిస్తున్నారట. ఇదంతా మన దేశంలో అనుకుని ఎక్కడ ఎక్కడ ఉందా తారక.. అని తెగ వెతికేయకండి. ఎందుకంటే ఈ మ్యాన్ మమ్ ట్రెండ్ నడుస్తున్నది చైనాలో మరి. అసలే ఆర్థిక అవసరాలు పెరిగిపోయి జీవనం భారమవుతున్న దేశం. యువత పెళ్లి, పిల్లలు అనే బాధ్యతల్లోకి వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. కానీ మానసికంగా కుంగిపోయినప్పుడు.. మనిషి పక్కన ఉంటే బాగుంటుంది అనిపిస్తుంది కదా! అలాంటి సమయాల్లోనే ఇలా హగ్ చేసుకునే కుర్రాళ్లను హైర్ చేసుకుంటున్నారట అమ్మాయిలు. అలా అని ఇవేమీ రహస్యంగా జరిగేవి కావు. పబ్లిక్ ప్లేస్‌లోనే ఒక ఐదు నిమిషాలు ఆత్మీయ ఆలింగనం అన్నమాట. ఇంతకు మించి ఇందులో మరేమీ ఉండదు. ఆధునిక సమస్యలకు ఆధునిక పరిష్కారాలు మరి!

ఆంధ్రనాట్యంలో ఆరితేరి!

తెలుగువారి ప్రాచీన నాట్యకళ 'ఆంధ్రనాట్యం'. కూచిపూడి కంటే ముందే మన నేలపై వెలుగులీనింది ఇది. అలాంటి పురాతన నాట్య పద్ధతిలో విజయవాడ యువకుడు రాణిస్తున్నాడు. సమ్మోహనపరిచే ప్రదర్శనలు ఇస్తూ ఔరా అనిపిస్తున్నాడు. తనకు ఈ ఆసక్తి ఎలా మొదలైందో మనతో పంచుకుంటున్నాడు శీలం మహేశ్‌రెడ్డి.



మాది విజయవాడ. నాన్న తిరుమలరెడ్డి గృహ నిర్మాణంలో ఉన్నారు. అమ్మ కృష్ణవేణి గృహిణి. నా బాల్యమంతా అమ్మమ్మగారి ఊరైన నందిగామలోనే సాగింది. మన పురాణాలు, నాట్య సంస్కృతి గురించి అమ్మమ్మ మాటల్లో వింటూ పెరిగాను. అప్పుడే నాకు నాట్యంపై ఆసక్తి కలిగింది.

ఇంటర్ పూర్తయ్యాక డాన్స్ నేర్చుకోవడం మొదలుపెట్టాను. కోచింగ్ క్లాసులు అని ఇంట్లో చెప్పి నృత్య తరగతులకు వెళ్లేవాడ్ని. కొన్నిరోజులకి విషయం బయటకు తెలిసింది. కోప్పడతారేమోనని భయపడ్డా. కానీ అమ్మానాన్న సంతోషపడి 'నువ్వు మాతో చెప్తే మేం కాదంటామా' అని ప్రోత్సహించారు. బంధువులు, ఇరుగుపొరుగు వాళ్లు మాత్రం 'మగపిల్లలకు నాట్యం ఏంటి' అంటూ లేనిపోని మాటలు అనేవారు. అయినా నిరుత్సాహపడకుండా ముందుకు సాగా. పట్టుదలతో సాధన చేశా.

నా తొలిగురువు ఉమామహేశ్వర్‌పాత్రుడు... ప్రతి రాగం, తాళం, భంగిమ పూసగుచ్చినట్లు చెప్పేవారు. ఆయన ద్వారానే 'ఆంధ్రనాట్యం' గొప్పతనం గురించి తెలుసుకున్నా. దీనికి రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. అందుకే ఈ కళలో ప్రావీణ్యం సంపాదించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నా.

తొలి ప్రదర్శన... నా మొదటి నాట్యప్రదర్శన శిర్డీలో ఇచ్చాను. ఆరోజు మా అమ్మ కళ్లు ఆనందంతో చెమర్చాయి. బెంగళూరు, ముంబయి, హైదరాబాద్, తిరుపతి, చెన్నై నగరాల్లో పాదం కదిపే అవకాశం దక్కింది. ఇప్పటివరకూ 100కు పైగా కార్యక్రమాల్లో నాట్యం చేశా. కాశీవిశ్వనాథ, పద్మనాభస్వామి, గురువాయూర్ కృష్ణ లాంటి ప్రసిద్ధ దేవాలయాల్లో గజ్జె కట్టే భాగ్యం కలిగింది. మలేసియాలో నేను ఇచ్చిన ప్రదర్శనకు అక్కడి ఓ సంస్థ పురస్కారంతో సత్కరించింది. 'బెంగళూరు నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్'లోనూ ఇలాంటి గుర్తింపు లభించింది.

ప్రాచుర్యంలోకి తెస్తా.. : బీఈడీ పూర్తయ్యాక నాకు విద్య నేర్పించిన పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా చేరాను. ప్రస్తుతం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో 'ఆంధ్రనాట్యంలో' ఎం.ఎ. చేస్తున్నా. ఖాళీ సమయాల్లో చిత్రలేఖనం, కవితలు రాయడం, పుస్తకాలు చదవడం చేస్తుంటా. నా గురువు అడుగుజాడల్లో నడుస్తూ, ఆంధ్రనాట్యాన్ని జనబాహుళ్యంలోకి తీసుకెళ్లి, దాని గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే నా జీవిత ధ్యేయం. – రాజవరపు సురేంద్ర, ఈజేఎస్

మెయిల్ పంపండి ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు రాసి పంపండి. మా మెయిల్ అడ్రస్ youthpage@eenadu.in

గంజాయితో కిక్.. పల్సర్‌తో ట్రిప్

✦ గంగూ భాయ్ ముఠా అరెస్టు ✦ రూ.12 లక్షల విలువైన పల్సర్ బైక్‌లు.. 5 కిలోల గంజాయి స్వాధీనం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పల్సర్ బైక్ కనిపిస్తే చాలు గంగూ భాయ్ ముఠాకు పండగే. బైక్‌ను అపహరించి బాస్‌కు అందజేస్తే పది నుంచి ఇరవై కిలోల గంజాయి ప్యాకెట్లు నజరానాగా లభిస్తాయి. గంజాయి పొట్లాలు అమ్ముతూ నిత్యం మత్తులో పల్సర్ బైక్‌లపై విహారం చేసేందుకు ముఠా సభ్యులు ప్రవృత్తిగా మార్చుకున్నారు. ఈ ముఠాకు చెందిన ఏడుగురిని నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి సారథ్యంలో అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12 లక్షలు విలువ చేసే 14 పల్సర్ బైక్‌లతోపాటు 5 కిలోల గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఏడీసీపీ ఎం.రాజారావు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా చిన్నయ్యపాలెం మండలం కొత్తకొట్టంకు చెందిన వడ్లమూరి గంగాధర్ అలియాస్ గంగూభాయ్ గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. అతడి వద్ద మాడుగుల మండలం కల్లం కోటకు చెందిన కొర్ర ఎలియా అలియాస్ రితిక్, చింతపల్లి మండలం తూర్పు అన్నవరానికి చెందిన గెమ్మిల్లి త్రినాథ్ అలియాస్ బత్తు, పాంగి శివ, వంతల కొండబాబు అలియాస్ బాలరాజు గంజాయిని అక్రమం రవాణా చేయడంతోపాటు విక్రయాలు చేస్తుంటారు. వీరికి విజయవాడ పరిధిలోని తాడిగడపకు చెందిన మోటర్ సైకిళ్ల చోరీ చేసే గుడిసెల భానుప్రకాష్, పెనమలూరుకు చెందిన బాల నేరస్థుడు పరిచయమయ్యారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి బ్యాంకులు, షాపింగ్ మాల్స్, పార్కింగ్ ప్రదేశాల్లోని పల్సర్ బైకులను లక్ష్యంగా చేసుకొని దొంగతనం చేస్తుంటారు.



ముఠా సభ్యులతో ఏడీసీపీ రాజారావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ప్రసాద్ తదితరులు



గంజాయి ప్యాకెట్లు

ఇలా చిక్కాడు.. విజయవాడ పరిధిలోని పటమట ఆటోనగర్‌లో మైనర్ మోటర్ సైకిల్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు తెలియజేశారు. వారొచ్చి మైనర్‌ను అదుపులోకి తీసుకోవడంతో మిగతా నిందితుల వివరాలు తెలిశాయి. దీంతో ఏడీసీపీ ఎం. రాజారావు, సీఐ శ్రీనివాసరావు, ఏఎస్సై ప్రసాద్, కానిస్టేబుళ్లు అప్పలరాజు, ఫణిరాజు, వేణుగోపాల్, సురేష్, కిశోర్ సీసీఎస్ పోలీసులు బృందాలుగా ఏర్పడి ఏడుగురు ముఠా సభ్యుల నుంచి పల్సర్ బైక్‌లు, గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా వెనుక మరికొంత మంది ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

నగదు కట్టలతో.. యానిమల్ స్టెప్పులు

☛ యువతులపై నోట్లు చల్లుతూ అశ్లీల నృత్యాలు
☛ వెలుగులోకి వైకాపా లీగల్‌సెల్ సభ్యుడి అకృత్యాలు

ఈనాడు, అమరావతి, పటమట, న్యూస్‌టుడే

యానిమల్ సినిమాలో ఓ పాటకు గ్లాసు తలపై పెట్టుకుని విలన్ బాబీడియోల్ చేసిన డ్యాన్స్ స్టెప్పులు ఎంత వైరల్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే పాటకు వైకాపా లీగల్‌సెల్ సభ్యుడు వెంకటేశ్వరశర్మ వేసిన స్టెప్పులూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తలపై గ్లాస్ స్థానంలో రూ.500 నోట్ల కట్టలు పెట్టుకుని చిందులేశారు. ఇక్కడితో ఆయన విన్యాసాలు ఆగలేదు. హోటల్‌లో మంచంపై పడుకుని, ఒంటిపై కరెన్సీ నోట్ల కట్టలతో మెలికలు తిరిగే వీడియోలు వైరల్‌గా మారాయి.

వైకాపా ప్రభుత్వంలో బెదిరించి..

వైకాపా ఐదేళ్ల హయాంలో ప్రభుత్వ పెద్దలంతా తనకు తెలుసని బెదిరిస్తూ వెంకటేశ్వరశర్మ అనేక అక్రమాలకు పాల్పడి భారీగా ఆర్జించాడు. కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన పలువురు యువకులకు రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించి రూ.లక్షల్లో వసూలు చేశాడు. గత ప్రభుత్వంలో మందీ మార్బలంతో హడావుడి చేసిన వెంకటేశ్వరశర్మ దగ్గరికి న్యాయ సలహా కోసం వచ్చే అనేక మందికి సంబంధించిన కేసులు వాదిస్తానంటూ నమ్మించాడు. వారి నుంచి పెద్దమొత్తంలో నగదు తీసుకుని ఆ తర్వాత కేసులు వాదించకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. కనీసం ఫోన్ చేసినా సమాధానం చెప్పడం లేదు. ఆ డబ్బులతో దేశవిదేశాల్లో జల్సాలు చేశాడు. ఆ వీడియోలన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వీటిపైనా పోలీసులు ప్రస్తుతం విచారణ చేస్తున్నారు.



మంచంపై పడుకుని.. నగదు కట్టలు శరీరంపై పెట్టుకుని..

అసభ్య తీరుపై విమర్శల వెల్లువ

ఓ గదిలో కొంత మంది యువతులతో అశ్లీల నృత్యాలు చేయిస్తూ.. వారిపై డబ్బులు చల్లుతూ, వారితో కలిసి కిందపడి నృత్యాలు చేస్తూ.. వేసిన చిల్లర వేషాలను చూసి అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. వైకాపా లీగల్ సెల్‌లో ఉంటూ, న్యాయవాదిగా చలామణి అవుతూ.. ఇలాంటి అకృత్యాలకు పాల్పడడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వీడియోలపై పోలీసుల దృష్టి..

వెంకటేశ్వరశర్మ దగ్గరికి న్యాయ సలహా కోసం వచ్చిన ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె ఫిర్యాదు మేరకు విజయవాడలోని మాచవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరశర్మ అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వీటిపైనా పోలీసులు దృష్టి సారించారు.

గ్రీన్ బెల్టు ప్రాజెక్టుగా స్మార్త, వేద పాఠశాల అభివృద్ధి



భూమిపూజ కార్యక్రమంలో దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: గ్రీన్ బెల్టు ప్రాజెక్టుగా స్మార్త, వేద పాఠశాలను అభివృద్ధి చేస్తామని దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. పోరంకిలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం స్మార్త, వేదపాఠశాల ప్రాంగణంలో నూతన గోశాల షెడ్డు నిర్మాణానికి ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణతో కలిసి ఈవో శుక్రవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా శీనా నాయక్ మాట్లాడుతూ.. దేవస్థానం ఆధ్వర్యంలో గో సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇక్కడ ఆధ్యాత్మిక శోభ, పచ్చదనం అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద శర్మ, వేదపండితులు రాధాకృష్ణ మూర్తి, ఈఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండలరావుకు అదనపు వసతులకు కోర్టు అనుమతి

ఈనాడు - అమరావతి: వైకాపా హయాంలో అగ్నిమాపక శాఖలో వెబ్‌సైట్, యాప్ తయారీ, ట్యాబ్‌ల కొనుగోలులో జరిగిన అక్రమాల కేసులో నిందితుడు కొండలరావుకు జైలులో అదనపు సౌకర్యాలకు కోర్టు అనుమతించింది. నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం ఏసీబీ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఇంటి భోజనం, దోమతెర, దిండు, బెడ్, మందులు, ప్రొటీన్ సప్లిమెంట్లు, కుర్చీ, అవసరమైనప్పుడు ప్రభుత్వాసుపత్రి వైద్యులతో పరీక్షలకు అనుమతిస్తూ న్యాయాధికారి భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం కేసు నిందితుల బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తి

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నలుగురు నిందితుల బెయిల్ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. తమకు బెయిల్ మంజూరు చేయాలని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ దాఖలు చేసుకున్న పిటిషన్లు శుక్రవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చాయి. వీటిపై ఇరు పక్షాల వాదనలు ముగిశాయి. తీర్పు నిమిత్తం వచ్చే నెల 5కు వాయిదా వేశారు. తమను గుంటూరు కారాగారం నుంచి విజయవాడ జైలుకు మార్చాలని బాలాజీ కుమార్, నవీన్ కృష్ణ వేసిన పిటిషన్లపై వాదనలు ముగిశాయి. వీటిపై డిసెంబరు 5కు తీర్పు కోసం న్యాయాధికారి వాయిదా వేశారు. సిట్ అధికారులు సీజ్ చేసిన కారు తమదనీ, దానిని అప్పగించాలని సత్యం ఇస్పాత్ కంపెనీ వేసిన పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ కౌంటర్ కోసం 1కి వాయిదా పడింది.

లంచం తీసుకున్న రైల్వే ఏడీఈకి జైలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : డిజిటల్ కెమెరాను లంచంగా తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన కేసులో రైల్వే ఏడీఈ మట్టా ధర్మారావుకు ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.1500లు జరిమానా విధిస్తూ విజయవాడ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు శుక్రవారం తీర్పు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో రైల్వే ఏడీఈగా పనిచేస్తున్న ధర్మారావు.. ఒక గుత్తేదారుకు చెందిన రూ.77 వేల బిల్లును మంజూరు చేసేందుకు డిజిటల్ కెమెరాను లంచంగా ఇవ్వాలని కోరారు. దీనిపై గుత్తేదారు సీబీఐకి ఫిర్యాదు చేయటంతో.. వారు వల పన్ని లంచం తీసుకుంటుండగా నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ అనంతరం అతడిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

★ **ఫిర్యాదు చేయండి:** కేంద్ర ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వ బీమా కంపెనీల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినా సీబీఐకి ఫిర్యాదు చేయవచ్చని సీబీఐ డీఐజీ తెలిపారు. ఫిర్యాదుదారులు 'డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సీబీఐ, విశాఖపట్నం' అనే చిరునామాకు వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. టోల్ ఫ్రీ నంబరు 1800 425 00100 లేదా 0891-2783344 లేదా 94927 83344 లేదా మెయిల్ ఐడీ hobacvskp@cbi.gov.inకి ఫిర్యాదు చేయాలని కోరారు.

ఆ డబ్బులు మీ ఖాతాకు ఎలా చేరాయి?

జోగి సోదరులపై సిట్, ఎక్సైజ్ అధికారుల ప్రశ్నల వర్షం

ఈనాడు - అమరావతి: సిట్, ఎక్సైజ్ అధికారులు ఏ ప్రశ్న అడిగినా వారి నుంచి వచ్చేది ఒకటే సమాధానం. 'నాకు తెలీదు.. గుర్తు లేదు.. సంబంధం లేదు.' ఇంతకు మించి నకిలీ మద్యం కేసులో నిందితులైన జోగి రమేష్, జోగి రాము నుంచి మరో సమాధానం రాలేదు. మూడో రోజైన శుక్రవారం వీరిని సిట్ అధికారులు విజయవాడ కారాగారం నుంచి కస్టడీకి తీసుకుని వైద్య పరీక్షలు చేయించి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ వేర్వేరుగా విచారణ చేపట్టారు. మూడో రోజు కూడా జోగి సోదరులు సూటిగా సమాధానాలు ఇవ్వలేదు. ముఖ్యమైన ప్రశ్నలకు నోరు మెదపలేదు. శుక్రవారం ప్రధానంగా ఆర్థిక లావాదేవీలు, అద్దేపల్లి సోదరులతో ఉన్న సాన్నిహిత్యంపై దృష్టి సారించి ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. జనార్దనరావుతో తమకు సంబంధం లేదని చెప్పినట్లు సమాచారం. జనార్దనరావు యూపీఐ ఖాతా నుంచి బదిలీ అయిన నగదు గురించి పోలీసులు ప్రశ్నించారు. దీని ఆధారాలు ముందుంచి అడిగినా జోగి రాము మౌనం దాల్చినట్లు తెలిసింది. 2020 అక్టోబరులో మీకు యూపీఐ ద్వారా నగదు ఎందుకు జమ అయింది? అని ప్రశ్నించినా.. నాకు గుర్తులేదని మాత్రమే జవాబిచ్చి మిన్నకుండిపోయారు. శుక్రవారం కూడా జనార్దనరావుతో గల సంబంధాలపై మరోసారి ప్రశ్నించారు. అయినా సరైన సమాధానాలివ్వలేదు. అతనెవరో తనకు తెలియదన్నారు. జనార్దనరావు నుంచి ఎన్నిసార్లు ముడుపులు తీసుకున్నారు? ఇప్పటి వరకు ఎంత సొమ్ము తీసుకున్నారు? అని సిట్ అధికారులు ప్రశ్నించినా సమాధానాలివ్వకుండా జోగి రమేష్ మౌనందాల్చారు. జోగి రమేష్ బీపీలో స్వల్ప హెచ్చుతగ్గులు కనిపించడంతో విచారణకు మధ్యాహ్నం కొంత బ్రేక్ ఇచ్చినట్లు తెలిసింది.

బాస్కెట్‌బాల్ బాలికల విజేత కృష్ణా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో మూడు రోజులు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీల్లో బాలుర విభాగంలో తూర్పు గోదావరి, బాలికల విభాగంలో కృష్ణా జట్లు విన్నర్ ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టు 44-25 తేడాతో తూర్పు గోదావరి జట్టుపై గెలుపొందగా. . బాలుర విభాగంలో తూర్పు గోదావరి జట్టు 67-51 తేడాతో అనంతపురం జట్టుపై విజయం సాధించింది. బాలికల విభాగంలో అనంతపురం జట్టు తృతీయ, పశ్చిమ గోదావరి చతుర్థ, బాలుర విభాగంలో కృష్ణా జట్టు తృతీయ, పశ్చిమ గోదావరి చతుర్థ స్థానాల్లో నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్నాసమ్మ, సూర్య విద్యానికేతన్ కరస్పాండెంట్ అర్బార్ ఆలీ బాషా, పోటీల పరిశీలకు బి.శ్రీనివాసరావు అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.సునీత, జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి వి.రవికాంత, తదితరులు పాల్గొన్నారు.



విన్నర్ ట్రోఫీతో కృష్ణా బాలికల జట్టు

జాతీయ స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీలకు రాష్ట్ర జట్లు



ఎంపికైన అండర్-19, 17 రాష్ట్ర బాలుర జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఈ నెల 30 నుంచి అయిదు రోజుల పాటు జరిగే 69వ జాతీయ స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ అండర్-19, 17 గ్రీకో రోమన్ జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లు శుక్రవారం నగరం నుంచి పయనమయ్యాయని ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి టి.శ్రీలత తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే రెజ్లర్లకు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా అధికారులు క్రీడాదుస్తులు అందజేశారు. అండర్-19 బాలుర జట్టులో ఐ.శివయ్య, ఎం.ఉదయ్‌కిరణ్, జి.వెంకట మహేష్, జి.గిరి, ఎం.సాయి చరణ్, జి.వినయ్, పి.ఇమ్మానియేల్, టి.భరత్‌కుమార్‌రెడ్డి, ఎం.గోపీచంద్, కె.అభిలాష్‌లు స్థానం సాధించారు. ఈ జట్టుకు శిక్షకులుగా పి.రమణయ్య, ఎం.ఉమాపతిలు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అండర్-17 బాలుర జట్టులో అంజికుమార్ నాయక్, వి.పృథ్వీ, శృతికీర్తన్, జి.రాజేష్, ఎం.మనోజ్, జి.జాన్సన్, వి.కార్తీక్, పి.రాజేష్, సీహెచ్ రుషిబాబు, పి.సిద్ధార్థ స్థానం సాధించారు. ఈ జట్టుకు శిక్షకులుగా పి.వెంగళరావు, వై.రాజీవ్‌లు వ్యవహరిస్తారని ఆమె తెలిపారు.

వసుంధర

vasundhara@eenadu.in

పుట్టుకతోనే అంధురాలామె. హేళనలు, అవమానాలతోనే రోజు మొదలయ్యేదట వి.కావ్యకు. అయినా వెనుదిరగలేదామె. తనేంటో నిరూపించుకోవడానికి చేయని ప్రయత్నాలు లేవు. కట్ చేస్తే... దేశం గర్వించదగ్గ స్థాయిలో గుర్తింపు సంపాదించుకుందీమె.

ఈ విజయం వాళ్లందరిదీ..!


కావ్య

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలోని బారువ గ్రామంలో పుట్టిపెరిగింది కావ్య. ఐదుగురు అక్కచెల్లెళ్లలో ఈమె నాల్గవది. నాన్న వెంకటేష్, అమ్మ జయమ్మ వ్యవసాయ కూలీలు. నిరుపేద కుటుంబమైనా పిల్లల చదువు విషయంలో రాజీపడలేదు కావ్య అమ్మానాన్నలు. 'నాలుగో తరగతి చదువుతున్నప్పుడు, ఆంగ్ల అక్షరాల్ని గుర్తించలేక కావ్య చాలా ఇబ్బంది పడేది. స్కూల్ యాజమాన్యం సలహాతో... శారదా దేవి బ్లైండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో చేర్చాం. అక్కడే క్రీడలు ఆమెకు పరిచయమయ్యాయి. అవి ఆమె జీవితానికి దిక్సూచిగా మారతాయని ఊహించలేదు' అంటారు కావ్య తల్లిదండ్రులు. 'నాకు చిన్నప్పట్నుంచీ క్రీడలంటే ఇష్టం. కానీ అంధత్వం వల్ల దేనిలోనూ భాగం కాలేకపోయా. అదే విషయం టీచర్లతో చెబితే ఆటల్లో ప్రోత్సాహించారు. వాళ్ల శిక్షణతో పరుగు, లాంగ్‌జంప్ పోటీల్లో పాల్గొనే దాన్ని' అనే కావ్య రెండింటిలోనూ అనుకున్న స్థాయిలో అవకాశాలు సంపాదించలేకపోయింది.

క్రికెట్ పరిచయమైంది అక్కడే...

'పది పూర్తయ్యాక బెంగళూరులోని సమర్థనం ట్రస్ట్‌లో చేరాను. తర్వాతి చదువులూ, క్రీడా శిక్షణకు అవసరమైన ఖర్చులన్నీ వాళ్లే చూసుకున్నారు. ఇక్కడ చందు సార్, శిఖా శెట్టి మేడమ్ అందించిన ప్రోత్సాహం మరిచిపోలేను. వీళ్ల వల్లే క్రికెట్ పరిచయమైంది. మెలకువలన్నీ నేర్పారు. అనతి కాలంలో నేర్చుకుని, జోనల్ స్థాయిలో ఆడటం మొదలుపెట్టా. దిల్లీలో జరిగిన ఓ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచి టీ20 అంధ మహిళల క్రికెట్ జట్టులో చోటు సంపాదించా' అనే కావ్య ఆల్‌రౌండర్. బీ1(పూర్తి అంధత్వం)కేటగిరీ క్రీడాకారిణి. బంతి శబ్దానికి అనుగుణంగా ఆడుతుంది. తాజాగా జరిగిన అంధ మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో తనదైన ప్రతిభను కనబరిచి జట్టు గెలుపులో భాగమైంది. 'కావ్య తోబుట్టువులందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కానీ తను మాత్రమే ఇలా ఉండిపోయింది. తన భవిష్యత్తుని తలుచుకుని బాధపడని రోజులేదు. కానీ తన మార్గాన్ని తనే నిర్మించుకుని, దేశం గర్వించదగ్గ స్థాయిలో ఉందిప్పుడు. అందుకు మాకు చాలా సంతోషంగా ఉంద'ంటారు కావ్య తల్లిదండ్రులు. 'పూట గడవని పరిస్థితుల్లో ఉన్నా... నా చదువు, ఆటలు భారం అనుకోలేదు అమ్మానాన్నలు. ఆటల్లో నేను రాణిస్తానని నాకన్నా ఎక్కువగా వాళ్లే నమ్మారు. అడుగడుగునా తోడుంటూ ముందుండి నడిపించారు శిక్షకులు. ఈ విజయం వీళ్లందరికీ అంకితం'అనే కావ్య ఈ రంగంలో మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుందామా!

ఓవైపు దూసుకొస్తున్న బుల్లెట్లు. మరోవైపు పక్కనే వాటికి గాయపడిన సహోద్యోగి. చావు ఏ క్షణమైనా పలకరించొచ్చు. అలాంటి భయంకర పరిస్థితుల్లోనూ వృత్తి ధర్మాన్ని మర్చిపోలేదు అంజలి కులే! ఎంతోమంది అమ్మలకు పునర్జన్మను ఇచ్చారామె! నాటి అనుభవాల్ని పంచుకున్నారిలా...

కర్తవ్యం ముందు బుల్లెట్ ఓడింది!


అంజలి

దేశంలో ఉగ్రదాడి అనగానే మొదట గుర్తొచ్చేది 26/11 ముంబయి దాడులే! నరమేధానికి గుర్తు ఆ దాడి. 'రాత్రి పదిన్నర అవుతోందేమో! బుల్లెట్ల మోత విని నేను, నా సహోద్యోగి... తొలి అంతస్తులోని కిటికీ దగ్గరికి పరుగెత్తాం. తొంగి చూస్తే ఇద్దరు ఆగంతకులు గోడదూకి లోపలికి వస్తున్నారు. మమ్మల్ని గమనించి కాల్పులు జరిపారు. నేను తప్పించుకున్నా. నా సహోద్యోగికే బుల్లెట్ దిగింది' అంటూ గుర్తు చేసుకుంటారు అంజలి. కసబ్, మరో ఉగ్రవాది దాడి చేసిన 'కామా హాస్పిటల్'లో నర్సుగా పని చేసేవారామె. ఆరోజు ఆమె మెటర్నిటీ వార్డుకి ఇన్‌ఛార్జి. 'ఆగంతకులు ఆసుపత్రిలోకి చొచ్చుకొచ్చారు. అడ్డొచ్చిన సెక్యూరిటీనీ చంపేశారు. వాళ్లు ఏ క్షణమైనా పైకి రావొచ్చు. అందుకే ముందు ఆ అంతస్తు తలుపులు మూసేశా. మెటర్నిటీ వార్డులో 20 మంది గర్భిణులు, వాళ్ల కుటుంబ సభ్యులున్నారు. వాళ్లని ఎలాగైనా కాపాడాలి అనుకుని, అంతస్తు చివర్లోని చిన్న గదిలోకి తీసుకెళ్లా. ఓవైపు గ్రెనేడ్ కారణంగా భవంతి కంపిస్తోంది. బుల్లెట్ల మోత మోగుతోంది. చావు భయం తరుముతోంది. అయినా రేపటి పౌరులకు జన్మనిస్తోన్న అమ్మలు, వారి ప్రాణాలే ముఖ్యమనుకున్నా. భయం, దానికితోడు హైబీపీ ఏదైనా వాళ్లకి నొప్పులు ప్రారంభమవుతాయనే కారణం కావొచ్చు. ఆ స్థితిలో ప్రసవం చేస్తే తల్లికీ, బిడ్డకీ కూడా అపాయమే. అందుకే... నా భయాన్ని పక్కనపెట్టి, వాళ్లలో ధైర్యం నింపా' అని గుర్తు చేసుకుంటారు అంజలి.

కానీ సరిగ్గా ఆ సమయంలోనే ఓ గర్భిణికి నొప్పులు మొదలయ్యాయి. 'రెండో అంతస్తులో మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు. వాళ్లకి వెంటనే విషయం చెప్పా. కాల్పులు భయంకరంగా జరుగుతున్నాయి. దీంతో కిందికి రావడం అసాధ్యమన్నారు వాళ్లు. ఒక్క క్షణం నాకేం చేయాలో అర్థం కాలేదు. చివరికి ధైర్యం తెచ్చుకుని ఆమెను మెటర్నిటీ వార్డుకి తీసుకెళ్లామనుకున్నా. కానీ ఆ తల్లి బయటికి అడుగు పెట్టడానికి భయపడింది. ఆమెకు నచ్చజెప్పి మెల్లగా పైకి తీసుకెళ్లా. ప్రతిక్షణం భయమే. దేవుడి మీద భారం వేశా. ఎలాగైతేనేం ఆ తల్లిని డాక్టర్లకు అప్పగించి, తిరిగి కిందకి వచ్చా' అనే అంజలి ఆ రాత్రంతా తన వార్డులోని గర్భిణులకు అండగా ఉన్నారు. పోలీసులు వచ్చి తలుపు తట్టేవరకూ ఆ గది తలుపులే తీయలేదు. చివరికి సురక్షితంగా బయటపడినా... ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారట అంజలి. 'ఆ కాళరాత్రిని తలుచుకుంటే ముచ్చెమటలు పోసేవి. అది జరిగిన నెలకి టెర్రరిస్టులను గుర్తించడానికి రమ్మని పోలీసులు పిలిచారు. ఇంట్లోవాళ్లంతా భయపడ్డారు. కానీ నేను వెళ్లా. కసబ్‌ని గుర్తుపట్టా కూడా. నన్ను చూసి అతను 'నన్ను బాగానే గుర్తు పట్టారే! నా పేరు అజ్మల్ కసబ్' అంటూ నవ్వాడు. పశ్చాత్తాపం ఏమాత్రం లేదతనిలో. పైగా ఏమీ చేయలేరన్న ధైర్యం కనిపించింది. అతని ముఖం, నవ్వు రెండు నెలలు నన్ను భయపెట్టాయి' అనే అంజలి తన యూనిఫామ్‌లోనే కోర్టుకి హాజరయ్యారు. తనని ఆరోజు ఆ యూనిఫామే ధైర్యంగా విధులు నిర్వర్తించేలా చేసిందట. అందుకే దాన్నే ధరిస్తానని అడిగారట అంజలి. తన ధైర్యానికి గుర్తింపుగా భారత్ తరఫున యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్‌కి ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్నారామె. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపునీ పొందారు. అయినా ఆమె మాత్రం 'నా విధిని నేను నిర్వర్తించా'నంటారు వినమ్రంగా. బుల్లెట్లకు ఎదురొడ్డి కర్తవ్యాన్ని నిర్వర్తించిన ఈమె ధైర్యానికి సలామ్ కొట్టకుండా ఉండగలమా?

'ట్రూ కాస్టింగ్' ఇప్పుడిదే ట్రెండ్!



పెళ్లిచూపులంటే... ఇరు కుటుంబాల వారు ఓ చోట చేరి, మా అమ్మాయి అంత అంటే... మా అబ్బాయి ఇంత అంటూ పొగడ్తలతో ముంచేస్తుంటారు. అంతేనా, అబ్బాయికి కుటుంబం తర్వాతే ఏదైనా అంటారు. ఆర్థికంగా బాగా స్థిరపడ్డారు, వ్యసనాలే లేవంటారు. టైమ్‌కి ఠంచనుగా ఇంటికి చేరుకుంటాడనీ కితాబులిస్తారు. చెప్పుకొంటూ పోవాలే కానీ... ఒకటా రెండా అమ్మాయిని ఆకర్షించడానికి ఎన్ని మాటలు చెబుతారో! వాళ్లు చెప్పింది చాలదన్నట్లు అబ్బాయి కూడా గొప్పలు పోతుంటాడు. తీరా పెళ్లయ్యాక తెలుస్తుంది. అవన్నీ అబద్ధాలే అని. ఇక మొదలవుతుంది కురుక్షేత్రం. సర్దుకుపోయేవాళ్లు సర్దుకుపోతారు. పోలేని వాళ్లు మాకొద్దు బాబోయ్ ఈ సంసారం అంటూ విడిపోతుంటారు. రెండూ చేయలేని వాళ్లు ఎటూ పోలేక నరకం అనుభవిస్తుంటారు. ఈ సమస్యలన్నీ ఉండకూడదనే ప్రతి విషయాన్ని పక్కాగా తెలుసుకుంటున్నారు ఈతరం అమ్మాయిలు. దీన్నే 'ట్రూ కాస్టింగ్' అంటున్నారు. వ్యసనాలు ఉన్నాయా... ఉంటే ఏ స్థాయి వరకూ. ఈ గజిబిజి జీవనశైలిలో భాగస్వామికి ఏ మేరకు సమయం ఇవ్వగలరు? కార్యాలయంలో నిర్వర్తించే విధులు, హోదా, లక్ష్యాలు దానికి కావాల్సిన సమయం అన్నీ బేరీజు వేసుకుని నచ్చితేనే బంధంలోకి అడుగు పెడుతున్నారు. లేదంటే అక్కడితో ఆ సమావేశానికీ, వ్యక్తికీ చెక్ చెప్పేస్తున్నారు. ఈతరం అమ్మాయిలకు భవిష్యత్తు మీద ఎంత స్పష్టతో కదా!

> మీ సామర్థ్యాలపైన సందేహం ఉన్నా కూడా ఒక అవకాశం వచ్చినప్పుడు 'ఎస్' అనే చెప్పండి. ఎందుకంటే దానికి మీ జీవితాన్ని మార్చగలిగే శక్తి ఉండొచ్చు. భయాన్ని పక్కనపెట్టి కష్టపడి పని చేయడంవల్లనే గమ్యాన్ని చేరుకోగలిగాను. ప్రపంచం మీకు పరిమితులు విధిస్తుంది, సామర్థ్యంపైన అనుమానాల్ని వ్యక్తం చేస్తుంది. కానీ ఇతరులు మీ గురించి మాట్లాడుకునేవి పట్టించుకోకుండా మిమ్మల్ని మీరు నిజాయతీగా విశ్లేషించుకున్నప్పుడే విజయం సాధిస్తారు.
>
> - గునీత్ మోంగా కపూర్, సినీ నిర్మాత, ఆస్కార్ గ్రహీత

అర్ధ శలభాసనం



శలభం అంటే మిడత. శలభాసనంలో సగం ఆచరించే భంగిమే అర్ధ శలభాసనం.

చేసే విధానం: మ్యాట్‌పైన బోర్లా పడుకుని... గడ్డాన్ని నేలపైన సున్నితంగా ఆనించి ఉంచండి. రెండు కాళ్లను నిటారుగా చాచి అరచేతుల్ని తొడల కిందగా బోర్లించి ఆన్చి ఉంచండి. గాలి తీసుకుంటూ వీపు కండరాల సాయంతో కుడి కాలిని మెల్లగా పైకి ఎత్తండి. మోకాలు వంపు లేకుండా నిదానంగా చాచి ఉంచండి. ఈ స్థితిలోనే శ్వాస తీసుకుంటూ 10-15 సెకన్లు ఉండేందుకు ప్రయత్నించండి. ఆపై గాలి వదులుతూ కాలిని కిందకు దించండి. విశ్రాంతిగా పడుకుని నిమిషం ఆగి తర్వాత ఎడమ కాలితో ఆసనాన్ని పునరావృతం చేయండి.

జాగ్రత్తలు: గర్భిణులు ఈ ఆసనం అస్సలు వేయకూడదు. హెర్నియా, గుండె జబ్బులు, తీవ్ర నడుము నొప్పి ఉన్నవాళ్లు డాక్టర్ సలహాతో చేయాలి.

ఉపయోగాలు: నడుము నొప్పి నుంచి ఉపశమనం ఇస్తుంది. సయాటికా, స్లిప్డ్ డిస్క్ సమస్యలకు పనిచేస్తుంది. తుంటి కండరాలకు బలం చేకూరుస్తుంది. ఉదర అవయవాలను ఉత్తేజితం చేస్తుంది. వెన్ను కండరాలకి బలాన్ని ఇస్తుంది.

ఆహారం: కాల్షియం సమృద్ధిగా లభించే పాలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, నువ్వులు తీసుకోండి. రోజూ బాదం, వాల్‌నట్స్, అవిసె గింజల్ని ఆహారంలో భాగం చేసుకోండి. నీరు తగినంతగా తాగండి.

- శిరీష, యోగ గురు

మీరు వాడే మిరియాలు మంచివేనా?!

శీతకాలంలో పిల్లలకీ పెద్దలకీ దగ్గూ జలుబు సర్వసాధారణం. దాంతో ఇంట్లో మిరియాలు స్టాక్ పెట్టుకుంటాం. కానీ వాటితో కషాయం కాచినా టీలో వేసినా ఘాటే అనిపించదు. అప్పుడొస్తుంది అనుమానం... ఇవి నిజంగా మిరియాలేనా. నకిలీవా అని. అందుకే నకిలీ మిరియాలని ఎలా కనిపెట్టాలో ఇప్పుడు తెలుసుకుందాం...



బ్లాక్ గోల్డ్‌గా పిలిచే మిరియాల ప్రయోజనాలు అందరికీ తెలిసిందే. అందుకే అవి లేని కిచెన్ ఎక్కడా కనిపించదు. వీటిల్లోని పైపరిన్ అనే పదార్థం శరీరంలో వేడి పుట్టించి, ఒంటికి పోషకాలు పట్టేలా చేస్తుంది. వీటిలోని సహజ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణశక్తిని పెంచుతాయి. గ్యాస్ సంబంధిత సమస్యల్ని తగ్గిస్తాయి. ఇవి జీవక్రియని పెంచి, బరువు తగ్గడానికీ తోడ్పడతాయి. హృద్రోగ సమస్యలూ తగ్గుతాయి. మొత్తంగా రోగనిరోధకశక్తిని పెంచుతాయి. పైగా విటమిన్-కె, సిలతోపాటు ఐరన్, పీచు, మాంగనీస్... వంటి పోషకాలూ ఉంటాయి. అందుకే పూర్వం నుంచీ ఆయుర్వేదం, సంప్రదాయ గృహ వైద్యంలోనూ వీటిని ఎక్కువగా వాడుతున్నారు.

అయితే ఆహారపదార్థాల కల్తీ మిరియాలకీ సోకింది. బొప్పాయి లేదా వీటిని పోలిన ఇతర్రా బెర్రీ గింజలకే నూనె పట్టించి మిరియాలుగా అమ్మడం లేదా వాటిలో కలపడం చేస్తున్నారు. లేదా పూర్తిగా పక్వానికి రాని మిరియాల్ని కోసి వాటికి సీసం పట్టించి విక్రయిస్తుంటారు. దాంతో ఇవి ఆరోగ్యానికి చేటు చేస్తున్నాయి. బొప్పాయి గింజలు వికారాన్ని కలిగిస్తే, వీటికి పట్టించిన చౌక నూనె లేదా సీసం వల్ల దీర్ఘకాలంలో జీర్ణ, మూత్రపిండ, కాలేయ సమస్యలకు కారణమవుతున్నాయి.

ఎలా గుర్తించాలి?

సాధారణంగా మిరియపు గింజలన్నీ ఒకే సైజులో, నొక్కులతో, ముదురు గోధుమ నుంచి నలుపు రంగులో, ఘాటైన వాసనతో ఉంటాయి. కొరికినప్పుడు ఘాటైన రుచితోపాటు ఒకలాంటి మట్టి లేదా పూల వాసనతో ఉంటాయి. కాబట్టి నకిలీ వాటిని గుర్తించడానికి ఇలా చేసి చూడండి.



నొక్కండి: ముందుగా కొన్ని గింజల్ని తీసుకుని బల్లమీద పెట్టి వేలితో నొక్కండి. అవి సులభంగా చితికితే నకిలీవన్నమాటే. నిజమైనవి అంత త్వరగా చితకవు.




నీళ్లతో: ఓ స్పూను మిరియాల్ని తీసుకుని గ్లాసు నీళ్లలో వేసి కాసేపు పరిశీలించండి. అసలైనవి మునిగిపోతాయి. బొప్పాయి గింజలైతే తేలికగా ఉండటం వల్ల నీళ్లపైన తేలతాయి. అయితే కొన్నిసార్లు మిరియాల్లోని గాలి వల్ల అవీ తేలతాయి. కాబట్టి మరో పరీక్ష అవసరం.



వాసన: మీ ముక్కే మంచి ప్రయోగశాల. గింజల్ని వేళ్లతో నలిపి వాసన చూడండి. ఆ ఘాటైన వాసనకు ముక్కు రంధ్రాలు వెంటనే తెరచుకుంటాయి. అదే నకిలీవైతే ఎలాంటి వాసనా రాదు.

టెక్స్చర్‌తో: బల్ల రోలులో వేసి కొట్టినప్పుడు వెంటనే పొడయితే నకిలీవన్నమాట. పైగా మిరియాలయితే కొట్టేటప్పుడు మంచి వాసన వస్తాయి. అప్పటికీ నమ్మకం కుదరకపోతే కొన్నింటిని స్పూనులో వేసి చిన్నమంటమీద పెట్టండి. మిరియాలైతే ఘాటైన వాసన వస్తాయి. బొప్పాయి గింజలైతే చేదు వాసన వస్తుంది. అలాగే అరచేతుల్లో వేసుకుని రుద్దితే.. రంగు అంటుకున్నా నకిలీవన్నట్లే.

ఈ పరీక్షలన్నీ ఇంటికి తెచ్చాకే చేయగలం. కాబట్టి వీలైనంత వరకూ కొనేటప్పుడు ఎఫ్ఎస్ఎస్ఏఐ, అగ్‌మార్క్ లేబుల్ ఉందో లేదో చూసుకోండి. నమ్మకమైన బ్రాండ్ల నుంచే కొనండి.



జెన్ జీ అమ్మాయిలు మెచ్చే స్లీప్ మ్యాక్సింగ్..!

స్లీప్ మ్యాక్సింగ్... ప్రస్తుతం నిద్రలేమితో బాధపడుతున్నవారు సోషల్ మీడియాలో ఎక్కువగా వెతుకుతున్న ట్రెండ్ ఇది. అవునుమరి, మన దేశంలో దాదాపు మూడింట ఒకవంతు ఈ సమస్యతో బాధ పడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ ట్రెండ్ నిద్రలేమికి గల కారణాన్ని గుర్తించి నివృత్తి చేసే మార్గాలను గురించి చెబుతుంది. అయితే ఈ ట్రెండ్‌ను సోషల్ మీడియాలో వెతుకుతున్నది మాత్రం జెన్ జీ అమ్మాయిలేనట. వీళ్లకి ఈ వయసులో నిద్రలేమి ఏంటి అనుకుంటున్నారా? మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, నైట్ షిఫ్టులు, పని ఒత్తిడి, డెడ్ లైన్లు... వెరసి వీళ్లకు సరిగ్గా నిద్ర పట్టకుండా చేస్తున్నాయట. సాధారణంగా ఒక మనిషికి 7-8 గం. నిద్ర అవసరం. కానీ వీళ్లు 4గం. కూడా నిద్రపోవడం లేదట. ఒకవేళ బలవంతంగా నిద్రపోవడానికి ప్రయత్నించినా మధ్యరాత్రి మెలకువ వచ్చేస్తుంది. దీంతో వారిలో ఏకాగ్రత, సృజనాత్మకత లోపించడం, బరువు పెరగడం, మధుమేహం, డిప్రెషన్, ఆందోళన, కోపం, అతిగా తినడం, జీర్ణ సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందుకే తక్కువ సమయమే నిద్రపోయినా గాఢనిద్రలోకి జారుకునేందుకు మార్గాలను ఎక్కువ వెతుకుతున్నారు వీళ్లు. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, లేవడం చేయాలి. నిద్రకి గంట ముందు నుంచీ మొబైల్, ల్యాప్‌టాప్‌లను దూరం పెట్టాలి. బెడ్‌రూమ్ చల్లగా ఉండేలా చూసుకోవాలని చెబుతుందీ స్లీప్ మ్యాక్సింగ్ ట్రెండ్. వీటితోపాటు కాఫీ, టీలకు దూరంగా ఉంటూ క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలి. ఆరోగ్యం మీద శ్రద్ధ పెరగడం, పాటించడానికి సులువుగానూ ఉండటంతో జెన్ జీలు దీన్ని పాటించేస్తున్నారట.

జైల్లో... కళా ప్రపంచం!

రాంచీ జైల్లో మహిళా ఖైదీలు తమ ప్రత్యేకతని చాటుతున్నారు. మరుగున పడిపోతున్న గిరిజన కళతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. అంతేకాదు, మానసిక ప్రశాంతతను పొందుతున్నారు. ఖైదీలకు ఇంత పేరు ఎలా వచ్చిందంటే...





సాధారణంగా జైళ్లంటే ఖైదీల పట్ల కఠినంగా వ్యవహరిస్తారనే భావిస్తాం. కానీ ఝార్ఖండ్‌లోని రాంచీలోని జైళ్లు మాత్రం ఇందుకు భిన్నంగా కనిపిస్తాయి. అక్కడ ఉండే మహిళా ఖైదీలు సోహ్రాయి పెయింటింగ్స్ వేస్తూ ఆనందంగా కనిపిస్తారు. పెయింటింగ్‌తోపాటు వివిధ కళలను నేర్చుకునేందుకు జైలు అధికారులే వారికి శిక్షణను అందిస్తున్నారు. 'జైలుకొచ్చే చాలా మంది ఖైదీలు పేదరికంతో బాధ పడుతున్న వారు, నిరక్షరాస్యులు. అందుకే వాళ్లలో సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు నైపుణ్యాలు అందిస్తున్నాం. వాళ్లు బయటికివెళ్లాక జీవనోపాధి సాగించడానికి ఈ కళ ఉపయోగపడుతుంది. దీనివల్ల వారికి సమాజంలో గౌరవమూ దక్కుతుంది. ముఖ్యంగా సోహ్రాయి పెయింటింగ్ వారిలో సృజనాత్మకతను పెంపొందిస్తుంది. పుస్తకాల కవర్లగానూ వీటిని వాడతారు. దుస్తుల మీదా చిత్రిస్తారు. గృహాలంకరణలోనూ ఈ పెయింటింగ్స్ కనువిందు చేస్తాయి. అలా తయారుచేసిన సోహ్రాయి పెయింటింగ్స్‌ని ఈ ఏడాది దిల్లీలో జరిగిన జాతీయ మానవహక్కుల సమావేశంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులూ, కొన్ని సంస్థల ప్రతినిధులూ వాటిని చూసి ముగ్ధులయ్యారు. మహిళా ఖైదీల్లోని ప్రతిభను మెచ్చుకున్నారు. ఖైదీలకు ఉపాధి అవకాశాలను అందించడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని కొనియాడారు. ఈ కళను రాష్ట్రంలోని అన్ని జైళ్లలో ప్రదర్శించేలా చూస్తున్నా'మన్నారు జైలు అధికారి సుదర్శన్ మండల్.

అసలేంటీ సోహ్రాయి పెయింటింగ్...

నవంబరు, డిసెంబరు మాసాల్లో ఝార్ఖండ్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని గిరిజనులు సోహ్రాయి పండుగను జరుపుకొంటారు. ఆ సమయంలో స్థానిక జీవితాల్నీ, ప్రకృతినీ వర్ణిస్తూ అక్కడి గిరిజన మహిళలు ఈ పెయింటింగ్స్‌ను గోడలకు వేసేవారు. దీనికి ప్రత్యేకంగా బంకమట్టి, సహజ రంగులు ఉపయోగించి తయారుచేస్తారు. కాలక్రమేణా ఈ కళ మరుగున పడిపోవడంతో మళ్లీ ఇప్పుడు మహిళా ఖైదీలు దీన్ని నేర్చుకుంటున్నారు.



మిన్నెసోటా విశ్వవిద్యాలయ లా పాఠశాలలోనూ, బయోగ్రాఫికల్ స్పీకర్స్ సెమినార్‌లోనూ హషియా సోషియో లీగల్ సెంటర్ వ్యవస్థాపకురాలు అపూర్వ ఈ సంప్రదాయ కళల గురించి ప్రసంగించారు. ఆమె వివిధ దేశాల్లోని మహిళా నేరస్థురాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలూ, పునరావాస కేంద్రాలూ, గర్భిణుల హక్కులపై పోరాడుతుంటారు. రాంచీ కారాగారాల్లో జరిగే కార్యక్రమాలకు సంబంధించి ఒక ప్రెజంటేషన్ కూడా ఇచ్చారు. దాంతో ఈ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలోనూ ఆదరణ లభిస్తోంది.

- ఈటీవీ భారత్




బంగారం - వెండి

28న ముగింపు

	బంగారం (24క్యా.)	ఆర్నమెంట్ (22క్యా.)	వెండి (కిలో)
హైదరాబాద్	1,30,770	1,18,150	1,71,775
విజయవాడ	1,26,700	1,17,750	1,68,700
ప్రొద్దుటూరు	1,25,900	1,15,830	1,68,000
రాజమహేంద్రవరం	1,28,460	1,17,750	1,83,000
విశాఖపట్నం	1,27,990	1,17,750	1,70,000
తమిళనాడు	-----	1,18,400	1,83,000

సోగ కళ్ల సొగసు కోసం..!



కళ్లకి కాటుక... వింజామరలాంటి కనురెప్పలు... వంపులు తిరిగిన కనుబొమలు... ఇవేనా ఇంకెన్నో సొగసులు అద్దితేగానీ... కళ్ల మేకప్ పూర్తవదు. అందం సంపూర్ణమవదు. నిజానికి ముఖం అందం పెంచేది కళ్లే అని భావిస్తారు అమ్మాయిలు. కాబట్టే, ఎంత మేకప్‌కి దూరంగా ఉండేవారైనా కళ్ల సింగారాన్ని మాత్రం కాదనరు. దాన్ని సులువు చేసేవి ఇవి...





ఇదొక్కటి చాలు...



కాటుక కన్ను దాటొద్దు, మస్కారా కంటి చుట్టుపక్కల అంటొద్దు... ఐలైనర్ తీరుగా రావాలి. అప్పుడేగా అందమైన కళ్లు సాధ్యం. అలా కావాలంటే ఈ మల్టీఫంక్షనల్ ఐ మేకప్ టూల్ కావాల్సిందే! ఇది లిప్‌లైనర్, లిప్‌స్టిక్ నచ్చినట్లుగా తీర్చిదిద్దుకోవడానికీ సాయపడుతుంది. ఇంకా కంటైనర్‌లో చివరికి చేరిన క్రీమ్‌ని తీసుకోవడానికీ దీని కింది భాగం స్పూన్‌లా ఉపయోగపడుతుంది.

అతికించేయండి

కనుమూలల్లో వంపులు తిరుగుతూ సోగకళ్లను మరింత పెద్దవిగా చేస్తూ తీర్చిదిద్దే ఐలైనర్ అంటే ప్రతి అమ్మాయికీ ప్రేమే. సమస్యల్లా ఆ వంపు తిప్పడమే! ఈ క్రమంలో ఎన్నెన్నిసార్లు తుడిచి మళ్లీ వేయాలో! ఈ ఇబ్బంది అంతా వద్దు అనుకుంటే ఈ ఐలైనర్ స్టిక్కర్స్‌ని తెచ్చేసుకోండి. కావాల్సినప్పుడల్లా అతికించేసుకుని తిరిగి తీసేయడమే. వాటర్ ప్రూఫ్. తొలగించడమూ సులువే. ముఖ్యంగా తిరిగి వాడుకోవచ్చు. నలుపే కాదు... భిన్న రంగుల్లోనూ దొరుకుతున్నాయి.



నచ్చినట్టుగా సిద్ధమైపోవచ్చు

ఫిష్ టెయిల్, థిక్ వింగ్, ఆల్ రౌండ్ వింగ్, క్యాట్ వింగ్... ఐలైనర్ లుక్‌లూ బోలెడు. సంప్రదాయ వస్త్రాలు, పార్టీ, వేడుక ఒక్కోదాన్ని బట్టి దీన్నీ మారుస్తుంటారు అమ్మాయిలు. అప్పుడే ప్రత్యేకత. కానీ దాన్ని తీర్చిదిద్దడంలోనే సగం సమయం అయిపోతుంది. అది తగ్గాలంటే ఈ ఐలైనర్ ఐషాడో స్టెన్సిల్స్ తెచ్చుకోండి. నచ్చిన ఐలైనర్ వేశాక... దానికి తగ్గట్టుగా ఐషాడో ఏమేరకు వేయాలో తెలిపే స్టెన్సిల్స్ కూడా ఉంటాయి. వాటిని అనుసరిస్తూ వేసుకోండి. నిమిషాల్లో అందమైన కళ్లు సొంతం. ఇంకేం... వీటిలో మీకు అనువైనవేవో ఎంచుకుని తెచ్చేసుకోండి. వేడుకల్లో మెరిసిపోండి మరి!



కార్యక్రమానికి హాజరైన వివిధ బ్యాంకుల అధికారులు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు సమక్షంలో కాస్మోస్ ప్లానెటోరియం నిర్మాణానికి ఎంఓయూ మార్చుకున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ ప్రతినిధులు, అధికారులు

అమరావతి అభివృద్ధి అన్‌స్టాపబుల్



- 2028 నాటికి ఒక స్థాయికి తీసుకువస్తాం
- కేంద్ర సహకారంతో ఏపీ దేశానికే వెన్నెముక అవుతుంది
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు-అమరావతి: కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ వెంటిలేటర్‌పై నుంచి బయటపడిందని, ఇదే సహకారాన్ని కొనసాగిస్తే గట్టిగా నిలదొక్కుకుని దేశానికే వెన్నెముకగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రైతుల త్యాగం, కేంద్ర సాయం, పక్కా ప్రణాళికతో అమరావతి అన్‌స్టాప్‌బుల్‌గా అభివృద్ధి సాధిస్తుందన్నారు. 2027 మార్చి నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి అమరావతి రాజధాని నగరం ఒక స్థాయికి వస్తుందని చెప్పారు. పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుకు, రాయలసీమ హబ్‌కు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి సహకరించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. అమరావతి రైతులు మూలధన రాబడి పన్నుపై రాయితీని మరికొన్నాళ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. రాజధాని నగరంలో శుక్రవారం 15 ప్రభుత్వ రంగ బ్యాంకులు, మరో 2 బీమా కంపెనీల ప్రాంతీయ ప్రధాన కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ముఖ్యాంశాలివి..

రాజధానికి కేంద్రం భరోసా ఇచ్చింది

'అసాధ్యమనుకున్న అమరావతి నగర నిర్మాణాన్ని ప్రారంభించాం. తొలుత రైతుల త్యాగాలతో మొదలైంది. ఆ తర్వాత 5 ఏళ్ల విధ్వంసం. మళ్లీ ఇప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి రూ.15 వేల కోట్లు ఇచ్చారు. ఇది నిధులు ఇవ్వడమే కాదు అమరావతికి భరోసా ఇవ్వడం. అమరావతిలో ఒకేసారి 15 ప్రభుత్వ రంగ బ్యాంకులకు, 2 బీమా సంస్థలకు శంకుస్థాపన చేసుకున్నాం. ఇందుకు కూడా నిర్మలా సీతారామన్ సహకరించారు. రూ.1,334 కోట్లతో వీటి నిర్మాణం చేపడుతున్నారు. 6,576 మందికి ఉపాధి లభిస్తుంది. రికార్డు సమయంలో వీటిని పూర్తి చేయాలని బ్యాంకులను కోరుతున్నా. కేంద్రం తీసుకువస్తున్న ప్రతి సంస్కరణను అమలు చేస్తూ వాటి ద్వారా అభివృద్ధి జరిగేలా చూస్తున్నాం. రాజధానిలో రూ.56 వేల కోట్ల విలువైన 95 ప్రాజెక్టులు ప్రారంభించాం. త్వరలోనే సీడ్ యాక్సెస్ రోడ్డు పూర్తి అవుతుంది. రాజధానిని 7 జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తున్నాం. రైల్వే లైను వస్తోంది. ప్రపంచంలోని ఉత్తమ యూనివర్సిటీలన్నింటినీ తీసుకువస్తాం. క్వాంటం కంప్యూటర్ జనవరికే ప్రారంభిస్తాం. అమరావతి గ్రీన్, బ్లూ నగరంగా భారతదేశం గర్వపడే రాజధానిలా ఉంటుంది. గ్రీన్ ఎనర్జీ మాత్రమే ఇక్కడ వినియోగిస్తాం. ఇక్కడ నివసిస్తే 20-30 ఏళ్ల జీవితకాలం పెరిగేలా ఉంటుంది. ఏ కొత్త టెక్నాలజీ వచ్చినా అది అమరావతిలో ఉంటుంది. ఆధునిక ప్లానెటోరియం నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నాం. ప్రస్తుతం ఫైనాన్స్ స్ట్రీట్ నిర్మాణానికి అడుగులు వేశాం. క్వాంటమ్ కంప్యూటర్ సాయంతో బ్యాంకుల ఆర్థిక సేవలను ఊహించని స్థాయికి తీసుకుపోతాం. జీఎస్టీ 2.0ను తక్కువ సమయంలో అమలు చేసి నిర్మలా సీతారామన్ సత్తా చాటారు.

పోలవరం- నల్లమల సాగర్ మా సొంత ప్రాజెక్టు

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తున్నాం. పోలవరం నుంచి గోదావరి వరద జలాలను నల్లమల సాగర్‌కు తీసుకువెళ్తాం. గత 100 ఏళ్లుగా సగటు లెక్కలు చూస్తే ఏటా 2,800 టీఎంసీలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. ఇందులో 200 టీఎంసీలను నల్లమల సాగర్‌కు మళ్లిస్తే రాయలసీమ కరవు పోతుంది. మూడు సంవత్సరాల్లో దీన్ని పూర్తి చేసుకుంటే రాష్ట్రానికి వరంగా మారుతుంది. ఇది ఏ ఇతర రాష్ట్రానికి సంబంధం లేని మన అంతర్గత ప్రాజెక్టు. దీనికి కేంద్రం సహకరించాలని కోరుతున్నా. రాయలసీమలో ఉద్యాన హబ్‌కు కూడా కేంద్రం సహకరించాలి. పూర్వోదయ పథకం కింద ఉత్తరాంధ్ర వెనుకబడ్డ జిల్లాల అభివృద్ధికీ అండదండలు అందించాలి. అమరావతికి రైతులు భూములు త్యాగం చేశారు. గతంలో క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను లేకుండా రాయితీ ఇచ్చారు. ఐదేళ్ల విధ్వంసకర పాలన వల్ల ఆ రాయితీని రైతులు వినియోగించుకోలేకపోయారు. మరి కొన్నాళ్ల పాటు కేంద్రం ఆ రాయితీ ఇవ్వాల్సిన అవసరం ఉంది' అని సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు.

అమరావతి నుంచి రెండేళ్లలో బ్యాంకుల కార్యకలాపాలు

కేంద్ర ఆర్థిక సర్వీసుల విభాగం కార్యదర్శి నాగరాజు

ఈనాడు అమరావతి: 'అమరావతిలో 15 ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటు అనేది కేవలం భవనాల నిర్మాణాలు మాత్రమే కాదు.. భారత ఆర్థిక వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ వైపు మరింత విస్తరిస్తోందనడానికి ఇది సంకేతం. ఈ బ్యాంకుల ప్రధాన కార్యాలయాలన్నీ రెండేళ్లలో ఇక్కడ నిర్మాణాలు పూర్తి చేసుకుని కార్యకలాపాలు ప్రారంభిస్తాయి' అని కేంద్ర ఆర్థిక సర్వీసుల విభాగం కార్యదర్శి కె.నాగరాజు వెల్లడించారు. బ్యాంకు భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో శుక్రవారం ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. 'ఈ బ్యాంకులు పూర్తిగా పని చేయడం ప్రారంభించిన తర్వాత రాష్ట్రంలో బ్యాంకుల మధ్య సమన్వయం మెరుగుపడి రుణాల పంపిణీ మరింత బలపడుతుంది. ఆర్థిక నగరానికి ఇవి పునాది రాళ్లు. 5 బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు, 2 బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలు తమ ఉద్యోగుల నివాసానికి కాంప్లెక్సులు నిర్మిస్తున్నాయి' అని వివరించారు.

ఐసీయూలో ఉన్న రాష్ట్రానికి అండగా నిలిచారు

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: ఐసీయూలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు అనుభవం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతోనే బయటకు తీసుకురాగలిగామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బ్యాంకుల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈరోజు 15 ప్రధాన బ్యాంకుల ఛైర్మన్లను, ఉన్నతాధికారులను అమరావతికి తీసుకువచ్చి దేశ ఆర్థిక వ్యవస్థ ముంబయిలోనే కాదు అమరావతిలోనూ ఉందని నిరూపించారన్నారు. వారిని ముంబయిలో కలవాలంటే ఎంతో నిరీక్షించాల్సి ఉంటుందని, అలాంటి వారిని అమరావతికి తీసుకువచ్చారని చెప్పారు. ఇంట్లో అమ్మ ఎంత కఠినంగా ఉంటుందో ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సైతం అలాగే ఉంటారని, ఏది అవసరమో అదే ఇస్తారని మంత్రి చెప్పారు.

మూలధన పన్ను మినహాయింపును పొడిగించండి

నిర్మలా సీతారామన్‌కు రాజధాని రైతుల లేఖ

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధానికి భూములు ఇచ్చిన తమకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన మూలధనంపై పన్ను మినహాయింపును పొడిగించాలని రాజధాని రైతులు కోరుతున్నారు. ల్యాండ్ పూలింగ్ చట్టం ప్రకారం భూములు ఇచ్చిన రైతులకు సీఆర్డీఏ అభివృద్ధి చేసి తిరిగి ఇచ్చిన ప్లాట్లను అమ్ముకునే సమయంలో వచ్చే మూలధనంపై పన్ను భారం పడకుండా 2017లో కేంద్ర ప్రభుత్వం రెండేళ్లపాటు మినహాయింపు లభించింది. వైకాపా ప్రభుత్వం రైతుల ప్లాట్ల కేటాయింపులో ఆలస్యం చేయడం, అభివృద్ధి పనులు నిలిచి పోవడంతో ప్లాట్లు పొందని రైతులు మూలధన పన్ను మినహాయింపును వినియోగించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆ రాయితీని మరో 3 సంవత్సరాల పాటు కొనసాగించాలని అభ్యర్థిస్తూ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు శుక్రవారం రైతులు లేఖ అందించారు.

రాజధాని అభివృద్ధికి రూ.7,500 కోట్ల రుణం

సీఆర్డీఏ తీసుకునే అప్పుకు ప్రభుత్వ హామీ

రాజధాని అమరావతి అభివృద్ధి కోసం జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు నుంచి సీఆర్డీఏ తీసుకునే రూ.7,500 కోట్ల రుణానికి గ్యారంటీ, లెటర్ ఆఫ్ కంఫర్ట్ ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతించింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్యారంటీకి సంబంధించి ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. అసలు, వడ్డీ మొత్తాలపై గ్యారంటీ వర్తిస్తుంది. జీరో ఫోర్ క్లోజర్ ఛార్జీల నిబంధనలు రుణ ఒప్పందంలో చేర్పించాలి. వడ్డీ రేటు, కాల పరిమితి, మారిటోరియం తదితర వివరాలతో రీ పేమెంట్ షెడ్యూల్‌ను సమర్పించాలి. రుణాలు తిరిగి చెల్లింపుల్లో సీఆర్డీఏ విఫలమైన తర్వాతే ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ అమలులోకి వస్తుంది' అని ప్రభుత్వం పేర్కొంది.




స్థిరంగా ప్రయత్నించడమే సగం విజయం

మా యోగా టీచర్ రోజూ క్లాస్ మొదలుపెట్టేముందు ఒక మాట చెప్పేవారు. 'అభినందనలు.. మీరు ఇప్పటికే క్లిష్టమైన ప్రక్రియను పూర్తి చేశారు. అదేంటంటే.. మీరు డుమ్మా కొట్టకుండా తరగతికి హాజరు కావడమే' అనేవారు. ఆ మాట అక్షరాలా నిజం. బద్ధకాన్ని వదిలిపెట్టి, సాకులను పక్కనపెట్టి మీ ప్రయత్నాలను స్థిరంగా చేసుకుంటూ పోవడం అత్యంత కీలకం. అప్పుడు మీ లక్ష్యాన్ని తప్పక సాధిస్తారు.

– స్టెఫ్ స్మిత్, పాడ్‌కాస్టర్

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు బలమైన మద్దతు



వివిధ బ్యాంకుల ఛైర్మన్లతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు. చిత్రంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, సీఎస్ విజయానంద్, కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు, మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమని పేర్కొంటూ ఆ హబ్‌కు అవసరమైన ఇన్‌ఫ్రా సమకూర్చేందుకు బ్యాంకులు తోడ్పాటు ఇవ్వాలన్నారు. కొత్త అమరావతి అంటే రైతుల త్యాగం గుర్తుకు రావాలని, ఆ రైతులకు బ్యాంకర్లు అన్నిరకాల అండదండలు ఇవ్వాలని కోరారు. రాజధానిలో 15 ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రాంతీయ ప్రధాన కార్యాలయాలకు, రెండు బీమా కంపెనీల ప్రాంతీయ ప్రధాన కార్యాలయాల ఏర్పాటుకు శుక్రవారం ఒకేసారి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులతో కలిసి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేశారు. రాజధానిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్లానెటోరియం నిర్మాణానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ సంస్థ- సీఆర్డీఏలు ఇదే వేదికపై ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ఆమె ఏం చెప్పారంటే..

'అమరావతి రాజధాని పునర్ నిర్మాణం మహా యజ్ఞం. ప్రధాని మోదీ సహకరిస్తున్నారు. సమగ్ర ప్రణాళికతో అద్భుత నగరంగా ఇది రూపొందుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో ఆర్థిక జిల్లా ఏర్పాటు చేశారు. అది ఇప్పుడు చక్కని ఫలితాలిస్తోంది. మళ్లీ అలాంటిది నిర్మించే బాధ్యత చంద్రబాబు భుజస్కంధాలపై పడింది. అమరావతిలో ఫైనాన్షియల్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో ఎక్కడా ఆర్థిక సంస్థలన్నీ ఒకేచోట ఉన్న దాఖలా లేదు. అమరావతి ఇందులో ముందడుగు వేస్తోంది' అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

బ్యాంకులు, బీమా సంస్థల ప్రయోజనాలు ఏపీకి అందాలి

'హరియాణాలో ప్రధాని మోదీ నాడు బీమా సఖి కార్యక్రమం ప్రారంభించారు. ఎల్ఐసీ మహిళా ఏజెంట్లను నియమించి బీమాను విస్తరించగలిగాం. వారికి ఉపాధి దక్కింది. కార్యక్రమం ప్రారంభించిన రోజే 3 లక్షల మంది మహిళలు బీమా సఖిగా చేరారు. ఏడాదిలో అద్భుత ఫలితాలు కనిపించాయి. మూడేళ్ల వారి పని తీరు చూసి ఎల్ఐసీ వారిని పర్మినెంట్ ఏజెంట్లుగా నియమిస్తోంది. అమరావతికి 15 బ్యాంకులు, 2 బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలు రావడం వల్ల తక్షణ ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. వాటిని పూర్తిగా ఈ రాష్ట్రానికి, అమరావతికి అందించి ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకువెళ్లడం ముఖ్యం' అని ఆమె వివరించారు.

ఫ్యూచర్ సైన్స్ క్యాపిటల్‌గా మారాలి..

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్‌లో ముందుకు వెళ్తున్నాం. ఇతర సైన్సుల సంగతి ఏమిటి అని మంత్రి లోకేశ్ అడిగారు. నిజానికి భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం వంటి వాటిలో పూర్వకాలంలో ఆంధ్రప్రదేశ్ ఘనత అంతా, ఇంతా కాదు. ఇప్పుడు ఏపీ ఐటీలో, ఏఐలో ప్రతిభ కనబరుస్తోంది. దీంతో పాటు భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం వంటి వాటిలోనూ పాత ఘనత తిరిగి రావాలి. దేశంలో కొన్ని పదార్థాలు లేక చైనా నుంచి తెచ్చుకోవలసి వస్తోంది. కానీ వాటిని సైన్సు సాయంతో తయారు చేయవచ్చు. టిబెట్ బౌద్ధ క్షేత్రాలు చూడటానికి వెళ్లినప్పుడు ఏపీకి చెందిన ఆచార్య నాగార్జునుడికి రసాయన శాస్త్రంలో ఎంత నైపుణ్యం ఉందో విన్నాను. టిబెట్ అంతటా ఆయన పేరే వినిపిస్తోంది. అదీ సైన్సులో ఆంధ్రప్రదేశ్ ఘనత. మళ్లీ ఆ స్థాయికి రాష్ట్రం వెళ్లాలి' అని ఆకాంక్షించారు.



ప్రసంగిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

అమరావతికి అద్భుత ప్లానెటోరియం వస్తోంది..

'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్‌తో ఏపీ ఇప్పుడు ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రికి ఈ విషయం చెప్పిన వెంటనే భూమి ఇచ్చి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం వల్ల ఏపీకి అద్భుత ప్లానెటోరియం వస్తోంది. మైసూర్‌లో నా ఎంపీ ల్యాడ్స్‌తో ఇలాంటిదే ఏర్పాటు చేస్తున్నాం. లద్దాఖ్‌కు ఎంతో దూరంలో హ్యాండ్లే అని ఒక ప్రాంతం ఉంటుంది. అక్కడ రాత్రి నక్షత్రాలను, పాలపుంతను నేరుగా చూడవచ్చు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏపీ) అక్కడ ఒక ఇన్‌స్టిట్యూట్ పెట్టింది. అక్కడ మనం చూడగలిగే ఆకాశాన్ని మైసూర్‌లో ప్లానెటోరియంలో, అమరావతిలో సిద్ధమవుతున్న ప్లానెటోరియంలలో రియల్ టైంలో నేరుగా చూడగలం. అంటే హ్యాండ్లే వెళ్లనవసరం లేకుండానే ఆ సౌకర్యం మనకు అమరావతిలోనే అందుబాటులోకి వస్తుంది. దేశంలో వివిధ చోట్ల ఉన్న ప్లానెటోరియంలలో కేవలం రికార్డు చేసిన నక్షత్రాలను మాత్రమే చూపిస్తారు. మైసూర్, అమరావతి ప్లానెటోరియంలలో హ్యాండ్లే, కొడైకెనాల్ ఆకాశాలను, స్పష్టమైన నక్షత్రాలను నేరుగా చూడొచ్చు' అని నిర్మలా సీతారామన్ చెప్పారు.

రైతులకు ఏదో రూ.లక్ష రుణం ఇస్తే చాలదు

'బ్యాంకులు రైతులకు ఏదో రూ.లక్ష రుణం ఇస్తే సరిపోదు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ ఉద్యాన హబ్ ప్రణాళిక రూపొందించారు. ఇలాంటి ఆలోచనలు, ప్రణాళికలు దేశానికి అవసరం. దేశంలో 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చాం. మధ్య తరగతి పిల్లలకు పోషకాహారం ఇవ్వాలని కేంద్రం భావిస్తోంది. ఇందుకు పప్పులు, కూరగాయలు, పండ్లు అవసరం. సీఎం ఈ అవసరాన్ని గుర్తించి రాయలసీమలోని 9 జిల్లాల్లో కూరగాయలు, పండ్లు పండించి ఎగుమతి చేస్తామంటున్నారు. ఎక్కడ మార్కెట్ ఉంటే అక్కడికి రవాణా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తేనే రైతులకు తక్షణ ప్రయోజనాలు అందుతాయి. రాయలసీమ హబ్‌కు అవసరమైన ఇన్‌ఫ్రా ఏర్పాటుకు బ్యాంకులు సాయం చేయాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాకేజి యూనిట్లు, రవాణా వ్యవస్థ, కోల్డ్ స్టోరేజి యూనిట్ల ఏర్పాటుకు, ఉత్తమ విత్తనాల సరఫరాకు బ్యాంకులు తోడ్పాటు అందించాలి. ఈ హబ్ ప్రభావం కేవలం సీమ జిల్లాలకే పరిమితం కాదు. రాష్ట్రం యావత్తూ ఉంటుంది. తమిళనాడు నుంచి కొబ్బరి, మహారాష్ట్ర నుంచి అరటి ముంబయి, దిల్లీ వంటి నగరాలకు రవాణా చేసేందుకు కేంద్రం వారానికి 2, 3 సార్లు ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. అలా రాయలసీమ నుంచీ పంపాలి' అని నిర్మలా సీతారామన్ సూచించారు.

అమరావతికి ఇదో ఆర్థికశక్తి

- ఇలా బ్యాంకులన్నీ ఒకేచోట కొలువుదీరడం అరుదు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ఈనాడు, అమరావతి: ఆర్థిక సంస్థల కార్యాలయాలన్నీ రాజధానిలో ఒకేచోట కొలువుదీరడం అమరావతికి ఆర్థికశక్తినిచ్చే ప్రక్రియ అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివర్ణించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వస్తున్న ఆర్థిక సాయం కాగితాల లెక్కల్లో కరిగిపోనివ్వకుండా అభివృద్ధి ప్రతి ఒక్కరికీ కనబడేలా ఎన్డీయే ప్రభుత్వం జవాబుదారీతనంతో పని చేస్తుందన్నారు. రాష్ట్రం పురోగతికి వేస్తున్న ప్రతి అడుగులో, రాజధాని నిర్మాణానికి కేంద్రం అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదని అన్నారు. అమరావతిలో శుక్రవారం 15 బ్యాంకుల ప్రాంతీయ కార్యాలయాలకు శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

'ప్రధాన బ్యాంకుల కార్యాలయాలు, ఆర్థిక సంస్థలు ఒకే చోట కొలువుదీరడం అరుదైన విషయం. ఆర్థిక కార్యకలాపాలు, వ్యాపార లావాదేవీలు వేగం పుంజుకుంటాయి. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరుగుతుంది. ఆ విశ్వాసం అమరావతిని ఆర్థిక కేంద్రంగా నిలబెడుతుంది. మాటకు కట్టుబడి 34,915 ఎకరాల భూములు రాష్ట్ర భవిష్యత్తుకు ఇచ్చిన రైతుల నమ్మకమే అమరావతి నగరానికి పునాది. కేవలం భవనాలకే కాదు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు పడిన పునాది ఇది. అమరావతి ఒక ఆర్థిక కేంద్రం, విద్యా కేంద్రం, పరిశోధన కేంద్రం, మంచి పరిపాలనా కేంద్రంగా ఎదగడానికి ఈ పునాది ఎంతో బలాన్ని చేకూరుస్తుంది.

కేంద్రం సహకారం ఎంతో

కేంద్రం అండతో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోంది. ఎన్నో ప్రాజెక్టులకు అండగా నిలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ విశాఖలో జరిగిన కార్యక్రమంలో రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటి వల్ల 7.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. కేంద్రం అండతోనే అమరావతి పునర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కర్నూలు జీఎస్టీ కార్యక్రమంలో ప్రధాని రూ.13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు రూ.11,000 కోట్లు, పోలవరానికి రూ.12,500 కోట్లు, అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15,000 కోట్లు ఆర్థిక సాయం కేంద్రం సమకూర్చింది' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

అమరావతి రైతుల సమస్యలు పరిష్కరించే బాధ్యత మాదే

జెట్ స్పీడ్‌తో రాజధాని పనులు • ఐటీ మంత్రి లోకేశ్



ఈనాడు-అమరావతి: 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి రాజధాని పనులు జెట్ స్పీడ్‌తో జరుగుతున్నాయి. ఐదేళ్లపాటు నష్టపోయాం. ఇప్పుడు మనమంతా కలిసి ముందుకు వెళ్లాలి. ఇంత ప్రాజెక్టు కడుతున్నప్పుడు చిన్న చిన్న సమస్యలుంటాయి. అమరావతి రైతులకు ఏ సమస్యలున్నా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే శ్రావణ్, కేంద్రమంత్రి చంద్రశేఖర్, రాష్ట్రమంత్రి నారాయణ ఉన్నారు. రైతుల అన్ని సమస్యలను పరిష్కరించే బాధ్యత మేం తీసుకుంటున్నాం' అని ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ప్రకటించారు. బ్యాంకుల శంకుస్థాపన కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 'ప్రధాని శంకుస్థాపన చేసిన ఈ అమరావతిని విధ్వంసం చేయాలని కొందరు చూశారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలు చేసి ఒక్క ఇటుక కూడా వేయలేదు. కానీ ఒక వ్యక్తి నివసించేందుకు రూ.700 కోట్లు పెట్టి ప్యాలస్ కట్టుకున్నారు. ఆ కుట్రలన్నీ ఛేదించి, అమరావతిని పునఃనిర్మిస్తున్నాం' అని తెలిపారు. 'నాడు జై అమరావతి అన్నందుకు రైతులపై కేసులు పెట్టారు. 1,630 రోజులు అమరావతి ఉద్యమం నడిచింది. 270 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. 3,000 మందిపై కేసులు పెట్టారు. పోలీసులు మహిళలను బూటు కాళ్లతో తన్నారు. ఇలాంటివి అన్నీ తట్టుకుని నిలబడ్డాం. మళ్లీ మన ప్రజాప్రభుత్వం ఏర్పడింది. అమరావతి పునర్నిర్మాణం జరుగుతోంది' అని లోకేశ్ అన్నారు. కేంద్రం అండదండలతోనే అన్ని పనులు చేసుకుంటున్నామని చెప్పారు.



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆత్మీయ ఆలింగనం

గోదావరి పుష్కరాలకు 5 కోట్ల మంది భక్తులు!

దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఈనాడు, అమరావతి: 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు 5 కోట్ల మంది భక్తులు హాజరై, పుష్కర స్నానాలు ఆచరించే అవకాశం ఉందని, అందుకు తగినట్లు ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. పుష్కరాల కోసం రూపొందించాల్సిన ప్రణాళికలపై శుక్రవారం సచివాలయంలో దేవాదాయశాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. గోదావరి పుష్కరాలు-2027 పేరిట అధికారిక లోగో డిజైన్ చేయాలన్నారు. ఘాట్ల వద్ద మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు చేయడం, దుస్తులు మార్చుకునేందుకు గదులు నిర్మించడం, తాగునీటి సదుపాయం కల్పించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు ఆయా శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గోదావరికి హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం, నదికి సమీపంలోని ఆలయాల అభివృద్ధి వంటివి దేవాదాయ శాఖ తరఫున చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో దేవాదాయశాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్రమోహన్, సీఈ శేఖర్, స్థపతి పరమేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణి అనధికార పీఏ సతీష్ తొలగింపు

అతడిపై కేసు నమోదు చేయాలని ఆదేశించిన సీఎంవో


ఈనాడు-అమరావతి: గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అనధికార పీఏ సతీష్ ఓ మహిళను వేధించారనే ఆరోపణలు రావడంతో అతడిని తక్షణమే ఆ విధుల్లోంచి తొలగించాలని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఆదేశించింది. ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ బాధ్యతల్లో కొనసాగేందుకు వీల్లేదని పేర్కొంది. అలాగే అతనిపై కేసు నమోదు చేయాలని కూడా ఆదేశించింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన ఓ మహిళ.. సతీష్ తనను వేధిస్తున్నారని ఆరోపించడంతో సీఎంవో తీవ్రంగా స్పందించింది. మరోవైపు, ఆ మహిళ ఆరోపణలు ఎంతవరకు వాస్తవమనేది కూడా విచారణ జరపాలని, వాటిలో వాస్తవం లేకపోతే ఆమెపైనా చర్యలు తీసుకోవాలని సీఎంవో ఆదేశించింది.

దొమ్మర సామాజికవర్గం పేరు దొర వంశంగా మార్పు

ఈనాడు, అమరావతి: దొమ్మర సామాజిక వర్గం పేరును దొర వంశంగా ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు 1973లో విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాల్లో సవరణ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది.

దిండ్లు.. దుప్పట్లు... ఉతక్కపోతే ఇక్కట్లు!

రోహిత్ బ్యాచిలర్. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ముఖంతో పాటు శరీర భాగాలపై మొటిమల సమస్యతో బాధపడుతున్నారు. చర్మ వైద్యుడ్ని సంప్రదించగా నెలలుగా బెడ్‌షీట్, దుప్పటి, పిల్లో కవర్ ఉతకకుండా వాడటం దీనికి కారణమని తేల్చారు.





మరచిపోవడం, పట్టించుకోకపోవడం, వేరేవి లేకపోవడం.. ఇలా రకరకాల కారణాలతో పరుపు, దుప్పటి, బొంత, తలగడ, కవర్ల శుభ్రత విషయంలో చాలామంది అశ్రద్ధగా ఉంటారు. నెలల పాటు మార్చకుండా వాటిపైనే పడుకుంటారు. దీనివల్ల దుమ్ము-ధూళి, చెమట, లాలాజలం, చర్మం మృతకణాలు, నూనెలు, చుండ్రు పేరుకుపోతాయి. దీంతో వీటి నుంచి దుర్వాసన వస్తుంది. ఇది సూక్ష్మ జీవులు, క్రిమికీటకాలు పెరగడానికి కారణమవుతుంది. కొందరు ఏళ్ల పాటు ఒకే తలగడను కనీసం...పిల్లో కవర్ కూడా లేకుండా వాడుతుంటారు. ఇలా చేస్తే పలు చర్మ సంబంధ రుగ్మతలు, అలర్జీలు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యలు, కొన్ని లైంగిక వ్యాధులు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిద్ర లేమికి ఇది కారణమవుతుందని హెచ్చరిస్తున్నారు.

పరిశోధనలు ఏం చెబుతున్నాయి...

- దీర్ఘకాలంలో దిండుపై దుమ్ము, ఇతర అలర్జీ కారకాలు పేరుకుని బ్యాక్టీరియా వృద్ధికి దారి తీస్తాయని 'సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్' పేర్కొంది. చిన్నపిల్లలు, వృద్ధులు ఆస్తమా బారినపడటానికి ఇదీ ఓ కారణమని తెలిపింది.
- మనం ఉపయోగించే పరుపులో పది మిలియన్ల బ్యాక్టీరియా ఉంటుంది. పరుపు జీవిత కాలంలో ఒక కిలో కంటే ఎక్కువ మృత చర్మకణాలు పేరుకుపోతాయి.
- ఓ స్వచ్ఛంద సంస్థ జరిపిన అధ్యయనంలో టాయిలెట్ సీటు మీద కంటే పడక గదిలోని బెడ్ షీట్లు, దిండు కవర్లపైనే ఎక్కువ బ్యాక్టీరియా పేరుకుపోయినట్టు వెల్లడైంది.
- ఎక్కువ కాలం ఒకే తలగడను వాడటం వల్ల దాని ఆకృతి దెబ్బతిని మెడ, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి.
- పిల్లో కవర్లపై గ్రామ్-పాజిటివ్ రాడ్‌లు, గ్రామ్-నెగటివ్ రాడ్‌లు, బాసిల్లి, గ్రామ్-పాజిటివ్ కోకి వంటి బ్యాక్టీరియా ఉన్నట్టు గుర్తించారు. వీటి వల్ల మొటిమలు, దద్దుర్లు, తామర, దురద వంటి ఇన్‌ఫెక్షన్లు వస్తాయి.

వారానికి ఒకసారైనా ఉతకాలి...



- బెడ్‌షీట్లు, దిండు కవర్లను వారానికి ఒకసారైనా ఉతకాలి. వాటిని తరచూ ఎండలో ఉంచాలి
- కొన్ని రకాల చర్మ వ్యాధులు, అనారోగ్యాలతో బాధపడే వారు క్రమం తప్పకుండా బెడ్‌షీట్లు, పిల్లో కవర్లను మారుస్తూ ఉండాలి. అందరూ వాడుకునేవి కాకుండా వారి కోసం ప్రత్యేకంగా కేటాయించడం మంచిది
- అలర్జీలు ఉన్నవారు యాంటీ అలర్జీ బెడ్‌షీట్లు, దిండు కవర్లు వాడితే మంచిది
- కొంతమంది తమ పెంపుడు జంతువులను కూడా బెడ్ పైకి తీసుకురావడం, వారి పక్కనే పడుకోబెట్టుకోవడం చేస్తుంటారు. దీంతో వాటి వెంట్రుకలు, చర్మం మీద ఉండే బ్యాక్టీరియా, ఇతర క్రిములు బెడ్‌షీట్‌పై చేరే ప్రమాదం ఉంది. సాధ్యమైనంత వరకు వాటిని పడకకు దూరంగా ఉంచాలి. ఒకవేళ తీసుకొచ్చినా రెండు రోజులకోసారి మార్చాలి.



ఎలా ఉతకాలి..

- దుప్పట్లను శుభ్రం చేసే క్రమంలో వేడినీళ్లను ఉపయోగిస్తే మంచిది. ఇలా చేయడం వల్ల వాటిపై ఉండే క్రిములు, బ్యాక్టీరియా నశించడంతో పాటు మురికి త్వరగా పోతుంది. ఈ సమయంలో బెడ్‌షీట్ నాణ్యతను పరిగణనలోకి తీసుకోవాలి.
- తక్కువ నాణ్యత ఉన్న బెడ్‌షీట్లను మరీ ఎక్కువ వేడి చేసిన నీళ్లలో నానబెడితే పాడయ్యే అవకాశం ఉంది. అలాంటి వాటిని గోరువెచ్చని నీటిలో డిటర్జెంట్ పౌడర్ వేసి కాసేపు నానబెట్టి ఉతకాలి.
- త్వరగా మురికి పోవాలని, సువాసన రావాలని కొంత మంది ఎక్కువగా డిటర్జెంట్ పౌడర్ వాడుతుంటారు. తగిన మోతాదులోనే దీన్ని ఉపయోగించాలి.
- ఉతికిన వాటిని ఎండలో ఆరేయాలి. వర్షాకాలం, ఎండ లేనప్పుడు డ్రయర్ వాడడం మంచిది. అవి సరిగా ఆరకపోతే వాటి తడిదనం వల్ల బ్యాక్టీరియా, ఫంగస్ వృద్ధి చెందే ప్రమాదం ఉంది. ఇవి కూడా చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులకు దారి తీస్తుంది.

ఈ జాగ్రత్తలు కూడా...

- బయటి నుంచి వచ్చాక దుమ్ము-ధూళి చేరిన కాళ్లతోనే బెడ్‌పైకి ఎక్కడం మానుకోవాలి. శుభ్రంగా స్నానం చేయడం, చేతులు-కాళ్లు కడుక్కొని డ్రస్ మార్చుకున్న తర్వాతే బెడ్‌పై కూర్చోవడం ఉత్తమం
- కొందరు బెడ్‌పై ఆహారం, స్నాక్స్...తినడం, కంచం కింద దిండు పెట్టుకునే అలవాటుంటుంది. దీంతో వాటిపై ఆహార అవశేషాలు పడతాయి. ఇలా చేయకుండా ఉండడమే మంచిది.

పడుకున్న వెంటనే నిద్రపట్టేంత శుభ్రంగా ఉండాలి....

– దీక్ష, డెర్మటాలజిస్టు, విజయవాడ

ఆరోగ్యానికి నిద్రతో పాటు...పడకగది పరిశుభ్రతా ముఖ్యమే. పడుకుంటే నిద్రపట్టేంత శుభ్రంగా బెడ్‌షీట్లు, దిండ్లు ఉండాలి. చర్మంపై దద్దుర్లు, అలర్జీలకు ఇవి మురికిగా ఉండడమే కారణం

- ఈనాడు, అమరావతి

ఉత్తరాఖండ్‌లో.. అరుదైన హాఫించ్ పక్షి



యూరప్, తూర్పు ఆసియా, ఉత్తర అమెరికా ప్రాంతాల్లో ఎక్కువగా తిరుగాడే హాఫించ్ పక్షి తొలిసారిగా ఉత్తరాఖండ్‌లోని ప్రఖ్యాత కార్బెట్ పులుల అభయారణ్యంలో కనిపించింది. అతి శీతల ప్రాంతాల్లో గుంపులుగా కలిసి నివసించే ఈ వలస పక్షి బహుశా మంద నుంచి తప్పిపోయి ఇటు వచ్చి ఉండవచ్చని అటవీ అధికారులు భావిస్తున్నారు. దేశంలోని జాతీయ పార్కుల్లో ఈ పక్షి ఉనికిని గుర్తించడమూ ఇదే తొలిసారి. నైనీతాల్ జిల్లాలోని రామ్‌నగర్‌కు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ ప్రశాంత్‌కుమార్ జంగిల్ సఫారీ సందర్భంగా నవంబరు 23న ఈ పక్షిని తన కెమెరాలో బంధించారు. హాఫించ్ పొడవు 18 సెంటీమీటర్లు కాగా, 29 నుంచి 33 సెం.మీ.ల వరకు రెక్కలను విస్తరిస్తుంది. గట్టి విత్తనాలు, బెర్రీలు తింటుంది. –ఈటీవీ భారత్

కంది.. చెట్టులా ఎదిగింది



ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కమ్మరిగూడెంలోని వాసు అనే రైతు ఇంటి ఆవరణలో కంది మొక్క ఏకంగా 15 అడుగులకు పైగా పెరిగింది. రెండేళ్ల కిందట మొలిచిన ఈ మొక్క గుబురుగా.. చెట్టుగా పెరిగి గుత్తులుగా కాయలు కాస్తోంది. సాధారణంగా పంట పొలాల్లోని మొక్కలు 6-7 అడుగుల వరకే పెరుగుతాయని, ఇంటి ఆవరణలోని మొక్కకు అధిక నీరు, పోషకాలు అందడం వల్ల ఇలా భారీగా పెరిగిందని వ్యవసాయాధికారి సమీరజా తెలిపారు.

–న్యూస్‌టుడే, వేలేరుపాడు

మీ స్నేహితుల్లో ఇలాంటివారున్నారా?



- మీ అభిప్రాయాలను, అవసరాలను గుర్తించనివారు.
- మీరు చేసే ప్రతి పనినీ తప్పుపడుతూ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేవారు.
- మీ విజయాలను చూసి అసూయ చెందేవారు.
- మీ హద్దులను చెరిపేసి వ్యక్తిగత విషయాల్లోకి చొరబడేవారు.
- మిమ్మల్ని మోసం చేసైనా సరే, తాము కోరుకున్నదాన్ని సాధించుకోవాలనుకొనేవారు.
- తమను తాము బాధితులుగా చిత్రీకరించుకుంటూ, మీ మీద నిందలు వేసేవారు..

ఇలాంటి వారితో స్నేహం చేయకండి.

– ఎమ్మా కొలిన్స్, బ్రాండింగ్ స్ట్రాటజిస్ట్

త్రీ ఇన్ వన్ సైకిల్ మేడిన్ బల్మూరు



సాధారణ సైకిల్‌ను సౌరవిద్యుత్తు, విద్యుత్తు సహాయంతో నడిచేలా తయారు చేసి యంగ్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపికయ్యాడు నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన విద్యార్థి గగన్‌చంద్ర. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈనెల 18 నుంచి 23 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 250, తెలంగాణ నుంచి 9 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇందులో హైబ్రీడ్ త్రీ ఇన్ వన్ సైకిల్‌ను రూపొందించిన బల్మూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న గగన్ చంద్రను జాతీయస్థాయి యంగ్ సైంటిస్ట్ అవార్డు వరించింది. కాలుష్యం లేకుండా మూడు రకాలుగా ఉపయోగించే ఈ సైకిల్ తయారీకి రూ.15 వేలు ఖర్చు చేశారు. సాధారణ సైకిలుకు మోటారుతో పాటు సౌరపలకను అమర్చారు. తద్వారా సౌర విద్యుత్తు మరోవైపు విద్యుత్తు ఛార్జింగ్ సహాయంతో ద్విచక్ర వాహనంలా ఉపయోగించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడు సీతారాం ఆధ్వర్యంలో దీన్ని తయారు చేశారు. గంటపాటు విద్యుత్తు ఛార్జింగ్ పెడితే 40 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది.

–న్యూస్‌టుడే, అచ్చంపేట

క్యారెట్ కాదు.. బొప్పాయి



కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామంలో నల్లి చంద్రరావు ఇంటి ఆవరణలో ఉన్న బొప్పాయి చెట్టుకు కాసిన కాయ క్యారెట్ ఆకారంలో ఆకట్టుకుంది. సాధారణంగా బొప్పాయి కాయలు గుండ్రంగా, పొడవుగా పెరుగుతాయి. ఈ కాయ మాత్రం ఐదు అంగుళాల పొడవు ఎదిగి మగ్గిపోయింది. బొప్పాయిలో జన్యుపరమైన లోపాల వల్ల ఇలా కాస్తాయని ఉద్యాన అధికారి రాజశేఖర్ తెలిపారు.

– న్యూస్‌టుడే, కొత్తపల్లి

బస్సుల్లోనూ బాత్‌రూంలు!

దూర ప్రయాణాలకు అందరూ రైళ్లల్లో వెళ్లడానికే మొగ్గు చూపుతుంటారు. ఎందుకంటే మరుగుదొడ్లు అందుబాటులో ఉండటం. బస్సు ప్రయాణంలో అయితే కనీసం మూత్రవిసర్జనకు వెళ్లాలన్నా డ్రైవరు దగ్గరికి వెళ్లి బస్సు ఆపమని అడగడానికి ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారి కోసం ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థ అయిన ఇంటర్‌సిటీ తమ బస్సుల్లో బాత్‌రూం సదుపాయం కల్పించింది. డ్రైవర్ సీటు వెనుకభాగంలో వెస్టర్న్ కమోడ్, ముఖం కడుక్కోవడానికి వాష్‌బేసిన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి మూత్రవిసర్జనకు మాత్రమే అనుమతిస్తున్నారు.

– ఈనాడు, అమరావతి





జనవరి 1న ఆయుధాలు వదిలేద్దాం

మావోయిస్టు పార్టీ ఎంఎంసీ-ఎస్‌జడ్‌సీ ప్రతినిధి అనంత్ ప్రతిపాదన

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ నుంచి మరో కీలక ప్రకటన వెలువడింది. సాయుధ పోరాటాన్ని కొనసాగించేందుకు ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా లేవని, అందుకే వచ్చే ఏడాది జనవరి 1న ఆయుధాలు వదిలేద్దామని మావోయిస్టు పార్టీ మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ స్పెషల్ జోనల్ కమిటీ(ఎంఎంసీ-ఎస్‌జడ్‌సీ) ప్రతినిధి అనంత్ శుక్రవారం కోరారు. గతంలో సాయుధ పోరాటం తమ ఉద్యమానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని, నేడు అవే ఆయుధాలు తమని ప్రజల దగ్గరికి వెళ్లనీయడం లేదని పేర్కొన్నారు. ఇప్పుడు సంస్థను కాపాడుకోవడమే ముఖ్యమని స్పష్టం చేశారు. అనంత్ పేరిట ప్రకటనతోపాటు 12.36 నిమిషాల నిడివితో ఆడియో సందేశం కూడా విడుదలైంది. 'మనం పోరాటం ఆపడం లేదు. ఆయుధాలతో కాకుండా ప్రజల సమస్యలను మరో విధంగా ముందుకు తీసుకెళ్దాం. మనం ఇప్పటికే ఎంతో మంది సహచరుల్ని కోల్పోయాం. ఇక ఎవరినీ కోల్పోవాలని కోరుకోవడం లేదు.పార్టీ సభ్యులు ఇప్పుడు ఎక్కడున్నా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలనే నిర్ణయానికి వెంటనే రావాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో చర్చలకు, వాదోపవాదాలకు మన దగ్గర సమయం లేదు. ముందుగా మనమంతా బతికి ఉండాలి. సంప్రదింపులకు నేను బౌఫెంగ్ ఓపెన్ ఫ్రీక్వెన్సీ 435.715 విడుదల చేస్తున్నాను. ఇప్పటి నుంచి 2026 జనవరి 1 వరకు రోజూ ఉదయం 11 నుంచి 11.15 గంటల వరకు అక్కడ సమావేశమవ్వొచ్చు. సంప్రదింపుల అనంతరం జనవరి 1న ఆయుధాల్ని వదిలేందుకు సిద్ధం కావాలి' అని అనంత్ విజ్ఞప్తి చేశారు.

ములకలచెరువు కేసులో జనార్దన్‌రావుకు రిమాండ్

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, ములకలచెరువు: ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో కింగ్‌పిన్‌గా వ్యవహరించిన ఏ1 అద్దెపల్లి జనార్దన్‌రావు సహా నలుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టుకు శుక్రవారం తీసుకొచ్చారు.గత నెల 10న ఇబ్రహీంపట్నం కేసుకు సంబంధించి జనార్దన్‌రావును గన్నవరం ఎయిర్‌పోర్టులో ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులోనూ ఆయన నిందితుడిగా ఉండటంతో ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారంట్ దాఖలు చేశారు. శుక్రవారం రాత్రి జనార్దన్‌రావుతో పాటు తిరుమలశెట్టి శ్రీనివాస్‌రావు, రమేష్‌బాబు, అల్లాబక్ష్‌లను తంబళ్లపల్లె కోర్టు జడ్జి ఉమర్‌ఫరూక్ ముందు హాజరుపరిచారు. జడ్జి నిందితులకు 15 రోజుల రిమాండ్ విధించారు.



జనార్దన్‌రావుతో పాటు నిందితులను తంబళ్లపల్లె కోర్టుకు తీసుకెళ్తున్న ఎక్సైజ్ పోలీసులు





సభకు హాజరైన ప్రజలు ★ భగవద్గీత శ్లోకాలను పఠిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో లోక్‌సభ సభ్యుడు బీవై రాఘవేంద్ర, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, గవర్నర్ గహ్లోత్, మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ

దేశ ప్రగతికి గీతాసారం మూలం

- విధానాల రూపకల్పనకు శ్రీకృష్ణుడి బోధనలే స్ఫూర్తి
- ఉడుపి సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- శ్రీకృష్ణ మఠం సందర్శన
- ప్రజల కోసం 9 తీర్మానాల ప్రకటన

ఈనాడు, బెంగళూరు: భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు చెప్పిన బోధనలు వ్యక్తి జీవన విధానానికే కాదు.. దేశ విధానాల రూపకల్పనకూ మార్గదర్శకాలు అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కర్ణాటకలోని ఉడుపి శ్రీకృష్ణ మఠాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, లక్ష కంఠ గీతా పారాయణంలో పాల్గొన్నారు. మఠంలో కనకన కిండి (కిటికీ) ద్వారా శ్రీకృష్ణ దర్శనం చేసుకున్న ఆయన ఆ కిటికీలకు స్వర్ణ కవచాలు, సువర్ణ తీర్థ మంటపాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై మాట్లాడారు. "దేశాభివృద్ధి, రక్షణ వ్యవస్థ, జాతి నిర్మాణం కోసం తయారు చేసే విధానాలకు గీతాసారం మార్గదర్శిగా ఉపయోగపడుతోంది. కలియుగంలో భగవంతుడి నామస్మరణతోనే ప్రాపంచిక జీవితం నుంచి విముక్తి లభిస్తుంది. ఎన్ని శతాబ్దాలు గడిచినా.. గీతలోని బోధనలు, శ్లోకాలు సమాజానికి శక్తిని ప్రసాదిస్తుంటాయి. ఈ వేదికపై లక్షల మందితో గీతా పారాయణం చేసిన నాకూ అలాంటి శక్తి లభించింది" అని ప్రధాని చెప్పారు.



శ్రీకృష్ణదర్శనానికి ఉపకరించే కనకన కిండి (కిటికీ)కి చేసిన బంగారు తాపడాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధానమంత్రి

ఆధునిక భారత్ తలొగ్గదు..

ధర్మో రక్షతి రక్షితః మంత్రంతో ఆధునిక భారత్.. జాతి రక్షణ కోసం ఎవరి ముందూ తలొగ్గదని ప్రధాని తేల్చి చెప్పారు. ఇటీవల ప్రకటించిన 'మిషన్ సుదర్శన చక్ర'కు కూడా శ్రీకృష్ణ బోధనలే స్ఫూర్తిగా నిలిచినట్లు తెలిపారు. సుదర్శన చక్ర వ్యవస్థ శత్రువులను నాశనం చేస్తుందని స్పష్టం చేశారు. భారత పౌరుల కోసం ఎంత దూరమైనా వెళ్తామన్న సందేశాన్ని 'ఆపరేషన్ సిందూర్' చాటి చెప్పిందన్నారు. శ్రీకృష్ణుడి శ్లోకాల స్ఫూర్తితో 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' 'పీఎం ఆవాస్ యోజన', 'నారీ శక్తివందన్ అధినియమ్' వంటి పథకాలు రూపొందించినట్లు ప్రధాని పేర్కొన్నారు. జల సంరక్షణ, తల్లి పేరిట మొక్కలు నాటడం, ప్రతి ఒక్కరూ ఓ పేద వ్యక్తి జీవితాన్ని మెరుగుపరచటం, స్వదేశీ వస్తువుల ఉత్పత్తి, సేంద్రియ వ్యవసాయం, చిరు ధాన్యాల వాడకంతో ఆరోగ్య జీవనం, యోగ, పురాతన లిపి సంరక్షణ, వారసత్వ కట్టడాల సందర్శన వంటి తొమ్మిది తీర్మానాలను ఈ సందర్భంగా ప్రజల కోసం ప్రధాని ప్రకటించారు. కార్యక్రమంలో ఉడుపి మఠం పెద్దలు.. ప్రధాని మోదీని 'భారత భాగ్య విధాత' బిరుదుతో సత్కరించారు. పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ నేతృత్వంలో చేపట్టిన లక్ష కంఠ గీతా పారాయణం కార్యక్రమంలో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, అష్టమఠాధిపతులు పాల్గొన్నారు.

సమైక్యతే వికసిత భారతానికి మార్గం

- శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ్ మఠ్ 550వ వార్షికోత్సవంలో మోదీ

పణజి: వికసిత భారతావనికి ప్రజల సమైక్యతే మార్గమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం సాగుతోందని ఆయన అన్నారు. "సమాజం ఏకమైనప్పుడు, అన్ని రంగాలూ ఒక్కటై నిలిచినప్పుడు, దేశం ముందడుగు వేస్తుంది"అని అన్నారు. ప్రధాని మోదీ శుక్రవారం గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ్ జీవోత్తమ్ మఠం 550వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 77 అడుగుల ఎత్తైన శ్రీరాముని కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇది ప్రపంచంలోనే అతి ఎత్తైన శ్రీరాముని విగ్రహం కావడం విశేషం.

తన సంస్కృతిని నిలబెట్టుకున్న గోవా

అనంతరం మోదీ ప్రసంగిస్తూ.. "నేడు దేశం ఒక సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని అనుభూతి చెందుతోంది. అయోధ్యలో రామ మందిర పునర్నిర్మాణం, కాశీ విశ్వనాథుని ఆలయ పరిసరాల్లో జరిగిన విస్తృత నవీకరణ, ఉజ్జయినిలో మహాకాల్ మహాలోక్ విస్తరణ వంటి కార్యక్రమాలు దేశ ఆధ్యాత్మిక వారసత్వ పునరుజ్జీవనానికి, జాతీయ జాగృతికి ఉదాహరణలు" అని ఆయన అన్నారు. అనేక క్లిష్ట పరిస్థితులు ఎదురైనా గోవా తన సిసలైన సంస్కృతిని నిలబెట్టుకుందని, కాలక్రమంలో తన సంస్కృతిని పునరుద్ధరించుకుందని ఆయన అన్నారు. 550వ వార్షికోత్సవం జరుపుకొన్న శ్రీ సంస్థాన్ గోకర్ణ్ జీవోత్తమ్ మఠ్‌ను ప్రధాని మోదీ శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామాయణ గాథ ఆధారంగా రూపొందిన ఒక పార్కును ప్రారంభించారు. దక్షిణ గోవాలోని పార్తగలిలో ఉన్న మఠ ఆలయాన్ని కూడా మోదీ సందర్శించారు.

- ప్రధానమంత్రి తాజాగా ఆవిష్కరించిన శ్రీరాముని విగ్రహాన్ని గుజరాత్‌లోని నర్మదా తీరంలో స్టాట్యూ ఆఫ్ యూనిటీగా ప్రసిద్ధమైన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని రూపొందించిన శ్రీరాం సుతార్ డిజైన్ చేశారని గోవా మంత్రి దిగంబర్ కామత్ వెల్లడించారు.



77 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు తదితరులు

భారత్ వైపు దూసుకొస్తున్న దిత్వా తుపాను

- రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

ఈనాడు, విశాఖపట్నం: దిత్వా తుపాను శ్రీలంకలో బీభత్సం సృష్టిస్తోంది. దీని ప్రభావంతో అక్కడి ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం ఈ తుపాను భారత్ వైపు దూసుకొస్తోంది. శుక్రవారం సాయంత్రానికి ట్రింకోమాలి(శ్రీలంక)కి 40 కి.మీ., బట్టికాలోవా (శ్రీలంక)కు 140 కిలోమీటర్లు, కరైకల్ (భారత్)కు 270, పుదుచ్చేరికి 380, చెన్నైకి 490 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ శనివారం అర్ధరాత్రి తర్వాత లేదా ఆదివారం తెల్లవారుజాములోగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా (ఏపీ) తీరాలను సమీపించే అవకాశముంది. ఆదివారం వరకు తుపానుగా తీవ్రత కొనసాగించి, రాత్రికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. సోమవారం ఉదయానికి చెన్నైకి సమీపంగా వెళ్తుందని, తర్వాత తీరం వెంబడి ప్రయాణించి, సముద్రంలోనే బలహీనపడొచ్చని అంచనా వేసింది.

3 రోజులు విస్తారంగా వర్షాలు: తుపాను ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదివారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. తుపాను ప్రభావం చూపే అవకాశమున్న ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల యంత్రాంగాలను అప్రమత్తం చేసినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని వెల్లడించింది.

హామీలు అమలు చేయకపోతే 'చలో అసెంబ్లీ'

- 'ఏఐఎస్‌ఎఫ్ పోరుబాట'లో సమాఖ్య నాయకులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: నిర్బంధాలతో విద్యార్థి పోరాటాలను ఆపలేరని.. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే 'చలో అసెంబ్లీ' ఆందోళన చేపడతామని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు హెచ్చరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో మంత్రి లోకేశ్ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెట్టేలా మంత్రి ప్రకటనలు ఉన్నాయన్నారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో పోరుబాట చేపట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, సమాఖ్య నాయకులు తరలిరావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి.. ధర్నాచౌక్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఇరువర్గాల మధ్య తోపులాటలు జరిగాయి. సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.వలరాజు, బందెల నాసర్‌జీ మాట్లాడుతూ.. ఈ నెల 21న మంత్రి లోకేశ్ దగ్గరకు సమాఖ్య నేతృత్వంలో అన్ని విద్యార్థి సంఘాలను చర్చలకు పిలిచినట్లు చెప్పారు. జీవో 77ను రద్దు చేస్తామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందరికీ వర్తింపజేస్తామని, మూసివేసిన పాఠశాలలు తెరిపిస్తామని, విశ్వవిద్యాలయాల్లో పోస్టులు భర్తీ చేస్తామంటూ ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు మస్తాన్, షరీఫ్, బండి చలపతి, నాగభూషణం, నవ్యశ్రీ పాల్గొన్నారు.




ధర్నాచౌక్‌లో వేదికపై నినాదాలు చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఛాంపియన్

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో టీమ్‌ఇండియాకు గట్టి ఎదురు దెబ్బే తగిలింది. రెండు టెస్టుల్లోనూ ఓడి వైట్‌వాష్‌కు గురవడంతో తీవ్ర విమర్శలు తప్పలేదు. ఇప్పుడు అదే జట్టుతో వన్డే, టీ20 సిరీస్‌లు జరగబోతున్నాయి. వీటిలో జట్టు సత్తా చాటితే టెస్టు గాయాలకు కాస్త మందు రాసినట్లే! ఆదివారం మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌లో శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, బుమ్రా, సిరాజ్ లాంటి కీలక ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగుతోంది భారత్. ఇందులో తమదైన ముద్ర వేయడానికి కొందరు ఆటగాళ్లు ఎదురు చూస్తున్నారు. వారి కెరీర్లకు ఈ సిరీస్ ఎంతో కీలకం. మరి ఆ ఆటగాళ్లు సత్తా చాటుతారా?

ఇదే మంచి తరుణం

జడ్డూ.. అటో ఇటో


జడేజా


చాలా ఏళ్ల పాటు భారత వన్డే జట్టులో కీలక ఆటగాడిగా ఉన్నాడు రవీంద్ర జడేజా. అయితే ఇటీవల వన్డే జట్టులో అతడి స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన అతడిని ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేయలేదు. ఫిట్‌గానే ఉన్నప్పటికీ ఆ సిరీస్‌కు జడ్డూను పక్కన పెట్టారు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో మాత్రం ఛాన్స్ దక్కింది. కొన్ని రోజుల్లో జడ్డూ 37 ఏళ్లు పూర్తి చేసుకుంటాడు. ఈ మధ్య అతడి బౌలింగ్‌లో పదును తగ్గుతోంది. 2027 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని భారత జట్టు ప్రత్యామ్నాయాల వైపు చూస్తోంది. అక్షర్, సుందర్ లాంటి స్పిన్ ఆల్‌రౌండర్ల నుంచి అతడికి పోటీ పెరిగింది. అక్షర్ పటేల్‌కు విశ్రాంతినివ్వడంతో జడ్డూకు దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో తుది జట్టులో చోటు ఖాయమైంది. ఈ సిరీస్‌లో జడ్డూ రాణించకపోతే వన్డేల్లో తన చోటు గల్లంతవడం ఖాయం. కాబట్టి ఇందులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెప్పిస్తే తన కెరీర్‌ను పొడిగించుకోవడానికి అవకాశం దక్కుతుంది.

పేస్ త్రయానికి పరీక్ష


అర్ష్‌దీప్ సింగ్

షమి, బుమ్రా, సిరాజ్ లాంటి సీనియర్ పేసర్లలో ఒక్కరూ లేకుండా ఒక పెద్ద జట్టుతో వన్డే సిరీస్ ఆడుతుండడం చాలా ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న దక్షిణాఫ్రికాను భారత యువ పేసర్లు ఏమేర కట్టడి చేస్తారన్నది ఆసక్తికరం. అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణతో కూడిన పేస్ త్రయానికి ఈ సిరీస్ ఒక రకంగా పరీక్షే. అదే సమయంలో ఇది వారికి మంచి అవకాశం కూడా. ఈ ముగ్గురూ ఇప్పటిదాకా సీనియర్ పేసర్లకు సహాయ పాత్రలోనే ఉన్నారు. ఇప్పుడు వీళ్లే ప్రధానంగా పేస్ భారాన్ని మోయాల్సి ఉంది. అర్ష్‌దీప్ టీ20ల్లో తనేంటో రుజువు చేసుకున్నప్పటికీ.. వన్డేల్లో ఇంకా సత్తా చాటుకోలేదు. 11 వన్డేల్లో ఆడి 17 వికెట్లు తీసిన అర్ష్‌దీప్ ఇప్పుడీ సిరీస్‌లో పేస్ దళానికి నాయకుడిగా చెప్పొచ్చు. అతనే బౌలింగ్‌ను ఆరంభించే అవకాశముంది. మరి ఈ లెఫ్టార్మ్ పేసర్ జట్టుకు ఎలాంటి ఆరంభాలిస్తాడన్నది ఆసక్తికరం. టీ20ల్లో వికెట్ టేకర్‌గా తనకున్న పేరును ఇక్కడా నిలబెట్టుకుంటాడేమో చూడాలి. గంభీర్ ముద్దుతో ఎక్కువ అవకాశాలు అందుకుంటున్నాడనే పేరు సంపాదించిన హర్షిత్ రాణాపై ఈ సిరీస్‌లో అందరి కళ్లూ ఉంటాయనడంలో సందేహం లేదు. పేసు అనుకూలించే ఆస్ట్రేలియా పిచ్‌లపై అతను ఓ మోస్తరు ప్రదర్శన చేశాడు. భారత్‌లో [illegible] పరుగులిచ్చేస్తా[illegible]యాలి. ఇక ఐపీఎల్‌లో వరుసగా రెండు సీజన్లు గొప్పగా రాణించిన ప్రసిద్ధ్ కృష్ణ.. అంతర్జాతీయ క్రికెట్లో మాత్రం అంచనాలను అందుకోలేకపోయాడు. ఇంగ్లాండ్‌లో టెస్టు సిరీస్‌లో నిరాశపరచడంతో అతడిపై వేటు పడింది. ఇప్పుడు బుమ్రా, సిరాజ్ అందుబాటులో లేకపోవడంతో ఛాన్స్ దక్కింది. దీన్ని అతనెలా ఉపయోగించుకుంటాడో చూడాలి.

భలే ఛాన్సులే


యశస్వి జైస్వాల్

ఐపీఎల్‌లో గత కొన్నేళ్లలో ఎన్నో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడాడు యశస్వి జైస్వాల్. అక్కడ తన ఆట చూస్తే పరిమిత ఓవర్ల క్రికెట్‌కే అతను బాగా నప్పుతాడని అనిపిస్తుంది. కానీ ఆశ్చర్యకరంగా అతను టెస్టుల్లో స్థిరపడ్డాడు. రెగ్యులర్ ఆటగాడిగా మారాడు. కానీ వన్డేలు, టీ20ల్లో మాత్రం పెద్దగా అవకాశాలు రాలేదు. ఆ జట్లలోకి ఎంపికైనా తుది జట్టులో మాత్రం ఉండట్లేదు. అయితే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాలతో దూరం కావడం ఇప్పుడు యశస్వికి వరంగా మారింది. దక్షిణాఫ్రికా సిరీస్‌లో అతను తుది జట్టులో ఆడబోతున్నాడు. రోహిత్ శర్మతో కలిసి యశస్వినే ఇన్నింగ్స్‌ను ఆరంభించబోతున్నాడు. ఈ సిరీస్‌లో ఒకట్రెండు పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాడంటే యశస్విని ఇకపై వన్డే జట్టుకూ ఎంపిక చేయక తప్పని పరిస్థితి తలెత్తుతుంది. టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికా బౌలర్లను ఎదుర్కొన్న అనుభవం అతడికి కలిసొచ్చేదే. ఈ ఫార్మాట్లో తన శైలికి తగ్గట్లు స్వేచ్ఛగా బ్యాటు ఝుళిపించే అవకాశం దక్కుతుంది. మరి ఈ అవకాశాన్ని అతను ఎంతమేర ఉపయోగించుకుంటాడో?

–ఈనాడు క్రీడావిభాగం

భారత్ 7.. చిలీ 0

● జూనియర్ హాకీ ప్రపంచకప్


భారత ఆటగాళ్లు

చెన్నై: ఎఫ్ఐహెచ్ జూనియర్ హాకీ ప్రపంచకప్‌ను ఆతిథ్య భారత్ ఘనంగా ఆరంభించింది. రెండుసార్లు ఛాంపియన్ భారత్ శుక్రవారం తన తొలి మ్యాచ్‌లో 7-0తో చిలీని చిత్తు చిత్తుగా ఓడించింది. పూల్-బీలో జరిగిన ఈ మ్యాచ్‌లో మ్యాచ్ ఆద్యంతం దూకుడుగా ఆడిన ఆతిథ్య జట్టు ధాటికి చిలీ ఏమాత్రం నిలవలేకపోయింది. 16వ నిమిషంలో రోసన్ కుజుర్ గోల్ కొట్టి భారత్ ఖాతా తెరిచాడు. 21వ నిమిషంలో అతనే ఇంకో గోల్‌తో జట్టు ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. తర్వాత దిల్ రాజ్ అందుకున్నాడు. అతను 25, 34 నిమిషాల్లో స్కోర్ చేశాడు. అజీత్ యాదవ్ (35వ నిమిషం), అన్మోల్ ఎక్కా (48), కెప్టెన్ రోహిత్ (60) కూడా తలో గోల్ కొట్టి జట్టుకు తిరుగులేని విజయాన్నందించారు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ కూడా టోర్నీలో శుభారంభం చేసింది. ఏడుసార్లు ఛాంపియన్ జర్మనీ 4-0తో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. 19, 56 నిమిషాల్లో ఫీల్డ్ గోల్స్ సాధించిన జస్టస్ వార్వెగ్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. బెన్ హాస్బాక్ (43), పాల్ గ్లాండర్ (44) తలో గోల్ కొట్టారు. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో ఐర్లాండ్ 4-3తో కెనడాను ఓడించింది. ఐర్లాండ్ తరపున లూయిస్ రో (13, 33), గ్రెగరీ (35), మిలో థాంప్సన్ (43) గోల్స్ కొట్టారు. కెనడా జట్టులో గుర్నూర్ (26), లీటన్ (48, 53) స్కోర్ చేశారు.

అప్పటివరకు రో-కో ఆడొచ్చు


మోర్నీ మోర్కెల్

దిల్లీ: ఫిట్‌గా ఉన్నంతకాలం జట్టులో కొనసాగేందుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు ఎలాంటి అడ్డంకి లేదని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. 2027 ప్రపంచకప్‌లో స్టార్ ఆటగాళ్లు ఆడటంపై ఎదురైన ప్రశ్నకు అతడు బదులిస్తూ.. "రోహిత్, కోహ్లి నాణ్యమైన ఆటగాళ్లు. అనుభవంపై నాకు నమ్మకం ఎక్కువ. ఎందుకంటే అది ఎక్కడా దొరకదు. రోహిత్, కోహ్లి ఎన్నో విజయాల్లో కీలకపాత్ర పోషించారు. వాళ్లకు పెద్ద టోర్నీల్లో ఎలా ఆడాలో తెలుసు. ప్రత్యర్థిగా రో-కోను ఎదుర్కొన్నా. ఎలా బౌలింగ్ చేయాలో తెలియక నిద్ర కూడా పట్టేది కాదు. 2027 ప్రపంచకప్‌నకు ఇంకా చాలా సమయం ఉంది. వారి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుంటే కచ్చితంగా ఈ కప్‌లో ఆడే జట్టులో ఉంటారు. ఫిట్‌గా ఉన్నంతవరకు వారు ఆడొచ్చు" అని మోర్నీ తెలిపాడు. టెస్టు క్రికెట్లో ఓటమిని మరిచిపోయి వన్డేలపై దృష్టి పెడితేనే జోరు మీదున్న దక్షిణాఫ్రికాను అడ్డుకోవచ్చని మోర్నీ పేర్కొన్నాడు.

ధోని-కోహ్లి ఓ షి'కారు'


ధోని కోహ్లి

రాంచి: టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని రాంచి రోడ్లపై విహరించడం సాధారణమే. కానీ ఈసారి ఇంకాస్త ఆకర్షణ తోడయ్యింది. ధోని కారు నడుపుతుండగా.. అతడి పక్క సీట్లో స్టార్ బ్యాటర్ కోహ్లి దర్శనమిచ్చాడు. దక్షిణాఫ్రికాతో తొలి వన్డే కోసం రాంచి చేరిన విరాట్.. మహి ఇంట భోజనానికి వెళ్లాడు. ఆ తర్వాత కోహ్లిని తన కారులో కూర్చోబెట్టుకుని రాంచి వీధుల్లో ధోని షికారు చేశాడు. కోహ్లిని అతడు బస చేసిన హోటల్ వద్ద దిగబెట్టాడు. మహి కారు నడుపుతుండగా పక్కన విరాట్ కూర్చున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అవుతున్నాయి. 2024 ఫిబ్రవరిలో చివరిగా రాంచిలో అంతర్జాతీయ మ్యాచ్ జరిగింది.

సెమీస్‌లో శ్రీకాంత్


శ్రీకాంత్

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ అంతర్జాతీయ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో తన్వి శర్మ, ఉన్నతి హుడా, కిదాంబి శ్రీకాంత్ సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో తన్వి 21-13, 21-19తో లో సిన్ యాన్ (హాంకాంగ్)ను ఓడించింది. మరో క్వార్టర్స్‌లో ఉన్నతి 21-15, 13-21, 21-15తో సహచర షట్లర్ రక్షిత శ్రీపై నెగ్గగా.. ఇంకో మ్యాచ్‌లో ఇషారాణి బరువా 19-21, 21-13, 15-21తో నెస్లిహాన్ (తుర్కియే) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో శ్రీకాంత్ 21-14, 11-4తో ఆధిక్యంలో ఉన్నప్పుడు అతడి ప్రత్యర్థి ప్రియాంశు రజావత్ గాయంతో తప్పుకొన్నాడు. మరో క్వార్టర్స్‌లో మిథున్ మంజునాథ్ 21-18, 21-13తో మన్‌రాజ్ సింగ్‌ను ఓడించాడు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ జంట సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో గాయత్రి ద్వయం 21-15, 21-16తో బెగిసు-నాజ్‌లికాన్ (తుర్కియే) జోడీపై నెగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో హరిహరణ్-ట్రీసా జంట 21-18, 21-14తో అండీకా-నొజోమి (ఆస్ట్రేలియా) ద్వయంపై గెలిచింది.

విశాఖలో మహిళల టీ20లు


దిల్లీ: భారత్, శ్రీలంక మధ్య మహిళల టీ20 సిరీస్‌కు విశాఖపట్నం, తిరువనంతపురం ఆతిథ్యమివ్వనున్నాయి. డిసెంబరు 21 నుంచి 30 వరకు ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. బంగ్లాదేశ్‌తో సిరీస్ వాయిదా పడిన కొన్ని రోజులకే శ్రీలంక పర్యటన ఖరారైంది. డిసెంబరు 21, 23 తేదీల్లో విశాఖలో మొదటి రెండు టీ20లు నిర్వహిస్తారు. డిసెంబరు 26, 28, 30న జరిగే మిగతా మూడు మ్యాచ్‌లకు తిరువనంతపురం వేదికగా నిలవనుంది.

ఫైనల్లో శ్రీలంక


దుష్మంత చమీర

రావల్పిండి: దుష్మంత చమీర (4/20) విజృంభించడంతో ముక్కోణపు టీ20 సిరీస్‌లో శ్రీలంక ఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక ఆరు పరుగుల తేడాతో పాకిస్థాన్‌పై గెలిచింది. దీంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచిన జింబాబ్వే టోర్నీ నుంచి నిష్క్రమించింది. కమిల్ మిషార (76; 48 బంతుల్లో 6×4, 3×6), కుశాల్ మెండిస్ (40; 23 బంతుల్లో 6×4, 1×6) సత్తాచాటడంతో మొదట శ్రీలంక 20 ఓవర్లలో 5 వికెట్లకు 184 పరుగులు సాధించింది. పాక్ 7 వికెట్లకు 178 పరుగులు చేయగలిగింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (63 నాటౌట్; 44 బంతుల్లో 4×4, 3×6) పోరాడినా ఫలితం లేకపోయింది. శనివారం పాక్, శ్రీలంక మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

గులాబి టెస్టుకూ కమిన్స్ దూరం


ప్యాట్ కమిన్స్

సిడ్నీ: వెన్ను గాయంతో కొన్ని నెలలుగా ఆస్ట్రేలియా జట్టుకు దూరంగా ఉన్న కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. యాషెస్ సిరీస్‌లో రెండో టెస్టుకూ అందుబాటులో లేకుండా పోయాడు. సిరీస్ మొదలయ్యే సమయానికి అతను పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని భావించినా అలా జరగలేదు. పెర్త్‌లో ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించిన తొలి టెస్టుకు దూరమయ్యాడు. డిసెంబరు 4 నుంచి బ్రిస్బేన్‌లో గులాబి బంతితో జరిగే రెండో టెస్టులో కమిన్స్ ఆడతాడని జట్టు ఆశించింది. కానీ కమిన్స్ ఇంకా మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించకపోవడంతో ఈ మ్యాచ్‌కూ అతను అందుబాటులో ఉండడని తేలింది. బ్రిస్బేన్‌లో జరిగే మూడో టెస్టులో మాత్రం కమిన్స్ కచ్చితంగా ఆడతాడని జట్టు వర్గాలు చెబుతున్నాయి. కమిన్స్ దూరం కావడంతో రెండో టెస్టుకూ స్టీవ్ స్మిత్‌యే జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఏ మార్పుల్లేకుండా ఆసీస్ ఈ మ్యాచ్ ఆడబోతోంది. గాయంతో బాధ పడుతున్న పేసర్ జోష్ హేజిల్‌వుడ్ సైతం వరుసగా రెండో టెస్టుకు దూరమయ్యాడు.

ఆమె వయసు పిల్లలంతా పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు.. లేకపోతే ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ బిజీగా ఉంటారు. కానీ ఆ చిన్నారి మాత్రం క్యూ స్టిక్ పట్టుకుంది. తనకన్నా పెద్దవాళ్లతో ఆడుతూ సత్తా చాటుతోంది. ఆ చిన్నారి పేరు తన్వి వల్లెం. స్పెయిన్ వేదికగా ఆరంభమైన ప్రపంచ జూనియర్ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో 12 ఏళ్ల తన్వి పోటీపడబోతోంది.

దూసుకొస్తోంది.. 'క్యూ' కెరటం


తన్వి

తన్వి పుట్టింది హైదరాబాద్‌లో. ఆమె తల్లిదండ్రులు శ్రీ వల్లెం, రేణుక సింధులది ఆంధ్రప్రదేశ్. వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. 2022లో తన్వికి తొలిసారి పూల్ టేబుల్ పరిచయం అయింది. ఆ ఏడాది వేసవిలో ఆమె తండ్రి శ్రీ.. ఒక పూల్ టేబుల్‌ను కొనిచ్చారు. అప్పటి నుంచి క్యూ స్పోర్ట్స్ పట్ల ఆమెకు ఆసక్తి పెరిగింది. సహజసిద్ధమైన కంటి, చేయి సమన్వయం ఉన్న తన్వి.. వేగంగా ఆటను నేర్చుకుంది. కోచ్‌లు కరెన్ కోర్, రాయ్ పాస్టర్స్ దగ్గర తీసుకున్న శిక్షణ ఆమెకు పూల్‌పై మరింత పట్టుదక్కేలా చేసింది. ఆటలోకి వచ్చిన తొలి ఏడాదే అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే స్థాయికి ఎదిగింది. ప్యూర్టోరికోలో జరిగిన ప్రపంచ జూనియర్ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో తొమ్మిదేళ్ల వయసులో తన్వి బరిలో దిగింది. ఈ టోర్నీలో ఆడిన పిన్న వయస్కురాలిగా ఆమె ఘనత సాధించింది. 2023లో ఆస్ట్రియాలో జరిగిన డబ్ల్యూపీఏ ప్రపంచ 10-బాల్ ఛాంపియన్‌షిప్, గతేడాది న్యూజిలాండ్‌లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో తన్వి పోటీపడింది.

ఈ ఏడాది మలుపు

తన్వి కెరీర్‌లో 2025 పెద్ద మలుపు. బీఈఎఫ్ జూనియర్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో అండర్-14లో నాలుగో స్థానంలో నిలిచిన ఆమె.. తర్వాత కనెక్టికట్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-14 మిక్స్‌డ్, 18 విభాగాల్లో ట్రోఫీ దక్కించుకుంది. ఈ టోర్నీలో తనకన్నా వయసులో పెద్దవాళ్లపై ఆమె పైచేయి సాధించింది. ఇంగ్లాండ్ రీజనల్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-14లో విజేతగా నిలిచిన ఈ తెలుగమ్మాయి.. న్యూ హాంప్‌షైర్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-18, అండర్-14 మిక్స్‌డ్‌లో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. స్పెయిన్ వేదికగా శుక్రవారం మొదలైన ప్రపంచ జూనియర్ బిలియర్డ్స్‌లో అండర్-14లో తన్వి బరిలో దిగుతోంది. పోడియంపై నిలవాలనేది ఆమె లక్ష్యం. తన్వి స్నూకర్, బిలియర్డ్స్ ప్లేయర్ మాత్రమే కాదు.. తనకు తైక్వాండోలో రెడ్ బెల్ట్ ఉంది. కూచిపూడిలోనూ ప్రవేశం ఉంది. అమెరికాలోని మేరీలాండ్‌లో ఐబీ వరల్డ్ స్కూల్‌లో ఆమె ఆరో తరగతి చదువుతోంది.

–ఈనాడు క్రీడావిభాగం

అతికకు నాలుగో స్థానం


అతిక

అల్ అయిన్ (యూఏఈ): భారత రేసింగ్ సంచలనం అతిక మీర్ అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శనను కొనసాగిస్తోంది. సీజ్ టీఎఫ్ఏ కార్టింగ్ సిరీస్‌లో ఆమె నాలుగో స్థానంలో నిలిచింది. ఈ రేసులో మిగిలిన రేసర్లకు అతిక గట్టి పోటీ ఇచ్చింది. 0.07 సెకన్ల తేడాతో ఆమె పోడియంపై ఎక్కే అవకాశాన్ని కోల్పోయింది. రేసు ఆరంభం నుంచి పోడియం ఫినిష్ చేసేలా కనిపించిన అతిక.. ఆఖర్లో తడబడింది. ఈ ఛాంపియన్‌షిప్ చరిత్రలో ఒక మహిళా రేసర్ సాధించిన అత్యుత్తమ స్థానం ఇదే. రేసింగ్‌లో దూసుకెళ్తున్న అతికకు ఫార్ములావన్ అకాడమీ మద్దతుగా నిలుస్తోంది.

అండర్-17 ప్రపంచకప్ పోర్చుగల్ సొంతం



పోర్చుగల్ జట్టు

దోహా: అండర్-17 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌ను పోర్చుగల్ సొంతం చేసుకుంది. ఫైనల్లో ఆ జట్టు 1-0తో ఆస్ట్రియాను ఓడించింది. అనిసియో కాబ్రాల్ 32వ నిమిషంలో గోల్ చేసి పోర్చుగల్‌ను ఆధిక్యంలో నిలిపాడు. ఆ ఆధిక్యాన్ని చివరి దాకా కాపాడుకున్న ఆ జట్టు.. టైటిల్‌ను కైవసం చేసుకుంది. అండర్-17 టైటిల్‌ను గెలవడం పోర్చుగల్‌కు ఇదే తొలిసారి. మూడో స్థానం కోసం జరిగిన పోరులో ఇటలీ పెనాల్టీ షూటౌట్లో 4-2తో బ్రెజిల్‌ను ఓడించింది. నిర్ణీత సమయానికి రెండు జట్లూ గోల్స్ చేయకపోవడంతో షూటౌట్ అనివార్యమైంది.

ఖతార్ జీపీపై నోరిస్ కన్ను

లుసైల్: ఫార్ములావన్ డ్రైవర్ ఛాంపియన్‌షిప్‌నకు చేరువైన మెక్‌లారెన్ స్టార్ లాండో నోరిస్ మరో టైటిల్ వేటకు సిద్ధమయ్యాడు. ఆదివారం జరిగే ఖతార్ జీపీలో టైటిల్ గెలవాలని అతడు పట్టుదలగా ఉన్నాడు. ప్రస్తుతం ఎఫ్-1 డ్రైవర్ రేసులో 390 పాయింట్లతో నోరిస్ అగ్రస్థానంలో ఉండగా.. అతడి సహచరుడు ఆస్కార్ పియాస్ట్రి (366), మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (366) రెండో స్థానంలో కొనసాగుతున్నారు. ఈ రేసులో పియాస్ట్రి, వెర్‌స్టాపెన్ కంటే రెండు పాయింట్లు ఎక్కువ సాధిస్తే నోరిస్‌కు కెరీర్ తొలి ఎఫ్1 ఛాంపియన్‌షిప్ సొంతమవుతుంది. ఖతార్ జీపీలో ఫైనల్ రేసుకు ముందు శనివారం స్ప్రింట్ రేసు జరుగుతుంది. శుక్రవారం ఫ్లడ్‌లైట్ వెలుతురులో జరిగిన ప్రాక్టీస్ రేసులో పియాస్ట్రి అగ్రస్థానంలో నిలవగా.. నోరిస్ తర్వాతి స్థానాన్ని సాధించాడు. వెర్‌స్టాపెన్‌కు ఆరో స్థానం దక్కింది.

ఆంధ్రకు రెండో విజయం

లఖ్‌నవూ: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో ఆంధ్ర వరుసగా రెండో విజయం నమోదు చేసింది. శుక్రవారం గ్రూపు-ఎ మ్యాచ్‌లో ఆంధ్ర 66 పరుగుల తేడాతో ఒడిశాను చిత్తుచేసింది. శ్రీకర్ భరత్ (42; 37 బంతుల్లో 4×4, 1×6), అశ్విన్ హెబ్బర్ (39; 26 బంతుల్లో 4×4, 2×6), కెప్టెన్ రికీ భుయ్ (47; 29 బంతుల్లో 2×4, 3×6) సత్తాచాటడంతో మొదట ఆంధ్ర 20 ఓవర్లలో 7 వికెట్లకు 184 పరుగులు సాధించింది. ఒడిశా 17.2 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు పృథ్వీరాజ్ (3/4), సౌరభ్‌కుమార్ (3/23) విజృంభించి జట్టుకు విజయాన్ని అందించారు.

ఆయుష్ అజేయ శతకం: మరో గ్రూపు-ఎ మ్యాచ్‌లో ముంబయి ఏడు వికెట్ల తేడాతో విదర్భపై విజయం సాధించింది. అథర్వ తైడె (64; 36 బంతుల్లో 9×4, 1×6), అమన్ మొఖాడె (61; 30 బంతుల్లో 7×4, 2×6) రాణించడంతో తొలుత విదర్భ 20 ఓవర్లలో 9 వికెట్లకు 192 పరుగులు రాబట్టింది. ఆయుష్ మాత్రె (110 నాటౌట్; 53 బంతుల్లో 8×4, 8×6) సెంచరీతో చెలరేగడంతో ముంబయి 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. సూర్యకుమార్ యాదవ్ (35; 30 బంతుల్లో 4×4, 1×6), శివమ్ దూబె (39 నాటౌట్; 19 బంతుల్లో 3×4, 3×6) సత్తాచాటారు.

హైదరాబాద్ ఓటమి

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో మహారాష్ట్ర చేతిలో హైదరాబాద్‌కు చుక్కెదురైంది. శుక్రవారం గ్రూపు-బి మ్యాచ్‌లో మహారాష్ట్ర 8 వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. రాహుల్ బుద్ధి (31; 25 బంతుల్లో 1×4, 2×6), తనయ్ త్యాగరాజన్ (32; 17 బంతుల్లో 3×4, 2×6), కెప్టెన్ సి.వి.మిలింద్ (35 నాటౌట్; 20 బంతుల్లో 4×4, 1×6) రాణించడంతో తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 191 పరుగులు సాధించింది. అనంతరం 8 బంతులు మిగిలివుండగానే మహారాష్ట్ర లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ పృథ్వీ షా (66; 36 బంతుల్లో 9×4, 3×6), అర్షిన్ కులకర్ణి (89 నాటౌట్; 54 బంతుల్లో 12×4, 2×6) మొదటి వికెట్‌కు 117 పరుగులు జోడించి జట్టు విజయానికి బాటలు వేశారు.

కెప్టెన్‌గా ఆయుష్ మాత్రె


ఆయుష్ మాత్రె

దిల్లీ: అండర్-19 ఆసియా కప్‌లో పాల్గొనే భారత యువ జట్టుకు ఆయుష్ మాత్రె సారథ్యం వహించనున్నాడు. డిసెంబరు 12 నుంచి 21 వరకు దుబాయ్‌లో ఈ టోర్నీ (వన్డేలు) జరగనుంది. విహాన్ మల్హోత్రా వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. భారత్ తరపున యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. వచ్చే ఏడాది జనవరి- ఫిబ్రవరిలో జింబాబ్వే, నమీబియాలలో జరిగే అండర్-19 ప్రపంచకప్‌కు ఈ టోర్నీ సన్నాహకంగా పనికొస్తుందని బీసీసీఐ భావిస్తోంది. సెప్టెంబరు- అక్టోబరులో ఆస్ట్రేలియాలో జరిగిన అండర్-19 టోర్నీలోనూ ఆయుష్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

భారత అండర్-19 జట్టు: ఆయుష్ మాత్రె (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు (వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్ (వికెట్ కీపర్), యువరాజ్ గోహిల్, కనిష్క్ చౌహాన్, ఖిలన్ పటేల్, నమన్ పుష్పక్, దీపేశ్, హెనిల్ పటేల్, కిషన్‌కుమార్ సింగ్, ఉద్ధవ్ మోహన్, ఆరోన్ జార్జ్, **స్టాండ్‌బై:** రాహుల్ కుమార్, హేమ్‌చుదేశన్, బి.కె.కిషోర్, ఆదిత్య రావత్

ఈ చెట్టుకు 600 ఏళ్లు



మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా శాహువాడీ తాలూకాలో గల ఈ 'బెహడా' వృక్షం (తాండ్ర చెట్టు) వయసు 600 సంవత్సరాలు. సహ్యాద్రి పులుల అభయారణ్యంలో భాగంగా ఉన్న ఈ చెట్టు పొడవు 120 అడుగులు కాగా, 8 వేల చదరపు అడుగుల్లో విస్తరించి ఉంది. పలురకాల పక్షులకు, జంతువులకు ఆవాసంగా మారిన ఈ చెట్టును విదేశీయులు ఎక్కువగా సందర్శిస్తుంటారు. దీనిని 'వారసత్వ వృక్షం'గా గుర్తించి, పరిరక్షించాలని అధికారులను కోరుతున్నామని పర్యావరణ యువ శాస్త్రవేత్త విలాస్ టోలా శంకర్ తెలిపారు. ఔషధ గుణాలు ఉన్న ఈ చెట్టు బెరడును త్రిఫల చూర్ణం తయారీలో వాడుతారు. లండన్‌లోని అర్బో కల్చరల్ సొసైటీ ప్రతినిధులు త్వరలో భారత్‌ను సందర్శించి ఈ చెట్టు గురించి అధ్యయనం చేయనున్నారు.

ఈటీవీ భారత్

బీమా సొమ్ము కోసం.. బొమ్మకు అంత్యక్రియలు!



ఇంటర్నెట్ డెస్క్: బీమా సొమ్ము కోసం కొందరు వ్యక్తులు చేసిన ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. హరియాణాకు చెందిన నలుగురు వ్యక్తులు బుధవారం యూపీలోని గఢ్ ముక్తేశ్వర్ గంగా ఘాట్‌కు అంత్యక్రియల కోసమని ఓ శవాన్ని తీసుకువచ్చారు. ఆచారాల ప్రకారం అంత్యక్రియలకు ముందు చేయాల్సిన క్రతువులు ఏవీ వద్దంటూ.. నేరుగా శవాన్ని చితిపైకి తీసుకువెళ్లి దహన సంస్కారాలు ప్రారంభించారు. వీరి తీరు అనుమానాస్పదంగా ఉండటంతో స్థానికులు అడ్డుకొని నిలదీశారు. చితిపై పడుకోబెట్టిన శవంపై ఉన్న వస్త్రాన్ని తొలగించి.. మనిషి రూపంలో బొమ్మ కనిపించడంతో కంగుతిన్నారు. మోసం బయటపడటంతో ఆ బొమ్మను తీసుకువచ్చినవారిలో ఇద్దరు పారిపోగా.. స్థానికులు మిగతా ఇద్దరిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసు విచారణలో అసలు విషయం బయటపడింది. దిల్లీలోని కైలాస్‌పురికి చెందిన కమల్ సోమానీ రూ.50 లక్షలకు పైగా అప్పులు చేశాడు. రుణ విముక్తి కోసం అతడు ఉత్తమ్‌నగర్‌కు చెందిన స్నేహితుడు ఆశిష్ ఖురానాతో కలిసి ఓ పథకం పన్నాడు. ఇందులో భాగంగా.. కమల్ సోమానీ గతంలో తన వద్ద పనిచేసిన అన్షుల్ కుమార్ ఆధార్, పాన్‌కార్డులను తీసుకున్నాడు. ఏడాది క్రితం అన్షుల్ పేరు మీద రూ.50 లక్షల జీవిత బీమా పాలసీ తీసుకొని క్రమం తప్పకుండా ప్రీమియంలు చెల్లించాడు. ఇప్పుడు ఆ బీమా డబ్బు కోసం అన్షుల్ మరణించాడని నమ్మించేలా నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని పొంది.. ఇలా అంత్యక్రియల నాటకం ఆడారు. తన పేరు మీద బీమా పాలసీ ఉన్న విషయమే తెలియదని అన్షుల్ విచారణలో పోలీసులకు తెలిపాడు. కమల్ సోమానీని, అతడి స్నేహితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

హాంకాంగ్ అగ్నిప్రమాద ఘటన.. 128కి పెరిగిన మృతులు

హాంకాంగ్: హాంకాంగ్‌లోని తై పో జిల్లాలో ఏడు బహుళ అంతస్తుల భవనాల్లో బుధవారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 128 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. 11 మంది అగ్నిమాపక సిబ్బంది సహా 79 మంది గాయపడ్డారని, మరో 200 మంది ఆచూకీ దొరకడం లేదన్నారు. ఈ భవంతుల్లో చెలరేగిన అగ్నికీలలను దాదాపు 1,000 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది 24 గంటల పాటు శ్రమించి అదుపులోకి తెచ్చారు. ఇప్పటికీ కొన్ని భవనాల నుంచి పొగ వెలువడుతూనే ఉంది. చివరి ప్రయత్నంగా.. బతికి ఉన్నవారి కోసం అగ్నిమాపక సిబ్బంది ఒక్కో అపార్ట్‌మెంట్‌లో వరుసగా ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు వెలికితీసిన వాటిలో 89 మృతదేహాలు ఎవరివి అనేది ఇంకా గుర్తించలేదని సిటీ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్ టాంగ్ తెలిపారు. మరోవైపు భవనాల ఆధునికీకరణ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై హాంకాంగ్ అవినీతి వ్యతిరేక కమిషన్ గురువారం దర్యాప్తు ప్రారంభించింది. ఇటువంటి ప్రాజెక్టుల్లో ఉపయోగించే అన్ని స్కాఫోల్డింగ్, నిర్మాణ సామగ్రిపై నగరవ్యాప్తంగా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది.



అలాంటి పదార్థాలతో ఆరోగ్యానికి చేటు

అతిగా శుద్ధి చేసిన ఆహారాన్ని తీసుకోవడమనేది మద్యపానం, పొగతాగడంతో సమానం. అలాంటి వాటిలో క్యాలరీలు, అనారోగ్యకర కొవ్వులు, సోడియం, చక్కెర శాతం అధికంగా, పోషకాలు తక్కువగా ఉంటాయి. దీనివల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. అందుకే అలాంటి పదార్థాలకు దూరంగా ఉండండి.

– శ్రేయా షా, న్యూట్రిషనిస్ట్

ఆ దేశాల నుంచి వలసలకు పూర్తిగా స్వస్తి

- భద్రతపరంగా మాకు ముప్పున్నవారు పోవాల్సిందే
- తృతీయ ప్రపంచ దేశాలపై అమెరికా కఠిన నిర్ణయం
- శ్వేతసౌధం సమీపాన కాల్పులతో ట్రంప్ ఆగ్రహం
- గాయపడ్డవారిలో ఒకరి కన్నుమూత



వాషింగ్టన్: తృతీయ ప్రపంచ దేశాల నుంచి తమ దేశంలోకి వలసలకు శాశ్వత విరామం ఇస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దేశ భద్రతకు ముప్పుగా పరిణమించే విదేశీయుల్ని వెనక్కి పంపించేస్తామని చెప్పారు. ఆందోళనకర దేశాల నుంచి వచ్చి గ్రీన్ కార్డులు పొందినవారిలో ప్రతిఒక్కరినీ క్షుణ్నంగా పరిశీలిస్తామని తెలిపారు. శ్వేతసౌధం సమీపాన భద్రత బలగాలపై అఫ్గాన్ పౌరుడు జరిపిన కాల్పుల నేపథ్యంలో ఈ నిర్ణయాలు వెలువరించారు. కాల్పుల ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిలో ఒకరైన మహిళా నేషనల్ గార్డు సభ్యురాలు సారా బెక్‌స్ట్రోమ్ (20) మరణించినట్లు ప్రకటించారు. మరొకరు చావుబతుకుల్లో, విషమ పరిస్థితుల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

ఇది నిద్రమత్తు బైడెన్ చలవే

"మన ఇమిగ్రేషన్ విధానం చాలామంది జీవన పరిస్థితులను దెబ్బతీస్తోంది. నిద్రమత్తులో ఉండే జో బైడెన్ ఆటోపెన్‌తో సంతకం చేసి రప్పించిన లక్షలమంది అక్రమ ప్రవేశాలను రద్దు చేస్తున్నాం. అఫ్గాన్ నుంచి వేలమందిని ఎలాంటి తనిఖీల్లేకుండా మన దేశంలోకి ఆయన తెచ్చారు. కుటిల బైడెన్, ఆయన దొంగపరివారం చేసినదాన్ని మరిచిపోం. అమెరికాను ప్రేమించనివారిని, మన వృద్ధికి పాటుపడనివారిని ఇక్కడి నుంచి పంపించేస్తాం. అమెరికాయేతర పౌరులందరికీ ప్రభుత్వ ప్రయోజనాలు, రాయితీలు నిలిపివేస్తాం. ప్రశాంతతకు భంగం కలిగించేవారిని, పాశ్చాత్య సంస్కృతికి సరిపోనివారిని, మన భద్రతకు ముప్పుగా మారేవారిని బహిష్కరిస్తాం" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' పోస్టులో రాసుకొచ్చారు. "అమెరికాలో 5.30 కోట్ల మంది విదేశీయులున్నారు. వారిలో చాలామంది విఫల దేశాల నుంచి, జైళ్ల నుంచి, మానసిక సంస్థల నుంచి, డ్రగ్స్ ముఠాల నుంచి వచ్చినవారే. దేశభక్తులు, సహృదయులైన అమెరికా పౌరులు చేస్తున్న చెల్లింపులతో ఇలాంటివారికి, వారి పిల్లలకు ప్రయోజనం అందుతోంది. ఇది క్రమంగా అమెరికా పౌరుల్ని కబళిస్తోంది. ఏటా 30వేల డాలర్లు ఆర్జించే గ్రీన్‌కార్డు వలసదారుడికి వివిధ ప్రయోజనాల రూపంలో 50వేల డాలర్లు వెళ్లిపోతున్నాయి. వలసదారులు, శరణార్థులతో ఇలా ఎంతో భారం పడుతోంది" అని వివరించారు. అఫ్గాన్ సహా 18 దేశాలకు చెందిన గ్రీన్‌కార్డ్‌దారుల్ని సమీక్షించనున్నట్లు అమెరికా పౌరసత్వం, వలస సేవల (యూఎస్‌సీఐఎస్) డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో వెల్లడించారు. కొత్త మార్గదర్శకాలు వెంటనే అమల్లోకి వచ్చాయని, పెండింగులో ఉన్న దరఖాస్తులకు కూడా వర్తిస్తాయని చెప్పారు.

అరెస్టులతో కలవరం

శాన్‌డియాగోలోని కార్యాలయంలో గ్రీన్‌కార్డు ఇంటర్వ్యూ కోసం వచ్చిన భార్యాభర్తల్ని అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీసా గడువు ముగిసినా అమెరికాలో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని ఈ అరెస్టులు జరుగుతున్నాయని న్యాయవాది సమన్ నస్సేరి పేర్కొన్నారు. మరో ఇమిగ్రేషన్ న్యాయవాది హబీబ్ హస్బిని కూడా తన వద్దకు ఇలాంటి కేసులు చాలా వచ్చాయన్నారు.

శ్రీలంకలో వరద బీభత్సం

- 80కి చేరిన మృతుల సంఖ్య
- మరో 34 మంది గల్లంతు

కొలంబో: శ్రీలంకలోని పలు ప్రాంతాల్లో మూడురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దిత్వా తుపాను కారణంగా ఆకస్మిక వరదలు ముంచెత్తడంతోపాటు కొండచరియలు విరిగిపడడంతో మరణించినవారి సంఖ్య 80కి చేరినట్లు ప్రభుత్వ విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడించింది. మరో 34 మంది గల్లంతైనట్లు తెలిపింది. వరద ధాటికి 600కు పైగా ఇళ్లు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కొట్టుకుపోయాయి. అనేక రహదారులు, పొలాలు జల దిగ్బంధమయ్యాయి. వరదల కారణంగా లక్షా 48 వేల మంది ప్రభావితమయ్యారు. 14 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. వరదల్లో గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ఆపరేషన్ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. దేశంలోని అనేక నగరాలు వరదలో చిక్కుకుపోవడంతో శ్రీలంక ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను మూసివేసింది. రైలు సర్వీసులు నిలిపివేసింది.

భారత్ నుంచి 'ఆపరేషన్ సాగర్ బంధు'

దిల్లీ: శ్రీలంకలో వరదల కారణంగా 80 మంది ప్రాణాలు కోల్పోవడంపై ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. కష్టసమయంలో పొరుగుదేశానికి చేయూత అందించేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసానిచ్చారు. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో లంకకు అత్యవసర మానవతా సాయం పంపినట్లు ప్రకటించారు.



భారత మానవతా సాయాన్ని శ్రీలంక ప్రతినిధులకు అప్పగిస్తున్న నౌకాదళ అధికారులు

భారత్‌కు పుతిన్


- 4, 5 తేదీల్లో పర్యటించనున్న రష్యా అధ్యక్షుడు
- ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం



దిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు రానున్నారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు వచ్చే నెల 4, 5 తేదీల్లో ఆయన పర్యటించనున్నారు. మోదీతో జరిగే భారత్-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో వాణిజ్యం, రక్షణ తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా కొన్ని కీలక ఒప్పందాలూ కుదిరే అవకాశం ఉంది. భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రూపాయి-రూబుల్‌తో ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతం చేసే మార్గాలు, పాశ్చాత్య దేశాలు రష్యాపై విధించిన ఆంక్షల నేపథ్యంలో ఇంధన సహకారాన్ని ముందుకు తీసుకువెళ్లడం, రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకోవడం, ఉక్రెయిన్ వివాదం, పౌర అణుశక్తి తదితర కీలక అంశాలు నేతలిద్దరి మధ్య చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో అద్భుతంగా పనిచేసిన ఎస్-400 క్షిపణుల కొత్త బ్యాచ్ కొనుగోలుపై సైతం చర్చలు జరిగే అవకాశం ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభానికి కొన్ని నెలల ముందు 2021 డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత ఆయన మన దేశానికి రానుండడం ఇదే తొలిసారి.

రుతుక్రమ సెలవుకు ఆధారాలు అడుగుతారా?

- ఆ వ్యక్తుల మనస్తత్వానికి ఇది నిదర్శనం
- కేంద్రానికి, హరియాణాలోని వర్సిటీకి సుప్రీం నోటీసులు



దిల్లీ: హరియాణాలోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయంలో విధులకు హాజరుకాని మహిళా పారిశుద్ధ్య కార్మికులను వారి రుతుక్రమానికి ఆధారాలు చూపాలని ఒత్తిడి చేయడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యులైన వ్యక్తుల మనస్తత్వానికి ఇది నిదర్శనమని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం మండిపడింది. ఈ అంశంపై స్పందన తెలపాలని కేంద్రానికి, మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయానికి నోటీసులు జారీ చేసింది. 'మహిళలకు కర్ణాటకలో రుతుక్రమ సెలవు ఇస్తున్నారు. హరియాణా ఉదంతం చదివిన తర్వాత వారు కూడా సెలవు మంజూరుకు ఆధారాలు కావాలని అడుగుతారేమో! మహిళా పారిశుద్ధ్య కార్మికులు సెలవులో ఉన్నప్పుడు నిలిచిపోతున్న పనులను ఇంకెవరికైనా పురమాయించవచ్చుకదా' అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయంలోని ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్‌సీబీఏ) న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చింది. ఈ పిటిషన్ ద్వారా ఎంతోకొంత మంచి జరుగుతుందన్న అభిప్రాయాన్ని జస్టిస్ నాగరత్న వ్యక్తం చేశారు. తదుపరి విచారణ డిసెంబరు 15వ తేదీకి వాయిదాపడింది. మహిళా కార్మికులను రుతుక్రమ ఆధారాలు అడిగిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఎస్‌సీబీఏ విజ్ఞప్తి చేసింది. మహిళలు-బాలికల గౌరవానికి, ఆరోగ్యానికి భంగం కలిగించరాదని పేర్కొంది. అక్టోబరు 26న జరిగిన ఈ ఘటనకు సంబంధించి అదే నెల 31న ముగ్గురు వ్యక్తులపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు హరియాణా పోలీసులు తెలిపారు. బాధ్యులైన ఇద్దరు సూపర్‌వైజర్లను సస్పెండ్ చేసినట్లు మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అనారోగ్యంతో ఉన్నామని తెలిపినప్పటికీ విధులకు హాజరుకావాలని, రుతుక్రమంలో ఉన్నట్లు ఆధారాలు చూపాలని ఇద్దరు సూపర్‌వైజర్లు బలవంతపెట్టారని ముగ్గురు మహిళా పారిశుద్ధ్య కార్మికులు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

అమెరికాలో అగ్రస్థానం మళ్లీ మనదే

- 3.63 లక్షల మంది విద్యార్థులతో ప్రథమ స్థానంలో భారత్
- 2023-24 విద్యా సంవత్సరం కంటే 2024-25లో 10 శాతం అధికం
- విదేశీ విద్యార్థుల్లో 30.80 శాతం మంది మనవాళ్లే
- ఓపెన్ డోర్స్ నివేదిక-2025 వెల్లడి



ఈనాడు, హైదరాబాద్: అమెరికాలోని విదేశీ విద్యార్థుల్లో వరుసగా రెండోసారి భారత్ అగ్రస్థానంలో నిలిచింది. గత విద్యా సంవత్సరం(2023-24) నాటికి 3.30 లక్షల మంది విద్యార్థులతో భారత్ తొలిస్థానంలో నిలవగా... 2024-25 విద్యా సంవత్సరంలో ఆ సంఖ్య 3.63 లక్షలకు పెరిగి మరోసారి ప్రథమ స్థానాన్ని నిలబెట్టుకుంది. అక్కడున్న విదేశీ విద్యార్థుల్లో ఎన్నో ఏళ్లుగా ప్రథమ స్థానంలో ఉన్న చైనాను మన దేశం 2023-24లో వెనక్కి నెట్టిన విషయం తెలిసిందే. 2024-25లోనూ భారత్ ప్రథమ స్థానంలోనే నిలవడం విశేషం. భారతీయ విద్యార్థుల సంఖ్య అంతకుముందు విద్యా సంవత్సరం కంటే ఈసారి 10 శాతం పెరగగా... చైనా విద్యార్థులు 4 శాతం తగ్గారు. యూఎస్‌ఏకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ తాజాగా విడుదల చేసిన ఓపెన్ డోర్స్ రిపోర్ట్-2025 ద్వారా ఈ వివరాలు వెల్లడయ్యాయి.

ఇవి 2025 మే నాటి వరకు గణాంకాలే...

అమెరికాలో విద్యా సంవత్సరం అంటే ఆగస్టు-మే నెల వరకు భావిస్తారు. తాజా నివేదికను 2024-25 విద్యా సంవత్సరం గణాంకాల ఆధారంగా రూపొందించారు. అంటే 2024 ఆగస్టు నుంచి 2025 మే (ఫాల్ సీజన్ నుంచి సమ్మర్ సీజన్) వరకు జరిగిన ప్రవేశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని నివేదిక ఇచ్చారు. సాధారణంగా భారతీయ విద్యార్థులు అత్యధికంగా ఆగస్టు/సెప్టెంబరులో మొదలయ్యే ఫాల్ సీజన్‌లో అమెరికాలో ప్రవేశాలు పొందుతారు. 2024 ఫాల్ సీజన్ నాటికి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక కాలేదు. ట్రంప్ విధిస్తున్న ఆంక్షలు, అనిశ్చిత పరిస్థితుల ప్రభావం 2025 ఫాల్ సీజన్(ఆగస్టు/సెప్టెంబరు)పై మాత్రమే పడింది. దానివల్ల విద్యార్థులు ఎంత తగ్గారన్నది వచ్చే ఏడాది నవంబరులో విడుదల చేసే నివేదిక-2026లో తేలనుంది. ప్రాథమిక సర్వే ప్రకారం ఈ సంవత్సరం ఫాల్ సీజన్‌లో విదేశీ విద్యార్థులు 17 శాతం తగ్గారని తేలింది. భారత్ నుంచి 40 శాతం తగ్గి ఉంటారని అనధికారిక అంచనా.

గత ఫాల్ సీజన్‌లో 7 శాతం తగ్గిన అంతర్జాతీయ విద్యార్థులు

తాజా నివేదిక ప్రకారం అమెరికాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు పెరిగినా... 2024 ఫాల్ సీజన్‌లో అక్కడ ప్రవేశాలు పొందిన వారి సంఖ్య తగ్గింది. కొత్తగా 2,77,118 మంది ప్రవేశాలు పొందారు. అంతకుముందు (2023) ఫాల్ సీజన్‌తో పోల్చుకుంటే ఏడు శాతం తగ్గారని నివేదిక పేర్కొంది. అండర్ గ్రాడ్యుయేట్ చదువు కోసం వచ్చిన వారి సంఖ్య 5 శాతం పెరగగా... అదే సమయంలో మాస్టర్స్ విద్యార్థుల సంఖ్య 15 శాతం పడిపోయింది.

మరిన్ని వివరాలు www.eenadu.net లో..

హర్షిత స్కూల్ కేసులో నందిగం రాణికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- సొమ్ము వసూలులో ఆమెది కీలక పాత్ర
- ముందస్తు బెయిలిచ్చేందుకు నిరాకరణ
- బెయిల్ పిటిషన్ కొట్టివేత
- మిగిలిన నిందితులకు షరతులతో ముందస్తు బెయిలు



నందిగం రాణి, ధర్మరాజు

ఈనాడు, అమరావతి: హర్షిత పాఠశాల ఏర్పాటు పేరుతో రూ.కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడిన వ్యవహారంలో నందిగం రాణికి ముందస్తు బెయిలివ్వడానికి హైకోర్టు నిరాకరించింది. నిందితులు దర్యాప్తునకు అడ్డంకులు సృష్టించి సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని పేర్కొంది. ఆర్థిక నేరాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయని, ఆ నేరాలతో దేశ ఆర్థిక స్థిరత్వానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని వెల్లడించింది. సొమ్ము వసూలులో నందిగం రాణి కీలకపాత్ర పోషించారనే ఆరోపణలున్నందున ఆమెకు ముందస్తు బెయిలు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న నందిగం లక్ష్మిహర్షిత, గవిర్ని కృష్ణారావు, గవిర్ని రమేశ్, గవిర్ని సురేశ్, గవిర్ని యజ్ఞవల్లికి షరతులతో కూడిన ముందస్తు బెయిలిచ్చింది. ఒక్కొక్కరు రూ.2లక్షల చొప్పున మూడు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అభియోగ పత్రం దాఖలు చేసేవరకు నిందితులు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకావాలని, సాక్షులను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడానికి వీల్లేదంది. దర్యాప్తు అధికారి వద్ద పాస్‌పోర్టును జమచేయాలని, పాస్‌పోర్టు లేకపోతే ఆ మేరకు అఫిడవిట్ ఇవ్వాలని స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు ఈ నెల 26న ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

అధిక వడ్డీ, లాభాల్లో వాటాను ఆశ చూపి..

పాఠశాల ఏర్పాటు పేరుతో అధిక వడ్డీ చెల్లిస్తామని, లాభాల్లో వాటా ఇస్తామని ఆశ చూపి ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడిలో శ్రీ హర్షిత ఇంగ్లిష్ మీడియం స్కూల్, జూనియర్ కళాశాల ఛైర్‌పర్సన్ నందిగం రాణి, ఆమె భర్త పలువురి నుంచి రూ.33 కోట్లకు పైగా వసూలుచేసి మోసగించారని కొర్రపాటి చంద్రశేఖర్ మంగళగిరి సీఐడీకి ఫిర్యాదు చేశారు. హర్షిత ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో భారీగా డిపాజిట్లు సేకరించారన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీఐడీ అధికారులు.. రాణితో పాటు ఆమె భర్త ధర్మరాజు, కుమార్తె లక్ష్మీహర్షిత, ఆమె తండ్రి గవిర్ని కృష్ణారావు, సోదరులు రమేశ్, సురేశ్, వదిన యజ్ఞవల్లిపై గతేడాది ఆగస్టులో ఏపీ డిపాజిటర్ల చట్టంతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ కేసులో నందిగం రాణి, తదితరులు హైకోర్టులో ముందస్తు బెయిలు పిటిషన్ వేశారు. సీఐడీ తరఫున సహాయ పీపీ నీలోత్పల్ వాదనలు వినిపిస్తూ.. నిందితుల కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమని, బెయిలిస్తే దర్యాప్తునకు సహకరించరని చెప్పారు.

విద్యార్థులనూ వినియోగించుకున్నారు

ఫిర్యాదుదారుడు కొర్రపాటి చంద్రశేఖర్ తరఫున న్యాయవాదులు ఉన్నం అఖిల్ చౌదరి, దండమూడి రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. నందిగం రాణి, ఆమె భర్త, కుటుంబసభ్యులు ప్రజల నుంచి రూ.33 కోట్లు వసూలు చేశారన్నారు. దర్యాప్తునకు సహకరించకుండా పోలీసులను అడ్డుకునేందుకు రాణి.. పాఠశాల విద్యార్థులను వినియోగించుకునే స్థాయికి వెళ్లారన్నారు. నేరతీవ్రతను దృష్టిలో పెట్టుకొని బెయిలు పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. ఇటీవల జరిగిన విచారణలో ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేసిన న్యాయమూర్తి.. ఈ నెల 26న నిర్ణయాన్ని ప్రకటించారు. నేరారోపణల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని రాణికి బెయిలివ్వడానికి నిరాకరించారు.

3న విశాఖకు పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: వచ్చేనెల 4న విశాఖలో నిర్వహించే నౌకాదళ దినోత్సవం (నేవీ డే)లో భాగంగా 3న చేపట్టే ముందస్తు కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ఈస్టర్న్ నావల్ కమాండ్‌కు వెళతారని ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

పుదుచ్చేరిలో నకిలీ మందుల తయారీ

ఆంధ్ర, దిల్లీలో విక్రయాలు

అర్కేనగర్, న్యూస్‌టుడే: దిల్లీ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న నకిలీ ఔషధ మాత్రల రాకెట్ గుట్టు రట్టయింది. సన్ ఫార్మసీ పేరిట పుదుచ్చేరిలో నకిలీ ఔషధ మాత్రలు తయారు చేసి విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు సీబీసీఐడీ పోలీసులు గురువారం సోదాలు చేపట్టారు. మేట్టుపాళ్యం పరిశ్రమలోని రెండు గోదాముల్లో దాచి ఉన్న రూ.100 కోట్ల విలువైన మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మాత్రలు దిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లలో విక్రయిస్తున్నట్లు తెలియడంతో ఆయా రాష్ట్రాల పోలీసులు పుదుచ్చేరికి వచ్చారు. నకిలీ మాత్రలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కేసులో అరెస్టై జైల్లో ఉన్న రాణా, మెయ్యప్పన్‌ని దిల్లీ తీసుకెళ్లి విచారించాలని నిర్ణయించారు. మరికొన్ని చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి.

క్షుద్రపూజలతో భయపెట్టి రూ.3.50 కోట్ల దోపిడీ

- దంపతులను బురిడీ కొట్టించిన నకిలీ గురువు



అమ్మవారి విగ్రహం, పూజా సామగ్రి చూపుతున్న బాధిత దంపతులు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆరోగ్యం బాగుచేయాలని తనను ఆశ్రయించిన దంపతులను క్షుద్రపూజల పేరుతో భయపెట్టి ఏకంగా రూ.3.50 కోట్లు కొట్టేశాడో నకిలీ గురువు. ఈ ఘటన కర్నూలు జిల్లా ఆదోని మండలం బైచిగేరిలో చోటుచేసుకుంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవట్లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరులో ఉంటున్న వెంకటయ్య, పద్మ దంపతులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బైచిగేరి గ్రామానికి చెందిన దుర్గాసింగ్‌కు దేవుడు వస్తాడని, అక్కడికి వెళ్తే ఆరోగ్యం కుదుటపడుతుందని ఎవరో చెబితే కొన్ని రోజుల కిందట దంపతులు అక్కడికి వెళ్లారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దుర్గాసింగ్ వారికి కట్టుకథలు చెప్పారు. మీ పొలంలో నిధి ఉందని, అది తీసేంత వరకూ మీకు, మీ పిల్లలకు ప్రాణహాని ఉంటుందని భయపెట్టాడు. ఆ నిధి తీస్తానని చెప్పి వారి నుంచి రూ.80 లక్షలు కాజేశాడు. ఓ రోజు రాత్రి బాధితుల స్వగ్రామమైన ఉండవల్లి శివారులోని వారి పొలంలో క్షుద్రపూజలు చేశాడు. అనంతరం ఇక్కడ అమ్మవారి విగ్రహం బయటపడిందని చెప్పి మూడడుగుల ఎత్తున్న విగ్రహాన్ని దంపతులకు చూపించాడు. ఈ విగ్రహాన్ని ఇంట్లో పెట్టుకుంటే ప్రాణహాని ఉంటుందని, అమ్మేస్తే రూ.కోట్లు వస్తాయని నమ్మబలికాడు. విగ్రహం కొనుగోలుకు విదేశాల నుంచి కొందరు దిల్లీకి వచ్చారని చెప్పి, ఐదు సార్లు బాధితులను దిల్లీకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో వారి నుంచి సుమారు రూ.3.50 కోట్లు వసూలు చేశాడు. చివరికి మోసపోయామని గ్రహించిన దంపతులు తమ డబ్బు తిరిగివ్వాలని దుర్గాసింగ్‌ను కోరారు. దాంతో అతడు బెదిరింపులకు దిగాడు. 'గ్రామంలోకి అడుగు పెడితే చంపేస్తామని దుర్గాసింగ్‌తో పాటు ముకుంద అనే వ్యక్తి మమ్మల్ని బెదిరించారు. దీనిపై పెబ్బేరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. గత నెల ఆదోనికి వచ్చి డీఎస్పీతో పాటు తాలూకా పోలీసు సీఐకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు' అని దంపతులు ఎమ్మెల్యే వద్ద బోరున విలపించారు. ఎమ్మెల్యే ఆదోని డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడగా, సాక్ష్యాలు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని డీఎస్పీ తెలిపారు.

గూగుల్‌కు 'సింహాచలం' భూములు

- మధురవాడ వద్ద 106, అడవివరం వద్ద 150 ఎకరాలు కోరిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ డేటా సెంటర్ కోసం సింహాచలం ఆలయ భూములు తీసుకోనున్నారు. ఈ ఆలయానికి మధురవాడలోని సర్వే నంబరు 420, 424ల్లో ఉన్న 106.47 ఎకరాలను ఇవ్వాలని ప్రభుత్వం కోరుతోంది. అలాగే అడవివరం వద్ద కేంద్ర కారాగారానికి సమీపంలోని 150 ఎకరాలు కూడా కేటాయించాలని అడుగుతోంది. మొత్తంగా 256.47 ఎకరాల కోసం దస్త్రాన్ని కలెక్టర్ పంపగా, ఇప్పుడు అది దేవాదాయశాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. విశాఖపట్నంలోని ప్రధాన బస్టాండ్‌కు ఆనుకొని గతంలో కేంద్ర కారాగారం ఉండేది. దానిని అక్కడి నుంచి తరలించేందుకు 2002లో అడవివరం వద్ద సింహాచలం ఆలయానికి చెందిన సర్వే నంబరు 275లోని 100 ఎకరాలను తీసుకున్నారు. ప్రత్యామ్నాయంగా మధురవాడ వద్ద 106.47 ఎకరాలను ఆలయానికి కేటాయించారు. ఇప్పుడా ప్రాంతమంతా ఐటీ హబ్‌గా మారుతోంది. ఆ భూమిని ఏపీఐఐసీకి కేటాయించి, దాని ద్వారా గూగుల్ డేటా సెంటర్‌కు ఇవ్వనున్నారు.

★ అడవివరం వద్ద విశాఖ కేంద్ర కారాగారానికి ఆనుకొని ఉన్న సింహాచల ఆలయ భూముల్లో 150 ఎకరాలను కూడా గూగుల్ డేటా సెంటర్ కోసం ప్రభుత్వం కోరింది. ఈ భూములు సింహాచలం నుంచి హనుమంతవాక వెళ్లే ప్రధాన మార్గానికి ఆనుకొని ఉన్నాయి.

ప్రత్యామ్నాయమా? లీజు పద్ధతా?

★ సింహాచలం ఆలయానికి చెందిన 256.47 ఎకరాలను గూగుల్ డేటా సెంటర్ కోసం తీసుకుని.. దానికి ప్రత్యామ్నాయంగా గాజువాక సమీపంలోని పెదగంట్యాడ, మునగాడ పరిధిలో దాదాపు 600 ఎకరాలను కేటాయించేలా రెవెన్యూ అధికారులు ప్రతిపాదించారు. అయితే ఇందులో కొండ ప్రాంతం ఎక్కువగా ఉంది. దీంతో ఏం చేయాలో యోచిస్తున్నారు.

★ ప్రత్యామ్నాయ భూములు ఇవ్వకుండా నేరుగా సింహాచలం ఆలయ భూములు 256.47 ఎకరాలనే లీజు రూపంలో కేటాయిస్తే ఎలా ఉంటుందనేదీ పరిశీలిస్తున్నారు. దీనివల్ల భూములు ఆలయం పేరిటే ఉండటంతోపాటు లీజు రూపంలో దేవస్థానానికి పెద్ద ఎత్తున ఆదాయం లభిస్తుంది.

నిందితులకు బెయిలివ్వొద్దని సహనిందితుడు కోరుతున్నారేంటి?

చెవిరెడ్డి పిటిషన్‌పై హైకోర్టు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులైన ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి (ఏ2), ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక అధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్ (ఏ3) ముందస్తు బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్లను తిరస్కరించాలని సహ నిందితుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్ విచారణార్హతను తేలుస్తామని హైకోర్టు పేర్కొంది. సహ నిందితుడు అనుబంధ పిటిషన్ వేసి, నిందితుల ముందస్తు బెయిలు పిటిషన్లను తిరస్కరించాలని కోరడాన్ని తొలిసారి చూస్తున్నామని వ్యాఖ్యానించింది. విచారణను డిసెంబర్ 2కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఈ ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు వైకాపా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదిస్తూ.. అప్రూవర్లుగా మారతామనే షరతుతో ముందస్తు బెయిలివ్వండి అని వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ కోరడంపై తమకు అభ్యంతరం ఉందన్నారు.

రాజ్యాంగమే దేశానికి దిక్సూచి

- దీని స్ఫూర్తి అన్నివర్గాల ప్రజలకు చేరాలి
- ఇందులో న్యాయవాదుల పాత్ర కీలకం..
- రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్



న్యాయవాద పరిషత్, హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు, జస్టిస్ హరినాథ్ నూనేపల్లి, జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ, జస్టిస్ తుహిన్‌కుమార్ గేదెల, హైకోర్టు, కృష్ణా జిల్లా యూనిట్ల సభ్యులు

ఈనాడు, అమరావతి: 'రాజ్యాంగమే దేశానికి దిక్సూచి. వివిధ భాషలు, రాష్ట్రాలు, సంస్కృతుల సమాహారమైన భారత్‌లో అందరినీ ఏకతాటిపై నడిపిస్తోంది. అటు దృఢంగా.. ఇటు మార్పుచేర్పులకు అనుగుణంగా ఉండడమే రాజ్యాంగం గొప్పదనం. దీని కారణంగానే ఇప్పటికి 106 సార్లు సవరించారు' అని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ అన్నారు. శుక్రవారం రాత్రి విజయవాడలో ఏపీ న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రాజ్యాంగ దినోత్సవ' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'భారత రాజ్యాంగం ఇప్పటికి ఐదు యుద్ధాలు చూసింది. అయినా చెక్కుచెదరకుండా నిలబడింది. ఇందులో అందరికీ వారి బాధ్యతలను నిర్దేశించడమే కారణం. అట్టడుగున ఉన్న సామాన్యులకు కూడా రాజ్యాంగ స్ఫూర్తి చేరినప్పుడే దీని ప్రయోజనం సిద్ధిస్తుంది. ఈ విషయంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలి. కార్యనిర్వాహక వ్యవస్థ చేసిన తప్పిదాలతో కోర్టుల్లో పెద్దఎత్తున రిట్ పిటిషన్లు వెల్లువెత్తుతున్నాయి. ఇబ్బంది పడుతున్న సామాన్యులకు సరైన న్యాయం జరిగేలా న్యాయవాదులు తోడ్పాటు అందించాలి. ఎప్పటి నుంచో అమలులో ఉన్న ఆర్టికల్ 370 రద్దు చేయడంలోనూ రాజ్యాంగం ప్రధాన భూమిక పోషించింది' అని జస్టిస్ హరినాథ్ అన్నారు.

చట్టబద్ధ పాలన అమలులో కీలకం: జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ

'దేశంలో చట్టబద్ధ పాలన అమలులో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తోంది. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందితేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఈ విషయంలో న్యాయవాదులు చొరవ తీసుకోవాలి. ప్రతి నెలా కనీసం ఒక కేసునైనా ఉచితంగా పేదలకు ప్రయోజనం కలిగించేలా చేపట్టాలి. 75 వసంతాలు పూర్తి చేసుకుని 76వ ఏట అడుగుపెట్టినా రాజ్యాంగానికి వన్నె తగ్గకపోవడం విశేషం.'

రాజ్యాంగ పరిరక్షణలో కోర్టులది కీలక పాత్ర: జస్టిస్ వై.లక్ష్మణరావు

'రాజ్యాంగ పరిరక్షణలో కోర్టులు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. రాజ్యాంగం మన దేశానికి గొప్ప వరం. ప్రజాస్వామ్యం ఇంకా మనుగడ సాగిస్తోందంటే అది రాజ్యాంగం గొప్పదనమే.'

రాజ్యాంగం అక్షయపాత్ర వంటిది: జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల

'మన రాజ్యాంగం అక్షయపాత్ర వంటిది. మనం ఎంత తీసుకుంటే అంత ఇస్తుంది. 70వ దశకంలో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రలో నిలిచిపోతుంది. తర్వాత సంవత్సరాల్లో దీనిని తిరగరాయాలని ప్రయత్నించినా ఇది సాధ్యం కాలేదు'

★ ఈ కార్యక్రమంలో న్యాయవాది పరిషత్ ఏపీ హైకోర్టు యూనిట్ అధ్యక్షుడు సీవీఆర్ రుద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, న్యాయవాది పరిషత్ కృష్ణా జిల్లా యూనిట్ అధ్యక్షులు వై.హరిబాబు, ప్రధాన కార్యదర్శి సూర్య, న్యాయవాది పరిషత్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జితేంద్ర, అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) చల్లా ధనంజయ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

దిల్లీ నుంచి దేశమంతా కొరియర్లలో సరఫరా

- నైజీరియన్ల డ్రగ్ నెట్‌వర్క్‌పై కీలకాధారాల సేకరణ
- 2 వేల మందికి పైగా కస్టమర్లు, పెడ్లర్ల వివరాలు లభ్యం

ఈనాడు, హైదరాబాద్: దిల్లీలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ఈగిల్) గురువారం చేపట్టిన భారీ ఆపరేషన్ నైజీరియన్ల డ్రగ్ నెట్‌వర్క్‌ను ఛేదించింది. దేశ రాజధాని నుంచి ప్రముఖ కొరియర్ సర్వీస్‌ల ద్వారా దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల్ని సరఫరా చేస్తూ సంపాదించిన సొమ్మును హవాలా మార్గంలో దేశం దాటిస్తున్న తీరుపై కీలక ఆధారాలు సేకరించింది. దిల్లీ పోలీసులు, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) సహకారంతో ఈగిల్ బృందం నిర్వహించిన ఈ దాడుల్లో 5340 ఎక్స్‌టసీ మాత్రలు.. 250 గ్రాముల కొకైన్.. 109 గ్రాముల హెరాయిన్.. 250 గ్రాముల మెథంఫెటమైన్ లభ్యమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.3.5 కోట్లుగా గుర్తించారు. డ్రగ్స్ లావాదేవీలతో సంబంధమున్న 107 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. దిల్లీ, గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలో గడువు ముగిసిన వీసాలపై ఉన్న 50 మంది నైజీరియన్లకు ఈ దందాతో సంబంధమున్నట్లు వెల్లడైంది. ఇందులో దేశవ్యాప్తంగా సుమారు 2 వేల మంది కస్టమర్లు, పెడ్లర్ల ప్రమేయమున్నట్లు గుర్తించారు. అక్రమంగా ఉంటున్న నైజీరియన్లను తిప్పి పంపే (డిపోర్టేషన్) ప్రక్రియపై దృష్టి సారించారు.

తెల్లవారుజామున 4.30 గంటల నుంచే ఆపరేషన్

ఈగిల్ బృందం దిల్లీ క్రైమ్‌బ్రాంచ్ పోలీసులు, ఎన్‌సీబీతో కలిసి ఈ నెల 27న తెల్లవారుజామున 4.30 గంటలకే దిల్లీలోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. పోలీసులు వెళ్లిన దాదాపు అన్ని ప్రాంతాల్లో చాలావరకు నైజీరియన్లు తలుపులు తెరవలేదు. ఈ సమయంలో నైజీరియన్లు డ్రగ్స్‌ను దాయడంతోపాటు కమోడ్‌లలో వేసి ఫ్లష్ చేసినట్లు గుర్తించారు.

ఆంధ్రా యూనివర్సిటీ లింక్‌లు బహిర్గతం

నైజీరియన్ల డ్రగ్ దందాపై నిఘా ఉంచిన క్రమంలోనే ఈ నెల 19న ముగ్గురు మహిళా అనుమానితులు దిల్లీ నుంచి విమానంలో వైజాగ్‌కు వెళ్లినట్లు సమాచారం అందింది. ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన విద్యార్థులిద్దరితోపాటు పార్వతీపురానికి చెందిన మరొకరికి డ్రగ్స్‌ను సరఫరా చేసేందుకే వీరు వైజాగ్ వెళ్లినట్లు తేలింది. సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో బస చేసిన వీరు డ్రగ్స్‌ను సరఫరా చేసిన అనంతరం రాత్రంతా మరో యువకుడితో కలిసి వినోదంలో మునిగి తేలినట్లు గుర్తించి అరెస్టు చేశారు. డ్రగ్స్ విక్రయంతోపాటు వీరు సెక్స్ వర్కర్లు గానూ పనిచేస్తున్నట్లు తేలింది.

EENADU Vol: 52, Issue: 109 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ప్రోత్సాహకర గణాంకాలివి: ప్రధాని మోదీ



ఈ గణాంకాలు చాలా ప్రోత్సాహకరంగా ఉన్నాయి. వృద్ధికి అనుకూలమైన విధానాలు - సంస్కరణల ప్రభావాన్ని, మా కృషి, ప్రజల సమష్టి తత్వాన్నీ ప్రతిబింబిస్తున్నాయి. సంస్కరణలను కొనసాగిస్తాం. పౌరులందరి జీవితాన్ని మరింత సౌకర్యవంతం చేస్తాం.

జై డీపీ



● ఆరు త్రైమాసికాల గరిష్ఠానికి ఆర్థిక వృద్ధి
● జులై-సెప్టెంబరులో 8.2% ● ఉపకరించిన జీఎస్టీ కోత

భారత బలానికి నిదర్శనం: ఆర్థిక మంత్రి సీతారామన్



భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. సంస్కరణలు, ద్రవ్య స్థిరీకరణ చర్యలు ఇందుకు దోహదం చేశాయి. 8.2% వృద్ధితో, ప్రపంచంలోనే అత్యంత వేగవంత ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోంది.

భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.2% వృద్ధిని నమోదు చేసింది. ఇది ఆరు త్రైమాసికాల గరిష్ఠస్థాయి. జీఎస్టీ రేట్ల కోతలతో వినియోగం పెరుగుతుందనే అంచనాల మధ్య పరిశ్రమ ఉత్పత్తి అధికమైంది. అందువల్లే వ్యవసాయ ఉత్పత్తి తగ్గినా.. జీడీపీ రాణించగలిగింది.

వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం పదిలం..: 2025-26 తొలి త్రైమాసిక వృద్ధిరేటు 7.8%, 2024-25 జులై-సెప్టెంబరులోని 5.6% కంటే తాజా గణాంకాలు మిన్నగా ఉన్నాయి. సేవల రంగం రెండంకెల వృద్ధి సాధించడమూ కలిసొచ్చింది. 2023-24 నాలుగో త్రైమాసికంలో నమోదైన 8.4% వృద్ధి తర్వాత, అత్యధిక వృద్ధి ఇదే. ప్రపంచంలోనే వేగవంతమైన పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం కొనసాగేందుకు తాజా గణాంకాలు ఉపకరించాయి. జులై-సెప్టెంబరులో చైనా వృద్ధి 4.8 శాతమే.

పూర్తి ఆర్థిక సంవత్సరానికి అంచనాలు మించొచ్చు: 2025-26 ప్రథమార్ధంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 8 శాతానికి చేరిందని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) తెలిపింది. 2024-25 ఇదే సమయంలో జీడీపీ వృద్ధి 6.1 శాతంగా ఉంది. ప్రస్తుత వృద్ధి ఫలితంగా, 2025-26 మొత్తానికి ఆర్థిక సర్వేలో అంచనా వేసిన 6.3-6.8% వృద్ధిరేటును సులువుగా అధిగమించొచ్చు.

✦ సమీక్షిస్తున్న త్రైమాసికంలో తయారీ రంగం 9.1% వృద్ధి చెందింది. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇది 2.2 శాతంగా ఉంది. సెప్టెంబరు 22 నుంచి జీఎస్టీ రేట్ల కోత అమలవుతుందని ముందుగానే ప్రకటించడం, పండగల సీజను గిరాకీని అందుకునేందుకు పరిశ్రమలు ఉత్పత్తి పెంచడం ఇందుకు నేపథ్యం. సేవల రంగం 7.2% నుంచి 10.2 శాతానికి పెరగ్గా.. వ్యవసాయ రంగ వృద్ధి 4.1% నుంచి 3.5 శాతానికి పరిమితమైంది.

సెప్టెంబరు త్రైమాసికంలో వాస్తవిక జీడీపీ(రూ.లక్షల కోట్లు)		
2025–26	2024–25	వృద్ధి(%)
48.63	44.94	8.2

సెప్టెంబరు త్రైమాసికంలో సాధారణ జీడీపీ(రూ.లక్షల కోట్లు)		
2025–26	2024–25	వృద్ధి(%)
85.25	78.40	8.7

టారిఫ్‌ల ప్రభావం పడుతుంది అనుకున్నాం కానీ..: 'పండగల సీజను వ్యయాల ఫలితంగా మూడో త్రైమాసికంలోనూ వృద్ధి ధోరణి కొనసాగుతుంది. పూర్తి ఆర్థిక సంవత్సర వృద్ధిరేటు అంచనాలను పెంచే అవకాశం ఉంద'ని డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ అన్నారు.

☛ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థిక వ్యవస్థ 4 లక్షల కోట్ల డాలర్ల (దాదాపు రూ.356 లక్షల కోట్ల) స్థాయిని అధిగమిస్తుందని ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అంచనా వేశారు.

☛ 2025లో 7%, వచ్చే ఏడాది 6.4% వృద్ధితో వర్ధమాన, ఆసియా పసిఫిక్ దేశాల్లో భారత్ ముందంజలో నిలబడగలదని మూడీస్ రేటింగ్స్ పేర్కొంది.

☛ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు చివరికి ద్రవ్య లోటు రూ.8,25,144 కోట్లుగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న ద్రవ్యలోటు లక్ష్యమైన రూ.15.69 లక్షల కోట్లలో ఇది 52.6 శాతానికి సమానం.

ఈనాడు బిజినెస్

రోజూ రెండు కొత్త ఫార్మసీ స్టోర్లు

● ఐదేళ్లలో 10 కోట్ల మంది వినియోగదార్ల లక్ష్యం
● అపోలో హెల్త్‌కో ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభన కామినేని



ఈనాడు, హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సంస్థ అయిన అపోలో ఫార్మసీ విస్తరణ బాటలో ఉంది. రోజూ 2 కొత్త ఫార్మసీ స్టోర్లు ప్రారంభించాలని, ఐదేళ్లలో 10 కోట్ల మంది వినియోగదార్లను సంపాదించుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. తాజాగా ఈ సంస్థ 7,000 ఫార్మసీ స్టోర్ల సంఖ్యను చేరుకుంది. 7,000వ స్టోర్‌ను ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ప్రారంభించారు. రోజూ తమకు 10 లక్షలకు పైగా మంది ఆర్డర్లు లభిస్తున్నాయని అపోలో హెల్త్‌కో ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభన కామినేని తెలిపారు. అపోలో ఫార్మసీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అయిన అపోలో 24/7 యాప్, దేశంలోని 19,000 పిన్‌కోడ్‌లకు మందులు పంపిణీ చేస్తోందని అన్నారు. అపోలో వైద్యులతో ఆన్‌లైన్ కన్సల్టేషన్, డయాగ్నస్టిక్స్, ఆరోగ్య బీమా సేవలనూ అందిస్తున్నట్లు వివరించారు. వీటితో పాటే ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం 'అపోలో సర్కిల్' సభ్యుల సంఖ్య కోటికి చేరిందని అపోలో ఫార్మసీ సీఈఓ పి.జయకుమార్ అన్నారు.

ఐసీఏఐ గిన్నిస్ రికార్డు

దిల్లీ: ముంబయిలో ఒకే రోజులో అతిపెద్ద కెరీర్ సలహా కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించి, గిన్నిస్ రికార్డు సాధించినట్లు చార్టర్డ్ అకౌంటెంట్ల అత్యున్నత సంస్థ ఐసీఏఐ శుక్రవారం వెల్లడించింది. ఈ సెషన్‌లో 7400 మందికి పైగా విద్యార్థులు, ఇతర వ్యక్తులు పాల్గొన్నారు. 'కెరీర్ ఇన్ అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ ఫర్ యూత్ (సీఏఎఫ్‌వై 4.0)', సూపర్ మెగా కెరీర్ కౌన్సెలింగ్ ప్రోగ్రామ్‌ను గురువారం దేశవ్యాప్తంగా నిర్వహించారు. ఇందులో మొత్తం 1.3 లక్షల మంది పాల్గొన్నారు. ముంబయి కార్యక్రమంలో 7400 మంది విద్యార్థులు, ఉద్యోగులు, ప్రిన్సిపల్స్, ఇతరులు పాల్గొన్నారు. ఇప్పటివరకు ఉన్న 6,166 మంది విద్యార్థుల రికార్డును బద్దలు కొట్టినట్లు ఐసీఏఐ ప్రెసిడెంట్ చరణ్‌జోత్ సింగ్ నందా ప్రకటించారు.

జియో ఖాతాలో మరో 20 లక్షల మంది

20.8 లక్షల మంది వినియోగదారులను పోగొట్టుకున్న వొడాఫోన్ ఐడియా: ట్రాయ్

దిల్లీ: ఈ ఏడాది అక్టోబరులో రిలయన్స్ జియో కొత్తగా 19.97 లక్షల మంది మొబైల్ వినియోగదారులను చేర్చుకుంది. దీంతో సంస్థ మొత్తం చందాదారుల సంఖ్య 48.47 కోట్లకు చేరినట్లు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాలు స్పష్టం చేశాయి. ఇదే నెలలో ఎయిర్‌టెల్ వినియోగదారులు 12.52 లక్షలు పెరిగి 39.36 కోట్లకు చేరారు. బీఎస్ఎన్ఎల్ కూడా 2.69 లక్షల ఖాతాదారులను చేర్చుకుని, మొత్తం సంఖ్య 9.25 కోట్లకు పెంచుకుంది. వొడాఫోన్ ఐడియా మాత్రం 20.83 లక్షల మంది ఖాతాదారులను పోగొట్టుకోవడంతో మొత్తం సంఖ్య 20.07 కోట్లకు పరిమితమైంది. మన దేశ మొత్తం టెలిఫోన్ చందాదారుల సంఖ్య 123 కోట్లకు పెరిగింది. ఇందులో వైర్‌లెస్ 118.4 కోట్లు కాగా.. వైర్‌లైన్ చందాదారులు 4.6 కోట్లు.

కోడి గుడ్డు

29న ఫారం వద్ద రైతు అమ్మకం ధర (వంద) (100 గుడ్లకు రూపాయల్లో)

హైదరాబాద్	630
వరంగల్	632
విజయవాడ	640
తూ/ప గోదావరి	620
విశాఖపట్నం	610
చిత్తూరు	663

మరింత సురక్షితంగా డిజిటల్ బ్యాంకింగ్

● కొత్త నిబంధనలు తీసుకొచ్చిన ఆర్‌బీఐ
● జనవరి 1 నుంచి అమల్లోకి



ఈనాడు బిజినెస్ బ్యూరో: డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థను మరింత సురక్షితం, సులభతరం చేయడంతో పాటు, ప్రమాణీకరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సిద్ధమయ్యింది. ఇందుకోసం 'డిజిటల్ బ్యాంకింగ్ ఛానల్స్ ఆథరైజేషన్ డైరెక్షన్స్-2025' పేరుతో కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. 2026 జనవరి 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా, అన్ని వాణిజ్య బ్యాంకులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్స్ బ్యాంకులు, ప్రాంతీయ బ్యాంకులకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంది. ఆన్‌లైన్ ఛానల్స్ నియంత్రణతో పాటు లావాదేవీల భద్రత మెరుగుపర్చేందుకు ఆర్‌బీఐ ఈ చర్యలు తీసుకుంటోంది. వెబ్‌సైట్లు, మొబైల్ బ్యాంకింగ్ తదితరాలన్నీ ఈ మార్గదర్శకాల పరిధిలోకి వస్తాయి.

రెండు రకాలుగా...: ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను జనవరి 1 నుంచి 2 రకాలుగా పరిగణించనున్నారు.

చూడటానికే: ఖాతాదారుకు పరిమిత సేవలు మాత్రమే అందుబాటులో ఉండటం. అంటే, తన ఖాతాలో ఉన్న నగదు నిల్వ చూసుకోవడం, ఖాతా స్టేట్‌మెంట్లు తీసుకోవడం లాంటివి. ఈ సౌకర్యం ఎంచుకున్నప్పుడు నిధుల బదిలీకి సంబంధించిన ఏ సేవలకూ ఖాతాదారుడిని బ్యాంకులు బాధ్యత చేయలేవు.

లావాదేవీల సౌకర్యం: నిధుల బదిలీ, ఇతర బ్యాంకింగ్ సేవలన్నీ అందుబాటులో ఉంటాయి.

ఒత్తిడి చేయొద్దు..

ఖాతాదారుల హక్కులను కాపాడేందుకు మార్గదర్శకాల్లో పలు సూచనలూ ఆర్‌బీఐ చేసింది. ఆన్‌లైన్ ఛానెల్స్‌కోసం రిజిస్ట్రేషన్/డీరిజిస్ట్రేషన్ కోసం ఖాతాదారుల నుంచి స్పష్టమైన అనుమతి తీసుకోవాలి. లావాదేవీలకు సంబంధించి ఎస్ఎంఎస్/ఇ-మెయిల్ పంపించాలి. షరతులు, నిబంధనలను స్పష్టమైన, సరళమైన భాషలో (ఆంగ్లం, హిందీ, స్థానిక భాషల్లో) అందించాలి. డెబిట్ కార్డులు, ఇతర సేవలతో బ్యాంకుల డిజిటల్ ఛానల్స్‌ను ముడిపెట్టకూడదు. వినియోగదారుడి ఎంపికకే ప్రాధాన్యం ఇవ్వాలి.

ఈ వర్గీకరణ ద్వారా ఖాతాదారులకు బ్యాంకులు సరైన సేవలను అందించేందుకు తోడ్పడతాయి. ఉదాహరణకు కొత్త వినియోగదారులు ముందుగా 'వ్యూ ఓన్లీ' విధానంలో చేరి, ఆ తర్వాత ట్రాన్సాక్షనల్ సేవలకు మారొచ్చు. దీనివల్ల మోసాలను నివారించేందుకు వీలవుతుంది. డిజిటల్ ఛానల్స్‌ను ప్రారంభించాలంటే బ్యాంకులు ఆర్‌బీఐ నిబంధనలను కచ్చితంగా పాటించాలి.

పసిడి బిస్కెట్లకూ హాల్‌మార్కింగ్!

● కృత్రిమ వజ్రాలకు నియమావళి
● ప్రభుత్వం సన్నాహాలు



పసిడి బిస్కెట్లు, కడ్డీలు, నాణేల (బులియన్)కు స్వచ్ఛంద హాల్‌మార్కింగ్‌ను తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే వెండి ఆభరణాలు, కళాఖండాలకు స్వచ్ఛంద హాల్‌మార్కింగ్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం, ఇకపై బులియన్‌కూ అమలు చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం బంగారు ఆభరణాలకే హాల్‌మార్కింగ్ తప్పనిసరిగా అమలవుతోంది. తద్వారా ఆభరణాల తయారీదార్లు స్వచ్ఛమైన మేలిమి బంగారం పొందేలా చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. సహజ వజ్రాలు - ప్రయోగశాలలో అభివృద్ధి చేసిన కృత్రిమ వజ్రాల మధ్య తేడాను వినియోగదారులు గుర్తించేలా స్పష్టమైన నియమావళి తీసుకురావడానికీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తద్వారా ఈ విభాగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని ఆశిస్తోంది. పసిడి, వెండి వంటి విలువైన లోహాల స్వచ్ఛతను ధ్రువీకరించేదే హాల్‌మార్కింగ్. 2021 జూన్ నుంచి పసిడి ఆభరణాలకు హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేశారు. 2025 సెప్టెంబరు 1 నుంచి వెండి ఆభరణాలు, కళాఖండాలకు స్వచ్ఛంద హాల్‌మార్కింగ్ అమల్లోకి వచ్చింది.


✦ సీఐఐ నిర్వహించిన రత్నాభరణాల సదస్సులో కేంద్ర వినియోగదారు వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే మాట్లాడుతూ.. పసిడి ఆభరణాల హాల్‌మార్కింగ్‌కు వచ్చిన స్పందనతో, వెండికి స్వచ్ఛంద హాల్‌మార్కింగ్‌ను ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. వెండి హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేయడానికి ముందు పరిశ్రమకు మరింత సమయం ఇస్తున్నట్లు ఆమె తెలిపారు.

పసిడి ధరల నిర్ణయాత్మక శక్తిగా భారత్!

అంతర్జాతీయ పసిడి విపణి ఆధారంగా, దేశీయంగా ధరలు అమలుచేస్తున్న ప్రస్తుత స్థాయి నుంచి.. పసిడికి ధర నిర్ణయించే శక్తిగా భారత్ మారాల్సి ఉందని పరిశ్రమ ప్రముఖులు పేర్కొన్నారు. దేశీయ మైనింగ్, పసిడి బ్యాంకింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల.. అంతర్జాతీయ విపణిలోని పసిడి ధరను భారత్ తీసుకుంటోందని.. లండన్ ఏఎం, పీఎం ప్రామాణిక ధరలపై ఆధారపడుతోందని ప్రపంచ స్వర్ణ మండలి ప్రాంతీయ సీఈఓ (భారత్) సచిన్ జైన్ వెల్లడించారు. దేశీయంగా పసిడి ఉత్పత్తి పెరిగితే, 20% అవసరాలు తీరతాయని.. అప్పుడు ధరల నిర్ణయంలోనూ భారత పాత్ర ఉంటుందన్నారు. 2-3 ఏళ్లలో భారత్ ప్రపంచ ఆభరణాల హబ్‌గా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

అమెరికా, ఈయూలతో చురుగ్గా చర్చలు

వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



దిల్లీ: అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ) వంటి పలు వాణిజ్య భాగస్వాములతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏ)పై భారత్ చురుగ్గా చర్చలు జరుపుతోందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. 'భారత్ తన విశ్వసనీయ వాణిజ్య భాగస్వాములతో ఈ ఒప్పందాల కోసం పనిచేస్తోంది. తద్వారా ఆర్థిక బంధాలను బలోపేతం చేసుకుంటుంద'ని అన్నారు. సుమారు 50 దేశాలు, దేశ బృందాలతో ఎఫ్‌టీఏ కోసం భారత్ చర్చలు జరుపుతోందని అన్నారు. గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్(జీసీసీ) కూడా మనదేశంతో వాణిజ్య ఒప్పంద చర్చలపై ఆసక్తిగా ఉందని మంత్రి అన్నారు. యూఏఈతో ఇప్పటికే ఒక విస్తృత స్థాయి వాణిజ్య ఒప్పందాన్ని భారత్ అమలు చేస్తుండగా, ఒమన్‌తో చర్చలు పూర్తి కావొస్తున్నాయి. బహ్రెయిన్, ఖతర్‌తో చర్చల్లోకి అడుగుపెట్టాం. 'ఆరు దేశాల గ్రూపు (జీసీసీ) కూడా చర్చల్లో ఉంది. న్యూజిలాండ్‌తోనూ మాట్లాడుతున్నాం. అమెరికా, 27 దేశాల ఈయూతోనూ చురుగ్గా చర్చల్లో పాల్గొంటున్నామ'ని ఫిక్కీ వార్షిక సాధారణ సమావేశంలో మంత్రి చెప్పారు. భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని (బీటీఏ) ఈ ఏడాది చివరిలోగా ఖరారు చేసుకోగలమని, ఇందుకు సంబంధించిన చర్చలు ముందస్తు దశలో ఉన్నాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు.

ఆసియా పవర్ ఇండెక్స్‌లో ప్రధాన శక్తిగా భారత్



ఆసియా పవర్ ఇండెక్స్-2025లో 'ప్రధాన శక్తి' హోదాకు భారత్ చేరుకుందని ఆస్ట్రేలియా సంస్థ లోవీ ఇన్‌స్టిట్యూట్ శుక్రవారం వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌లో మన దేశ ప్రదర్శన ఆధారంగా ఆర్థికాభివృద్ధి, సైనిక సామర్థ్యాల వల్లే, ఈ హోదా లభించినట్లు తెలిపింది. అయితే భారత లక్ష్యాలు, వాస్తవికత మధ్య అంతరాలు ఇప్పటికీ ఉన్నాయని, ఫలితంగా చైనాతో పోలిస్తే పలు పరిమితిలు కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది. ఆసియా దేశాల శక్తి సామర్థ్యాలు, చూపించే ప్రభావం ఆధారంగా వార్షిక ఆసియా పవర్ ఇండెక్స్‌ను నిర్ణయిస్తారు. ఆసియా పవర్ ఇండెక్స్-2024లో 38.1 పాయింట్ల స్కోర్‌తో ఉన్న భారత్.. ఈ ఏడాదిలో 40 పాయింట్లతో ప్రధాన శక్తిగా అవతరించింది. అమెరికా (80.5 పాయింట్లు), చైనా (73.7 పాయింట్లు) తర్వాత భారత్ మూడోస్థానంలో ఉంది. 38.8 పాయింట్లతో జపాన్ నాలుగో స్థానంలో నిలిచింది.

ఆర్థిక సామర్థ్యాలు, భవిష్యత్ వనరుల ఆధారంగా భారత్‌కు మూడో స్థానం ఇచ్చారు. ఆర్థిక సామర్థ్యం ర్యాంక్‌ను ఒక స్థానం మెరుగుపరుచుకుని మూడో స్థానానికి చేరుకున్న భారత్, ఈ క్రమంలో జపాన్‌ను వెనక్కి నెట్టింది. అంతర్గత పెట్టుబడులు పెరగడంతో ఆర్థిక సంబంధాల్లో భారత్ 9వ స్థానానికి పెరిగింది.

✦ ఆసియా పవర్ ఇండెక్స్ 2025లో భారత ఆర్థిక, సైనిక సామర్థ్యాలు రెండూ పెరిగాయని లోవీ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది.

✦ రక్షణ వ్యవస్థల్లో భారత్ బలహీనంగా 11వ స్థానంలో ఉంది. క్రితం ఏడాదితో పోలిస్తే మన స్కోరు తగ్గడంతో ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ కంటే రెండు స్థానాలు తగ్గింది.

✦ సూచీ ప్రకారం.. పెట్టుబడులను ఆకర్షించడంలో అమెరికా తర్వాత భారత్ నిలిచింది. ఈ క్రమంలో చైనాను అధిగమించింది.

ఏఐ టూల్స్‌కు విశ్వసనీయత ముఖ్యం

'క్యూఈ కాంక్లేవ్ 2025'లో నిపుణులు



ప్రసంగిస్తున్న మధు మూర్తి

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతపై నమ్మకం కలిగించడం ఎంతో ముఖ్యమని.. ఒక చిన్న తప్పు జరిగినా ఈ అధునాతన సాంకేతికతపై విశ్వాసం సన్నగిల్లుతుందని క్వాలిటీ ఇంజినీరింగ్ సదస్సు 'క్యూఈ కాంక్లేవ్ 2025'లో వక్తలు హెచ్చరించారు. ఏఐ టూల్స్‌ను పూర్తిగా పరీక్షించి, తప్పులు జరగవని నిర్ధారించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఈ సదస్సులో వివిధ కంపెనీలకు చెందిన దాదాపు 600 మంది ఇంజినీర్లు, సీఎక్స్‌ఓలు, క్వాలిటీ పరిశోధకులు పాల్గొన్నారు. క్వాలిజీల్ సహవ్యవస్థాపకుడు మధుమూర్తి రోణంకి మాట్లాడుతూ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే ముందు, దాన్ని పూర్తిస్థాయిలో పరీక్షించడానికి టెస్టింగ్ టూల్స్ అవసరమని పేర్కొన్నారు. 'వాలిడేట్' అనే ఏఐ వాలిడేషన్, ట్రస్ట్ ఇంజినీరింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను ఆవిష్కరించారు. ఎన్ఐఎస్‌టీకి చెందిన ఏఐ రిస్క్ మేనేజ్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ (ఆర్ఎంఎఫ్), ఐఎస్ఓ/ఐఈసీ 42001 ప్రమాణాలకు అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దినట్లు మధుమూర్తి తెలిపారు. వ్యాపార సంస్థలకు ఏఐపై హామీ ఒక్కటే సరిపోదని, విశ్వాసం కల్పించడం అవసరమని ఎవరెస్ట్ గ్రూపు ఉపాధ్యక్షుడు అంకిత్ గుప్తా అన్నారు. సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి రాయ్, పిక్లాడీ సహ వ్యవస్థాపకుడు అవినాష్ తివారీ, బ్రౌజర్‌స్టాక్, కంటెక్స్ట్‌ఏఐ, బ్రాడ్‌రిడ్జ్.. తదితర సంస్థల ప్రతినిధులు మాట్లాడారు.

బాండ్ మార్కెట్లోకి మధ్య స్థాయి కంపెనీలూ రావాలి: అనంత నాగేశ్వరన్

ముంబయి: భారీ స్థాయి, మంచి రేటింగ్ ఉన్న కంపెనీలే నిధుల సమీకరణ కోసం బాండ్ మార్కెట్లోకి వెళుతున్నాయని, మధ్య స్థాయి కంపెనీలూ బాండ్ మార్కెట్లను అందిపుచ్చుకోవాలని ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. మార్కెట్లో ద్రవ్యలభ్యత పెరగాల్సిన అవసరాన్నీ ఆయన నొక్కి చెప్పారు. అలాగే మదుపర్లు తమ బాండ్ల గడువు ముగిసేవరకూ వేచిచూసే ధోరణిని మానుకోవాలనీ అన్నారు. అటు బాండ్ మార్కెట్లు, ఇటు బ్యాంకు రుణాలు.. 'డబుల్ ఇంజిన్'లాగా భారత్ వంటి వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు ఆర్థిక మద్దతును అందించాల్సి ఉంటుందన్నారు.

సంక్షిప్తంగా

☛ భారత్‌లో నోయిడా వద్ద తన అయిదో విక్రయ కేంద్రాన్ని **యాపిల్** తెరవనుంది. డీఎల్ఎఫ్ మాల్ ఆఫ్ ఇండియాలో ఉన్న ఈ యాపిల్ నోయిడా స్టోర్‌ను డిసెంబరు 11న ప్రారంభించనుంది.

☛ వస్తువుల ఎగుమతులపై తప్పుడు పద్ధతిలో రిఫండ్‌లను క్లెయిమ్ చేసుకుందని ఆరోపిస్తూ **టొరెంట్ ఫార్మాస్యూటికల్స్**పై జీఎస్టీ అధికారులు రూ.41 కోట్ల జరిమానా విధించారు.

☛ ఒక నెల వరకు లేదంటే నిపుణుల కమిటీ దర్యాప్తు పూర్తయ్యే వరకు, ఎన్‌హెచ్ఏఐ నిర్వహించే బిడ్ ప్రక్రియల్లో పాల్గొనకుండా **అశోకా బిల్డ్‌కాన్**పై ఎన్‌హెచ్ఏఐ ఆంక్షలు విధించింది.

☛ రైట్స్ ఇష్యూలో **బైజూస్** మాతృసంస్థ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్‌కు (టీఎల్‌పీఎల్) రూ.25 కోట్ల విలువైన షేర్ల కేటాయింపును **ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్** నిలిపేసింది. రూ.25 కోట్లను డిపాజిట్ చేసే విషయంలో ఫెమాతో పాటు ఇతర నిబంధనలు టీఎల్‌పీఎల్ ఉల్లంఘించి ఉండొచ్చన్న ఆందోళనలతో ఈ నిర్ణయం తీసుకుంది.

☛ ఆస్ట్రేలియాలోని **అదానీ గ్రూపు**నకు చెందిన కార్మైకెల్ బొగ్గు గనులకు సంబంధించిన రహస్య సమాచారాన్ని అడిగేందుకు, వాడేందుకు వీలు లేదని ఒక సామాజిక కార్యకర్తను నియంత్రిస్తూ క్వీన్స్‌ల్యాండ్ సుప్రీంకోర్టు శాశ్వత ఆదేశాలను జారీ చేసింది. దీంతో ఆ సామాజిక కార్యకర్తకు, అదానీ కంపెనీకి మధ్య చాన్నాళ్లుగా కొనసాగుతున్న వివాదానికి ముగింపు పలికినట్లయ్యింది.

ఐఐపీ గణాంకాలు 1న

అక్టోబరు నెలకు సంబంధించి పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గణాంకాలను డిసెంబరు 1న విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సాధారణంగా ఐఐపీ గణాంకాలను ప్రతి నెలా 28న, ఆ రోజు సెలవు ఉంటే మరుసటి రోజున విడుదల చేస్తుంటారు. ఈ నెల 28న రెండో త్రైమాసిక జీడీపీ వృద్ధి గణాంకాల వెల్లడి ఉన్నందున, ఐఐపీ గణాంకాల విడుదల తేదీని 1వ తేదీకి ప్రభుత్వం మార్చింది.

☛ తొలి పబ్లిక్ ఆఫర్ ద్వారా రూ.6,650 కోట్ల వరకు సమీకరించేందుకు వాటాదార్ల అనుమతి తీసుకునే నిమిత్తం డిసెంబరు 20న సర్వసభ్య సమావేశాన్ని (ఈజీఎం) **ఓయో** మాతృసంస్థ ప్రిజమ్ నిర్వహించనుంది.

☛ తమ నియంత్రణ పరిధిలోని సంస్థలు, ఏజెంట్లు వాటి సామాజిక మాధ్యమాల ప్లాట్‌ఫామ్ హోమ్ పేజ్‌పై నమోదిత పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య తప్పనిసరిగా ప్రదర్శించాలని **సెబీ** ప్రతిపాదించింది.

సూచీలకు అతిస్వల్ప నష్టాలు

సెన్సెక్స్ ▼ 14	నిఫ్టీ ▼ 13
85707	26203

జీడీపీ గణాంకాల నేపథ్యంలో మదుపర్ల అప్రమత్తత

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.3795.72 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.4148.48 కోట్లు

సమీక్ష

తీవ్ర ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో సూచీలు అతిస్వల్ప నష్టాలతో ముగిశాయి. జులై- సెప్టెంబరు త్రైమాసిక జీడీపీ గణాంకాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించడం ఇందుకు కారణం. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగడం, విదేశీ మార్కెట్ల నుంచి మద్దతునిచ్చే సంకేతాలు లేకపోవడమూ ప్రభావాన్ని చూపింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 9 పైసలు తగ్గి 89.45 వద్ద స్థిరపడింది. బ్రెంట్ ముడి చమురు 0.27% నష్టంతో 63.17 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, హాంకాంగ్ మినహా మిగతా దేశాల సూచీలు లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు లాభాల్లోనే ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2000 కోట్లు పెరిగి, రూ.474.35 లక్షల కోట్ల (5.30 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

తీవ్ర ఒడుదొడుకులు..

బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 85,720.38) స్వల్ప లాభాలతో 85,791.55 పాయింట్ల వద్ద ఆరంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్నా, మళ్లీ లాభాల్లోకి వచ్చింది. అక్కడ నుంచి ఒడుదొడుకుల మధ్య చలిస్తూ 85,969.89 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠానికి చేరుకుంది. చివరకు 13.71 పాయింట్ల నష్టంతో 85,706.67 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 12.60 పాయింట్లు కోల్పోయి 26,202.95 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,280.75 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 26,172.40 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 475 పాయింట్లు, నిఫ్టీ 135 పాయింట్లు పెరిగాయి.



12 లాభాల్లో.. 18 నష్టాల్లో..

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 లాభాల్లో, 18 నష్టాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ 1.39%, ఎటర్నల్ 0.83%, భారతీ ఎయిర్‌టెల్ 0.7%, యాక్సిస్ బ్యాంక్ 0.55%%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.42%, ఇన్ఫోసిస్ 0.41%, ట్రెంట్ 0.41% చొప్పున తగ్గాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 2.07%, సన్‌ఫార్మా 1.2%, ఎస్‌బీఐ 0.69%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.68%, హిందుస్థాన్ యునిలీవర్ 0.65% పెరిగాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో చమురు- గ్యాస్, టెలి కమ్యూనికేషన్, ఇంధనం, విద్యుత్, యుటిలిటీస్ డీలాపడ్డాయి. ఆరోగ్య సంరక్షణ, లోహ, సేవల రంగాల సూచీలు రాణించాయి.

అదరగొట్టిన సుదీప్ ఫార్మా

సుదీప్ ఫార్మా షేర్లు నమోదైన రోజే అదరగొట్టాయి. ఇష్యూ ధర రూ.593తో పోలిస్తే, బీఎస్ఈలో 23.76% అధికంగా రూ.733.95 వద్ద ఈ షేర్లు నమోదయ్యాయి. తదుపరి 34.19% దూసుకెళ్లి రూ.795.80 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరినా, చివరకు 30.47% లాభంతో రూ.773.70 వద్ద ముగిశాయి. ఎన్ఎస్ఈలోనూ ఈ షేరు 30.54% పెరిగి రూ.774.15 వద్ద స్థిరపడింది. తొలి రోజు కంపెనీ మార్కెట్ విలువ రూ.8,738.84 కోట్లుగా నమోదైంది.

60,000 పాయింట్ల చేరువకు బ్యాంక్ నిఫ్టీ

బ్యాంక్ నిఫ్టీ 60,000 పాయింట్ల మైలురాయికి చేరువయ్యింది. శుక్రవారం కూడా లాభాల్లో ముగిసిన ఈ సూచీ 59,897.50 పాయింట్ల వద్ద తాజా జీవన కాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది మార్చిలో నమోదైన 52 వారాల కనిష్ఠమైన 47,702.90 పాయింట్లతో పోలిస్తే ఇప్పటికి 25% పెరగడం గమనార్హం. గత మూడు రోజుల్లో ఈ సూచీ 2% లాభపడింది. దేశీయ బ్యాంకింగ్ రంగంపై మదుపర్ల సానుకూల దృక్పథానికి దీనిని సంకేతంగా చూడొచ్చు.

ఐపీఓ సమాచారమ్

కంపెనీ	పబ్లిక్ ఇష్యూ తేదీలు	ధరల శ్రేణి
మీషో	డిసెంబరు 3–5	రూ.105–111
ఏక్వస్	డిసెంబరు 3– 5	రూ.118–124
విద్యా వైర్స్	డిసెంబరు 3–5	రూ.48–52

విదేశీ మారకపు నిల్వలు తగ్గాయ్

నవంబరు 21తో ముగిసిన వారంలో మన విదేశీ మారకపు నిల్వలు 4.472 బిలియన్ డాలర్లు తగ్గి 688.104 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. విదేశీ మారకపు నిల్వల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 1.69 బిలియన్ డాలర్లు తగ్గి 560.60 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి. పసిడి నిల్వలు 2.675 బిలియన్ డాలర్లు తగ్గి 104.182 బిలియన్ డాలర్లకు; ఎస్‌డీఆర్‌లు (స్పెషల్ డ్రాయింగ్ రైట్స్) 84 మిలియన్ డాలర్లు తగ్గి 18.566 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 23 మిలియన్ డాలర్లు తగ్గి 4.757 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

ఈక్విటీ సూచీల్లోకి రీట్స్

మ్యూచువల్ ఫండ్స్, స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ ప్రాతినిధ్యాన్ని మరింతగా పెంచే ఉద్దేశంతో స్థిరాస్తి ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (రీట్స్)ను ఈక్విటీ పెట్టుబడి మార్గంగా సెబీ పునఃవర్గీకరించింది. 2026 జులై 1 లేదా ఆ తర్వాత రీట్స్‌ను ఈక్విటీ సూచీల్లోకి చేరుస్తామని సెబీ పేర్కొంది.

సినిమా

పాత్ర పరిమితులు దాటితే నో చెప్పేస్తా!



రాశీ ఖన్నా

ఇకపై కంటెంట్ ఆధారిత పాత్రల్లోనే నటించాలనుకుంటున్నానని అంటోంది అందాల తార రాశీ ఖన్నా. ఇటీవలే '120 బహాదుర్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించిందీ భామ. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె పాత్రల ఎంపిక గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "నేను దక్షిణాదిలో చాలా కమర్షియల్ సినిమాలు చేశాను. అందుకే మరో ముందడుగు వేసి హిందీలో కథా బలమున్న పాత్రల్నే ఎంచుకోవాలనుకుంటున్నా. వాణిజ్య చిత్రాలు చేయడం ఇష్టమే కానీ. . దానికి కూడా ఒక పరిమితి ఉంటుంది. ఎంచుకున్న పాత్రలో సౌకర్యంగా ఉండటం చాలా ముఖ్యం. ఒక వేళ ఆ పాత్ర నా వ్యక్తిగత పరిమితులను దాటుతుందని, అందులో నేను మరింత దిగజారిపోయేలా కనిపిస్తానని అనిపిస్తే.. క్షణం ఆలోచించకుండా నో చెప్పేస్తా. ప్రతి నటికి ఒక కంఫర్ట్ జోన్ ఉంటుంది. ఆ విషయంలో ఎవరినీ జడ్జ్ చేయకూడదనేది నా అభిప్రాయం" అని చెప్పుకొచ్చింది రాశి. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పాటు పలు చిత్రాలు.

వంద జన్మలెత్తినా నటుడిగానే పుడతా

'ఇఫి' ముగింపు వేడుకల్లో రజనీకాంత్



గోవా సీఎం ప్రమోద్ సావంత్, రజనీకాంత్

వంద జన్మలెత్తినా మళ్లీ నటుడిగానే పుడతానని అన్నారు అగ్రహీరో రజనీకాంత్. కొన్ని రోజులుగా గోవా వేదికగా జరుగుతోన్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) ముగింపు వేడుకల్లో శుక్రవారం రజనీకాంత్‌ను సన్మానించారు. కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఆయన్ను శాలువాతో సత్కరించారు. నటుడిగా 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రజనీకాంత్‌కు ఈ గౌరవం దక్కింది. సన్మానం అనంతరం రజనీ మాట్లాడుతూ.. "ఈ అద్భుతమైన వేదికపై నన్ను సత్కరించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు. నాకు సినిమాలు, నటన అంటే చాలా ఇష్టం. ఈ 50ఏళ్ల సినీ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు" అని తెలిపారు. ఈ ఏడాది 'స్కిన్ ఆఫ్ యూత్' చిత్రాన్ని 'గోల్డెన్ పికాక్' అవార్డు వరించింది. 2013లో సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో జరిగిన అంతర్యుద్ధం నేపథ్యంలో రూపొందిన 'సేఫ్ హౌస్' చిత్రానికి 'ఐసీఎఫ్‌టీ యునెస్కో గాంధీ మెడల్' దక్కింది. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు రిషబ్‌శెట్టి, నవాజుద్దీన్ సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ధురంధర్'. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఇఫి ముగింపు వేడుకలో ప్రదర్శించారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఇప్పటివరకూ మరణించిన సినీ ప్రముఖులు ధర్మేంద్ర, కామినీ కౌశల్, సులక్షణా పండిట్, సతీశ్ షా, పీయూశ్ పాండే, రిషబ్ తాండన్, గోవర్ధన్ అస్రానీ, పంకజ్ ధీర్, వరిందర్ సింగ్ ఘుమాన్, జుబీన్ గర్గ్, బాల్‌కర్వే, జస్వీందర్ భళ్లా, జ్యోతిచందేకర్, రతన్ థియామ్, బి.సరోజాదేవి, షఫాలీ జరీవాలా, పార్థో ఘోష్, విభు రాఘవే, షాజీ ఎన్ కరుణ్, మనోజ్‌కుమార్, అలోక్ ఛటర్జీ, శ్యామ్‌బెనగల్, జాకిర్ హుస్సేన్‌లకు 'ఇఫి' వేదికగా నివాళి అర్పించారు.



ఆది పినిశెట్టి, సంయుక్త, బోయపాటి శ్రీను, బాలకృష్ణ, తమన్, రామ్ ఆచంట, గోపీ ఆచంట

నేనే చరిత్ర... నాదే ఆ చరిత్ర

- బాలకృష్ణ

"పిల్లలు, ప్రకృతి జోలికి వెళ్తే దేవుడు మనిషిలో ఆవహిస్తాడన్నది 'అఖండ'లో చూపించాం. అకృత్యాలు మితిమీరితే మనిషే ఆ దైవాన్ని తనలోకి ఆవాహన చేసుకుంటాడని 'అఖండ 2'లో చూపించనున్నాం" అన్నారు నందమూరి బాలకృష్ణ. విజయవంతమైన 'అఖండ' చిత్రానికి కొనసాగింపుగా బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో తెరకెక్కిన పాన్ ఇండియా సినిమానే 'అఖండ 2: తాండవం'. ఎం తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. సంయుక్తా మేనన్ కథానాయిక. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ చిత్ర రిలీజ్ టీజర్‌ను విడుదల చేశారు. "భారత్‌ను కొట్టాలంటే అక్కడి మూలాల్ని అడ్డం పెట్టుకునే కొట్టాలి" అనే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం బాలకృష్ణ యాక్షన్ హంగామాతో ఆసక్తికరంగా సాగింది. "కొండల్లో తొండలు పట్టుకుని తిని బతికే మీరెక్కడ.. ప్రతి కొండని క్షేత్రంగా మార్చి పూజించే మేమెక్కడ" అంటూ ఆ ప్రచార చిత్రంలో వినిపించిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. అనంతరం కథానాయకుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. "చరిత్రలో చాలా మంది ఉంటారు. కానీ, ఆ చరిత్రను తిరగరాసి మళ్లీ చరిత్ర సృష్టించేవాడు ఒక్కడే ఉంటాడు. నేనే ఆ చరిత్ర. నాదే ఆ చరిత్ర. సినిమాల విషయంలో నేను తప్పు చేసిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. అప్పుడు తెలుసుకున్నా.. సినిమాలోని ఆత్మను పట్టుకోవాలని. నేనెప్పుడూ ప్రేక్షకుల గురించే ఆలోచిస్తుంటా. వాళ్లను మెప్పించడం కోసమే 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'డాకు మహారాజ్' లాంటి వైవిధ్య భరితమైన చిత్రాలు చేశా. ఇప్పుడీ క్రమంలోనే 'అఖండ 2: తాండవం'తో వస్తున్నా. ఆ మహాశివుడు సాక్షిగా.. పార్వతీ మాత తోడుగా.. గంగమ్మ తల్లి ఆశీర్వాదంతో దీన్ని చేశాం. ఆ రుద్ర తాండవ విన్యాసం నాలో ఆవేశమై.. ఆ త్రినేత్రుడి వీక్షణ దృష్టి నాలో నిక్షిప్తమై.. ఆయన త్రిశూలం నా ఆయుధానికి శక్తిశౌర్యమై.. నా పాత్ర ఎలా ఉంటుందన్నది రేపు తెరపై చూస్తారు. ఇటీవలే ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ చిత్ర ట్రైలర్‌ని చూశారు. సనాతన హిందూ ధర్మం శక్తిని, పరాక్రమాన్ని గొప్పగా చెప్పారని ప్రశంసించారు. ఈ చిత్రానికి రానున్న రోజుల్లో చాలా పండగలు నిర్వహించనున్నాం" అన్నారు.

'కెమెరా ముందు బాలకృష్ణ చేసిన తాండవాన్ని.. కెమెరా వెనుక బోయపాటి శ్రీను చేసిన తాండవాన్ని డిసెంబరు 5న థియేటర్లలో ప్రేక్షకులు చూస్తారు. ఇది వీళ్లిద్దరి కలయికలో డబుల్ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలుస్తుంది. కచ్చితంగా రేపు వెండితెరపై బాలయ్య నట విశ్వరూపాన్ని చూస్తారు" అన్నారు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట.

దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. "బాలకృష్ణ మా ఆస్తి.. శక్తి.. ధైర్యం. ఆయనతో 'అఖండ 2' చేస్తే అందరికీ పరమేశ్వరుడే కనిపించాలన్న లక్ష్యంతో బరిలోకి దిగాం. సినిమా చూసుకున్నాక ఇది భగవత్ కార్యక్రమం అని మాకు అర్థమైంది. ఆ భగవంతుడే మాతో ఈ చిత్రం చేయించుకున్నాడనిపించింది. ఈ సినిమా చూసి సెన్సార్ వాళ్లు యూఏ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ చిత్రం విడుదలయ్యాక 'మీరు చాలా గౌరవమైన స్థానం'లో ఉంటారని ప్రశంసించారు. ఈ సినిమాలో హర్షాలి నటనను ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటారు. ఈ కథంతా ఆమె చుట్టూనే తిరుగుతుంది" అన్నారు. "ఈ చిత్రాన్ని ఆ శివుడే నాతో చేయించుకున్నాడని నమ్ముతా. ఇలాంటి సినిమా చేయాలంటే చాలా అదృష్టం కావాలి. ఇందులో శివుడి రూపంలో బాలకృష్ణను చూసినప్పుడు ప్రతిఒక్కరూ చేతులెత్తి దణ్ణం పెడతారు" అన్నారు సంగీత దర్శకుడు తమన్.

"ఈ కథ విన్నప్పుడు గగుర్పాటుకు గురయ్యా. ఈ పాత్రకు బాలకృష్ణ తప్ప మరెవరూ న్యాయం చేయలేరనిపించింది. నేనిందులో ఓ చిన్న పాత్ర పోషించా. ఈ సినిమా అఖండ విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు నటుడు, నిర్మాత మురళీ మోహన్. ఈ కార్యక్రమంలో సంయుక్తా మేనన్, హర్షాలి, ఆది పినిశెట్టి, పూర్ణ, రామ్ - లక్ష్మణ్, మహేంద్రన్, సంతోష్ డిటాకే, శరత్ చంద్ర, కబీర్ దుహాన్ సింగ్, ప్రకాశ్, ఎల్వీ గంగాధర శాస్త్రి, సర్వేపల్లి శ్రేయా, సర్వేపల్లి రాజ్యలక్ష్మి, సౌందర్య, ఐశ్వర్య, కల్యాణ్ చక్రవర్తి, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పైరసీని అరికట్టడం కోసం జపాన్ బృందంతో ఒప్పందం



జపాన్ ప్రతినిధులతో డి.సురేశ్‌బాబు, భట్టి విక్రమార్క, సుప్రియ

పైరసీకి వ్యతిరేకంగా తీసుకొంటున్న చర్యలతో పాటు, అవలంబించే వ్యూహాలకు సంబంధించి పరిజ్ఞానాన్ని పంచుకోవడంలో భాగంగా జపాన్‌కి చెందిన ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ (కోడా) సంస్థ, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి (ఫిల్మ్ ఛాంబర్) పరస్పర అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కోడా సంస్థ డైరెక్టర్ టకేరో గోటోతోపాటు, జపాన్‌కి చెందిన అంతర్జాతీయ వ్యవహారాల డిప్యూటీ సీనియర్ డైరెక్టర్ తత్సుయ ఓట్సుకా శుక్రవారం తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలిని సందర్శించారు. ఛాంబర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన యాంటీ వీడియో పైరసీ సెల్ పనితీరుని, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించి పైరసీని ఎదుర్కోవడంలో తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన పురోగతిని ప్రశంసించారు. అంతకుముందు జపాన్ బృందంతో కలిసి తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు కె.ఎల్.దామోదర్‌ప్రసాద్, డి.సురేశ్‌బాబు, సుప్రియ యార్లగడ్డ, రాజ్‌కుమార్ ఆకెళ్ల, వై.మనీంద్ర తదితరులు ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కలిశారు. జపనీస్ కంటెంట్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ గురించి, జపాన్‌లో తెలుగు చిత్రాలకి పెరుగుతున్న ఆదరణ గురించి వివరించారు. డిజిటల్ పైరసీని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలు, సంస్థలు, ప్రభుత్వాలు పరస్పరం సహకారాన్ని అందించుకోవల్సిన అవసరం ఎంతో ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పైరసీని ఎదుర్కోవడంలోనూ, తెలుగు చిత్ర పరిశ్రమకు సహాయ సహకారాలు అందించడంలోనూ ఎంతో నిబద్ధతతో పనిచేస్తోందన్నారు తెలుగు సినీ ప్రముఖులు.

కలర్‌ఫుల్... 'పతంగ్'



ప్రణవ్, ప్రీతి, వంశీ పూజిత్

కొత్తతరం ఎంతో ఉత్సాహంగా చేసిన 'పతంగ్' అందరినీ అలరిస్తుందన్నారు ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు. ఆయన సంస్థ సురేశ్ ప్రొడక్షన్స్ సమర్పణలో ప్రేక్షకుల ముందుకొస్తున్న చిత్రమిది. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్యపాత్రలు పోషించారు. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. విజయ్‌శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. ఎస్పీ చరణ్ కీలక పాత్రని పోషించారు. ఈ చిత్రం డిసెంబరు 25న రానుంది. ఈ సందర్భంగా ఎమోషనల్ డ్రామా... అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ "కథే హీరోగా ఎంతో కలర్‌ఫుల్‌గా సాగుతుంది" అన్నారు.

టాక్సిక్ ప్రేమకథ



నవీన్, కుసుమ చందక

నవీన్, కుసుమ చందక జంటగా సురేశ్ లంకలపల్లి తెరకెక్కిస్తున్న చిత్రం 'లవ్ డేస్'. మాదల వెంకటకృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సూరజ్ ఆదిత్య సింగ్, మాస్టర్ రోహిల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. దర్శకుడు సముద్ర అతిథిగా హాజరయ్యారు. "ఇదొక విభిన్నమైన టాక్సిక్ ప్రేమకథతో రూపొందుతున్న సినిమా" అన్నారు దర్శకుడు సురేశ్ లంకలపల్లి.

పాఠాలు నేర్చుకోవడానికి థియేటర్‌కు రావట్లేదు ప్రేక్షకులు



ఆమిర్ ఖాన్

"నేను స్టార్‌ను ఎలా అయ్యానో నాకు తెలియదు. ఎందుకంటే స్టార్‌డమ్‌కు సంబంధించిన అన్ని నియమాల్ని ఉల్లంఘించాన"ని అన్నారు బాలీవుడ్ హీరో ఆమిర్ ఖాన్. ఆయన గోవా వేదికగా జరుగుతోన్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) ముగింపు వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ది నేరేటివ్ ఆర్కిటెక్ట్ ఆఫ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే సెషన్‌లో తన సినీ ప్రయాణం గురించి మాట్లాడారు.


"నిజానికి నేను స్టార్‌ని కాకూడదు. అన్నీ సాధ్యం కాని పనుల్నే ఎంచుకున్నా. అయినా నాకు ప్రేక్షకుల నుంచి గౌరవం, విజయం లభించినందుకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. నేను ఎంచుకునే ప్రతి సినిమా హిట్ అవుతుందో లేదో నాకు తెలియదు. 'సర్ఫరోష్', 'లగాన్', 'తారే జమీన్ పర్' లాంటి చిత్రాలు ప్రయోగాత్మకమైనవే. ఆ సమయంలో సినీప్రియులు వీటిని ఇష్టపడతారో లేదో అనే ఆలోచన లేదు. కానీ నాకు అభిమానుల్ని ఆశ్చర్యపరచడం ఇష్టం".

● "సామాజిక అంశాల నేపథ్యంలో సినిమాలు తీసే అలవాటు నాకు లేదు. నేను కార్యకర్తను కాదు. నేను అంటే కథ చెప్పడం.. నేను అంటే సినిమాలు. అదే నా ప్రపంచం. ప్రేక్షకులు సామాజిక శాస్త్రంలోని పాఠాల్ని నేర్చుకోవడానికి థియేటర్‌కు రావట్లేదని చాలా స్పష్టంగా తెలుసు. దాని కోసం వారు కళాశాలకు వెళ్తారు. నా ప్రాథమిక బాధ్యత అభిమానుల్ని అలరించడమే. వినోదం పంచడమంటే కేవలం మిమ్మల్ని నవ్వించడం మాత్రమే కాదు.. నేను మిమ్మల్ని ఏడిపించగలను.. హారర్ సినిమాల్ని తీసి భయపెట్టగలను.. ఇలా అన్ని జానర్లు తీయగలను. ఎన్ని సినిమాలు తీసినా ఏదో ఒక విధంగా ప్రేక్షకుల్ని ఆకర్షించడమే నా ప్రధాన లక్ష్యం".

ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకోను

"నాకు బాల్యం నుంచే కథల పట్ల ఆసక్తి ఎక్కువ. అదే నన్ను మంచి సినిమాల వైపునకు నడిపించింది. ఈ రోజుల్లో చాలా మంది తదుపరి ఏమి తీయాలి.. మార్కెట్లో ఏ సినిమాలు నడుస్తున్నాయి అని ఆలోచిస్తుంటారు. కానీ ఎప్పుడూ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకొని కథల్ని ఎంపిక చేసుకోలేదు. 2008లో నేను 'గజిని' సినిమా తీస్తున్నప్పుడు 'ఇప్పుడు యాక్షన్ చేస్తున్నావు.. ఈ రోజుల్లో ఆ సినిమాలు ఆడట్లేదని' చాలా మంది చెప్పారు. అయినా 'గజిని' వచ్చింది. దాంతోపాటు యాక్షన్ కూడా ఫ్యాషన్‌లోకి వచ్చింది. అలాగే ఇకపై నిర్మాతగా కాకుండా పూర్తిగా నటనకే అంకితం కావాలని నిర్ణయించుకున్నా".

పృథ్వీరాజ్ కెరీర్‌ను నాశనం చేయాలనుకుంటున్నారు



పృథ్వీరాజ్

పరిశ్రమలోని కొన్ని వర్గాలు ఉద్దేశపూర్వకంగానే పృథ్వీరాజ్ సుకుమారన్ కెరీర్‌ను నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన తల్లి, నటి మల్లికా సుకుమారన్ ఆరోపించారు. ఇటీవలే విడుదలైన 'విలాయత్ బుద్ధ' విషయంలోనూ తన కుమారుడిని టార్గెట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా మల్లిక ఓ మీడియాతో మాట్లాడుతూ. . "పృథ్వీరాజ్‌పై దాడులు జరిగినప్పుడు సంస్థలైనా.. వ్యక్తులైనా మాట్లాడడానికి ఇష్టపడరు. నేను గమనించిన దాని ప్రకారం చాలా తక్కువ మంది అతనికి మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇప్పుడు కూడా ఆన్‌లైన్‌వేదికగా అతడిపై దుర్భాషలాడుతున్నారు. పృథ్వీని టార్గెట్ చేస్తూ దాడికి దిగుతున్నారు. అతడు కెరీర్‌లో ఎదగడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఎలాగైనా అతని కెరీర్‌ను అంతం చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇంత నీచానికి దిగజారుతారని అనుకోలేదు. ఇలాంటి పనులు ఆపకపోతే నేను సందర్భం వచ్చినప్పుడల్లా దీనిపై పోరాడుతూనే ఉంటా" అని అన్నారు.

అర్జునుడి ఉపదేశం



దివిజ, అఖిల్ రాజ్

'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన హీరో అఖిల్ రాజ్. ఇప్పుడాయన.. దివిజ ప్రభాకర్, ఆదిత్య శశికుమార్, సదన్, వసంతిక మచ్చ నాయకానాయికలుగా నటిస్తున్న సినిమా 'అర్జునుడి గీతోపదేశం'. సతీశ్ గోగాడ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని త్రిలోక్‌నాథ్ కాళిశెట్టి నిర్మిస్తున్నారు. వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం 80శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు నిర్మాత శుక్రవారం ప్రకటించారు. "ఇదొక అందమైన ప్రేమకథతో తెరకెక్కుతున్న సినిమా" అని నిర్మాత తెలిపారు.

నేనే ఆంధ్ర కింగ్ అని చెప్పగానే కంగారు పడ్డా! : ఉపేంద్ర



మహేశ్‌బాబు.పి, ఉపేంద్ర, రవిశంకర్

తనని తానెప్పుడు స్టార్‌లా ఫీలవ్వనన్నారు నటుడు ఉపేంద్ర. ఓ అభిమాని తన వద్దకు వచ్చి ఫొటో తీసుకుంటుంటే తానూ ఓ ఫ్యాన్ బాయ్‌లాగే మురిసిపోతానన్నారు. ఇప్పుడాయన.. కథానాయకుడు రామ్ పోతినేనితో కలిసి నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మహేశ్‌బాబు.పి తెరకెక్కించిన ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు ఉపేంద్ర మాట్లాడుతూ.. "ఈ కథ విన్నప్పుడే చాలా థ్రిల్ అయ్యా. ఇలాంటి సబ్జెక్ట్.. ఇంతటి భావోద్వేగాలు చూడలేదనిపించింది. దీంట్లో నేనే ఆంధ్ర కింగ్ అని చెప్పినప్పుడు కాస్త కంగారు పడ్డా. కానీ, తర్వాత అది మాయమైంది. నిజంగా నేనిక్కడికి వచ్చినప్పుడల్లా ఓ కింగ్‌లా ఫీలవుతుంటా. ఇది నా నేల అనిపిస్తుంటుంది. తెలుగు వాళ్లు నాపై చూపే ప్రేమాభిమానాల గొప్పదనమిది. 25ఏళ్లుగా ఇదే అనుభూతి పొందుతున్నా" అన్నారు. "మేము అనుకున్న ఫలితాన్ని సాధించాం. దీనికి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కుతోంది. చాలా మంది ఫోన్లు చేసి సినిమాని ప్రశంసిస్తున్నారు. రామ్ - ఉపేంద్రల నటన.. వాళ్లిద్దరి కలయికలో వచ్చిన సన్నివేశాల గురించి ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఇది చాలా లాంగ్ రన్ ఉన్న సినిమా. కచ్చితంగా మూడు వారాల పాటు అద్భుతంగా ప్రదర్శితమవుతుందని నమ్ముతున్నాం" అన్నారు నిర్మాత వై.రవిశంకర్. ఈ కార్యక్రమంలో మహేశ్‌బాబు.పి, వివేక్, మెర్విన్ పాల్గొన్నారు.



కార్తి, కృతి శెట్టి

అన్నగారు నవ్విస్తారు

'అన్నగారు వస్తారు' చిత్రంతో థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు కార్తి. ఆయన.. కృతి శెట్టి జంటగా నటించిన ఈ సినిమాని నలన్ కుమారస్వామి తెరకెక్కించారు. కేఇ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. సత్యరాజ్, మధుర్ మిట్టల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్ర తెలుగు టీజర్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి శుక్రవారం విడుదల చేశారు. దీంట్లో ఒక్క డైలాగ్ లేకున్నా.. సినిమాలో కార్తి పాత్ర ఎలా సాగనుందన్నది ఈ టీజర్‌తో స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో తను పోలీస్ పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే నెల ప్రేక్షకుల ముందుకు రానుంది.

సావిత్రి మహోత్సవం



మహానటి సావిత్రి 90వ జయంతి వేడుకలు డిసెంబరు 1 నుంచి 6 వరకు సావిత్రి మహోత్సవ్ పేరిట జరగనున్నాయి. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సంగమం ఫౌండేషన్‌తో కలిసి ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి. ఈ వేడుకల్లో భాగంగా సావిత్రి సినిమాల ప్రదర్శనలు, పాటల పోటీలు ఉంటాయని, డిసెంబరు 6న జరిగే సభలో 'మహానటి' చిత్ర దర్శకనిర్మాతలైన నాగ్ అశ్విన్, ప్రియాంక దత్, స్వప్న దత్‌లను, 'సావిత్రి క్లాసిక్స్' పుస్తక రచయిత సంజయ్ కిశోర్, ప్రచురణకర్త బొల్లినేని కృష్ణయ్యలను సత్కరించనున్నట్లు అందులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సభకు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

శాపం..శాంతి రెండూ నువ్వే

ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎల్ ఐకే). విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబరు 18న థియేటర్లలోకి రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో భాగంగా 'పట్టుమా..' అనే రెండో గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. "నిన్ను నా చేతుల్లోనే ఉంచుకోవాలనుకుంటున్నా. నా శాపం, శాంతి.. అన్నీ నువ్వే..' అంటూ సాగుతున్న ఈ గీతంలో కృతి, ప్రదీప్‌ల కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 2040లో సెట్ చేసిన ఈ ప్రేమ గీతాన్ని అనిరుధ్ రవిచందర్ స్వరపరిచారు. ఎస్‌జే సూర్య, యోగి బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో టైమ్ ట్రావెల్ నేపథ్యంలో తీర్చిదిద్దిన ఈ సినిమా నిర్మాతల్లో నయనతార ఒకరు కావడం విశేషం.



ప్రదీప్ రంగనాథన్



అసమానతలకు.. అస్థిరతకు మూలం!

ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన భారత్ యువశక్తికి నిలయంగా ఉంది. కానీ అంతటి ప్రగతి పథంలోనూ నిరుద్యోగిత ప్రధాన సమస్యగా పరిణమించింది. ఏటా లక్షలాదిమంది యువత డిగ్రీలు పొంది ఉద్యోగాల కోసం అన్వేషణ సాగిస్తున్నారు. సరైన ఉపాధి లభించకపోవడంతో ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దాంతో సామాజిక అస్థిరత, మానసిక ఒత్తిడి పెరిగి దేశ పురోగతికి అవరోధాలు ఏర్పడుతున్నాయి. దీనికి అధిక జనాభా, అసమాన ఆర్థికవృద్ధి, నైపుణ్యాల్లో అంతరాలు, సాంకేతిక మార్పులు తదితరాలు ముఖ్య కారణాలు. ఆ వివరాలు, పరిణామాలు, నిరుద్యోగాన్ని కొలిచే విధానాలపై పోటీపరీక్షలు రాసే వారికి అవగాహన ఉండాలి. నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, వాటి లక్ష్యాలను తెలుసుకోవాలి.

భారతదేశంలో నిరుద్యోగిత

(కారణాలు-ప్రభావాలు-నిర్మూలన చర్యలు)

భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నిరుద్యోగం ఒకటి. ఇది ఒక సామాజిక, ఆర్థిక సమస్య. పనిచేసే సామర్థ్యం ఉండి, ఉద్యోగం కోసం చురుగ్గా వెతుకుతున్నప్పుడు జీతం ఇచ్చే పని లభించని స్థితిని నిరుద్యోగం అంటారు. ఆచార్య పిగూ ప్రకారం ''వ్యక్తికి పనిచేయాలనే కోరిక ఉన్నప్పటికీ పని కల్పించకపోవడమే నిరుద్యోగిత''.

☛ నిరుద్యోగం అన్ని దేశాల్లోనూ ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో బహిర్గత, ప్రచ్ఛన్న నిరుద్యోగం ఉంటే, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో సార్థక డిమాండ్ తగ్గదలే నిరుద్యోగానికి కారణమవుతుంది. ☛ భారతదేశంలో నిరుద్యోగ తీవ్రత ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక, అల్ప ఉద్యోగిత, ప్రచ్ఛన్న నిరుద్యోగిత ఉండగా; పట్టణ ప్రాంతాల్లో విద్యావంతుల్లో నిరుద్యోగిత ఎక్కువగా ఉంది.

నిరుద్యోగిత - కొలిచే విధానం: దేశ ఆర్థికవ్యవస్థ ఆరోగ్య సూచికల్లో ముఖ్యమైంది నిరుద్యోగిత. దీనిని సాధారణంగా 'నిరుద్యోగిత రేటు' కొలమానంతో కొలుస్తారు. నిరుద్యోగుల సంఖ్యను శ్రామిక జనాభా/శ్రామికశక్తి కింద పనిచేసే వ్యక్తులతో భాగించినప్పుడు వచ్చేసంఖ్యను 'నిరుద్యోగిత' అంటారు.

$$\text{నిరుద్యోగిత రేటు} = \frac{\text{నిరుద్యోగ కార్మికులు}}{\text{మొత్తం శ్రామికుల సంఖ్య}} \times 100$$

☛ దేశంలో ఉపాధి, నిరుద్యోగితను కొలవడానికి ప్రామాణిక భావనలను ఎన్ఎస్ఎస్ఓ రూపొందించింది. అవి-

రోజు వారీ స్థితి నిరుద్యోగిత: ఈ విధానంలో వ్యక్తి నిరుద్యోగ స్థితిని ఒక వారంలో ప్రతి రోజూ కొలుస్తారు. రోజులో ఒక గంట కూడా లాభదాయకమైన పనిలేని వ్యక్తిని ఆ రోజు నిరుద్యోగిగా అభివర్ణిస్తారు. దీనినే 'అల్ప నిరుద్యోగిత' లేదా 'దైనందిన నిరుద్యోగిత'గా పేర్కొంటారు.

వారం వారీ స్థితి నిరుద్యోగిత: సర్వే జరిపే రోజుకు ముందు 5 రోజుల్లో ఏ రోజూ పని దొరకనివారిని వారం వారీ నిరుద్యోగులుగా పరిగణిస్తారు. ఈ వారం రోజుల్లో గంట పనిదొరికినా వారిని ఉద్యోగులుగానే పరిగణిస్తారు.

సాధారణ స్థితి నిరుద్యోగిత: సర్వే సంవత్సరానికి సంబంధించి ఎక్కువ రోజులు పని కోసం ఎదురుచూసినప్పటికీ పని దొరకని స్థితి. దీనినే దీర్ఘకాలిక లేదా శాశ్వత నిరుద్యోగిత అంటారు.

భారత్‌లో నిరుద్యోగిత రేటు: దేశంలో నిరుద్యోగిత రేటు ఉద్యోగాల లభ్యతను మాత్రమే కాకుండా వివిధ రంగాల్లో శ్రామిక శక్తి భాగస్వామ్యాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే ప్రకారం.. నిరుద్యోగిత రేటు 2025, జులైలో 5.2%గా ఉంది.

శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్): 2025, జూన్‌లో 54.2% ఉండగా, జులైలో 54.9%గా ఉంది.

- గ్రామీణం - 56.9%, ✪ పట్టణం - 50.7%
- గ్రామీణ పురుషులు - 78.1%
- పట్టణ పురుషులు- 75.1%
- గ్రామీణ మహిళలు - 36.9%
- పట్టణ మహిళలు - 23.5%.

కార్మిక జనాభా నిష్పత్తి (డబ్ల్యూపీఆర్): గ్రామీణ - 54.4%, పట్టణ - 47.0%.

నిరుద్యోగిత - కారణాలు

అధికరేటులో వృద్ధి చెందే జనాభా: అందుబాటులో ఉన్న ఉద్యోగావకాశాల కంటే కార్మికుల సరఫరా ఎక్కువగా ఉండటంతో నిరుద్యోగ రేటు పెరుగుతోంది.

నైపుణ్యాభివృద్ధి లేకపోవడం: శ్రామిక శక్తికి ఉన్న నైపుణ్యాలకు, పరిశ్రమలు డిమాండ్ చేసే నైపుణ్యాలకు మధ్య తరచూ అసమతౌల్యత ఉంటోంది.

పారిశ్రామిక వృద్ధి మందగమనం: పరిశ్రమల్లో పరిమిత పెట్టుబడి వల్ల ఉద్యోగావకాశాలు తగ్గవచ్చు.

గ్రామీణ పరిశ్రమలు విస్తరించకపోవడం: గ్రామీణ పరిశ్రమలు విస్తరించలేకపోవడంతో పెరిగే జనాభా మొత్తం వ్యవసాయంపై ఆధారపడుతోంది. ఫలితంగా ఒత్తిడి అధికమై ఆ రంగం వెనకబడుతోంది.

సాంకేతిక పురోగతులు: పెరుగుతున్న సాంకేతికత శారీరక శ్రమను భర్తీ చేస్తుండటంతో కార్మికులు నిరుద్యోగులుగా మారుతున్నారు.

లోపభూయిష్ట విద్యావిధానం: భారతదేశ విద్యావ్యవస్థ ఆచరణాత్మక నైపుణ్యాలు, ఉద్యోగ శిక్షణ అందించడంలో వెనకబడింది. ఫలితంగా విద్య, ఉపాధి మధ్య అంతరం ఏర్పడి నిరుద్యోగిత పెరుగుతోంది.

ఆర్థిక అసమానతలు: కొన్ని ప్రాంతాల్లో తగిన మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, ఉద్యోగావకాశాలు లేకపోవడంతో ఆ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు పెరుగుతోంది.

ప్రభావాలు: నిరుద్యోగం వ్యక్తులతో పాటు సమాజంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

ఆర్థిక ఇబ్బందులు: ఇది సాధారణంగా ఆదాయం లేకపోవడం వల్ల ఎదురవుతుంది. వ్యక్తులు తమ ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడం కూడా కష్టమవుతుంది.



కొనుగోలు శక్తి క్షీణత: నిరుద్యోగం వ్యక్తిగత కొనుగోలుశక్తిని తగ్గిస్తుంది.

మానసిక ప్రభావం: ఇది సామాజిక కళంకం, సామాజిక బహిష్కరణ తదితర భావనలకు దారితీస్తుంది. పని దొరకని వ్యక్తులు మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటారు.

అసమానతల పెరుగుదల: ఉద్యోగావకాశాలు లేకపోవడం అనే పరిస్థితి ఆదాయ అసమానతలు, ధనికులు - పేదల మధ్య అంతరాన్ని పెంచుతుంది.

ప్రభుత్వ పథకాలు/కార్యక్రమాలు

ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం: 2008లో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సూక్ష్మసంస్థలకు ఆర్థిక సహాయం ద్వారా స్వయంఉపాధి అవకాశాలను సృష్టిస్తారు. ఈ పథకం ఖాదీ, గ్రామీణ పరిశ్రమ కమిషన్ (కేవీఐసీ) ద్వారా అమలవుతుంది.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం: 2005లో ప్రారంభించారు. గ్రామీణ కుటుంబాలకు ఏటా 100 రోజులు ఉపాధి అందించడం దీని లక్ష్యం. రోడ్లు, చెరువులు, నీటిపారుదల కాలువలు మొదలైన వాటిని నిర్మించడం ద్వారా గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుంది.

ప్రధానమంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన: 2016లో ప్రారంభించారు. నూతన ఉపాధి అవకాశాల సృష్టి, ఆ దిశగా యాజమాన్యాలను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ అమలుచేస్తోంది.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన: 2014లో ప్రారంభమైంది. 15-35 ఏళ్ల వయసున్న గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వడం ద్వారా వివిధ పరిశ్రమల్లో వారికి ఉపాధి అవకాశాలను పెంచి, తద్వారా పేదరికాన్ని తగ్గించాలనేది ఈ పథకం లక్ష్యం.

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన: 2015లో ప్రారంభించారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించడానికి కావాల్సిన నైపుణ్య అభివృద్ధి, వృత్తి శిక్షణపై దృష్టి పెడుతుంది.

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ రోజ్‌గార్ యోజన: కరోనా అనంతరం 2020లో 125 రోజుల కార్యక్రమంగా ప్రారంభమైంది. మహమ్మారి ప్రభావంతో స్వస్థలాలకు తిరిగొచ్చిన వలస కార్మికులు, ప్రభావితమైన గ్రామీణ జనాభా సమస్యలను పరిష్కరించడమే దీని లక్ష్యం. ఇందులో భాగంగా దీర్ఘకాలిక జీవనోపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు 116 జిల్లాలను ఎంపిక చేశారు. రూ.50,000 కోట్ల విలువైన 25 రకాల పనులను చేపట్టారు.

స్టార్ట్ అప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా: 2016లో తీసుకొచ్చారు. స్టార్ట్ అప్ ఇండియాలో ఆర్థిక ప్రోత్సాహకాలు, ఇంక్యుబేషన్ కేంద్రాల ద్వారా వ్యవస్థాపకత, ఉద్యోగ సృష్టికి చేయూత ఇస్తారు. స్టాండప్ ఇండియా కొత్త సంస్థల స్థాపనకు ఆర్థిక సహాయం అందిస్తుంది. మహిళలు, అణగారిన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తుంది.

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం: 2023లో ప్రారంభించారు. 18 రకాల చేతివృత్తుల వారికి నైపుణ్య మద్దతు, టూల్‌కిట్ ప్రోత్సాహం,మార్కెటింగ్ చేయూత ఇస్తారు.

పీఎం ముద్రా యోజన: 2015, ఏప్రిల్ 8న ప్రధాని ప్రారంభించారు. వ్యవసాయేతర చిన్న, సూక్ష్మ సంస్థలకు రూ.20 లక్షల వరకు రుణాలుగా అందిస్తుంది.

గ్రామీణ స్వయంఉపాధి, శిక్షణ సంస్థలు: ఇవి స్వయంఉపాధి, వేతన ఉపాధి చేపట్టే సామర్థ్యం ఉన్న 18-45 ఏళ్ల నిరుద్యోగ యువతకు తగిన నైపుణ్య శిక్షణ ఇస్తాయి.

నేషనల్ కెరియర్ సర్వీస్ ప్రాజెక్టు: కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ.. నేషనల్ కెరియర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్‌ను నిర్వహిస్తుంది. ఈ డిజిటల్ వేదిక ద్వారా ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగావకాశాల సమాచారం, కెరియర్ కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇస్తుంది.

ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ): ఆత్మనిర్భర్ దార్శనికతలో భాగంగా దేశీయంగా తయారీ సామర్థ్యాలు పెంచి ఎగుమతులు వృద్ధి చేసే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు.



రచయిత: **వమరవల్లి రమణయ్య**

లైఫ్‌స్కిల్స్ నిన్ను నువ్వు తెలుసుకో!

మనిషి తనను తాను తెలుసుకోవడంపైనే భవిష్యత్తులో అతడు లేదా ఆమె అస్తిత్వం ఆధారపడి ఉంటుందనేది ప్రసిద్ధ తత్వవేత్తలు చెప్పిన మాట. అందుకే 'స్వీయ అవగాహన' అనేది అన్ని జీవన నైపుణ్యాలకు పునాది లాంటిది. తమపై తాము అవగాహన కలిగి ఉండటం అంటే అంతర్గత సామర్థ్యాలను గుర్తించడం, పరిమితులను అర్థం చేసుకోవడం, వాటిని లక్ష్యాలతో అనుసంధానం చేసుకోవడమే. ఊహల్లో జీవించకుండా, వాస్తవంలో ఉంటూ విజేతలుగా నిలవాలంటే ముందుగా ఎవరిని వారు తెలుసుకోవాలి. అది ఎలాగో చక్కటి ఉదాహరణలతో అర్థం చేసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.



మాదిరి ప్రశ్నలు



కరెంట్ అఫైర్స్

■ ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్స్ ట్రాకర్ (2025, అక్టోబరు) ప్రకారం ప్రపంచ చరిత్రలో అధికారికంగా 500.1 బిలియన్ డాలర్ల నికర సంపద సాధించిన మొదటి వ్యక్తిగా ఎవరు వార్తల్లో నిలిచారు?

జ: టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్

■ హెరిటేజ్ ఫౌండేషన్ విడుదల చేసిన 2025 ఆర్థిక స్వేచ్ఛా సూచికలో ఏ దేశం అత్యంత స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థగా మొదటి స్థానంలో నిలిచింది? (రెండు, మూడు స్థానాల్లో వరుసగా స్విట్జర్లాండ్, ఐర్లాండ్‌లు; అమెరికా 26, భారత్ 128వ స్థానాల్లో నిలిచాయి)

జ: సింగపూర్

■ వ్యవసాయ స్వావలంబన దిశగా 2025, అక్టోబరు 1న కేంద్ర ప్రభుత్వం పప్పుధాన్యాల్లో ఆత్మ నిర్భరత మిషన్ అనే కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. ఇది ఏ కాలంలో అమలులో ఉంటుంది? (దేశీయ పప్పుధాన్యాల ఉత్పత్తిని 350 లక్షల టన్నులకు పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.)


జ: 2025-26 నుంచి 2030-31 వరకు

■ ప్రతిష్ఠాత్మక గ్లోబల్ టూరిజం అవార్డు - 2025ను ఏ రాష్ట్ర ప్రభుత్వం గెలుచుకుంది?

జ: ఆంధ్రప్రదేశ్

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



☛ రైట్స్ లిమిటెడ్‌లో మేనేజర్ ఉద్యోగాలు (40)
చివరి తేదీ: 30-11-2025


☛ ఎంఎస్‌టీసీలో మేనేజ్‌మెంట్ ట్రెయినీ ఖాళీలు (37)
చివరి తేదీ: 30-11-2025

భౌగోళిక ఆలోచన.. స్థానిక స్పందన!

వాతావరణ మార్పు అనేది ఏ ఒక్క దేశం లేదా ప్రాంతానికో పరిమితం కాదు, ఇది ప్రపంచ సమస్య. మనుషులతో పాటు ఇతర జీవుల ఆరోగ్యానికి, ఆర్థికరంగ స్థిరత్వానికి, పర్యావరణ వ్యవస్థల మనుగడకు తీవ్రమైన ముప్పుగా పరిణమించింది. అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేస్తేనే ఆ ఆపదను నియంత్రించడం లేదా నివారించడం సాధ్యమవుతుంది. భూతాపాన్ని పెంచుతున్న గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించడానికి, సహజ వనరులను భావితరాలకు సురక్షితంగా అందించడానికి ఐక్యరాజ్యసమితి చొరవతో పలు అంతర్జాతీయ ఒప్పందాలు, అవగాహనలు కుదిరాయి. ప్రపంచ దేశాల సహకారంతో అమలవుతున్న అలాంటి ఒప్పందాలు జరిగిన సదస్సులు, నిర్వహించిన ప్రాంతాలు, అంగీకారం కుదిరిన అంశాలు, అందులో భారతదేశం పాత్రపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. జీవవైవిధ్య పరిరక్షణ, గ్రీన్ ప్రాజెక్టులకు సహకారం, కాలుష్యాన్ని అదుపు చేయడానికి ధనిక, పేద దేశాల మధ్య ఉన్న సహకారం, అందుకు దోహదపడుతున్న వ్యవస్థల గురించి తెలుసుకోవాలి.

వాతావరణ మార్పు అంతర్జాతీయ కార్యక్రమాలు

1. స్టాక్‌హోమ్ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన అంశాల్లో సరైంది ఏది?



ఎ) 1972, జూన్ 5, 6 తేదీల్లో స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో 'మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి సమావేశం' పేరుతో ఈ సమావేశం జరిగింది.
బి) పర్యావరణ, అభివృద్ధికి సంబంధించిన 26 సూత్రాలు, 109 సిఫార్సులతో కూడిన కార్యాచరణ ప్రణాళిక, తీర్మానాన్ని సమావేశం అంగీకరించింది.
సి) ఈ సమావేశం ఫలితంగా వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ రూపొందింది.
1) ఎ, బి, సి 2) సి 3) ఎ, బి 4) బి, సి

2. రియో కాన్ఫరెన్స్ లేదా ఎర్త్ సమ్మిట్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
ఎ) పర్యావరణ అభివృద్ధిపై ఐక్యరాజ్యసమితి సమావేశాన్ని రియో కాన్ఫరెన్స్ లేదా ఎర్త్ సమ్మిట్‌గా పిలుస్తారు.
బి) ఇది సుస్థిరాభివృద్ధిపై జరిగిన మొదటి సదస్సు.
సి) 'భౌగోళికంగా ఆలోచించండి - స్థానికంగా స్పందించండి' అనే పిలుపు ఇచ్చింది.
1) ఎ, సి 2) సి 3) ఎ, బి, సి 4) ఎ, బి

3. ధరిత్రి సదస్సులో ఆమోదించిన అంశాల్లో సరైనవి ఏవి.
ఎ) ఎజెండా - 21 బి) రియో డిక్లరేషన్
సి) ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్
డి) మినామాటా కన్వెన్షన్
ఇ) అటవీ సంరక్షణ సూత్రాలు
ఎఫ్) జీవవైవిధ్య కన్వెన్షన్
జి) వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్
1) ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్, జి
2) ఎ, బి, ఇ, ఎఫ్, జి
3) బి, సి, డి, ఇ, ఎఫ్, జి
4) ఎ, బి, సి, డి, ఇ

4. ఎజెండా 21కి సంబంధించిన అంశాల్లో సరికానివి ఏవి?
ఎ) ఎజెండా 21 అనేది సుస్థిరాభివృద్ధికి సంబంధించి ఐక్యరాజ్యసమితి స్వచ్ఛందంగా అమలు చేస్తున్న కార్యాచరణ ప్రణాళిక.
బి) 1992లో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగిన స్టాక్‌హోమ్ సదస్సులో దీన్ని రూపొందించారు.
సి) ప్రతి ప్రభుత్వం సొంత, స్థానిక ఎజెండా- 21ని తయారుచేయాలన్నది ఈ ఎజెండా ప్రధాన లక్ష్యం.
డి) 2050 నాటికి ప్రపంచ సుస్థిరాభివృద్ధి సాధించాలని నిర్దేశిస్తుంది.
1) ఎ 2) బి, డి
3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి

5. రియో డిక్లరేషన్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
ఎ) రియో డిక్లరేషన్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ అనేది 1992లో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగిన ఎర్త్ సమ్మిట్‌లో రూపొందించిన విధానపత్రం.
బి) రియో + 10 సదస్సు బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగింది. దీన్ని సుస్థిరాభివృద్ధిపై ప్రపంచ సదస్సు అంటారు.
సి) రియో + 20 సదస్సు జోహన్నెస్‌బర్గ్‌లో జరిగింది. ఈ సదస్సులో భాగంగా 'మేం కోరుకుంటున్న భవిష్యత్తు' అనే నివేదిక విడుదలైంది.
1) ఎ, సి 2) ఎ, బి, సి 3) బి, సి 4) ఎ

6. జీవవైవిధ్య కన్వెన్షన్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
ఎ) జీవవైవిధ్య కన్వెన్షన్ 1993, డిసెంబరు 29న అమల్లోకి వచ్చింది.
బి) జీవవైవిధ్య సంరక్షణ, సుస్థిర ఉపయోగం, జన్యు సంపదను నిజాయతీతో వినియోగించడం దీని లక్ష్యాలు.
సి) జీవవైవిధ్య కన్వెన్షన్‌కు కార్టేజీనా ప్రొటోకాల్, మాంట్రియల్ ప్రొటోకాల్ అనే రెండు అనుబంధ ఒప్పందాలు ఉన్నాయి.
1) ఎ, సి 2) సి 3) ఎ, బి, సి 4) ఎ, బి

7. ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ కింద సభ్య దేశాల విభజనకు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
ఎ) పారిశ్రామిక, పరివర్తన చెందే దశలో ఉన్న దేశాలు అనెక్స్-1 దేశాల కిందకు వస్తాయి.
బి) ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో - ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ సభ్యదేశాలు, యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలు అనెక్స్-2 దేశాల కిందకు వస్తాయి.
సి) క్యోటో ప్రొటోకాల్ అనెక్స్-బి జాబితాలోని పార్టీలు అనెక్స్- బి దేశాల కిందకు వస్తాయి.
1) ఎ, సి 2) ఎ, బి, సి 3) బి, సి 4) ఎ

8. క్యోటో ప్రొటోకాల్‌కు సంబంధించిన అంశాల్లో సరికానివి ఏవి?
ఎ) 1997, డిసెంబరు 11న ఆమోదం పొందింది. సంక్లిష్టమైన ధ్రువీకరణ ప్రక్రియ కారణంగా 2005, ఫిబ్రవరి 16న అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం క్యోటో ప్రొటోకాల్‌లో 192 పార్టీలు ఉన్నాయి.
బి) ప్రస్తుతం ఉన్న గ్రీన్‌హౌస్ వాయువులను 2012 నాటికి.. 1990లో ఎంత శాతం ఉన్నాయో అందులో 50% తగ్గించాలి.
సి) దీని కాలవ్యవధిని బాలి సదస్సులో 2013 నుంచి 2020, డిసెంబరు 31 వరకు పొడిగించారు. ఇందులో భాగంగా పారిశ్రామిక దేశాలు 18% కర్బన ఉద్గారాలను తగ్గించాలి.
1) ఎ, సి 2) ఎ, బి, సి 3) బి 4) ఎ

పర్యావరణ అంశాలు

9. కింది వాటిలో ఏవి క్యోటో ప్రొటోకాల్ మార్కెట్ - ఆధారిత యంత్రాంగాల్లోకి వస్తాయి?
ఎ) గ్లోబల్ వార్మింగ్ పొటెన్షియల్
బి) క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం
సి) ఎమిషన్స్ ట్రేడింగ్ - కార్బన్ ట్రేడింగ్
డి) జాయింట్ ఇంప్లిమెంటేషన్
ఇ) అటవీ నిర్మూలన, అటవీ క్షీణత నుంచి ఉద్గారాలను తగ్గించడంపై ఐక్యరాజ్యసమితి కార్యక్రమం.
1) బి, సి, డి, ఇ 2) బి, ఎ, సి, ఇ
3) ఎ, బి, ఇ 4) బి, సి, డి

10. క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజంకు సంబంధించిన అంశాల్లో సరికానిది ఏది?
1) అనెక్స్-1 దేశాలు తమ ఉద్గారాలను తగ్గించలేనప్పుడు అవి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో గ్రీన్ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చాలి. ఈ అంశమే క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం.
2) ఈ ప్రాజెక్టులు తగ్గించే ప్రతి 100 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విలువను 'కార్బన్ క్రెడిట్' అంటారు.



3) ఈ క్రెడిట్లను అభివృద్ధి చెందుతున్న దేశాలు అనెక్స్-1 దేశాల నుంచి సంపాదిస్తాయి అంటే అనెక్స్-1 దేశాలు కార్బన్ క్రెడిట్ రూపంలో పెనాల్టీలు చెల్లిస్తాయి.
4) ఈ విధంగా తగ్గించే ప్రతి టన్ను కార్బన్ డై ఆక్సైడ్ విలువ అంటే కార్బన్ క్రెడిట్‌ను 'సర్టిఫైడ్ ఎమిషన్ రిడక్షన్' అంటారు.

11. క్యోటో ప్రొటోకాల్ మార్కెట్ ఆధారిత యంత్రాంగాల్లో ఎమిషన్స్ ట్రేడింగ్ లేదా కార్బన్ ట్రేడింగ్ అంటే ఏమిటి?
1) కార్బన్ తగ్గించడంలో వివిధ ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు పాల్గొనడం.
2) క్యోటో ప్రొటోకాల్ కింద స్థాపించిన అడాప్టేషన్ ఫండ్.
3) కాలుష్య ఉద్గారాలను తగ్గించడానికి ఆర్థిక ప్రోత్సాహకాలను అందించడం ద్వారా కాలుష్య నియంత్రణకు చేపట్టే మార్కెట్ ఆధారిత పద్ధతి.
4) ఉద్గారాలను తగ్గించడానికి జాతీయంగా నిర్ణయించిన సహకార లక్ష్యం.

12. క్యోటో ప్రొటోకాల్ కిందకు వర్తించే గ్రీన్‌హౌస్ వాయువులకు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
ఎ) ఆక్సిజన్ బి) కార్బన్ డై ఆక్సైడ్
సి) మీథేన్ డి) నైట్రస్ ఆక్సైడ్
ఇ) హైడ్రో ఫ్లోరో కార్బన్లు ఎఫ్) పెర్ఫ్లోరో కార్బన్లు
జి) సల్ఫర్ డై ఆక్సైడ్
1) బి, సి, డి, ఇ, ఎఫ్ 2) ఎ, బి, సి, ఇ, ఎఫ్, జి
3) ఎ, బి, సి, ఇ 4) బి, సి, ఎఫ్, జి

13. ప్యారిస్ ఒప్పందానికి సంబంధించిన అంశాల్లో సరికానివి ఏవి?
ఎ) ఇది వాతావరణ మార్పుపై 2015లో ఆమోదించిన అంతర్జాతీయ ఒప్పందం.
బి) 2022, నవంబరు 4 నుంచి అమల్లోకి వచ్చింది.
సి) భూతాపాన్ని తగ్గించడం, 2020 తర్వాత ఏటా 100 బిలియన్ డాలర్ల శీతోష్ణస్థితి సహాయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందజేయడం ప్యారిస్ ఒప్పందంలో భాగాలు.
డి) భారతదేశం దీనిపై సంతకం చేయలేదు.
1) ఎ, బి 2) బి, డి
3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి

14. ప్యారిస్ ఒప్పందానికి సంబంధించిన అంశాల్లో సరికానివి ఏవి?
ఎ) ఇంటెండెడ్ నేషనల్లీ, డిటర్‌మైండ్ కంట్రిబ్యూషన్స్ అనేది ఉద్గారాలను తగ్గించడం కోసం జాతీయంగా సిద్ధం చేసిన ప్రణాళిక.



బి) ప్రతి పార్టీ తమ నేషనల్లీ డిటర్‌మైండ్ కంట్రిబ్యూషన్స్‌ను తెలియజేయాలి, ప్రతి పదేళ్లకు దాన్ని సవరించాలి.
సి) భారత్ తన నేషనల్లీ డిటర్‌మైండ్ కంట్రిబ్యూషన్స్‌ను నేటికీ ప్రకటించలేదు.
1) ఎ, సి 2) ఎ, బి, సి
3) బి, సి 4) ఎ

15. భారత్ 2016, అక్టోబరు 2న వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్‌కు సమర్పించిన నేషనల్లీ డిటర్‌మైండ్ కంట్రిబ్యూషన్స్‌లో సరైనవి ఏవి?
ఎ) దేశంలో అటవీకరణను ప్రోత్సహించి 2.5 - 3 బిలియన్ లేదా గిగా టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గించాలనేది భారత్ లక్ష్యం.
బి) 2030 నాటికి భారత్ 2005 లోని ఉద్గారాల్లో 33 - 35% మేర తగ్గించాలని నిర్ణయించింది.
సి) 2030 నాటికి దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుత్తు శక్తిలో సుమారు 40% వరకు శిలాజేతర ఇంధనాల నుంచి ఉత్పత్తి కావాలి.
1) ఎ, బి, సి 2) సి
3) ఎ, బి 4) బి, సి

16. గ్లాస్గోలో జరిగిన ఐక్యరాజ్య సమితి 26వ వాతావరణ మార్పు సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పంచామృతం అనే ఐదు సూత్రాలు ప్రతిపాదించారు. వాటిలో సరైనవి ఏవి?
ఎ) నికరంగా కర్బన ఉద్గారాల శూన్యస్థాయి లక్ష్య సాధన గడువు 2023.
బి) 2030 నాటికల్లా కర్బన ఉద్గారాలు 100 టన్నుల తగ్గింపు.
సి) 2030 నాటికల్లా కర్బన తీవ్రత 45% మేరకు తగ్గింపు.
డి) 2030 నాటికి విద్యుత్తు అవసరాల్లో 50% మేరకు పునరుత్పాదక వనరులతోనే తీర్చుకోవాలి.
ఇ) 2030 నాటికి శిలాజేతర ఇంధన సామర్థ్యం 500 గిగావాట్లకు పెంపు.
1) బి, సి, డి, ఇ
2) ఎ, బి, సి, ఇ
3) ఎ, బి, ఇ 4) బి, సి, ఇ

సమాధానాలు

1-3; 2-3; 3-2; 4-2; 5-4; 6-4; 7-2; 8-3; 9-4; 10-2; 11-3; 12-1; 13-2; 14-2; 15-1; 16-1.

1707లో ఔరంగజేబ్ మరణంతో మొగల్ సామ్రాజ్య వైభవం అంతమైంది. ఆ తర్వాత వచ్చిన మొగల్ చక్రవర్తులు బలహీనులు, అసమర్థులు కావడంతో ప్రధానమంత్రుల చేతిలో కీలుబొమ్మలుగా మారారు. దీంతో 18వ శతాబ్ద ప్రారంభంలో భారతదేశ రాజకీయాల్లో ముఖ్య మార్పులు చోటుచేసుకున్నాయి. మొగల్ గవర్నర్లు తిరుగుబాటు చేసి అనేక స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటు చేశారు. భారతదేశంలో నెలకొన్న రాజకీయ అనైక్యత, అనిశ్చిత పరిస్థితులు ఆంగ్లేయులకు వరంగా మారాయి. ఒక్కొక్కటిగా రాజ్యాలను జయిస్తూ వచ్చిన ఆంగ్లేయులు భారతదేశంలో ఒక మహా సామ్రాజ్యాన్ని స్థాపించారు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం – భారతదేశ చరిత్ర

రాజకీయ అనైక్యతతోనే.. బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన

ఆలంగీర్-II (1754-59)



అసలు పేరు అజీజుద్దీన్. ఇతడు జహందర్ షా మనవడు. రెండో ఆలంగీర్ అనే బిరుదుతో పరిపాలన కొనసాగించాడు. (ఔరంగజేబ్‌ను ఆలంగీర్-Iగా పిలుస్తారు). ఇతడి కాలంలో ఆర్థిక, సైనిక వ్యవస్థలు దిగజారిపోయాయి. జీతాలు కూడా చెల్లించలేని స్థితిలోకి వచ్చారు. ఆఫ్గనిస్థాన్ పాలకుడు అహమ్మద్ షా అబ్దాలీ ఢిల్లీపై దండెత్తి దోచుకున్నాడు. ప్రధానమంత్రి ఇమాద్-ఉల్-ముల్క్ ఆలంగీర్-IIను చంపి, మృతదేహాన్ని యమున నదిలో పడేశాడు.

బహదూర్ షా-II (1837-57)



ఇతడు మొగల్ వంశంలో చివరి చక్రవర్తి. అబుల్ జాఫర్ అనే పేరుతో ఉర్దూలో కవితలు రచించాడు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటుకు నాయకత్వం వహించడంతో ఆంగ్లేయులు ఇతడిని బందీగా 1858లో బర్మాలోని రంగూన్‌కు పంపించారు. ఇతడు 1862లో రంగూన్‌లోనే మరణించడంతో అక్కడే సమాధి చేశారు. దీంతో మొగల్ వంశం సంపూర్ణంగా అంతమైంది.

అక్బర్-II (1806-37)

ఇతడికి ఆంగ్లేయులు ఏడాదికి 11,50,000 పెన్షన్ (రాజభరణం) ఇచ్చేవారు. ఇతడు సంఘ సంస్కర్త రామ్మోహన్ రాయ్‌కు 'రాజా' అనే బిరుదు ఇచ్చాడు. రామ్మోహన్ రాయ్ బ్రిటిషర్లు మొగల్ చక్రవర్తికి ఇచ్చే పెన్షన్ పెంపు గురించి చర్చించేందుకు ఇంగ్లండ్ వెళ్లాడు.

కడపటి మొగల్ చక్రవర్తులు

బహదూర్ షా-I (1707-12)



అసలు పేరు ముఅజ్జం. ఇతడినే షా ఆలం - I అని పిలుస్తారు. ఔరంగజేబ్ మరణానంతరం అతడి ముగ్గురు కుమారుల మధ్య వారసత్వ పోరు జరిగింది. ఇందులో షా ఆలం తన సోదరులైన ఆజం, కాంబక్ష్‌లను చంపి అధికారం చేజిక్కించుకున్నాడు. ఇతడు తన తండ్రి ఔరంగజేబ్ కాలంలో తిరుగుబాటు చేసిన వర్గాలతో సత్సంబంధాలు నెలకొల్పాడు. సిక్కుల గురువు గోవింద్‌సింగ్‌ను మొగలుల సర్వీస్‌లోకి తీసుకోవడంతో సిక్కులు, మొగలులకు మధ్య ఉన్న వైరాన్ని తగ్గించాడు. కానీ తర్వాతి సిక్కుల నాయకుడు బందా బహదూర్ మొగలులపై తిరుగుబాటు చేయగా అతడిని ఓడించాడు. మొగలుల చెరలో ఉన్న శంభాజీ కొడుకు సాహును చెర నుంచి విడిపించాడు. బుందేల పాలకుడు ఛత్రసాల్, సిక్కుల పదో గురువు గురుగోవింద్ సింగ్, జాట్ల నాయకుడు చౌరమన్‌తో శాంతి, స్నేహ సంబంధాలు కొనసాగించాడు. ఆనాటి చరిత్రకారుడు కాఫీఖాన్ ఈ మొగల్ చక్రవర్తిని 'షాహిబేఖబరి' (నిర్లక్ష్యం వహించే రాజు) అని పిలిచాడు. షా ఆలం మరణానంతరం ఇతడి ముగ్గురు కుమారులు అంత్యక్రియలు చేయకుండా వారసత్వ పోరు జరిపారు. దీనిలో చివరికి జహందర్ షా గెలిచాడు.

జహందర్ షా (1712-13)

ఇతడి కాలంలో ప్రధానమంత్రి జుల్ఫికర్ ఖాన్ సర్వాధికారాలు చెలాయించాడు. ఈ కాలంలో రాజ్య పాలన పూర్తిగా గాడితప్పింది. రాజ్య ప్రతిష్ఠ అంతకంతకూ దిగజారిపోయింది. ఇతడి కాలంలోనే ఇజార వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా భూమిశిస్తును మధ్యవర్తుల ద్వారా వసూలు చేసేవారు.

ఫరూఖ్ సియార్ (1713-19)

ఇతడు జహందర్ షా సోదరుడి కుమారుడు. సయ్యద్ సోదరుల సహకారంతో సింహాసనం అధిష్ఠించాడు. దీనికి కృతజ్ఞతగా చక్రవర్తి సయ్యద్ అబ్దుల్లా ఖాన్‌కు వజీర్, సయ్యద్ హుస్సేన్ అలీఖాన్‌కు సర్వసైన్యాధ్యక్షుడి పదవులు ఇచ్చాడు. తర్వాతి కాలంలో వీరికి చక్రవర్తితో సఖ్యత కుదరలేదు. ఫరూఖ్ సియార్‌ను సయ్యద్ సోదరులు చంపేశారు. ఇతడి మరణానంతరం రఫీ ఉద్దరత్‌ను చక్రవర్తిగా గుర్తించి సింహాసనం అధిష్ఠింపజేశారు. కానీ ఇతడు నాలుగు నెలల్లోనే చనిపోయాడు. ఇతడి తర్వాత రఫీ ఉద్దౌలాను షాజహాన్ II పేరుతో చక్రవర్తిగా చేశారు.

నోట్: ఫరూఖ్ సియార్ అనారోగ్యం బారిన పడినప్పుడు ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీ ఒక వైద్య బృందాన్ని ఢిల్లీకి పంపించి వైద్యం అందించింది. దీనికి కృతజ్ఞతగా 1717లో చక్రవర్తి కంపెనీ కోసం ఒక ఫర్మానా జారీ చేశాడు. దీని ప్రకారం, కంపెనీ ఏడాదికి రూ.10 వేలు మొగల్ చక్రవర్తికి చెల్లించి బెంగాల్, దక్కన్, గుజరాత్ రాష్ట్రాల్లో సుంకాలు లేకుండా వ్యాపారం నిర్వహించుకోవచ్చు. దీన్ని ఈస్టిండియా కంపెనీ మాగ్నాకార్టాగా అభివర్ణిస్తారు.

అహమ్మద్ షా (1748-54)

మహమ్మద్ షా మరణానంతరం అతడి కుమారుడు అహమ్మద్ షా రాజయ్యాడు. ఇతడి కాలంలో ప్రధానమంత్రి ఇమాద్-ఉల్-ముల్క్ సర్వాధికారాలు చెలాయించాడు. చక్రవర్తితో విభేదాలు రావడంతో కళ్లు పీకించి చెరసాలలో బంధించాడు. ఇతడి కాలంలోనే నాదిర్షా సేనాపతిగా పనిచేసిన, ఆఫ్గనిస్థాన్ పాలకుడైన అహమ్మద్ షా అబ్దాలీ దాడులు ప్రారంభమయ్యాయి. ఇతడు 1748 నుంచి 1767 మధ్య భారతదేశంపై ఎనిమిదిసార్లు దండెత్తాడు.

మహమ్మద్ షా (1719-48)

ఇతడి అసలు పేరు రౌషన్ అక్తర్. మహమ్మద్ షా అనే బిరుదుతో సయ్యద్ సోదరులు ఇతడిని సింహాసనాన్ని అధిష్ఠింపజేశారు. చక్రవర్తి తల్లి, నిజాం ఉల్ ముల్క్, సాదత్ ఖాన్; ఇతిమద్ ఉద్దౌలా కూటమిగా ఏర్పడి సయ్యద్ సోదరులను హతమార్చారు.

- మహమ్మద్ షా విలాసాలకు అలవాటుపడి పరిపాలనను గాలికి వదిలేశాడు. అంతఃపుర స్త్రీల సాంగత్యంలో గడిపేవాడు దీంతో రంగీలా (విలాస పురుషుడు)గా పేరుగాంచాడు. హిందూ, ముస్లిం సంప్రదాయాల సమ్మేళనంతో ప్రారంభమైన కథక్ నృత్యంలో ఈ చక్రవర్తి బహుప్రావీణ్యుడు. అంబర్ పాలకుడు సవాయ్ జైసింగ్ ఖగోళశాస్త్రానికి సంబంధించి జిజ్ మహమ్మద్ షాహిని రచించి చక్రవర్తికి అంకితమిచ్చాడు.
- మహమ్మద్ షా కాలంలోనే మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్నం వేగవంతమైంది. ఇద్దరు ప్రధాన అధికారులు రెండు స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. వారు:

సాదత్‌ఖాన్: మొగల్ అధికార గణంలోని ఇరానీ వర్గానికి నాయకుడు. వీరు ఇరాన్ నుంచి వలస వచ్చిన షియా మతానికి చెందినవారు. ఇతడు 1722లో అవధ్ రాజ్యాన్ని స్థాపించాడు. ప్రారంభంలో ఫైజాబాద్, తర్వాత లక్నో ఈ రాజ్యానికి రాజధానులు.

నిజాం-ఉల్-ముల్క్: అసలు పేరు మీర్ కమ్రుద్దీన్ ఖాన్. బిరుదులు అసఫ్ జా, చిన్ కులిచ్ ఖాన్. ఇతడు మొగల్ అధికార గణంలోని తురానీ వర్గ నాయకుడు. వీరు మధ్య ఆసియా నుంచి వలస వచ్చిన సున్నీ మతానికి చెందినవారు. 1724లో నిజాం-ఉల్-ముల్క్ తిరుగుబాటు చేసి దక్కన్‌లో నిజాం రాజ్యాన్ని స్థాపించాడు. ప్రారంభంలో ఈ రాజ్య రాజధాని ఔరంగాబాద్. ఆ తర్వాత రాజధానిని హైదరాబాద్‌కు మార్చారు.

నాదిర్షా దండయాత్ర

క్రీ.శ.1739లో ఇరాన్ నెపోలియన్‌గా ప్రసిద్ధిగాంచిన నాదిర్షా భారతదేశంపై దండెత్తాడు. కర్నాల్ వద్ద జరిగిన నామమాత్రపు యుద్ధంలో మహమ్మద్ షాను ఓడించి భారతదేశాన్ని దోచుకున్నాడు. కోహినూర్ వజ్రం, నెమలి సింహాసనంతో పాటు 70 కోట్ల సంపదను దోచుకెళ్లాడు. మహమ్మద్ షా నెమలి సింహాసనంపై కూర్చున్న చివరి మొగల్ చక్రవర్తి.

షా ఆలం-II (1759-1806)

అసలు పేరు అలీగౌహర్. రెండో ఆలంగీర్ కుమారుడు. ఇతడు బిహార్‌లో పట్టాభిషిక్తుడు అయ్యాడు. కానీ ప్రధానమంత్రి ఇమాద్-ఉల్-ముల్క్ పట్ల భయంతో 12 ఏళ్లు ఢిల్లీలో అడుగుపెట్టకుండా అవధ్‌లో శరణార్థిగా గడిపాడు. ఇతడి కాలంలోనే మొహి-ఉల్-మిల్లత్ అనే యువరాజును షాజహాన్ III అనే బిరుదుతో సింహాసనంపై కూర్చోబెట్టి ప్రధానమంత్రి ఇమాద్ పరిపాలన గావించాడు.

- ఇమాద్ మరణం తర్వాత 1772లో మహదాజి సింధియా అనే మరాఠా సర్దార్ సహకారంతో షా ఆలం-II ఢిల్లీకి వచ్చి సింహాసనం అధిష్ఠించాడు.
- 1803లో ఆంగ్లేయ సేనాని లార్డ్ లేక్ ఢిల్లీని ఆక్రమించి బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనం చేయడంతో మొగల్ పాలన అంతమైంది. షా ఆలం-II ఈస్టిండియా కంపెనీకి పెన్షనర్ అయ్యాడు. అనంతరం వచ్చిన మొగల్ చక్రవర్తులు ఆంగ్లేయులు ఇచ్చిన రాజభరణంతో జీవించారు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

Word of the Day 845

Refurbish

Telugu meaning: పునరుద్ధరించు, ఆధునికీకరించు

English meaning: The word refurbish (రిఫర్బిష్) is a verb that means to renovate, repair, or brighten something to make it look new or improved.

Synonyms: Renovate, Revamp; ***Antonyms:*** Damage, Ruin

Usage: **1.** The company decided to refurbish its old office building to create a more modern and productive workspace for employees.

2. Before selling the house, they completely refurbished the kitchen to increase its value.


కరెంట్ అఫైర్స్



అంతరిక్ష సేవల ప్రైవేటు సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను 2025, నవంబరు 27న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఉపగ్రహ ప్రయోగాల కోసం విక్రమ్-1 అనే ఆర్బిటల్ రాకెట్‌ను ఈ సంస్థ రూపొందించింది.



భారత్ ఆతిథ్యమిచ్చిన చెస్ ప్రపంచకప్‌లో ఉజ్బెకిస్థాన్‌కి చెందిన జవోకిర్ సిందరోవ్ విజేతగా నిలిచాడు. అతడి వయసు 19 ఏళ్లు. అత్యంత పిన్న వయసులో ఈ ప్రతిష్ఠాత్మక ట్రోఫీని సొంతం చేసుకున్న ప్లేయర్‌గా సిందరోవ్ రికార్డు నెలకొల్పాడు. ఫైనల్లో అతడు 2.5-1.5తో వీ యి (చైనా)ను ఓడించాడు.



ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని 2025, నవంబరు 26న ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో యునెస్కో డైరెక్టర్ జనరల్ ఖాలెద్ ఎల్ ఎనానీ, 50 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అరుదైన భూ అయస్కాంతాల తయారీని ప్రోత్సహించేందుకు రూ.7,280 కోట్ల పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'స్కీమ్ టు ప్రమోట్ మానుఫ్యాక్చరింగ్ ఆఫ్ సింటెర్డ్ రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్స్'కు అనుమతి లభించింది. ఏడాదికి 6,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం సృష్టించడం దీని లక్ష్యం.

ఆంధ్రప్రదేశ్‌లో 2029 నాటికి వందశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రభుత్వం 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఫిబ్రవరిలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 15-59 ఏళ్ల మధ్య నిరక్షరాస్యులు 81 లక్షల మంది ఉన్నారు. 2024-25లో నిర్వహించిన అక్షరాస్యత కార్యక్రమంలో 3.53 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

క్రిస్టియన్ డాప్లర్ – శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన ఆస్ట్రియాకు చెందిన ప్రసిద్ధ గణిత, భౌతిక, ఖగోళ శాస్త్రవేత్త. కాంతి, ధ్వని తరంగాలపై అనేక పరిశోధనలు చేశారు. ఈ క్రమంలోనే 'డాప్లర్ ఎఫెక్ట్' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఇది వైద్యరంగంతో సహా ఆధునిక భౌతికశాస్త్రం, టెక్నాలజీ రంగంలో అనేక నూతన ఆవిష్కరణలకు కారణమైంది. వివిధ శాస్త్రీయ రంగాల్లో ప్రాథమిక సూత్రంగా మారిన డాప్లర్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన క్రిస్టియన్ డాప్లర్ జయంతి నేడు (నవంబరు 29). ఈ సందర్భంగా ఈయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం – వృత్తి జీవితం

- డాప్లర్ 1803, నవంబరు 29న ఆస్ట్రియాలోని సాల్జ్‌బర్గ్‌లో జన్మించారు. 13 ఏళ్ల వయసులో ప్రాథమిక విద్యను ప్రారంభించారు. మాధ్యమిక విద్య కోసం లింజ్‌లోని పాఠశాలలో చేరారు. అక్కడ గణితాన్ని బోధించే సూమన్ స్టాంఫర్ ఈయనలోని మ్యాథ్స్ ప్రావీణ్యాన్ని గుర్తించారు.
- ఆయన సూచన మేరకు 1822లో వియన్నాలోని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. అక్కడ గణితం, భౌతికశాస్త్రానికి సంబంధించిన అనేక విషయాలను నేర్చుకున్నారు.
- 1837లో ఆయన ప్రేగ్ పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ (ప్రస్తుతం చెక్ టెక్నికల్ యూనివర్సిటీ పేరుతో ఉంది)లో గణితం బోధించే అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. 1941లో ప్రొఫెసర్ హోదా పొందారు.
- ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఆయన అనేక అంశాలపై పరిశోధనా పత్రాలను ప్రచురిస్తూ ఉండేవారు.




చివరగా..

మానవాళి అభ్యున్నతికి ఉపయోగపడే అనేక ఆవిష్కరణలకు 'డాప్లర్ ఎఫెక్ట్' కారణమైంది. ఆయన ఆలోచనలు, పరిశోధనలు నేటికీ ఎందరో పరిశోధకులకూ స్ఫూర్తిని కలిగిస్తూనే ఉన్నాయి. భౌతిక, ఖగోళ శాస్త్రాల్లో సాంకేతికతను మెరుగుపరచడానికి, పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడానికి ఈయన పరిశోధనా పత్రాలు మార్గదర్శిగా నిలిచాయి. ఈయన 1853, మార్చి 17న ఇటలీలోని వెనిస్‌లో మరణించారు.

డాప్లర్ ఎఫెక్ట్ అంటే ఏమిటి? డాప్లర్ ఇతర జీవిత విశేషాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

క్లోరోప్లాస్ట్



క్లోరోప్లాస్ట్‌లు మొక్కల కణాల్లో కనిపించే ముఖ్యమైన కణాంగాలు. ఇవి మొక్కల జీవ క్రియలో ప్రధానమైన కిరణజన్య సంయోగక్రియను నిర్వహిస్తాయి. క్లోరోప్లాస్ట్‌లు విస్తరిత కణాంగాలు. మొక్కలు ఆక్సిజన్, గ్లూకోజ్‌ను ఉత్పత్తి చేయడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. తద్వారా భూమిపై ఉన్న జీవుల మనుగడకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. క్లోరోప్లాస్ట్ నిర్మాణం, విధులు, ప్లాస్టిడ్స్ మొదలైన వాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

నిర్మాణం

- బాహ్య త్వచం (ఔటర్ మెంబ్రేన్)
- అంతర త్వచం (ఇన్నర్ మెంబ్రేన్)
- త్వచాంతర అవకాశిక (ఇంటర్ మెంబ్రేన్ స్పేస్)
- ఆవర్ణిక (స్ట్రోమా)

ప్లాస్టిడ్స్ రకాలు

- క్లోరోప్లాస్ట్‌లు
- క్రోమోప్లాస్ట్‌లు
- ల్యూకోప్లాస్ట్‌లు
- అమిలోప్లాస్ట్‌లు
- ఎలియోప్లాస్ట్‌లు
- ప్రోటీనోప్లాస్ట్‌లు
- జెరంటోప్లాస్ట్‌లు
- ప్రొప్లాస్టిడ్‌లు

కీలక వర్ణాలు

- క్లోరోఫిల్ ఎ
- క్లోరోఫిల్ బి
- కెరోటినాయిడ్స్

థైలకోయిడ్ నిర్మాణాలు, క్లోరోప్లాస్ట్ విధులు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) ఫిబ్రవరి-2026

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహించే సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటీఈటీ)కు నోటిఫికేషన్ విడుదలైంది. సీటెట్ పరీక్ష ఏటా రెండుసార్లు జరుగుతుంది. దరఖాస్తు రుసుము రూ.1000. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రాజెక్ట్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టులు

ఝార్ఖండ్‌లోని సీఎస్ఐఆర్ - నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ, జంషెడ్‌పూర్ తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసిస్టెంట్, అసోసియేట్, ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 66. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 3, 4, 5 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ ప్రవేశాలకు నేడే (నవంబరు 29) చివరి తేదీ

- ఎన్ఐఈపీవీడీలో 14 లెక్చరర్ పోస్టులు. డిప్లొమా, డిగ్రీ, బీఎడ్, డీఎడ్, ఎంఎడ్, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులు అర్హులు.
- మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు. ఎంఏ/ ఎమ్మెస్సీ/ ఎంకామ్/ఎంఈడీ/ పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ - జనవరి 2026. ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams – Mathematics

Percentages

1. A man spends 68% of his monthly salary and saves Rs.6,240 every month. What is 10% of his annual salary?
A) Rs.19,000 B) Rs.27,200
C) Rs.18,000 D) Rs.23,400

2. Ravi's monthly income is Rs.40,000 and his monthly expenditure is Rs.28,000. If his income increases by 20% and his expenditure increases by 10%, what will be his new monthly savings?
A) Rs.27,000 B) Rs.18,000
C) Rs.19,200 D) Rs.17,200

3. Anita pays tax at the rate of 25% on her entire income of Rs.80,000, and Meera pays tax at the rate of 35% on her entire income of Rs.x. If the overall tax rate on their combined income is 30%, then what is the value of x?
A) Rs.1,20,000 B) Rs.40,000
C) Rs.80,000 D) Rs.90,000

4. Ravi's monthly income is Rs.50,000 and his expenditure is Rs.35,000. If his income increases by 15% and his expenditure increases by 10%, then what will be the percentage increase in his savings?
A) 26.67% B) 25%
C) 30% D) 35.33%

5. Arun initially used to save 30% of his monthly income. Later, his monthly income increased by 20%, and his actual (nominal) savings increased by 10%. What percentage of his current income does Arun save now?
A) 27.5% B) 30% C) 32% D) 33%

6. If the price of cooking oil is increased by 67%, by what percentage should a family reduce its consumption so that the total expenditure remains the same? (Correct to two decimal places)
A) 38.92% B) 40.12%
C) 41.02% D) 42.51%

7. The monthly income of a person was Rs.60,000 and his monthly expenditure was Rs.38,000. Next year, his income increased by 20% and his expenditure increased by 10%. Find the percentage increase in his savings.
A) 18.52% B) 37.27%
C) 22.15% D) 25.00%

8. The cost price of an article is first decreased by 20% and then increased by 25%. If the final price becomes Rs.600, what was the original cost price?
A) Rs.640 B) Rs.720
C) Rs.750 D) Rs.600

9. In an election between two candidates, 25% of the registered voters did not cast their vote, and 60 votes were declared invalid. The winner secured 45% of the registered votes and won by a margin of 210 votes.
What was the number of registered voters?
A) 800 B) 900 C) 1,000 D) 1,200

10. The population of a town increases at the rate of 25% per annum. If the population of the town will be 78,125 after 2 years, what is the present population of the town?
A) 40,000 B) 45,000
C) 50,000 D) 55,000

11. Sumana spends 60% of her income. If her income increases by 20% and her expenditure also increases by 10%, then what will be the percentage increase in her savings?
A) 20% B) 25% C) 30% D) 35%

12. If the price of rice decreases by 25%, then by what percentage should its consumption be increased so that the expenditure remains unchanged?
A) 20% B) 25% C) 33.33% D) 30%

13. In an election, a candidate secures 48% of the votes polled but loses to his only opponent by a margin of 2,520 votes, because 1,800 votes were declared invalid. What is the percentage of invalid votes?
A) 6% B) 2.78% C) 10% D) 4%

14. Due to shortage of staff, the output of a factory decreases by 40%. By what percentage should the working hours be increased so that the original production level is restored?
A) 50% B) 66.67% C) 75% D) 80%

15. Raju spends 22% of his money on an insurance policy, 34% on food, 20% on children's education and 18% on recreation. He deposits the remaining amount of Rs.480 in the bank. What is the total amount that he spends on food and insurance policy together?
A) Rs.4,200 B) Rs.4,480
C) Rs.6,960 D) Rs.2,840

16. The price of a laptop first increases by 12%, then decreases by 25%, and finally increases again by 18%. What is the overall percentage increase or decrease?
A) 5.84% increase
B) 0.88% decrease
C) 6.75% decrease
D) 3.42% increase

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

రాజ్‌నాథ్ వ్యాఖ్యలు కలవరపెడుతున్నాయి

- పాక్ విదేశాంగ ప్రతినిధి తహిర్ అంద్రాబీ

ఇస్లామాబాద్: సరిహద్దులు మారొచ్చు, సింధ్ భారత్‌లో కలవొచ్చు అని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై పాకిస్థాన్ మరోసారి విమర్శలు గుప్పించింది. రాజ్‌నాథ్ వ్యాఖ్యలు "తీవ్రంగా కలవరపెడుతున్నాయి' అని పాకిస్థాన్ విదేశాంగ ప్రతినిధి తహిర్ అంద్రాబీ పేర్కొన్నారు. "ఇటువంటి రెచ్చగొట్టే ప్రకటనలను చేయడం భారత్ మానుకోవాలి' అని శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన వ్యాఖ్యానించారు. సింధూ జలాలకు సంబంధించి వివరాలను భారత్ పంచుకోకపోవడంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. ఆ చర్యలు తీవ్ర ఆందోళన కలిగించే విషయమని, ఒప్పంద ఉల్లంఘనేనని తహిర్ తెలిపారు.

8 నుంచి 13 వరకూ ఎర్రకోటలో యునెస్కో సభ

దిల్లీ: సాంస్కృతిక వారసత్వం ప్రత్యక్షంగా కనిపించే కట్టడాలలోనే కాదు, పరోక్షంగా ఆచారాలు, తాత్విక ధార, జ్ఞాన సంపదలోనూ ఇమిడి ఉంటుంది. పరోక్ష సాంస్కృతిక వారసత్వంపై ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక పరిరక్షణ సంస్థ (యునెస్కో) నిర్వహించే సమావేశానికి మొట్టమొదటిసారిగా భారత దేశం ఆతిథ్యమివ్వబోతోంది. డిసెంబరు 8 నుంచి 13వ తేదీవరకు దిల్లీలోని ఎర్రకోటలో ఈ సమావేశం జరుగుతుంది. అందుకే డిసెంబరు 5 నుంచి 14వ తేదీ వరకు సందర్శకులు ఎర్రకోటను సందర్శించే వీలు ఉండదు. నవంబరు 10న ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడులో 15 మంది మరణించి, పలువురు గాయపడిన నెల రోజుల తరవాత జరిగే ఈ సమావేశం కోసం బందోబస్తును పటిష్ఠం చేశారు. మొగల్ చక్రవర్తి షాజహాన్ నిర్మించిన ఈ కోటలో జరిగే యునెస్కో సమావేశానికి యునెస్కోలో భారత శాశ్వత ప్రతినిధి విశాల్ శర్మ అధ్యక్షత వహిస్తారు. 2024 జులై 21-31 తేదీలలో దిల్లీలోని భారత మండపంలో ప్రపంచ వారసత్వ సంఘం 46వ సమావేశం జరిగింది. దానికి కూడా శర్మనే అధ్యక్షత వహించారు.

థాయ్‌లాండ్‌లో వరదలు.. 145కు చేరిన మృతులు

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దక్షిణ థాయ్‌లాండ్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 145కు చేరింది. ఈ వరదలకు 12 లక్షలకు పైగా ఇళ్లు దెబ్బతిన్నాయని.. అనేక మంది నిరాశ్రయులయ్యారని అధికారులు వెల్లడించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను భద్రతా బలగాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. శిథిలాల్లో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రహదారులు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. మరోవైపు ఇండోనేసియాలో వరదలు, కొండచరియలు విరిగిపడటం కారణంగా మృతిచెందిన వారి సంఖ్య 164కు చేరినట్లు అధికారులు తెలిపారు.

చెల్లని చెక్కుపై తిరస్కరించిన బ్యాంకు ఉన్నచోటే పిటిషన్ వేయాలి

- స్పష్టతనిచ్చిన సర్వోన్నత న్యాయస్థానం

దిల్లీ: చెక్కు బౌన్స్ కేసులకు సంబంధించిన న్యాయపరమైన ఓ చిక్కు సమస్యపై సుప్రీంకోర్టు స్పష్టతనిస్తూ శుక్రవారం కీలకమైన తీర్పు వెలువరించింది. ఖాతాలో తగినంత నగదు లేకపోవడం వల్ల ఏ బ్యాంకులో చెక్కు తిరస్కరణకు గురవుతుందో, ఆ బ్యాంకు ఉన్న ప్రాంతంలోని న్యాయస్థానాన్నే ఫిర్యాదుదారు ఆశ్రయించాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది. 'చెల్లని చెక్కుల కేసులను నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్-1881లోని సెక్షన్ 138 కింద దాఖలు చేయాల్సి ఉంటుంది. చెక్కు స్వీకర్త దానిని నగదుగా మార్చుకునే క్రమంలో తన ఖాతా ఉన్న బ్యాంకు ద్వారా చెల్లించాల్సిన బ్యాంకుకు పంపిస్తారు. చెక్కు జారీ చేసిన వ్యక్తి ఖాతాలో తగినంత నగదు లేకపోవతే తిరస్కరణకు గురవుతుంది. వివాదం తలెత్తిన బ్యాంకు ఉన్న ప్రాంతంలోని కోర్టునే ఫిర్యాదుదారు ఆశ్రయించాలి' అని ధర్మాసనం పేర్కొంది. ఈ తీర్పులో 'నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్(సవరణ) చట్టం-2015లోని నిబంధనలనూ ధర్మాసనం ప్రస్తావించింది. ఈ సవరణ చట్టం రాకముందు..చెల్లని చెక్కులకు సంబంధించిన ప్రాదేశిక న్యాయపరిధి చాలా సంక్లిష్టంగా ఉండేదని తెలిపింది.

గినీ బిసావు నూతన ప్రధానిగా ఇలిడో వియెరా

- ప్రకటించిన సైన్యం

బిసావు: పశ్చిమ ఆఫ్రికాలోని గినీ బిసావులో తిరుగుబాటు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకున్న సైన్యం.. దేశ ప్రధానిగా ప్రస్తుత ఆర్థిక మంత్రి ఇలిడో వియెరాను నియమించింది. ఈ మేరకు కొత్త సైనికాధిపతి జనరల్ హోర్టా ఎన్టా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పదవీచ్యుతుడైన అధ్యక్షుడు ఉమరో సిసాక ఎంబాలోకు వియెరా అత్యంత సన్నిహితుడు కావడం గమనార్హం. ఆదివారం గినీ బిసావో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. గురువారం సైన్యం తిరుగుబాటు చేసింది. దీంతో అధ్యక్షుడు ఎంబాలో దేశం విడిచి పారిపోయారు. ఇప్పుడు ప్రధానిగా ఎంపికైన వియెరా.. అధ్యక్ష ఎన్నికల్లో ఎంబాలో ప్రచార డైరెక్టర్‌గా వ్యవహరించారు. మరోవైపు విపక్ష నేత ఫెర్నాండో డియోస్.. ఎన్నికల్లో తానే గెలిచానని, అందుకే ఈ తిరుగుబాటు నాటకాన్ని ఎంబాలో ఆడిస్తున్నారని ఆరోపించారు. 22 లక్షల జనాభా ఉన్న గినీ బిసావు.. ప్రపంచంలోనే అత్యంత పేద దేశం. 50 ఏళ్ల క్రితమే పోర్చుగల్ నుంచి స్వాతంత్ర్యం పొందింది.

సోషల్ మీడియాలో వ్యాఖ్యలు

- పోలీసులను ఆశ్రయించిన గంగూలీ సతీమణి డోనా

కోల్‌కతా: సామాజిక మాధ్యమాల్లో కొందరు వ్యక్తులు తనను కించపరిచేలా పోస్టులు పెడుతున్నారని.. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ సతీమణి ప్రముఖ నృత్య కళాకారిణి డోనా గంగూలీ కోల్‌కతా పోలీసులను ఆశ్రయించారు. ఇటీవల కోల్‌కతా ఫిల్మ్ ఫెస్టివల్‌లో డోనా నృత్యం చేశారు. అయితే దీనిపై పలువురు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో తన వ్యక్తిత్వానికి భంగం కలిగేలా పోస్టులు పెట్టారని డోనా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిక్కుల్లో జెలెన్‌స్కీ

- ప్రధాన కార్యనిర్వాహక అధికారి యెర్మాక్ నివాసంలో సోదాలు
- చమురు రంగంలో 10 కోట్ల డాలర్ల అవినీతిపై దర్యాప్తు



కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు వాలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి ఆంద్రీ యెర్మాక్ గృహం, కార్యాలయాలను అవినీతి నిరోధక సంస్థల అధికారులు శుక్రవారం ఉదయం సోదా చేశారు. చమురు రంగంలో 10 కోట్ల డాలర్ల అవినీతి జరిగిందనే ఆరోపణలను పురస్కరించుకుని ఈ దాడులు జరిగాయి. రష్యాతో యుద్ధం కొనసాగుతూ, అమెరికా ఒత్తిడిపై శాంతికి ఒప్పుకోవలసిన అగత్యం ముంచుకొస్తున్న సమయంలో అవినీతి నిరోధక శాఖల అధికారుల దాడులు జరగడం జెలెన్‌స్కీ సర్కారుకు ఇబ్బందికరమే. అమెరికాతో చర్చల్లో యెర్మాక్ పాల్గొంటున్నారు. యెర్మాక్ నివాసం ఉండే అపార్ట్‌మెంట్ రాజధాని కీవ్‌లో జెలెన్‌స్కీ కార్యాలయ సముదాయంలోనే ఉంది. యెర్మాక్ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు జరిపిన వేళ జెలెన్‌స్కీ ఆ కాంప్లెక్స్‌లో ఉన్నదీ లేనిదీ తెలియరాలేదు.

కుడిభుజంగా పేరు

ఒకప్పుడు జెలెన్‌స్కీకి వ్యాపార భాగస్వామి తైమూర్ మిండిచ్ చమురు కుంభకోణానికి సూత్రధారి అని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. తైమూర్ దేశం విడచిపరారైనా ఆయన పరోక్షంలోనే విచారణ జరగవచ్చు. చమురు కుంభకోణాన్ని పురస్కరించుకుని ఇద్దరు మంత్రులు రాజీనామా చేశారు కూడా. యెర్మాక్ సహాయకులు ఇద్దరు 2024లోనే రాజీనామా చేయగా, మరో సహాయకుడు ఇంకా విధుల్లో కొనసాగుతున్నారు. ఈ ముగ్గురిపై లంచగొండి ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది. యెర్మాక్‌కు అవినీతిలో పాత్ర ఉందని ఆరోపణలు రాకపోయినా అతడికీ ఉద్వాసన చెప్పాలని ఒత్తిడి పెరుగుతోంది. ఐరోపా సమాఖ్య (ఈయూ)లో చేరాలనుకుంటున్న జెలెన్‌స్కీకి మొదట అవినీతిని నిర్మూలించాలని ఈయూ షరతుపెడుతోంది. పూర్వాశ్రమంలో న్యాయవాది అయిన యెర్మాక్ 15 ఏళ్ల క్రితం టీవీ కార్యక్రమాల నిర్మాణంలో ప్రవేశించారు. అప్పట్లో టీవీ హాస్య నటుడిగా పేరున్న జెలెన్‌స్కీతో ఆయనకు సాన్నిహిత్యం ఏర్పడింది. జెలెన్‌స్కీ దేశాధ్యక్షుడైన తరవాత ఆయనకు కుడిభుజంగా వ్యవహరించసాగారు. ప్రధాన మంత్రి, ఇతర మంత్రుల నియామకంలోనూ యెర్మాక్ పాత్ర ఉంది. రష్యాతో శాంతి కుదుర్చుకోవాలని అమెరికా నుంచి ఒత్తిడి పెరుగుతున్న వేళ యెర్మాక్ ఉదంతం జెలెన్‌స్కీకి గుదిబండలా పరిణమిస్తోంది.

రష్యా చమురు కొనుగోలుకు హంగరీకి మినహాయింపు

బుడాపెస్ట్: రష్యా నుంచి చవకగా చమురు, సహజ వాయువు కొనడానికి హంగరీ ప్రధానమంత్రి విక్టొర్ ఓర్బాన్ శుక్రవారం మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. రష్యా చమురు, గ్యాస్‌ను ఎవరూ కొనరాదంటూ ఆంక్షలు విధించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుమతి తీసుకుని మరీ ఓర్బాన్ మాస్కో వెళ్లారు. నవంబరు నెలారంభంలో ఓర్బాన్ వాషింగ్టన్ వెళ్లి రష్యా చమురు దిగుమతికి ట్రంప్ నుంచి ఆమోదముద్ర వేయించుకున్నారు. రష్యా అందించే చవక ఇంధనం లేకపోతే తమ ఆర్థిక వ్యవస్థ దివాలా తీస్తుందని ఓర్బాన్ చెబుతున్నారు. 2027 చివరికల్లా రష్యా నుంచి శిలాజ ఇంధన కొనుగోళ్లను పూర్తిగా బంద్ చేయాలని ఐరోపా సమాఖ్య (ఈయూ) తీసుకున్న నిర్ణయాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఈయూ నాయకులు మాస్కో వెళ్లడం బంద్ చేసినా, ఓర్బాన్ మాత్రం పుతిన్‌తో భేటీ అయ్యారు.

మూడు సమస్యలకు మోదీ శాశ్వత పరిష్కారం: అమిత్‌షా



రాయ్‌పుర్: ఎప్పటి నుంచో దేశం పాలిట మాయని గాయంగా మారిన నక్సలిజం, ఈశాన్య రాష్ట్రాల సమస్య, జమ్మూ-కశ్మీర్ సమస్యలకు ప్రధాని నరేంద్రమోదీ శాశ్వత పరిష్కారం చూపించారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఇప్పుడివన్నీ దేశంలో మిగిలిన ప్రాంతాల మాదిరిగా మారనున్నాయని చెప్పారు. రాష్ట్రాల పోలీసు డైరెక్టర్ జనరళ్లు, ఇన్‌స్పెక్టర్ జనరళ్ల మూడురోజుల సదస్సు శుక్రవారం రాయ్‌పుర్‌లో ప్రారంభమైంది. అమిత్‌షా ప్రారంభోపన్యాసం చేశారు. మాదకద్రవ్యాల బెడద, వ్యవస్థీకృత నేరాలపై ముప్పేటదాడి జరపాలని, నేరగాళ్లకు దేశంలో అంగుళం చోటు కూడా దక్కనివ్వకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణ మండలి (ఎన్‌సీబీ)తో కలిసి రాష్ట్రాల పోలీసు బలగాలు పనిచేయాలని, రాష్ట్ర/ జాతీయ/ అంతర్జాతీయ స్థాయి ముఠాలను, వాటి నేతల్ని కటకటాల వెనక్కి నెట్టాలని పిలుపునిచ్చారు. 40 ఏళ్లుగా వేధిస్తున్న నక్సలిజాన్ని అంతం చేయడానికి భద్రత వలయాన్ని పటిష్ఠం చేశామని, 2014లో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 126 ఉంటే ఇప్పుడు 11కి తగ్గాయని వివరించారు. వచ్చే ఏడాది జరిగే డీజీపీల సదస్సు నాటికి ఇది సున్నా అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

బైక్ ట్యాక్సీ డ్రైవర్ ఖాతాలో రూ.331 కోట్లు

- ఈడీ విచారణలో ఆసక్తికరమైన నిజాలు

దిల్లీ: బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణ చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పొట్టకూటి కోసం బైక్ ట్యాక్సీ నడిపే ఓ డ్రైవర్ బ్యాంకు ఖాతాలో రూ. 331 కోట్లు డిపాజిట్ అయినట్లు గుర్తించింది. 1ఎక్స్‌బెట్ సంస్థకు చెందిన ఆన్‌లైన్ బెట్టింగ్‌తో ముడిపడిన కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ఈ వివరాలను సేకరించింది. డ్రైవరు బ్యాంకు ఖాతాలో 2024 ఆగస్టు 19 నుంచి 2025 ఏప్రిల్ 16 వరకూ రూ. 331 కోట్ల మేర డిపాజిట్ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలో పేర్కొన్న చిరునామాకు వెళ్లి దర్యాప్తు చేపట్టగా.. ఆ ఖాతాదారుడు ఒక ప్రసిద్ధ క్యాబ్ అగ్రిగేటర్ సంస్థ కోసం పని చేస్తున్నాడని, దిల్లీలోని ఒక మురికివాడలో రెండు గదుల ఇంట్లో నివసిస్తున్నట్లు తేలింది. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ బైక్ డ్రైవర్ ఖాతా నుంచి రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు కోటి రూపాయలు చెల్లించడం గమనార్హం. ఆ వివాహం గుజరాత్‌కు చెందిన ఒక యువ రాజకీయ నేతకు సంబంధించినట్లు గుర్తించారు. తన బ్యాంకు ఖాతా ద్వారా జరిగిన లావాదేవీలకు సంబంధించి తనకేమీ తెలియదని బైక్ డ్రైవర్ పేర్కొన్నట్టు అధికారులు తెలిపారు. నిందితులు బైక్ డ్రైవర్ బ్యాంకు ఖాతాను మ్యూల్ అకౌంట్‌గా వాడుకున్నట్టు భావిస్తున్నారు. ఆర్థిక నేరాల ద్వారా సంపాదించిన భారీ మొత్తాలను దాచేందుకు ఉపయోగించే మరొకరి బ్యాంకు ఖాతాను మ్యూల్ అకౌంట్ అంటారు.

రూ.11 కోట్లు గుటకాయ స్వాహా!

- మధ్యాహ్న భోజన పథకంలో కుంభకోణం
- యూపీలో టీచర్లు సహా ఐదుగురి అరెస్ట్

ఇంటర్నెట్‌డెస్క్: ఉత్తరప్రదేశ్‌లో మధ్యాహ్న భోజన పథకంలో భారీ అక్రమం బయటపడింది. పథకానికి సంబంధించిన రూ.11 కోట్లను టీచర్లు, అధికారులు, గ్రామపెద్ద కుమ్మక్కై కాజేశారు. బలరాంపుర్ జిల్లాలో జరిగిన ఈ కుంభకోణంలో ఇప్పటికే 45 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. టీచింగ్ అసిస్టెంట్, హెడ్ మాస్టర్, మిడ్ డే మీల్ జిల్లా కోఆర్డినేటర్, గ్రామపెద్దతో సహా ఐదుగురిని అరెస్టు చేశారు.

రికార్డులు తారుమారు చేసి...: బలరాంపుర్ జిల్లాలోని సుమారు 2,200 పాఠశాలలకు సంబంధించిన మధ్యాహ్న భోజన పథకం రికార్డులను తారుమారు చేయడం ద్వారా రూ.11 కోట్లకు పైగా భోంచేసినట్టు తెలుస్తోంది. జిల్లాకు చెందిన బేసిక్ శిక్షా అధికారి (బీఎస్ఏ) ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా అసలు విషయం బయటపడింది. గత పదేళ్లుగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులను నిందితులు తారుమారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

కట్నంతో వాణిజ్య లావాదేవీగా వివాహం

- తప్పు చేయకున్నా ప్రాణాలు పోవడం హేయం • సుప్రీంకోర్టు వ్యాఖ్య



దిల్లీ: ఎంతో పవిత్రమైన వివాహ వ్యవస్థ కాస్తా వరకట్న దురాచారం దృష్ట్యా వాణిజ్య లావాదేవీలా మారిపోయిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పరస్పర విశ్వాసం, సహవాసం, గౌరవాలపై నిర్మితమైన ఆదర్శమైన వ్యవస్థ ఇటీవలి కాలంలో ఇలా కావడం విచారకరమని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్. ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం పేర్కొంది. వివాహ బంధంలో అడుగిడిన నాలుగు నెలలకే భార్యకు విషమిచ్చి చంపిన భర్తకు ఓ హైకోర్టు మంజూరుచేసిన బెయిల్‌ను శుక్రవారం కొట్టివేస్తూ పలు వ్యాఖ్యలు చేసింది. భర్త విపరీత పోకడను, నేర తీవ్రతను, బాధితురాలి మరణ వాంగ్మూలాన్ని హైకోర్టు పరిగణించినట్లు లేదని ఆక్షేపించింది. "వరకట్న చావు అనేది ఒక వ్యక్తిపై మాత్రమే కాకుండా యావత్ సమాజంపై జరిగిన నేరం. బహుమతులు, స్వచ్ఛంద కానుకల పేరుతో ఇచ్చే కట్నం సామాజిక హోదాను ప్రదర్శించుకునే ప్రయత్నం.. వస్తు వ్యామోహాన్ని తృప్తిపరిచే తాపత్రయం. వరకట్నం సాంఘిక దురాచారం. ఇది వివాహ పవిత్రతను భ్రష్టుపట్టిస్తోంది. మహిళల్ని అణచివేతకు గురిచేస్తోంది. అది మరింత క్రూరంగా మారినప్పుడు నవ వధువు అకాల మరణానికి కారణమవుతుంది. ఇది వ్యక్తిగత విషాదమే కాకుండా సమాజ ఉమ్మడి అంతరాత్మకు అవమానం. ఎలాంటి తప్పు చేయకపోయినా ఇతరుల గొంతెమ్మ కోరికలు తీర్చలేని ఏకైక కారణంతో అత్తవారింట కోడలి జీవితం బలైపోతోంది. మానవ గౌరవ మూలాలపై ఇది హేయమైన నేరం. సమానత్వంతో, గౌరవప్రదమైన జీవనాన్ని గడిపేందుకు రాజ్యాంగంలో 14, 21 అధికరణలు ఇస్తున్న హామీని ఇది తుంగలో తొక్కుతోంది. సమాజ కూర్పును క్షీణింపజేస్తోంది. నాగరిక సమాజ పునాదుల్ని బలహీనపరుస్తోంది. ఇలాంటివాటిని న్యాయవ్యవస్థ ఉపేక్షించి వదిలేస్తే నేరాలు చేసేవారికి ధైర్యమిచ్చినట్లవుతుంది. న్యాయపాలనపై ప్రజా నమ్మకాన్ని సడలించినట్లవుతుంది. అందువల్ల చట్ట గౌరవాన్ని నిలబెట్టడానికి న్యాయవ్యవస్థ స్పందన దృఢంగా ఉండాలి. ఈ కేసులో న్యాయం చేయడమే కాకుండా వరకట్న దురాచార దురాగతాలను చట్టం, సమాజం భరించబోవని నిర్ద్వంద్వంగా సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉంది. వరకట్న చావులు ఆందోళనకరంగా పెరుగుతున్న తరుణంలో న్యాయసమీక్ష కఠినంగా ఉండాలి. నిందితుడిని స్వేచ్ఛగా వదిలేస్తే 304బీ, 498ఏ సెక్షన్ల లక్ష్యమే నీరుగారిపోతుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

పేలని బాంబును తిరిగిచ్చేయండి

- లెబనాన్‌ను కోరిన అమెరికా



ఇంటర్నెట్‌డెస్క్: ఓ పేలని బాంబు.. అమెరికా అధికారుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఇటీవల లెబనాన్‌పై జరిపిన దాడుల్లో అమెరికాకు చెందిన జీబీయూ-39బీ ప్రెసిషన్ గైడెడ్ బాంబులను ఇజ్రాయెల్ ప్రయోగించింది. ఇందులో ఒక బాంబు.. లెబనాన్‌కు చిక్కినట్లు తెలుస్తోంది. ఇప్పుడు దాన్ని తిరిగి తీసుకునేందుకు అగ్రరాజ్యం ప్రయత్నాలు చేస్తున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. బీరుట్ దక్షిణ శివారులో పేలని అమెరికాకు చెందిన జీబీయూ-39బీ ప్రెసిషన్ గైడెడ్ బాంబు ఒకటి లభ్యమయినట్లు లెబనాన్‌కు చెందిన మీడియా సంస్థ తెలిపింది. దీంతో అత్యంత అధునాతన సాంకేతికత కలిగిన ఈ బాంబుకు సంబంధించిన వివరాలు ప్రత్యర్థి దేశాల చేతుల్లోకి వెళ్తాయేమోనని అమెరికా భయపడుతోంది. చైనా, రష్యా, ఇరాన్ దేశాల చేతుల్లోకి వెళ్తే.. తమ ఆయుధ సాంకేతికత బహిర్గతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తోంది. అందుకే దాన్ని వెనక్కి తీసుకొచ్చేందుకు లెబనాన్ అధికారులను అత్యవసరంగా సంప్రదించింది. ఆ పేలని బాంబును తిరిగివ్వాలని అభ్యర్థించినట్లు తెలుస్తోంది.

ఏంటీ జీబీయూ-39బీ బాంబు..

జీబీయూ-39బీ స్మాల్ డయామీటర్ బాంబు ఇది. దీని బరువు 250 పౌండ్లు. పగలు, రాత్రితో పాటు ఎలాంటి వాతావరణంలోనైనా దీన్ని ఉపయోగించొచ్చు. జీపీఎస్- నావిగేషన్‌తో ఉపయోగించే ఈ బాంబు.. తన లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తుంది. 40 నాటికల్ మైళ్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలను చేరుకోగలదు. విమానంలో నుంచి కూడా దీన్ని ప్రయోగించవచ్చు.

కేంద్ర మాజీ మంత్రి శ్రీప్రకాశ్ జైస్వాల్ కన్నుమూత

కాన్పుర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శ్రీప్రకాశ్ జైస్వాల్ (81) గుండెపోటుతో శుక్రవారం కాన్పుర్‌లో మృతి చెందారు. తీవ్ర అస్వస్థతకు గురైన జైస్వాల్‌ను శుక్రవారం సాయంత్రం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో 2011 జనవరి నుంచి 2014 మే వరకు జైస్వాల్ బొగ్గుశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.


77 లక్షలకు చేరువలో ఏబీవీపీ సభ్యత్వం



ఏబీవీపీ సభలో మాట్లాడుతున్న సోమనాథ్

ఈనాడు, దిల్లీ: భాజపా అనుబంధ విద్యార్థి సంస్థ అయిన అఖిల భారతీయ విద్యార్థి పరిషద్ (ఏబీవీపీ) సభ్యత్వం 76,98,448కి చేరినట్లు ఆ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి వీరేంద్రసింగ్ సోలంకి వెల్లడించారు. ఉత్తరాఖండ్ రాజధాని దెహ్రాదూన్‌లో శుక్రవారం ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్ లాంఛనంగా ప్రారంభించిన 71వ జాతీయ మహాసభకు సమర్పించిన వార్షిక నివేదికలో ఈ సభ్యత్వ సంఖ్యను ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు రఘురాజ్ కిశోర్ తివారీ అధ్యక్షత వహించారు. ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి సోమనాథ్ మాట్లాడుతూ శాస్త్రం, ఆధ్యాత్మికతలు రెండూ భారతదేశంలో జ్ఞానం, విలువలు, సేవ అనే పునాదులపై నిలబడ్డాయన్నారు. విద్యార్థులు నిర్భయంగా నూతన ఆవిష్కరణలకై పని చేయాలని పిలుపునిచ్చారు.

గోదావరి డెల్టా చిత్రాలను అందించిన నైసార్



బెంగళూరు: భారత్, అమెరికాలు సంయుక్తంగా అభివృద్ధి చేసిన నైసార్ ఉపగ్రహంలోని 12 మీటర్ల వెడల్పు కలిగిన యాంటెన్నా రిఫ్లెక్టర్ విజయవంతంగా విచ్చుకుంది. సైన్స్ పరిశోధనల దశ కూడా మొదలైంది. ఈ ఉపగ్రహంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన ఎస్-బ్యాండ్, అమెరికా రోదసి సంస్థకు చెందిన ఎల్-బ్యాండ్ సింథటిక్ ఎపెర్చర్ రాడార్ల (సార్)కు ఈ యాంటెన్నా కీలకం. ఈ ఏడాది ఆగస్టు 19న తీసిన ఎస్-బ్యాండ్ సార్ తీసిన తొలి హైరిజల్యూషన్ చిత్రాన్ని ఇస్రో విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని గోదవరి డెల్టా ప్రాంతాన్ని ఇందులో ఆవిష్కరించింది. పచ్చటి పొలాలు, మడ అడవులతోపాటు చేపల చెరువులు వంటివి ఇందులో స్పష్టంగా కనిపించాయి. నైసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించి 100 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఇస్రో ఛైర్మన్ ఈ చిత్రాలను విడుదల చేశారు. 9 మీటర్ల పొడవైన బూమ్‌పై ముడుచుకున్న స్థితిలో ఈ ఉపగ్రహ యాంటెన్నా ఉండేది. తాజాగా దీన్ని విచ్చుకునేలా చేశారు. నాసా జెట్ ప్రొపల్షన్ ల్యాబ్ తోడ్పాటుతో ఇస్రోకు చెందిన ఇస్ట్రాక్ ఈ కసరత్తును నిర్వహించింది. యాంటెన్నా, బూమ్‌లను నాసా అభివృద్ధి చేసింది. నైసార్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ఈ ఏడాది జులై 30న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ప్రయోగించిన సంగతి తెలిసిందే.

పోటీతత్వమే కాదు సహకార స్ఫూర్తి ఉండాలి

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



లఖ్‌నవూ: దేశాన్ని, సమాజాన్ని బలోపేతం చేసేందుకు పోటీతత్వంతో పాటు.. సహకార స్ఫూర్తి కలిగి ఉండటం తప్పనిసరి అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పష్టంచేశారు ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో శుక్రవారం జరిగిన 'భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్' వజ్రోత్సవం, 19వ జాతీయ జంబోరీ ముగింపు వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ప్రసంగించారు. "జంబోరీలో ఎన్నో పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి పోటీ నుంచి మనం కొత్త విషయాలు తెలుసుకుంటాం. బృంద స్ఫూర్తి బలపడుతుంది. మరింత కష్టపడి పనిచేయాలన్న నిశ్చయం కూడా బలపడుతుంది" అని ఆమె పేర్కొన్నారు. భారత్‌లో 63లక్షలకుపైగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉన్నారని.. వీరిలో 25 లక్షలకు పైగా అమ్మాయిలే ఉండడం గణనీయ విషయమన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర ప్రగతికి మార్గమైన ఈ పథాన్ని ఎంచుకున్న బిడ్డలందరినీ అభినందిస్తున్నాను, అని రాష్ట్రపతి అన్నారు. ఈ వేడుకలో ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జైలు అధికారుల తీరుపై హైకోర్టుకు ఇమ్రాన్ సోదరి

ఇస్లామాబాద్: జైలులో ఉన్న తన సోదరుడు ఇమ్రాన్ ఖాన్‌ను కలిసేందుకు అవకాశం కల్పించాలని ఆయన సోదరి అలీమా ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అడియాలా జైలు అధికారులు అనుమతి ఇవ్వడం లేదని 'కోర్టు ధిక్కరణ' పిటిషన్‌ను దాఖలు చేశారు. పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) నేతలు, ఖైబర్ పంఖ్తుంఖ్వా ప్రావిన్సు ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది వెంటరాగా శుక్రవారం ఆమె ఈ పిటిషన్ దాఖలు చేశారు. వారంలో రెండు రోజులు మంగళ, గురువారాల్లో ఇమ్రాన్‌ను కలిసేలా మార్చి 24న ఇస్లామాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను జైలు అధికారులు పాటించడం లేదంటూ అలీమా ఖాన్ ఆరోపించారు. అంతకుముందు ఇమ్రాన్‌ను కలిసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ అడియాలా జైలు ముందు అలీమా ఖాన్ బైఠాయించారు. మరోవైపు.. తన తండ్రి ఆరోగ్యంగానే ఉన్నట్లు ఆధారాలు చూపాలని ఇమ్రాన్ కుమారుడు ఖాసీం ఖాన్ డిమాండ్ చేశారు.

బౌద్ధులకు హిందూ వైయక్తిక చట్టాలను వర్తింపజేయ తగదన్న అభ్యర్థనను పరిశీలించండి

- లా కమిషన్‌కు సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: హిందూ వైయక్తిక చట్టాల్లోని కొన్ని నిబంధనలను బౌద్ధ మతస్థులకూ వర్తింపజేయటాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై లా కమిషన్‌కు సుప్రీంకోర్టు కీలక సూచన చేసింది. నచ్చిన మతాన్ని ఆచరించే స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు ఈ నిబంధనలు అవరోధం కలిగిస్తున్నాయని పిటిషనర్లు పేర్కొన్నారు. బుద్ధిస్ట్ పర్సనల్ లా యాక్షన్ కమిటీ ప్రస్తావిస్తున్న ఈ అంశాలను పరిశీలించాలని లా కమిషన్‌కు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం కోరింది. ఉమ్మడి పౌర స్మృతిపై కసరత్తు జరుగుతున్నందున ఈ పిటిషన్‌ను వారి తరఫున అందిన నివేదనగా భావించాలని తెలిపింది.

నేవీ హెలికాప్టర్ల నిర్వహణ కోసం రూ.7,995 కోట్ల ఒప్పందం

- అమెరికాతో ఖరారు చేసుకున్న భారత్

దిల్లీ: భారత నౌకాదళంలోని 24 ఎంహెచ్-60ఆర్ సీహాక్ హెలికాప్టర్ల మరమ్మతులు, నిర్వహణ కోసం రక్షణశాఖ.. అమెరికాతో రూ.7,995 కోట్ల విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రెండు దేశాల మధ్య సుంకాల వివాదం నేపథ్యంలో ఈ పరిణామానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఐదేళ్లపాటు ఈ కాంట్రాక్టు అమల్లో ఉంటుంది. సీహాక్ హెలికాప్టర్లను అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఉత్పత్తి చేస్తోంది. ఇది ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా పనిచేస్తుంది. అనేక రకాల అవసరాలకు ఉపయోగపడుతుంది. ఇందులో అధునాతన ఏవియానిక్స్, సెన్సర్లు ఉన్నాయి. 2020లో కుదిరిన ఒక ఒప్పందం కింద భారత్ వీటిని కొనుగోలు చేసింది. తాజా ఒప్పందం ప్రకారం.. ఐదేళ్ల పాటు విడిభాగాలు, ఇతర పరికరాల సరఫరాతోపాటు సిబ్బందికి శిక్షణ, సాంకేతిక తోడ్పాటు, మరమ్మతులు వంటి సేవలను లాక్‌హీడ్ సంస్థ అందిస్తుంది. అలాగే ఈ హెలికాప్టర్ల కోసం మధ్యశ్రేణి విడిభాగాల మరమ్మతు, కాలానుగుణంగా చేయాల్సిన నిర్వహణ కోసం ప్రత్యేక వసతులను భారత్‌లో ఏర్పాటు చేస్తుంది.

లక్షలాది ప్రాణాలను కాపాడిన 'మీజిల్స్' టీకా: డబ్ల్యూహెచ్‌వో

ఇంటర్నెట్ డెస్క్: తట్టు (మీజిల్స్)పై పోరాటంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. వ్యాక్సిన్ విస్తృత పంపిణీతో గడిచిన 24 ఏళ్లలో మీజిల్స్ మరణాల్లో 88 శాతం తగ్గుదల కనిపించిందని తాజా నివేదికలో పేర్కొంది. ఈ టీకా ద్వారా రెండున్నర దశాబ్దాల్లో 59 మిలియన్ చిన్నారుల ప్రాణాలు రక్షించినట్లయిందని తెలిపింది. ప్రజారోగ్య చరిత్రలో అత్యంత విజయవంతమైన కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. మీజిల్స్ మరణాల సంఖ్య ఇటీవల భారీగా తగ్గింది. 2000లో 7,77,000 మరణాలు నమోదు కాగా, గతేడాది 95,000 మంది చిన్నారులు చనిపోయారు. ప్రపంచ వ్యాప్తంగా మరణాల సంఖ్య తగ్గుతున్నప్పటికీ కేసులు పెరుగుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. 2000లో 3.8 కోట్ల కేసులు నమోదు కాగా 2024లో 1.1 కోట్ల కేసులు నమోదయ్యాయి. కరోనాకు ముందు ఏడాదిలో (2019)తో పోలిస్తే గతేడాది ఈ కేసులు 8లక్షలు అదనంగా రికార్డయ్యాయి.

వెనెజువెలా భూభాగం నుంచే త్వరలో చర్యలు: ట్రంప్

వాషింగ్టన్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థలపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సముద్రం మీదుగా రవాణాను అడ్డుకునేందుకు ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోతోందని, దీంతో అతిత్వరలో వెనెజువెలా భూభాగంపై నుంచే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికైనా తమ దేశంలోకి మాదక ద్రవ్యాల సరఫరాను ఆపాలని వెనెజువెలాను మరోసారి హెచ్చరించారు. వెనెజువెలా ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశంతో ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడి చమురు నిల్వల్ని స్వాధీనం చేసుకోవడానికే ఈ చర్యలు చేపడుతోందని వార్తలు వెలువడుతున్నాయి.

అస్సాం సంస్కృతికి ప్రతీక 'మిరిజిం'



ఈటీవీ భారత్: అస్సాం నడిబొడ్డున నివసించే మైసింగ్ తెగకు అత్యంత ముఖ్యమైన సంప్రదాయ వస్త్రాల్లో ఒకటి 'మిరిజిం'. స్థానికంగా ఉత్పత్తి చేసిన పత్తిని ఉపయోగించి చేత్తో నేసిన ఈ దుప్పటిని వీరి భాషలో 'గ్యాడు' అంటారు. ఓవైపు ఉన్నిలా మెత్తగా, మరోవైపు సాదాగా ఉండే ఈ కంబళికి ఇక్కడి వివాహ ఆచారాల్లో ప్రత్యేక స్థానముంది. కుమారుడికి అతడి పెళ్లిలో తల్లి ఈ దుప్పటిని బహూకరిస్తుంది. సంరక్షణ, ఆశీర్వాదం, కుటుంబ గౌరవాన్ని సూచించే ఈ దుప్పటిని ప్రేమతో కూడిన వారసత్వంగా భావిస్తారు. నేటి ఆధునిక కాలంలో యంత్రాలు రూపొందించే పలురకాల దుప్పట్లు మార్కెట్లో లభిస్తున్నా, మజూలీ జిల్లాలోని మోహ్ఖుటి గ్రామానికి చెందిన బాపుకాన్ పాయెంగ్ అనే కళాకారుడు పాత సంప్రదాయం సంరక్షణకు కృషి చేస్తున్నారు. బాల్యంలో తన తల్లి మగ్గం నేస్తుండగా గమనించిన పాయెంగ్ ఆ వయసు నుంచే తాను కూడా నేయడం ప్రారంభించి ఇప్పుడు నిష్ణాతుడిగా మారారు. ఈయన నేసిన మిరిజిం, మైసింగ్ ఛోలా, రిహా, ఎరి శాలువలు, గమ్ఛాలకు ఇప్పుడు అస్సాంతోపాటు అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్‌లలో మంచి డిమాండు ఉంది. చాలామంది మహిళలకు పాయెంగ్ నేత పనిలో శిక్షణ కూడా ఇస్తున్నారు. ఆయన కృషిని గుర్తించిన భారత ప్రభుత్వం డిసెంబరు 9న జాతీయ అవార్డుతో సత్కరించనుంది.

రుచులు పిలుస్తుంటే... ...వద్దనేది ఇలా!



అదేం విచిత్రమో... 'ఇవి తినొద్దు' అంటే మనసు వాటికేసే లాగుతుంటుంది. 'ఇదొక్కటే, ఈసారికే'.. అనుకుంటూ జిహ్వా చాపల్యానికి తలొంచుతాం. తరవాత అనవసరంగా తిన్నామే అన్న బాధ తప్పాలంటే... ఈ చిట్కాలతో నోటికి లాక్ వేయాల్సిందే!

ఎటువైపు నుంచో ... ఈ చిన్న ముక్క తింటే ... అనే స్నేహితులు, సహోద్యోగుల ... వేడుకలంటూ అందే ఆహ్వానాలు... ఒకటా రెండా రారమ్మని ఊరించే పిలుపులెన్నో. వాటిని దాటుకుని కచ్చితంగా నిలబడడం అంత సులువేమీ కాదు. తీరా తిన్నాక ఏ నొప్పో బాధిస్తున్నా, అనారోగ్యం పలకరించినా అదో ఒత్తిడి.

నో చెప్పండి



నచ్చినదాన్ని తిరస్కరించడంలో గొప్పేమీ లేదు. నచ్చినా, నోరూరిస్తున్నా వద్దు అని చెప్పడమే గొప్ప. అలా చెప్పగలిగే బలాన్ని తెచ్చుకోండి. మీకు నచ్చిన చిప్స్ లేదా స్వీట్లు మరీ ఆకర్షిస్తున్నాయా? వాటి ముందుకే వెళ్లండి. 'తినను' అని బలంగా సంకల్పించుకోండి. దానికి కారణాన్నీ తలచుకోండి. ఇలా తరచూ చేస్తోంటే మెదడుపై సానుకూల ప్రభావం చూపుతుందట. ఆ పదార్థాలు ఆకర్షించకుండా చూస్తుందట.

సాయం తీసుకోండి



ఒత్తిడి, ఏదైనా బాధ... అప్పుడు మనసు మొదట వెళ్లేది నచ్చిన ఆహారం మీదకే. చకచకా వెళ్లి తీసుకుని తినేస్తాం. అదే అందుబాటులో లేకపోతే? ఏ మంచి నీళ్లో తాగి పడుకుంటాం. కాస్త నిరాశపడినా అప్పటికి తినాలన్న కోరిక తగ్గడం ఖాయం. మనకు వద్దని అందరినీ తినొద్దు, ఇంట్లోకి తేవద్దు అనడం సబబు కాదు కానీ... కనీసం మీపై మీకు నియంత్రణ వచ్చేవరకూ కొనొద్దని ఇంట్లో వాళ్లకీ, స్నేహితులకీ చెప్పండి. కళ్ల ముందు లేకపోతే మర్చిపోవడం సులువే.

సిద్ధంగా ఉండండి



చాలా సందర్భాల్లో ఆకలేసే కాదు..ఏమీ తోచక కూడా తింటుంటాం. ఇలాంటప్పుడు నట్స్, గింజలు, పండ్లు వంటివాటిని చిరుతిళ్లుగా సిద్ధం చేసుకోండి. ఇలా ఆకలి అనిపించినా, తోచట్లేదు అనిపించినా వాటిని తినేస్తే సరి. వీటిని తిన్నాక ఇక జంక్ మీదకి మనసు మళ్లదు. ముఖ్యంగా టైమ్‌కు తినడం, మధ్యలో ఆరోగ్యకరమైన చిరుతిళ్లు ప్లాన్ చేసుకుంటే జంక్‌ఫుడ్‌లపై అనవసర ఆరాటానికి అవకాశమే ఉండదు.

ఆలోచన మార్చండి



ఎంత కట్టడి చేసుకున్నా వేడుకలు, ఆఫీసు పార్టీలంటూ నిగ్రహానికి పరీక్షలు ఎదురవుతుంటాయి. ఇష్టమైన ఆహారం చూస్తే... మనసు లాగేస్తుంది. ఇలాంటప్పుడు వేరే వాటి మీదకు దృష్టిమరల్చాలి. అంటే డ్యాన్స్, క్లోజ్ ఫ్రెండ్‌కి ఫోన్ చేయడం, ఆర్ట్... వంటివి చేస్తే బాధ మాయం. నిజానికి తినాలన్న ఆరాటం ఉండేది కొద్దిసేపే.. ఆ సమయాన్ని నియంత్రించుకుంటే చాలు. ఆకలి మాయం అవుతుంది.

నోరు కట్టడి పేరుతో తిండిని తగ్గించొద్దు. ఆకలితో అసలే గడపొద్దు. అలాగే నిద్రనీ గమనించుకోండి. వీటిలో ఏది అస్తవ్యస్తమైనా మనసు మళ్లేది అనారోగ్యకరమైన ఆహారంవైపే! దీనిలో ఒత్తిడినీ ఓ కంట గమనిస్తునే ఉండాలి. దాన్ని తగ్గించుకునే మార్గాలనీ పాటిస్తే... మీ స్వీయ నియంత్రణను ఏదీ సవాల్ చేయలేదు.

- వసుంధర డెస్క్

రూ.230 కోట్లతో ఐఐఎఫ్‌టీ నిర్మాణం

- ఆమోదించిన రాష్ట్ర మంత్రివర్గం
- అంచనా వ్యయం రూ.229.81 కోట్లు

ఈనాడు, అమరావతి: సవరించిన నిధుల నమూనా (కేంద్రం, రాష్ట్రాలు చెరో 50 శాతం వాటా) ప్రకారం కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ క్యాంపస్ నిర్మాణానికి చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీని అంచనా వ్యయం రూ.229.81 కోట్లు, నిర్వహణ వ్యయం రూ.40 కోట్లు. ఇది విదేశీ వాణిజ్యం, మార్కెట్ యాక్సెస్, పెట్టుబడి ప్రమోషన్ విధాన రూపకల్పనకు మద్దతిస్తుంది. వైకాపా ప్రభుత్వం ఐఐఎఫ్‌టీ నిర్మాణానికి రాష్ట్ర వాటా నిధులు కేటాయించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న మరికొన్ని నిర్ణయాలను సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ముడసర్లోవలో యాదవ భవన్ నిర్మాణం

విశాఖ గ్రామీణ మండలంలోని ముడసర్లోవ గ్రామంలో యాదవ భవన్ నిర్మాణం కోసం 50 సెంట్ల భూమిని రూ.24 కోట్లు చెల్లింపుపై బీసీ సంక్షేమశాఖకు బదిలీ చేసే ప్రతిపాదనకు ఆమోదం. దీంతోపాటు క్యాబినెట్ ఆమోదం పొందిన ప్రతిపాదనలివీ.

◆ చిత్తూరు జిల్లా మంగసముద్రంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు 8.08 ఎకరాల భూమి ఉచితంగా కేటాయింపు.

◆ తిరుపతి గ్రామీణ మండలం దామినేడు గ్రామంలో జాతీయ ప్రమాణ క్రీడా మౌలిక సదుపాయాల సంస్థ ఏర్పాటుకు కేటాయించిన భూమికి బదులుగా ఎకరా రూ.2.5 కోట్ల విలువైన భూమి ఏపీటీఏకు బదిలీ.

◆ నంద్యాల జిల్లా మాధవరం గ్రామంలో క్రషింగ్ అండ్ పల్వరైజింగ్ యూనిట్ ఏర్పాటుకు 4.96 ఎకరాలు ఏపీఐఐసీకి ఉచితంగా బదిలీ.

◆ కృష్ణా డెల్టా వ్యవస్థలో రొంపేరు కుడివైపున 9.673 కి.మీ నుంచి 24.400 కి.మీ వరకు వేటపాలెం స్ట్రెయిట్‌కట్ పనులకు గతంలో చేసుకున్న ఒప్పందం రద్దు.

◆ గుత్తేదారులు/ఏజెన్సీల బిల్లుల నుంచి కార్మిక సెస్సును తిరిగి పొందేందుకు సంబంధించిన ఏకీకృత ఉత్తర్వుల జారీ.

◆ పీఎంఎస్‌జీఎంబీవై కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు సౌర పైకప్పులు (సోలార్ రూఫ్ టాప్), గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ఇన్‌స్టలేషన్లకు ప్రభుత్వ హామీతో నాబార్డ్ నుంచి రూ.3,762.26 కోట్ల రుణ సేకరణకు ఆమోదం.

◆ సవరించిన భారత్ నెట్ ప్రోగ్రామ్ (ఏబీపీ) అమలుకు కొత్త ఎస్పీవీ ఏర్పాటు ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం. ఇందుకోసం కేంద్రం రూ.2,428 కోట్లు కేటాయించింది. దీనికి త్వరలో టెండర్లు పిలవనున్నారు.

సాదా బైనామాల క్రమబద్ధీకరణ క్లెయిమ్ దాఖలు కాలం పొడిగింపు

సాదా బైనామాల క్రమబద్ధీకరణకు క్లెయిమ్‌లు దాఖలుచేసే కాలాన్ని 2027 డిసెంబరు 31 వరకు పొడిగించే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం. ఒప్పందపత్రాలపై భూములు కొన్నవారికి రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలు కల్పిస్తారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ గ్రామీణ వ్యవసాయ భూముల్లోనే వర్తిస్తుంది. బదిలీదారు చిన్న, సన్నకారు రైతు అయి ఉండాలి. వీరికి బదిలీ సుంకం, రిజిస్ట్రేషన్ రుసుములు, స్టాంప్‌డ్యూటీ నుంచి మినహాయింపు ఉంటుంది. ఇది చిన్న, సన్నకారు రైతులకు ఆర్థికభారాన్ని తగ్గించి భూ రికార్డుల క్రమబద్ధీకరణను సులభతరం చేయనుంది.

నూర్‌బాషా/దూదేకులకు ప్రత్యేక కార్పొరేషన్

రాష్ట్ర నూర్‌బాషా/దూదేకుల సంక్షేమ, అభివృద్ధి సంస్థను రద్దుచేసి దాని స్థానంలో రాష్ట్ర నూర్ బాషా/దూదేకుల సహకార ఆర్థికసంస్థ ఏర్పాటుచేసే ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది.

ఓపీసీఎల్‌కు నియంత్రణ కమిషన్ నిర్ణయించిన టారిఫ్ నుంచి 50% విద్యుత్తు రాష్ట్రానికి...

ఒడిశా పవర్ కన్సార్షియం లిమిటెడ్‌కు(ఓపీసీఎల్) బలిమెల డ్యామ్ టు పవర్‌హౌస్, జ్వాలాపుట్ డ్యామ్ టు పవర్ హౌస్ కేటాయించేందుకు నియంత్రణ కమిషన్ నిర్ణయించిన టారిఫ్‌లో 50% విద్యుత్తును రాష్ట్రానికి సరఫరా చేయాలనే షరతుతో ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం.

సాంకేతిక కమిటీ నివేదిక అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘం

టిడ్కోపై ఏర్పాటుచేసిన సాంకేతిక కమిటీ నివేదికపై అధ్యయనానికి మంత్రుల బృందాన్ని నియమించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీన్ని సమగ్రంగా అధ్యయనం చేసి ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వచ్చే ఉగాది నాటికి 1.44 లక్షల టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

క్యాబినెట్‌లో తప్పుడు ప్రజంటేషన్.. మున్సిపల్ సెక్షన్ అధికారి సస్పెన్షన్

ఈనాడు, అమరావతి: మంత్రిమండలి సమావేశానికి తప్పుడు సమాచారమిచ్చిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సెక్షన్ ఆఫీసర్ కె.విజయ్ కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. శుక్రవారం నాటి క్యాబినెట్ ఎజెండాలో నగరాలు, పట్టణాల్లో హోర్డింగ్‌ల ప్రదర్శనకు లైసెన్సులు తప్పనిసరి చేస్తూ సవరించిన నిబంధనలు చర్చకు రావాలి. ఇందుకు బదులుగా సెక్షన్ ఆఫీసర్ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా మరో ప్రజంటేషన్ వచ్చింది. దీనిపై సీఎంతో పాటు మంత్రులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తప్పు జరిగిన విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు. . సవరించిన నిబంధనల వివరాలను అప్పటికప్పుడు మళ్లీ మంత్రిమండలి ముందు పెట్టి ఆమోదం పొందారు. విజయ్‌కుమార్ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించి, విధుల్లోంచి సస్పెండ్ చేస్తున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శుక్రవారం రాత్రి ఆదేశాలిచ్చారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి సమయ నిర్దేశం

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' కిట్లు అందించేందుకు సమయాన్ని నిర్దేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కిట్లలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, నోటు పుస్తకాలు అందిస్తారు. వీటిని టెండర్ల ద్వారా సేకరించి, విద్యా సంవత్సరం ప్రారంభంలో అందించేందుకు సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ప్రభుత్వం టైంలైన్ సూచించింది. పరిపాలన, ఆర్థిక అనుమతులు, టెక్నికల్, ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటును ఈ నెలలో పూర్తి చేయాలని పేర్కొంది. డిసెంబరు మొదటి వారంలో టెండర్ డాక్యుమెంట్, రెండో వారంలో టెండర్ల ప్రకటన ఇవ్వాలని సూచించింది. జనవరి చివరి వారంలో టెండర్లు ఖరారు చేయాలని, ఫిబ్రవరి రెండో వారంలో మూడు దశల్లో నమూనాల నాణ్యత, నిర్ధారణ చేయాలని పేర్కొంది. మే నెలలో జిల్లా, మండల స్టాక్ పాయింట్లకు సామగ్రిని చేర్చాలని, నాలుగో వారంలో మండల స్టాక్ పాయింట్లలో కిట్ల తయారీ చేయాలని సూచించింది. జూన్ మొదటి వారంలో మండలాల నుంచి పాఠశాలలకు సరఫరా చేయాలని, జూన్ 12న విద్యార్థులకు అందించాలని ఆదేశించింది.

వైఎస్సార్ కడప జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు

- ఒకరు సరెండర్, మరొకరిపై సస్పెన్షన్ వేటు

ఈనాడు, అమరావతి: వసతి గృహ అధికారుల నుంచి మామూళ్లు వసూలు చేసిన వైఎస్సార్ కడప జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి అంజలాదేవీ, పులివెందుల సహాయ బీసీ సంక్షేమ శాఖ అధికారి బి.జ్యోతిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీరిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేయించిన ఉన్నతాధికారులు.. మామూళ్లు వసూలు చేశారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో అంజలాదేవీని హెడ్‌క్వార్టర్‌కు సరెండర్ చేయించగా, జ్యోతిని సస్పెండ్ చేశారు.

రెండు మున్సిపాలిటీల ఉన్నతీకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రెండు మున్సిపాలిటీలను ఉన్నతీకరిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మున్సిపాలిటీకి సెకండ్ గ్రేడ్ నుంచి స్పెషల్ గ్రేడ్ స్థాయి కల్పించింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని సెకండ్ గ్రేడ్ నుంచి మొదటి గ్రేడ్‌కి ఉన్నతీకరించింది.

'కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం'

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన తర్వాత కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో రైల్వేలైన్ల విద్యుదీకరణ వందశాతం పూర్తయిందన్నారు.

పట్టణాల్లో రూ.8 వేల కోట్లతో 281 తాగునీటి ప్రాజెక్టులకు అనుమతి

ఈనాడు-అమరావతి: పట్టణ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు అమృత్ 2.0లో 281 ప్రాజెక్టుల పనులను దాదాపు రూ.8 వేల కోట్లతో చేపట్టేందుకు ఎపెక్స్ కమిటీ చేసిన సిఫార్సులను ప్రభుత్వం శుక్రవారం ఆమోదించింది. పనుల నిర్వహణకు టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీని ప్రభుత్వం ఆదేశించింది. ◆ పట్టణ స్థానిక సంస్థల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్‌తో చేపట్టే ప్రాజెక్టులకు రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీయూఎఫ్ఐడీసీ)ను రాష్ట్ర నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను ఆమోదిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రాంతీయ ఆసుపత్రుల్లో నిర్మాణాలకు నిధులు మంజూరు

ఈనాడు, అమరావతి: మంగళగిరి, పిఠాపురం, చిలకలూరిపేట ప్రాంతీయ ఆసుపత్రుల్లో నిర్మాణ పనులకు రూ.22.74 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రహరీ, అంతర్గత సిమెంటు రోడ్లు తదితర పనులకు ఈ నిధులు మంజూరు చేసింది.



నియోపోలిస్ లేఅవుట్

కేకాపేట

- ఎకరా ఏకంగా రూ.151.25 కోట్లు
- 9.06 ఎకరాలకు రూ.1353 కోట్ల రాబడి


ఈనాడు, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ చరిత్రలో మరోసారి ఎకరా భూమి రికార్డు స్థాయి ధర పలికింది. కోకాపేటలో ఎకరా ఏకంగా రూ.151.25 కోట్లకు అమ్ముడుపోయింది. కోకాపేట నియోపోలిస్ లేఅవుట్ సర్వే నం.239, 240ల్లో 15, 16 ప్లాట్లను శుక్రవారం హెచ్‌ఎండీఏ ఆన్‌లైన్‌లో వేలం వేసింది. ఈ ప్లాట్లను దక్కించుకోవడానికి బిడ్డర్లు పోటీపడ్డారు. చివరికి 15వ నంబరు ప్లాట్‌ను లక్ష్మీనారాయణ గుమ్మడి తదితరులు ఎకరాకు రూ.151.25 కోట్ల చొప్పున 4.03 ఎకరాలను రూ.610 కోట్లకు దక్కించుకున్నారు. 16వ నంబరు ప్లాట్‌ను గోద్రెజ్ సంస్థ ఎకరా రూ.147.75 కోట్ల వంతున 5.03 ఎకరాలను రూ.743 కోట్లకు సొంతం చేసుకుంది. మొత్తం 9.06 ఎకరాలకు గాను రూ.1353 కోట్ల ఆదాయం సమకూరింది. ఇదే వెంచర్‌లో 17, 18 ప్లాట్లను ఈనెల 24న వేలం నిర్వహించగా.. ప్లాట్ నం.17లో ఎకరా 136.50 కోట్లు, ప్లాట్ నం.18లో ఎకరా 137.25 కోట్లు పలికిన సంగతి తెలిసిందే. 4 రోజుల వ్యవధిలో అదే ప్రాంతంలో ఎకరా ఏకంగా రూ.150 కోట్లు దాటడం విశేషం. దాదాపు 500 ఎకరాలున్న ఈ లేఅవుట్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డుకు నేరుగా చేరుకునేలా ట్రంపెట్ నిర్మాణం, అటు ఐటీ కారిడార్, ఇటు అంతర్జాతీయ విమానాశ్రయానికి పక్కనే ఈ వెంచర్ ఉండటం... ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు ఇక్కడ నిర్మాణాలు చేపట్టడం.. ప్రపంచస్థాయి వాణిజ్య, వ్యాపార కేంద్రాలకు కీలక ప్రాంతం కావడంతో ప్రముఖ సంస్థలు ఈభూములను కొనేందుకు ఆసక్తి చూపుతున్నాయి. తాజా వేలంలో పదికి పైగా సంస్థలు పోటాపోటీగా పాల్గొన్నాయి. రెండేళ్ల క్రితం ఇదే వెంచర్‌లో హెచ్‌ఎండీఏ వేలం వేయగా.. ఎకరా గరిష్ఠంగా రూ.100 కోట్లు పలకగా.. సరాసరి ధర ఎకరాకు రూ.73 కోట్లు వరకు అమ్ముడైంది. ఈనెల 24తో పాటు తాజాగా శనివారం విక్రయించిన 4 ప్లాట్ల ద్వారా ప్రభుత్వానికి రూ.2708 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ 4 ప్లాట్లలో ఎకరా సగటు విలువ రూ.142.83 కోట్లకు చేరడం హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్ వృద్ధికి నిదర్శనమని హెచ్‌ఎండీఏ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇదే వెంచర్‌లోని 19వ నంబరు ప్లాట్‌లో 4 ఎకరాలు, 20వ నంబరులో 4.04 ఎకరాలకు డిసెంబరు 3న హెచ్‌ఎండీఏ వేలం వేయనుంది. ఈ ప్లాట్ల కనీస ధర ఎకరాకు రూ.99 కోట్లుగా నిర్ణయించగా.. రూ.150 కోట్లు దాటవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సైట్-2 గోల్డెన్‌మైల్‌లోని 1.98 ఎకరాలకు డిసెంబరు 5న వేలం నిర్వహించనున్నారు. ఇందులో ఎకరా కనీస ధర రూ.70 కోట్లుగా పేర్కొనగా.. రూ.100 కోట్లు దాటుతుందని లెక్కలు వేస్తున్నారు.

తెలంగాణలో అతిపెద్ద సైబర్ దోపిడీ

- నకిలీ పెట్టుబడుల పేరిట వైద్యుడికి రూ.14.61 కోట్ల బురిడీ

ఈనాడు, హైదరాబాద్: సైబర్ నేరస్థుల మోసాలకు విద్యాధికులు బలవుతూనే ఉన్నారు. నకిలీ పెట్టుబడుల పేరిట జరిగిన మోసంలో తాజాగా ఓ వైద్యుడు ఏకంగా రూ.14.61 కోట్లు పోగొట్టుకున్నారు. తెలంగాణ చరిత్రలో ఒకే సైబర్ మోసంలో ఇంత పెద్ద మొత్తం పోగొట్టుకున్న ఉదంతం ఇదే తొలిసారి కావడం గమనార్హం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) నమోదు చేసిన కేసులోని వివరాల మేరకు.. హైదరాబాద్ ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన వైద్యుడిని గత ఆగస్టు 27న ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా మోనికా మాధవన్ అనే పేరుతో ఓ మహిళ సంప్రదించింది. పెళ్లి పేరుతో మోసపోయానని.. తన విడాకుల కేసు పెండింగ్‌లో ఉందని గోడు వెళ్లబోసుకుంది. అలా కొన్ని సంభాషణల అనంతరం టెలిగ్రామ్ ఐడీ ద్వారా సంప్రదింపులు జరుపుదామని ప్రతిపాదించింది. వైద్యుడు అందుకు సమ్మతించడంతో సంభాషణల పర్వం కొనసాగింది. ఈ క్రమంలో తనకు షేర్ ట్రేడింగ్‌లో ఐదేళ్లకు పైగా అనుభవముందని చెప్పింది. సీఎంసీ మార్కెట్లలో రోజూ రూ.4-5 లక్షల మేర సంపాదిస్తున్నానని పేర్కొంది. తనలా ట్రేడింగ్ చేసేందుకు పేరు రిజిస్టర్ చేసుకోవాలని వెబ్‌సైట్ లింక్ పంపించింది. అనంతరం రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టాలంటూ సెప్టెంబరు 30న వైద్యుడిని ఒప్పించింది. మొదటి ట్రేడ్‌లోనే రూ.8.6 లక్షల లాభమొచ్చినట్లు వైద్యుడి వర్చువల్ ఖాతాలో కనిపించింది. దీంతో రూ.10 కోట్ల మేర పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసింది. ఈ క్రమంలో వైద్యుడు తన ఖాతా నుంచి రూ.85 వేలు ఉపసంహరించుకునే అవకాశం కల్పించింది. దీంతో నమ్మకం కుదిరిన వైద్యుడు బ్యాంకు రుణాలతోపాటు స్నేహితుల వద్ద అప్పులు చేసి సుమారు రూ.14 కోట్ల మేర పెట్టుబడి పెట్టారు. అప్పుడు అతడి వర్చువల్ ఖాతాలో రూ.34 కోట్ల మేర నగదు నిల్వ ఉన్నట్లు చూపించింది. వాటిని ఉపసంహరించేందుకు ప్రయత్నించగా పన్ను కింద రూ.7.5 కోట్లు చెల్లించాలని చెప్పింది. అందుకు వైద్యుడు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తన వాటాగా 50% పన్నును యూఎస్‌డీటీ రూపంలో చెల్లిస్తానని, మిగిలిన రూ.3.75 కోట్లను చెల్లించాలని వైద్యుడికి మోనికా స్పష్టం చేసింది. ఆపై సీఎంసీ ప్రతినిధులు పంపించిన డాక్యుమెంట్లు అసంబద్ధంగా ఉండటంతో వైద్యుడికి అనుమానమొచ్చింది. గట్టిగా నిలదీయడంతో మోనికా స్పందించడం మానేసింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశారు.

రోటీ తినేలోగా రోడ్డు రెడీ!



సతీష్ పాండే



అది అత్యంత రద్దీగా ఉండే దిల్లీ సచివాలయం రోడ్డు. అక్కడ ఓ పెద్ద గుంత ఉంది. దాని కారణంగా వాహనదారులు బాగా ఇబ్బంది పడుతున్నారు. అక్కడకు కొంతమంది ఏవో కొన్ని బ్యాగ్‌లు పట్టుకుని వచ్చారు. గుంతలో పోసి, దాన్ని పూడుస్తున్నారు. సరిగ్గా 20 నిమిషాల్లో మళ్లీ ఆ రోడ్డు మీద వాహనాలు తిరిగేశాయి. అంటే, ఒక రోటీ తినేలోగా రోడ్డు సిద్ధమైపోయింది! ఆ మ్యాజిక్ పేరే ఎకోఫిక్స్. దాని రూపకర్త.. కేంద్ర రహదారి పరిశోధన సంస్థ (సీఆర్ఆర్ఐ) సీనియర్ ముఖ్య శాస్త్రవేత్త, ఫ్లెక్సిబుల్ పేవ్‌మెంట్ విభాగానికి అధిపతి డాక్టర్ సతీష్ పాండే. ఉక్కు కర్మాగారాల్లో వచ్చే వ్యర్థాలను ఉపయోగించి వెంటనే వాడగలిగేలా ఈ ఎకోఫిక్స్‌ను తయారుచేశారు. "ఉక్కు వ్యర్థాలను ప్రాసెస్ చేసి, వాటికి ఒక ప్రత్యేక పాలిమరిక్ బైండర్ కలుపుతారు. దాంతో అది బాగా అతుక్కుని, నీటిని తట్టుకుని, ఎక్కువ కాలం మన్నుతుంది. 10-20% ఖర్చు తక్కువ, మన్నిక ఎక్కువ" అని సతీష్ పాండే తెలిపారు. కర్ణాటకలో 141వ నంబరు రాష్ట్ర రహదారిపై గుంతలను ఎకోఫిక్స్‌తో పూడ్చి చూపించారు. గుంతలో నీళ్లు తీయకుండానే మరమ్మతు చేసి, వెంటనే ట్రాఫిక్ పునరుద్ధరించడంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐతో ఒప్పందం కుదుర్చుకుంది. దిల్లీలో ఒకేరోజు 3,400 గుంతల్ని దీంతో పూడ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో రాజధాని అమరావతి ప్రాంతంలో గుంతలను ఎకోఫిక్స్‌తో పూడ్చి చూపించారు. ఈ క్రమంలో విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉన్న దాదాపు 20-30 లక్షల టన్నుల వ్యర్థాలను దీనికి ఇచ్చేందుకు ఏపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది.

-ఈనాడు, ఆంధ్రప్రదేశ్ డెస్క్

ఆడపిల్లని గర్భంలోనే చిదిమేశారు!

ఆర్ఎంపీ ఇచ్చిన మాత్రలు వేసుకొని దారుణం

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రపంచాన్ని చూడాల్సిన ఓ ఆడ శిశువును గర్భంలోనే చిదిమేసిన దారుణం సిద్దిపేట జిల్లాలో వెలుగుచూసింది. పూడ్చిపెట్టిన మృతశిశువును పోలీసులు శుక్రవారం బయటకు తీసి పోస్టుమార్టంకు పంపారు. వివరాల్లోకి వెళ్తే.. రాజిరెడ్డిపల్లికి చెందిన దంపతులు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆ మహిళ మళ్లీ గర్భం దాల్చింది. ఎలా తెలుసుకున్నారో కానీ.. గర్భంలో పెరుగుతోంది ఆడపిల్ల అని తల్లిదండ్రులు గ్రహించి వద్దనుకున్నారు. ఈ నెల 26న గజ్వేల్‌లో ఆర్ఎంపీ రవిని కలిసి గర్భం తొలగించేందుకు మందులు అడిగారు. అతడు రూ.1,400 తీసుకుని మాత్రలు ఇచ్చాడు. మూడు పూటలా ఆ మాత్రలను గర్భిణి వేసుకుంది. గురువారం శౌచాలయంలో గర్భస్థ శిశువు చనిపోయి బయటపడింది. మృత శిశువును రాజిరెడ్డిపల్లి కుంట చెరువు సమీపంలో పూడ్చిపెట్టారు. అక్కడ పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడికి అనుమానం వచ్చి ప్రశ్నించగా విషయం బయటపడింది. ఆయన అధికారులకు సమాచారం ఇచ్చారు. దంపతులు, ఆర్ఎంపీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

బలమైన సైన్యం యుద్ధాన్ని నివారిస్తుంది

- రక్షణ శాఖ మాజీ ముఖ్య సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ వినోద్ జి.ఖండారే

ఈనాడు, హైదరాబాద్: 'మన చుట్టూ కొన్ని దేశాలున్నాయి. అవి కచ్చితంగా మన స్నేహితులు కావు. కాబట్టి మనం ఎప్పటికప్పుడు స్మార్ట్‌గా, దూరదృష్టితో వ్యవహరించాలి. జాతీయ నాయకత్వం ఆలోచనకు తగినట్లుగా పరిష్కారాలు సూచించగలగాలి. అప్పుడే యుద్ధాల్లో విజయం సాధించగలం' అని ఆపరేషన్ సిందూర్‌లో కీలక భూమిక పోషించిన భారత రక్షణ శాఖ మాజీ ముఖ్య సలహాదారు, లెఫ్టినెంట్ జనరల్ వినోద్ జి.ఖండారే పేర్కొన్నారు. హైదరాబాద్ తుక్కుగూడ హార్డ్‌వేర్ పార్క్‌లోని సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కొత్తగా రూపొందించిన యాంటీ డ్రోన్ వెహికల్ ఇంద్రజాల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .'సైన్యం అంటే చాలామంది యుద్ధాలు చేయడానికే ఉందనుకుంటారు. కానీ బలమైన సైన్యం యుద్ధాన్ని నివారిస్తుందనే విషయాన్ని తెలుసుకోవాలి. భారత సైన్యం ఇప్పుడు ఆధునికీకరణపై దృష్టి పెట్టింది. దీనికి తోడు ఎంఎస్ఎంఈలు, అంకురసంస్థలు మనల్ని సమర్థుల్ని చేస్తున్నాయి' అని పేర్కొన్నారు.



యాంటీ డ్రోన్ వాహనం ఇంద్రజాల్ వద్ద వినోద్ జి.ఖండారే


పైరసీ జోలికెళ్లను.. మారిపోతాను!

- రెండోరోజు కస్టడీలో ఐ బొమ్మ రవి వేడుకోలు

ఈనాడు, హైదరాబాద్: పైరసీ సినిమాల కేసులో అరెస్టయిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి పోలీసు కస్టడీ శుక్రవారం రెండోరోజు ముగిసింది. మొదటి కేసులో 5 రోజులు, తాజాగా మరో 3 రోజులు పోలీసులు కస్టడీకి తీసుకొని విచారిస్తున్నారు. పైరసీ కేసులో సాంకేతిక ఆధారాలు సేకరిస్తున్నారు. దేశ, విదేశాల్లో ఏజెంట్లు, ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు. ఉదయం నుంచి మౌనంగా ఉన్న రవి మధ్యాహ్నం పెదవి విప్పినట్లు సమాచారం. పైరసీ గుట్టు బయటపడినా విదేశీ పౌరసత్వంతో తప్పించుకోవచ్చని భావించానని రవి అంగీకరించినట్లు తెలిసింది. ఆరేళ్ల పాటు తననెవరూ పసిగట్టలేకపోయారని అదే ధీమాతో నెట్‌వర్క్‌ను బలోపేతం చేశానని చెప్పినట్లు సమాచారం. మొదట్లో డబ్బు సంపాదించాలనే ఆలోచనతో చేసేది తప్పని గుర్తించలేకపోయానంటూ పోలీసుల ఎదుట పశ్చాత్తాపం ప్రదర్శించినట్లు తెలిసింది. జైలు నుంచి బయటకు వచ్చాక పూర్తిగా మారిపోయి పైరసీ జోలికెళ్లనంటూ పోలీసులను ప్రాధేయపడినట్లు విశ్వసనీయ సమాచారం.

1997లో తండ్రి హత్య.. 2025లో కుమారుడి ప్రతీకారం

- ఓ ఇంటర్వ్యూలో పాత హత్యను వివరించిన మాజీ మావోయిస్టు
- అది చూసి యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్‌గా వచ్చి అతన్ని చంపిన హతుడి కుమారుడు




సిద్ధయ్య

ఈనాడు, సిరిసిల్ల- న్యూస్‌టుడే, వేములవాడ గ్రామీణం: ఇటీవల కొందరు మాజీ మావోయిస్టులు యూట్యూబ్ ఇంటర్వ్యూలు ఇస్తూ తాము ఉద్యమంలోకి ఎలా వెళ్లింది. ఎలాంటి పోరాటాలు, దాడులు చేసింది వివరిస్తున్నారు. అలా ఓ మాజీ మావోయిస్టు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ ఆయన ప్రాణాలనే హరించింది. పైగా నిందితుడు అతన్ని ఇంటర్వ్యూ కోసమే పిలిచి చంపడం గమనార్హం. రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం గుట్టల్లో గురువారం సాయంత్రం హత్యకు గురైన బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధయ్య అలియాస్ బాపురెడ్డి(58) హత్యోదంతంలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గండి లచ్చపేట గ్రామానికి చెందిన సిద్ధయ్య పీపుల్స్‌వార్‌లో డిప్యూటీ దళ కమాండర్ స్థాయి వరకు పని చేసి 2004లో పోలీసులకు లొంగిపోయారు. తర్వాత సొంతూరులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల మావోయిస్టుగా పని చేసినప్పటి అనుభవాలను ఒక యూట్యూబ్ ఛానల్ ముఖాముఖిలో వివరించారు. సుమారు 1997లో పార్టీ ఆదేశాలతో పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలతో జగిత్యాలకు చెందిన అంజయ్య అనే వ్యక్తిని వీర్నపల్లిలో హత్య చేసినట్లు చెప్పారు. ఈ ఇంటర్వ్యూ చూసిన అంజయ్య కుమారుడు సంతోష్ తన తండ్రి హత్యకు సిద్ధయ్యనే కారణమని తెలుసుకొని, అతన్ని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్‌గా సిద్ధయ్యను సంప్రదించి తనకూ ఇంటర్వ్యూ ఇవ్వాలని కోరాడు. ఇదివరకు తీసుకున్నవారు డబ్బులు ఇస్తామని చెప్పి మోసం చేశారని సిద్ధయ్య నిరాకరించగా.. సంతోష్ రూ.40 వేలు ఇస్తానని ఆశచూపాడు. గురువారం ఇద్దరూ సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద కలుసుకొని..రగుడులో కల్లు తాగారు. అక్కడి నుంచి ఇంటర్వ్యూ చిత్రీకరణ కోసం సిద్ధయ్యను అగ్రహారం గుట్టల్లోకి తీసుకెళ్లిన సంతోష్ ఆయన తలపై బండరాయితో మోది హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అనంతరం సంతోష్ నేరుగా జగిత్యాలకు వెళ్లి అక్కడి పోలీసులకు లొంగిపోయాడు. సంతోష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వేములవాడ పట్టణ పోలీసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయండి

- సమస్యలకు గడువులోగా ముగింపు పలకాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- అమరావతిలో నేచురోపతి వైద్య కళాశాల
- 40 ఎకరాల్లో రూ.750 కోట్లతో నిర్మాణం
- గోదావరి పుష్కరాల్లోగా పోలవరం పూర్తి చేస్తామని వెల్లడి



ఈనాడు, అమరావతి: రెవెన్యూ వ్యవస్థను తక్షణమే ప్రక్షాళన చేయాలని ఆ శాఖ మంత్రి, అధికారుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ శాఖలో సమస్యలు రావణకాష్టంగా రగులుతూనే ఉన్నాయని, నిర్దిష్ట గడువులోగా వాటిని సమూలంగా పరిష్కరించాలని స్పష్టంచేశారు. శుక్రవారం మంత్రివర్గ సమావేశంలో సాదా బైనామాల రిజిస్ట్రేషన్ పొడిగింపు అంశంపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి ఈ ఆదేశాలిచ్చారు. ఎవరైనా దొంగ సాదా బైనామాలు పుట్టించే అవకాశం ఉంటుందేమోనని మంత్రి మనోహర్ అనుమానం వ్యక్తం చేయగా, అలాంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టం చేయాలని సీఎం ఆదేశించారు. రాజధాని అమరావతిలో నేచురోపతి వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.750 కోట్లు ఇస్తుందని, మంగళగిరి ఎయిమ్స్ సమీపంలో 40 ఎకరాలు కేటాయించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరగా.. రాజధానిలో ఏర్పాటు చేద్దామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

రైతులతో సరిగ్గా డీల్ చేయకే ఇబ్బంది

రాజధాని నిర్మాణానికి రెండో విడత భూసమీకరణ ప్రతిపాదనపై చర్చ సందర్భంగా.. అమరావతిలో పనుల పురోగతిని చంద్రబాబు వివరించారు. భూసమీకరణపై రైతుల అభ్యంతరాలు తొలగినట్టేనా? అని మంత్రి మనోహర్ ప్రస్తావించగా, సమస్యల్ని సరిగ్గా డీల్ చేయకపోవడం వల్లే రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారని, తాను వారితో మాట్లాడటంతో అన్నీ పరిష్కారమయ్యాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులు లేవనెత్తిన అంశాల్లో రెండు మూడు అక్కడే పరిష్కరించామని, మిగతావి వచ్చే క్యాబినెట్ సమావేశం నాటికి కొలిక్కి రావచ్చని చంద్రబాబు పేర్కొన్నారు.

రాష్ట్రానికి కేంద్రం సంపూర్ణ సహకారం

అమరావతి నిర్మాణం సహా, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. 'రాజధాని పనుల పునఃప్రారంభానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరవడం, తాజాగా బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేయడం కేంద్రం సహకారానికి నిదర్శనం. రాష్ట్రానికి పరిశ్రమల్ని, పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు ప్రభుత్వం చూపుతున్న చొరవను కేంద్రమంత్రి అభినందించారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే భూముల కేటాయింపులు, అనుమతుల్లో ఏపీ వేగంగా స్పందిస్తోందని, అందుకే రాష్ట్రంపై పెట్టుబడిదారులు ఆసక్తి కనబరుస్తున్నారని కేంద్ర మంత్రి చెప్పారు' అని చంద్రబాబు ప్రస్తావించారు. 'పరిశ్రమలకు భూములు కేటాయించడంతో పాటు అవి వేగంగా ఆచరణలోకి వచ్చేలా మనం కృషి చేయాలి. పెట్టుబడిదారులకు మనపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి' అని ఆయన వ్యాఖ్యానించారు. 'పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయి. గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేయాలి. పురోగతిని మూణ్నెల్లకోసారి సమీక్షిస్తా. పోలవరం వద్ద ఒక ఐకానిక్ వంతెన నిర్మాణం చేపట్టాలి' అని సీఎం సూచించారు.

తుపానుతో ఎక్కువ నష్టం జరగకుండా చర్యలు

'దిత్వా' తుపాను వల్ల ఎక్కువ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇన్‌ఛార్జి మంత్రులు వారికి కేటాయించిన జిల్లాల్లో ఉండి పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

జగన్ విధ్వంసం వల్ల రూ.4,600 కోట్ల అదనపు భారం

వ్యవసాయ ఉత్పత్తులు, వాటి ధరలు, టిడ్కో ఇళ్లపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి చర్చ జరిగినపుడు.. జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం వల్ల రూ.4,600 కోట్ల అదనపు భారం పడుతోందని మంత్రి పి.నారాయణ తెలిపారు. అరటి తదితర వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పతనమైనప్పుడు రైతుల్ని ఆదుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

63 ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'బెరా' పరికరాలు

వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: వినికిడి లోపం ఉన్నవారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు రాష్ట్రంలోని 63 ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'బెరా' (బ్రెయిన్‌స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ) పరికరాల్ని ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సీఎం చంద్రబాబు నిర్ణయం మేరకు రూ.15.11 కోట్ల వ్యయంతో వీటిని సమకూర్చుకున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'వినికిడి లోపాన్ని గుర్తించి చికిత్స అందించడానికి, చెవుల్లోని కణితులు, ఇన్ఫెక్షన్ల గుర్తింపునకు ఇవి ఉపయోగపడతాయి. సదరం ధ్రువపత్రాల జారీ మరింత సులభతరం కానుంది' అని సత్యకుమార్ యాదవ్ వివరించారు.

వివేకా హత్య కేసు విచారణను సునీతే అడ్డుకుంటున్నారు

సీబీఐ కోర్టులో నిందితుల వాదన

ఈనాడు, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సత్వర విచారణ జరగకుండా కుమార్తె సునీతారెడ్డి అడ్డుకుంటున్నారని నిందితులైన వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిల తరఫు న్యాయవాది సీబీఐ కోర్టుకు నివేదించారు. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు కోసం అనుమతించాలని సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయాధికారి టి.రఘురాం విచారణ చేపట్టారు. నిందితుల తరఫు న్యాయవాది ఇ.ఉమామహేశ్వరరావు వాదనలు వినిపిస్తూ వివేకా హత్యకు ఆర్థిక వివాదాలు, వివాహేతర సంబంధాలు కూడా కారణమని, దీనికి సంబంధించి ఇచ్చిన వాంగ్మూలంపై సీబీఐ లోతైన దర్యాప్తు జరపలేదని అన్నారు. సునీత కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ విచారణను జాప్యం చేయడంతోపాటు కోర్టు సమయాలను వృథా చేస్తున్నారని చెప్పారు. వాదనలు విన్న న్యాయాధికారి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

ఈ వేగం దేశాన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలుపుతోంది

ఈనాడు, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దేశ జీడీపీ 8.2 శాతంగా నమోదు కావడం ప్రతి పౌరుడికీ ఉత్తేజాన్నిచ్చే వార్త అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పరిణామం దేశాన్ని ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలబెడుతోందని ఎక్స్ వేదికగా శుక్రవారం ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా స్థిరంగా ముందుకు సాగుతున్న తరుణంలో ఈ పురోగతి ఆనందదాయకమన్నారు.

జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంట్‌లో మాట్లాడాలి: పవన్

ఈనాడు, అమరావతి: జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో పార్లమెంట్‌లో పోరాడేందుకు సిద్ధం కావాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆ పార్టీ ఎంపీలకు సూచించారు. వచ్చే నెల 1 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన విధానాలపై జనసేన ఎంపీలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ లతో శుక్రవారం ఆ పార్టీ పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. 'రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులు వేగవంతమయ్యేలా సంబంధిత శాఖల మంత్రులతో సమావేశమై వివరాలు అందించాలి. పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ కేంద్ర పథకాల ద్వారా నిధుల మంజూరు గురించి కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలి' అని వారికి దిశానిర్దేశం చేశారు.

అన్న క్యాంటీన్ల పర్యవేక్షణకు కమిటీలు

- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్నక్యాంటీన్ల సమర్థ నిర్వహణ, వాటిపై పర్యవేక్షణ కోసం క్యాంటీన్ స్థాయిలో సలహా కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ శుక్రవారం జారీ చేశారు.

క్యాంటీన్ స్థాయి సలహా కమిటీ ఇలా...

ఛైర్మన్: మున్సిపల్ ఛైర్‌పర్సన్ లేదా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నామినేట్ చేసిన కార్పొరేటర్/కౌన్సిలర్

మెంబర్ కన్వీనర్: సంబంధిత క్యాంటీన్ నోడల్ అధికారి

సభ్యులు: వార్డు శానిటరీ, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి, వార్డు మహిళా సభ్యులు, బలహీనవర్గాల సంరక్షణ కార్యదర్శి, స్థానిక ఎన్జీవోల నుంచి ఒకరు, స్వయం సహాయక సంఘాలు, పట్టణ స్థాయి ఫెడరేషన్ల నుంచి ఒకరు ఉంటారు.

బాధ్యతలివి

- చెక్ లిస్ట్ ఆధారంగా వారానికి రెండు సార్లు సమీక్షించాలి. వంటగది, క్యాంటీన్లలో ఆహారం సరఫరా కౌంటర్లు, డైనింగ్ తదితర ప్రాంతాల్లో పరిశుభ్రతను పరిశీలించాలి.
- నిర్దేశిత సమయానికి భోజనం సరఫరా చేస్తున్నారా? లేదా చూడాలి. ఆహారం నిల్వ చేసేందుకు సురక్షితమైన విధానాలు పాటిస్తున్నారా లేదా అన్నది గమనించాలి.
- క్యాంటీన్ల రికార్డులు నిర్వహించాలి.
- సీసీ టీవీలు, ఐవోటీ పరికరాలు, సెన్సర్లు పని చేస్తున్నాయో, లేదో చూడాలి. ఆర్వో నీటి వ్యవస్థ, లైటింగ్, ఫ్యాన్ల పనితీరును పరిశీలించాలి.

ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యం: క్యాంటీన్లకు వచ్చేవారి నుంచి అభిప్రాయాలు విధిగా సేకరించాలి. ఈ సందర్భంగా వ్యక్తమయ్యే సమస్యలను మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లు, జిల్లా కో-ఆర్డినేటర్లు, రాష్ట్ర అధికారులకు తెలియజేయాలి.

రాజ్ కెసిరెడ్డి పాత్రపై ఆధారాలు సేకరించాం

- మద్యం కేసులో బెయిల్‌కు ఆయన అనర్హుడు
- హైకోర్టులో సిట్ వాదనలు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి పాత్రకు సంబంధించిన ఆధారాలను సిట్ సేకరించిందని సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా శుక్రవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. మద్యం విధానం రూపకల్పన, అమలు, లంచాలు ముట్టజెప్పిన మద్యం కంపెనీలకు ఆర్డర్లు ఇవ్వడం, లంచాల సొమ్మును విదేశాలకు తరలించడంలో కెసిరెడ్డిది కీలక పాత్ర అన్నారు. రూ.3,200 కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. కెసిరెడ్డి పాత్రపై ఆధారాలు లభ్యమైన నేపథ్యంలో ఆయన బెయిలు పొందేందుకు అనర్హులన్నారు. మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. రాజ్ కెసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు వినిపిస్తూ.. 'ఈ కేసులో ఇప్పటికే మూడు అభియోగపత్రాలు వేశారు. 300 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోందన్న పేరుతో దీర్ఘకాలంగా నిందితులను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచడం సరికాదు. పిటిషనర్ ఏడు నెలలుగా జైల్లో ఉన్నారు. సహేతుక సమయంలో దర్యాప్తు పూర్తి చేయకపోతే నిందితులకు బెయిలివ్వొచ్చు' అని అన్నారు. రాజ్ కెసిరెడ్డి పారిపోయే ప్రమాదం లేదని, ఆయనకు షరతులతో బెయిలివ్వాలని కోరారు. పూర్తి స్థాయి వాదనలు వినేందుకు సమయం లేకపోవడంతో న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణను డిసెంబర్ 2కు వాయిదా వేశారు.

నార్కో అనాలసిస్ టెస్టుకు వైవీ సుబ్బారెడ్డి సిద్ధమా?

తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య



ఈనాడు, అమరావతి: వైకాపా నేత, తితిదే బోర్డు మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తిరుమల శ్రీవారి సన్నిధిలో ఏ తప్పు చేయకపోతే నార్కో అనాలసిస్ టెస్టుకు సిద్ధమా అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నిలదీశారు. నార్కో అనాలసిస్ టెస్టుతోనే గత వైకాపా ప్రభుత్వ హయాంలో తితిదేలో జరిగిన అక్రమాలు, అందులో తాడేపల్లి ప్యాలెస్ సహా ఎవరికి ఎంత వాటాలు వెళ్లాయో వివరాలు తెలుస్తాయన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "శ్రీవారికి సేవ చేయాలని పదవులిస్తే స్వామి సొమ్మునే దోచుకున్న దొంగలు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి. వారి హయాంలోనే 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి తితిదేకు సరఫరా అయ్యింది. రసాయనాలతో తయారు చేసిన నెయ్యి సరఫరా చేస్తున్నారని తెలిసి కూడా వైవీ సుబ్బారెడ్డి ఎందుకు అడ్డుకోలేదు? ఏ తప్పు చేయకపోతే ఆయన బ్యాంకు అకౌంట్ల వివరాలు సీబీఐకి ఎందుకు ఇవ్వలేదు? కమీషన్ల కక్కుర్తితోనే కల్తీ నెయ్యి సరఫరాకు గేట్లు తెరిచారు" అని వర్ల రామయ్య దుయ్యబట్టారు.

కడప, రాజమహేంద్రవరం ఆర్జేడీల నియామకం

ఈనాడు, అమరావతి: కళాశాల విద్యకు సంబంధించి కడప, రాజమహేంద్రవరం ఆర్జేడీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప ఆర్జేడీగా అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న నాగలింగారెడ్డిని పదోన్నతిపై నియమించింది. రాజమహేంద్రవరం ఆర్జేడీగా చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకట కృష్ణాజీకి పదోన్నతి కల్పించి, నియమించింది. ఈ మేరకు ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మరో రూ.3,000 కోట్ల రుణం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 2 న రిజర్వుబ్యాంకు నిర్వహించే సెక్యూరిటీల వేలంలో పాల్గొని రూ.3,000 కోట్ల రుణం తీసుకోనుంది. రూ.వెయ్యి కోట్లు చొప్పున 11, 15, 19 ఏళ్ల కాలపరిమితితో తిరిగి చెల్లించేలా రుణం తీసుకోనుంది. ఆర్‌బీఐ ఈ అంశాన్ని నోటిఫై చేసింది.

అక్రెడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: పాత్రికేయుల అక్రెడిటేషన్ కార్డుల గడువును ఈ ఏడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ వరకు రెండు నెలలు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నెలాఖరుతో పాత కార్డుల గడువు ముగియనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పింది.

మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలకు సుప్రీంకోర్టు పచ్చజెండా

- కోటా దాటిన వాటిలో తీర్పు ఆధారంగా ఫలితం

దిల్లీ: మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఆ ఎన్నికల ఫలితాలన్నీ తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని, ఇది 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఉల్లంఘించిన స్థానిక సంస్థలకూ వర్తిస్తుందని పేర్కొంది. స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి దాఖలైన 27 అభ్యర్థనలపై తుది విచారణను జనవరి 21 నుంచి త్రిసభ్య ధర్మాసనం చేపడుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్రంలో మొత్తం 246 మున్సిపల్ కౌన్సిళ్లు, నగర పంచాయతీలు ఉన్నాయని, వీటిలో 40 మున్సిపల్ కౌన్సిళ్లలో, 17 నగర పంచాయతీలలో మాత్రమే ఈ పరిమితిని ఉల్లంఘించారని రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది బల్బీర్ సింగ్ కోర్టుకు విన్నవించారు. ఈ వాదన విన్న సుప్రీంకోర్టు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవచ్చనీ, అయితే ఫలితాలు ఈ కేసుపై కోర్టు వెలువరించే తీర్పు ఆధారంగా ఉంటాయని స్పష్టం చేసింది.

సిరియాలో ఇజ్రాయెల్ దాడులు

- 13 మంది పౌరుల మృతి



ఇజ్రాయెల్ దాడితో సిరియాలో కాలి బుగ్గి అయిన ఓ వాహనం

డమాస్కస్: దక్షిణ సిరియాలో ఇజ్రాయెల్ దాడులు చేసింది. రాజధాని డమాస్కస్ శివార్లలోని ఓ గ్రామంలోకి ఇజ్రాయెలీ దళాలు ప్రవేశించి, 13 మంది పౌరులను కాల్చి చంపాయని సిరియా విదేశాంగ మంత్రిత్వశాఖ శుక్రవారం పేర్కొంది. ఇది దారుణమైన ఊచకోత అని మండిపడింది. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారని తెలిపింది. సిరియా అధికారిక వార్తాసంస్థ సానా ప్రకారం.. స్థానిక వ్యక్తులను నిర్బంధించాలన్న లక్ష్యంతో ఇజ్రాయెల్ బలగాలు బీట్ జిన్ అనే గ్రామంలోకి ప్రవేశించాయి. అడ్డుకోబోయిన గ్రామస్థులపై కాల్పులు జరిపాయి. ఈ కథనాన్ని ఇజ్రాయెల్ సైన్యం ఖండించింది. "మా పౌరులను హతమార్చేందుకు జామా ఇస్లామియా అనే ఇస్లాం మత సంస్థకు చెందిన వ్యక్తులు కుట్ర పన్నుతున్నారన్న సమాచారంతో ఆ గ్రామంలోకి ప్రవేశించాం. మాపై మిలిటెంట్లు కాల్పులు జరిపారు. దీంతో మా సైనికులకు గాయాలయ్యాయి. కాల్పులు జరపాల్సి వచ్చింది" అని పేర్కొంది. తమ ఆపరేషన్ పూర్తయిందని, అనుమానితులందరినీ అదుపులోకి తీసుకున్నామని తెలిపింది. "చనిపోయిన వారంతా సాధారణ పౌరులే. అందులో ఓ వ్యక్తికి నిన్ననే వివాహం జరిగింది" అని ఏపీ వార్తాసంస్థకు స్థానిక గ్రామస్థుడు తెలిపారు.

'ఇజ్రాయెల్-పాలస్తీనా' కమిషన్‌కు నేతృత్వం

- భారత న్యాయనిపుణుడికి అరుదైన గౌరవం



జస్టిస్ ఎస్.మురళీధర్

ఇంటర్నెట్ డెస్క్: ఒడిశా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.మురళీధర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలో మానవహక్కుల ఉల్లంఘనపై విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన ప్యానెల్‌కు ఆయన నేతృత్వం వహించనున్నారు. ఇజ్రాయెల్-గాజా ఉద్రిక్తతలను ప్రపంచం మొత్తం ఆసక్తిగా చూస్తున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన మానవ హక్కుల బృందానికి భారతీయ న్యాయమూర్తి నేతృత్వం వహించడం విశేషం. ఇజ్రాయెల్, 'ఆక్రమిత పాలస్తీనా ప్రాంతం'లో మానవ హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరపడం ఈ ప్యానెల్ ప్రధాన బాధ్యత. ఈ స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు గతంలో బ్రెజిల్ న్యాయనిపుణుడు పాలో సెర్గియో పిన్హీరో నేతృత్వం వహించారు. ఇజ్రాయెల్-పాలస్తీనా సంఘర్షణపై జస్టిస్ మురళీధర్ ఇవ్వబోయే నివేదికలకు చాలా ప్రాధాన్యం ఉండనుంది. 1984లో మద్రాసు హైకోర్టులో జస్టిస్ మురళీధర్ న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత దిల్లీ హైకోర్టుకు మారారు. రెండు దశాబ్దాల పాటు సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేశారు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌లోనూ సేవలు అందించారు. 2006లో దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021లో ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. స్వలింగ సంపర్కం నేరం కాదని ప్రకటించడం ఆయన ఇచ్చిన తీర్పుల్లో ముఖ్యమైంది. 2013లో సుప్రీంకోర్టు దీన్ని రద్దు చేసింది. 2023లో పదవీ విరమణ చేసిన తర్వాత జస్టిస్ మురళీధర్ మళ్లీ న్యాయవాద వృత్తిని చేపట్టారు.

కొలంబోలో ప్రతికూల వాతావరణం

తిరువనంతపురానికి విమానాల మళ్లింపు

తిరువనంతపురం: వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో వివిధ దేశాల నుంచి శ్రీలంకలోని కొలంబో వెళ్లాల్సిన 5 అంతర్జాతీయ విమాన సర్వీసులను శుక్రవారం కేరళలోని తిరువనంతపురం మళ్లించారు. తుపాను ప్రభావంతో కొలంబోపై వాతావరణం హెచ్చరికలు ఉండటంతో మరికొన్ని విమానాలు మళ్లించే అవకాశం ఉందని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్(టీఐఏఎల్) అధికారులు తెలిపారు. మళ్లించిన వాటిలో అబుధాబీకి చెందిన ఎతిహాద్ ఎయిర్‌వేస్, కౌలాలంపూర్ నుంచి ఎయిర్ ఏషియా విమానం, దుబాయ్, దోహా నుంచి వస్తున్న రెండు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానాలు.. భారత్ నుంచి ఇండిగో విమానం ఉన్నాయి. వాతావరణం మెరుగుపడే వరకు ఈ విమానాలు ఇక్కడే ఉంటాయని అధికారులు తెలిపారు.

కశ్మీర్ వణుకుతోంది

శ్రీనగర్‌లో కనిష్ఠంగా మైనస్ 4.5 డిగ్రీలు

శ్రీనగర్: కశ్మీర్‌లో 2007 తర్వాత అత్యంత చలిగా నవంబరు నెల నమోదవుతోందని, అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తక్కువ స్థాయికి పడిపోయాయని అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ సీజన్‌లో శ్రీనగర్ అత్యంత చలి ప్రాంతంగా గురువారం రాత్రి నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు మైనస్ 4.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా నగరంలో రాత్రి ఉష్ణోగ్రతలు నిరంతరం తగ్గుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రత ఈ సీజన్‌లో సాధారణం కంటే నాలుగు డిగ్రీలు ఎక్కువగా ఉందని వారు పేర్కొన్నారు.

2 నుంచి శబరిమలలో 'కేరళ సద్య'

పథనంథిట్ట (కేరళ): ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం శబరిమలలో వచ్చే నెల 2 నుంచి ఉచిత అన్నదాన కార్యక్రమంలో భాగంగా కేరళ సంప్రదాయ శాకాహార భోజనం కేరళ సద్యను భక్తులకు అందించనున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె.జయకుమార్ శుక్రవారం వెల్లడించారు. అయితే దీన్ని సంప్రదాయ అరటి ఆకుల్లో కాకుండా స్టీల్ ప్లేట్‌లలో వడ్డిస్తామని తెలిపారు. "ఇతర రాష్ట్రాల భక్తులకు కేరళ సద్య నచ్చుతుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ "వారి నుంచి ఫిర్యాదులు అందితే వాటిని పరిశీలిస్తాం" అని సమాధానమిచ్చారు.

దిల్లీ కాలుష్యంపై మౌనం ఎందుకు?

- ప్రధాని మోదీని ప్రశ్నించిన రాహుల్ గాంధీ



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో నానాటికి క్షీణిస్తున్న వాయు నాణ్యతపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారంటూ లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'అత్యవసర ఆరోగ్య పరిస్థితి'పై త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చర్చించాలని డిమాండ్ చేశారు. వాయుకాలుష్యం కారణంగా చిన్నారులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆయన కొంతమంది తల్లులతో తన నివాసంలో ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన శుక్రవారం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "నేను కలిసిన ప్రతి మాతృమూర్తి ఒకే విషయం గురించి మాట్లాడుతున్నారు. పిల్లలు విషపూరిత గాలిని పీలుస్తూ పెరుగుతున్నారని చెబుతున్నారు. దేశంలోని చిన్నారులు మన ముందే ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా ప్రధాని ఎలా మౌనంగా ఉండగలుగుతున్నారు? అసలు ప్రభుత్వం ఎందుకు అప్రమత్త, ప్రణాళిక, జవాబుదారీతనం చూపడం లేదు? గాలి కాలుష్యంపై పార్లమెంటులో చర్చ జరగాలి. ఈ అత్యవసర ఆరోగ్య పరిస్థితిని కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలి. మన పిల్లలకు సాకులు కాదు... స్వచ్ఛమైన గాలి కావాలి" అని రాహుల్ గాంధీ అన్నారు. మరోవైపు పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఆదివారం సోనియాగాంధీ నివాసంలో కాంగ్రెస్ కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది.

పేదలకు న్యాయం అందించేందుకు అర్ధరాత్రి వరకు కోర్టులో ఉండగలను

- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్య



దిల్లీ: పేద కక్షిదారులకు న్యాయం అందించడం తన మొదటి ప్రాధాన్యమని, అందుకోసం అర్ధరాత్రి వరకూ కోర్టులో ఉండగలనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, ఇతరులకు వ్యతిరేకంగా తిలక్ సింగ్ డాంగి అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం శుక్రవారం కొట్టేసింది. ఈ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ కోర్టులో సరదాలు, కాలక్షేపం కోసం వేసే పిటిషన్లు, విలాసవంతమైన వ్యాజ్యాలు ఉండవు. న్యాయం కోసం చివరి వరుసలో వేచి ఉన్న నిరుపేద వ్యాజ్యదారుడికి న్యాయం జరగడమే మా ప్రధాన లక్ష్యం. అలాంటి వారి కోసం అవసరమైతే అర్ధరాత్రి వరకు కోర్టులోనే అందుబాటులో ఉంటాను" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

సీఈసీ చేతులపై రక్తపు మరకలు

- తృణమూల్ కాంగ్రెస్ ఆరోపణ

దిల్లీ: పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో భాగంగా 40 మంది మరణించారని, ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) చేతులపై రక్తపు మరకలు ఉంటాయని తృణమూల్ కాంగ్రెస్ శుక్రవారం ఆరోపించింది. ఎన్నికల సంఘం పూర్తి బెంచిని కలిసిన టీఎంసీ ప్రతినిధి బృందం ఈ మేరకు కమిషన్ సభ్యుల సమక్షంలో ఈ ఆరోపణలు చేసింది. టీఎంసీ రాజ్యసభ సభ్యుడు డెరెక్ ఓబ్రియన్ నేతృత్వంలో పదిమంది సభ్యుల ప్రతినిధి బృందం కమిషన్‌ను కలిసింది. "సమావేశంలో మా పార్టీ ఐదు ప్రశ్నలు లేవనెత్తింది, వాటిలో ఒక్కదానికీ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సమాధానమివ్వలేదు" అని ఓబ్రియన్ విలేకరులకు వివరించారు.

బీసీల ఓట్లు తొలగించాలని వారిపై ఒత్తిడి

ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణలో భాగంగా ఎదురవుతున్న బెదిరింపులు, ఒత్తిడుల కారణంగా బీఎల్‌వోలు మరణిస్తున్నారని కాంగ్రెస్ పేర్కొంది. ఎస్ఐఆర్‌లో భాగంగా బీసీల ఓట్లు తొలగించాలని బీఎల్‌వోలపై ఒత్తిడి తెస్తున్నారని, 18 గంటల పాటు ఏకధాటిగా పనిచేసేలా బలవంత పెడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ అన్నది ఓట్ల చౌర్యంలో భాగమని ఆయన ఆరోపించారు.

ఇద్దరు బీఎల్‌వోల మృతి

పశ్చిమబెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణలో పాల్గొంటున్న ఇద్దరు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వోలు) పనిఒత్తిడి కారణంగా గుండెపోటుతో మరణించారు. వీరిలో ఒకరు పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన జాకిర్ హుసేన్ కాగా మరొకరు గుజరాత్‌లోని మెహసానా జిల్లాకు చెందిన దినేశ్ రావల్.


దిల్లీ పేలుడుపై ఎన్ఐఏ ముమ్మర దర్యాప్తు

నేర సన్నివేశ పునఃసృష్టికి చర్యలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ పేలుడు కేసులో ఎన్ఐఏ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహీన్‌ను ఎన్ఐఏ అధికారులు నేర సన్నివేశ పునఃసృష్టి(సీన్ రీక్రియేషన్) కోసం నిందితులతో సంబంధమున్న అల్-ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. ఉగ్రకుట్ర దర్యాప్తులో భాగంగా ఈ కేసులో అరెస్టు చేసిన ఏడుగురు నిందితులను లఖ్‌నవూ, కాన్పుర్, సహరన్‌పూర్, ఫరీదాబాద్, జమ్మూకశ్మీర్‌లకు తీసుకువెళ్లనున్నట్లు తెలుస్తోంది.

'గర్భవతిగా ఉన్నా.. పలుమార్లు రేప్ చేశాడు'

కాంగ్రెస్ ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు నమోదు



రాహుల్ మామ్‌కుటత్తిల్

తిరువనంతపురం: కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కుటత్తిల్‌పై అత్యాచారం కేసు నమోదైంది. గర్భవతిగా ఉన్న ఓ యువతిపై అనేకసార్లు అతడు అత్యాచారానికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో పోలీసులు కేసు నమోదుచేశారు. మార్చి 17న యువతి అపార్ట్‌మెంట్‌లో ఆమెతో ఉన్న వీడియోలను రికార్డు చేశాడని, తమ మధ్య ఉన్న సంబంధాన్ని బహిర్గతం చేస్తే వాటిని విడుదల చేస్తానని బెదిరించాడని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. రాహుల్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని.. అనంతరం గర్భాన్ని తొలగించుకోవాలని బెదిరించాడని కేరళకు చెందిన బాధితురాలు సీఎం పినరయి విజయన్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిపై ఈమేరకు కేసు నమోదు చేశారు. ఆ ఫిర్యాదులో తాము కొంతకాలం కలిసున్నామని.. తనకు బిడ్డ కావాలని బలవంతం చేసి, గర్భం దాల్చిన తర్వాత అబార్షన్ చేయించుకోవాలని రాహుల్ బెదిరింపులకు పాల్పడ్డాడని యువతి పేర్కొంది. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డులు, వాట్సప్ స్క్రీన్‌షాట్‌ల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అబార్షన్ అయ్యేందుకు ఎమ్మెల్యే స్నేహితుడు జాబీ జోసేఫ్ బాధితురాలికి మందులు ఇచ్చాడన్న ఆరోపణలతో అతడిపైనా కేసు నమోదైంది. కాగా, దీనిపై ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కుటత్తిల్ స్పందిస్తూ.. తాను ఏ తప్పూ చేయలేదన్నారు. కుట్రపూరితంగా తనపై కేసు నమోదు చేశారని, దీనిని చట్టపరంగా ఎదుర్కొంటానన్నారు.